
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 282

బుధవారం 2-1-2019



ప్రజా రవాణాకు జీపీఎస్ తప్పనిసరి

కొత్త వాహన నిబంధనలు అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం – బిజినెస్‌లో



బడ్జెట్లో పన్ను రాయితీ?

ఎన్నికల నేపథ్యంలో మినహాయింపులు ఉంటాయని అంచనా – బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పార్టనర్స్ ముసుగు తొలగింది

పవన్‌తో బంధాన్ని బయటపెట్టిన చంద్రబాబు వ్యాఖ్యలు

- కలసి పోటీ చేస్తే తప్పేమిటన్న సీఎం..
- ఆ వ్యాఖ్యల అంతరార్థమదే..
- ఇద్దరి మధ్య బంధం కొనసాగుతున్నట్లేనంటున్న విశ్లేషకులు
- పవన్, జగన్, మోదీ భాగస్వాములని బాబు ఎల్లో ప్రచారం..
- గతకొద్ది రోజులుగా మారిన వ్యూహం..
- పవన్‌ను ఏమీ అనవద్దని శ్రేణులకు సూచనలు
- ఇప్పుడు అకస్మాత్తుగా బయటపడిన బాబు బండారం
- గతంలో బీజేపీతో చెలిమి.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కలసిరావాలని పిలుపు
- ఇప్పుడు కాంగ్రెస్‌తో ఫ్రెండ్‌షిప్.. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడదామని వ్యాఖ్య
- స్వార్థ రాజకీయ ప్రయోజనాలే చంద్రబాబు పరమావధి

5లో

అయోధ్యపై ఆర్డినెన్స్ ఉండదు



న్యాయ ప్రక్రియ ముగిశాకే నిర్ణయం : ప్రధాని మోదీ

- ఉర్జిత్ పటేల్ ఏడు నెలల క్రితమే రాజీనామా చేస్తానన్నారు
- ప్రజలకు, మహా కూటమికి మధ్యనే రానున్న ఎన్నికలు
- నూతన సంవత్సరంలో ప్రధాని మోదీ తొలి ఇంటర్వ్యూ

13లో

"రుణమాఫీతో అత్యధిక శాతం రైతులకు ప్రయోజనం కలగదు. రుణమాఫీ రాజకీయ స్టంట్. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలవి. రైతులకు సాధికారత కల్పించడమే వారి సమస్యలకు పరిష్కారం. ఆ దిశగానే మేం ఆలోచిస్తున్నాం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే రైతుల సంఖ్య చాలా తక్కువ. ఎక్కువగా ప్రైవేటు రుణాలే తీసుకుంటారు. వారికి రుణమాఫీతో ఎలాంటి ప్రయోజనం ఉండదు.


– ప్రధాని నరేంద్ర మోదీ

కొలువుదీరిన కొత్త హైకోర్టు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ప్రమాణ స్వీకారం

ఆయనతోపాటు మరో 13 మంది న్యాయమూర్తులతో ప్రమాణం చేయించిన గవర్నర్ నరసింహన్

- కార్యక్రమానికి హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సీఎం చంద్రబాబు, మంత్రులు
- ఏపీలో హైకోర్టు ఏర్పాటు కావడం చరిత్రాత్మక ఘట్టం: జస్టిస్ ప్రవీణ్‌కుమార్
- ఆంధ్రప్రదేశ్‌కు హైకోర్టు రాకతో విభజన పూర్తయింది: సీఎం
- తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణాన్ని పరిశీలించిన జస్టిస్ ప్రవీణ్‌కుమార్
- హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ హైకోర్టు జడ్జీలు

మంగళవారం విజయవాడలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్

సాక్షి, అమరావతి/విజయవాడ లీగల్

అమరావతి రాజధాని కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొలువు తీరింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి హైకోర్టును విభజించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మరో 13 మంది న్యాయమూర్తులతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ సలసా వెంకట నారాయణ బట్టు, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ మందాడ సీతారామమూర్తి, జస్టిస్ దుర్గాప్రసాదరావు, జస్టిస్ తాళ్లూరి సునీల్‌చౌదరి, జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి, జస్టిస్ గుడిసేవ శ్యాంప్రసాద్, జస్టిస్ జె.ఉమాదేవి, జస్టిస్ నక్కా బాలయోగి, జస్టిస్ తేలప్రోలు రజని, జస్టిస్ దుర్వాసుల వెంకట సుబ్రహ్మణ్య సూర్యానారాయణ సోమయాజులు, జస్టిస్ కొంగర విజయలక్ష్మి, జస్టిస్ ఎం.గంగారావులు హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత హైకోర్టు విభజనకు సంబంధించి కేంద్ర న్యాయశాఖ, రాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ వేదికపై ప్రకటించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి సీఎం చంద్రబాబు నాయుడు

మిగతా 2వ పేజీలో ▶

ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుంది?

- 10వ శ్వేతపత్రం విడుదలలో సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- కేసీఆర్ ప్రతిపాదిస్తున్న ఫ్రంట్‌ను మోదీ, జైట్లీ ప్రోత్సహిస్తున్నారు
- మేం తక్కువ వడ్డీకి అప్పులు చేశాం
- త్వరలో ఇంటికో స్మార్ట్ ఫోన్ ఇస్తాం
- ఏపీకి కార్యాలయాల తరలింపుతో ఖర్చులు పెరిగాయి

సాక్షి, అమరావతి: తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుందని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. మంగళవారం ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాలులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 10వ శ్వేతపత్రం విడుదల సందర్భంగా రాజకీయాలపైనా చంద్రబాబు మాట్లాడారు. నరేంద్ర మోదీ, అరుణ్ జైట్లీ ఆ ఫ్రంట్‌ను ప్రమోట్ చేస్తున్నారని ఆరోపించారు. నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ ఫెడరల్ ఫ్రంట్‌లో

మిగతా 5వ పేజీలో ▶

రెండు రాష్ట్రాల్లోనూ నాన్‌లోకల్



- వైద్యులకు 'స్థానికత' కష్టం
- రెంటికీ చెడ్డ రేవడిలా మారిన పీజీ వైద్య అభ్యర్థులు
- మీరు మా రాష్ట్రం వాళ్లు కాదంటూ తిరస్కరించిన ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు
- ఎనిమిదో తరగతి దాకా తెలంగాణలో, తర్వాత ఏపీలో చదివిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- రెండు రాష్ట్రాల్లోనూ ఉద్యోగాలకు అనర్హులవుతున్న వైనం

– వివరాలు 16లో

మోడుబారిన బతుకుల్లో చిగురించిన ఆశలు

చంద్రబాబు హామీలను నమ్మి అప్పులు కట్టలేక డిఫాల్టర్లుగా మారిన అన్నదాతలకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రకటించిన 'వైఎస్సార్ రైతు భరోసా' పథకం ఊరట కలిగించనుంది. ఈ పథకం అన్ని విధాలా రైతులకు అండగా ఉంటుందని వివిధ రంగాల నిపుణులు ప్రశంసిస్తున్నారు. 'నవరత్నాలు'పై నేటి నుంచి వరుస కథనాలు..



– ఫ్యామిలీ 9వ పేజీలో

ఇదంజగత్



ఇప్పటికైనా నిర్దోషిగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు చెపుతున్నాడ్సార్!

శ్రీకాకుళం జిల్లా బాహడాపల్లిలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు తమ సమస్యలను వివరిస్తున్న ఉద్దాన రైతాంగ సంక్షేమ సంఘం నేతలు



అన్నదాతలపై రాజద్రోహం కేసులా?

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆగ్రహం

- అధికారంలోకి రాగానే ఎత్తివేస్తామని భరోసా
- తిత్లీ తుపాను బాధితులకు సరుకులు పంచడంతో కక్ష కట్టారని వివరించిన రైతులు
- బాధితులను ఏ విధంగానూ ఆదుకోలేదని ఆవేదన
- ప్రశ్నించిన వారందరినీ అణచి వేస్తున్నారని ఫిర్యాదు
- కష్టాలు చెప్పుకున్న జీడి కార్మికులు
- అందరినీ ఆదుకుంటామని ధైర్యం చెప్పిన జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రైతులపై రాజద్రోహం కేసు పెట్టడం ఏమిటి? ఇంత అన్యాయమా? అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనందరి ప్రభుత్వం రాగానే ఈ అక్రమ కేసులన్నీ ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 335వ రోజు మంగళవారం కొత్త సంవత్సరం ప్రారంభం రోజు

మిగతా 4వ పేజీలో ▶

నిన్ను నమ్మం బాబూ

- చంద్రబాబు వైఫల్యాలు, మోసాల చిట్టా ఇక ప్రజల్లోకి..
- వైఎస్సార్‌సీపీ నిర్ణయం

4లో

వ్యవ'సాయ' వంగడాలు

కర్షకులకు కొత్త ఏడాది కానుక 13 రకాల వంగడాలు



- వచ్చే ఖరీఫ్ నుంచి రైతులకు అందుబాటులోకి కొత్త రకాలు
- ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల రూపకల్పన
- చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తాయని వెల్లడి

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అన్నదాతలకు నూతన సంవత్సర కానుకగా 13 కొత్త వంగడాలను రూపొందించారు.ఇందులో రాష్ట్ర రైతులకు అనుకూలమైనవి 9 రకాలు, దేశ వ్యాప్తంగా అన్నదాతలకు ఉపయోగపడేవి 4 రకాలు ఉన్నాయి. వచ్చే ఖరీఫ్ నుంచి సాగు చేసుకునేందుకు వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. చీడపీడలను తట్టుకోవడంతో పాటు రైతులకు అధిక దిగుబడి ఇస్తాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు. రాష్ట్రానికి సిఫార్సు చేసిన వాటిల్లో వరి, చెరకు, మినుము, వేరుశనగ, రాగి, జొన్న రకాలు ఉన్నాయి. సుదీర్ఘకాలంగా ఈ వంగడాలను అభివృద్ధి చేసి అధిక దిగుబడి వచ్చేందుకు రాష్ట్రంలోని వివిధ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు అవిరళ కృషి చేశారు. జాతీయ స్థాయిలో సాగు చేసేందుకు సిఫార్సు చేసిన వాటిల్లో వరి, వేరుశనగ, చెరకులో రెండేసి రకాలు ఉన్నాయి. రాష్ట్ర రైతాంగంతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల రైతులకు కూడా ఉపయోగపడతాయని వైస్ చాన్సలర్ డాక్టర్ వి.దామోదరనాయుడు, డీన్ ఎన్.వరదరాజుల నాయుడు ఈ సందర్భంగా వివరించారు.

ఏ పంట తీరు ఎలా?


వరి: రాష్ట్రానికి సిఫార్సు చేసిన వరి వంగడాలలో బాపట్ల మసూరీ (బీపీటీ 2295) రకం అత్యధిక దిగుబడిని ఇచ్చే వంగడం. 150–155 రోజుల్లో పంట చేతికి వస్తుంది. అగ్గితెగులు, దోమపోటును తట్టుకుంటుంది. పాండురంగ రకం (ఎంసీయూ–100) 140, 145 రోజుల వ్యవధిలో

మిగతా 4వ పేజీలో ▶

కొండెక్కిన 'కోడి'

భారీగా పెరిగిన చికెన్ ధర

- గత నెలాఖరు వరకూ కిలో రూ.210 నుంచి రూ.230
- కొత్త సంవత్సరంలో ఇంకా పెరిగే సూచనలు



సాక్షి, అమరావతి

కోడి మాంసం ధర కొండెక్కి కూర్చుని సామాన్యుడికి అందకుండా ఊరిస్తోంది. డిసెంబర్ నెల ప్రారంభం నుంచి మొదలైన పెరుగుదల నెలాఖరు నాటికి కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.210 నుంచి 230 వరకూ పలికింది. నూతన సంవత్సరం రోజున కొద్దిగా తగ్గినా మళ్లీ పెరిగే సూచనలే కనిపిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ముక్కలేనిదే ముద్ద దిగని చికెన్ ప్రియులు ఆవేదన చెందుతున్నారు. నెలన్నర క్రితం వరకూ కిలో రూ.150 నుంచి రూ.170 మధ్య ఉన్న బ్రాయిలర్ చికెన్ (స్కిన్‌లెస్) ధర 20 రోజులుగా బాగా పెరిగింది. పది రోజులపాటు కిలో రూ.210 – 230 మధ్య (చికెన్ కంపెనీలు, నాణ్యత, ప్రాంతాన్ని బట్టి రూ.15 నుంచి రూ.20 వరకూ తేడా ఉంటుంది) స్థిరపడింది. రెండు మూడు రోజుల్లో తగ్గుముఖం పట్టి రూ.180–200కి దిగివచ్చింది. గత రెండు మూడు రోజుల్లో తగ్గడానికి అయ్యప్ప, భవానీ దీక్షలు, కొత్త సంవత్సరం, సెంటిమెంటు కారణాలని చికెన్ వ్యాపారులు, బ్రాయిలర్ పౌల్ట్రీ ఫారాల వారు విశ్లేషిస్తున్నారు. రెండు రోజుల్లో భవానీ దీక్షలు

మిగతా 2వ పేజీలో ▶

కొలువుదీరిన కొత్త హైకోర్టు

▶ మొదటి పేజీ తరువాయి

ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా, డీజీపీ ఆర్పీ ఠాకూర్, మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జిల్లా జడ్జి వై.లక్ష్మణరావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ నెల 21న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రాక..

ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ సందేశాన్ని జస్టిస్ ఎన్వీ రమణ చదివి విన్పించారు. రాష్ట్రంలో న్యాయ విభాగం కార్యకలాపాలు విస్తృతమయ్యాయని, మరింత బలోపేతమవ్వడం ఎంతో సంతోషంగా ఉందని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ తన సందేశంలో పేర్కొన్నారు. దేశంలోని న్యాయవ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుది అతిపిన్న వయస్సు అని అన్నారు. మన న్యాయవ్యవస్థ నిస్సందేహంగా గర్వించదగినదిగా ఉండాలని, ఇందుకు మన బాధ్యత ఎంతో ఉందని, ఆనందంతో మన విధుల్లో భాగస్వాములమవ్వాలని ఉద్బోధించారు. న్యాయవ్యవస్థలో న్యాయవాదులు జవాబుదారీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని తన సందేశంలో ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ నెల 21న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ చేతుల మీదుగా అమరావతిలోని తాత్కాలిక హైకోర్టు నూతన భవనాలను ప్రారంభించి పూర్తి స్థాయిలో కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణను సత్కరించారు.

ఇదో చరిత్రాత్మక ఘట్టం: జస్టిస్ ప్రవీణ్‌కుమార్

అమరావతి రాజధాని కేంద్రంగా హైకోర్టు ఏర్పాటు కావడం చరిత్రాత్మక ఘట్టమని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సూచనలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకోవడం ప్రశంసనీయమని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు వ్యవస్థ చరిత్రలో పునరావృతమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి హైకోర్టు గుంటూరు కేంద్రంగా పనిచేసిందని, తదుపరి 1956లో హైదరాబాద్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగాక తిరిగి అమరావతి రాజధాని ప్రాంతం విజయవాడ కేంద్రంగా హైకోర్టు కార్యకలాపాలు చేపట్టడం చరిత్రాత్మకమైన ఘట్టమని జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.



మంగళవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణస్వీకారోత్సవ సభలో జాతీయ గీతాలాపన చేస్తున్న గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబునాయుడు, న్యాయమూర్తులు, ఇతర అధికారులు

విభజన పూర్తయ్యింది: సీఎం

ఆంధ్రప్రదేశ్‌కు హైకోర్టు రాకతో విభజన పూర్తయిందని భావిస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిధులు, ఆస్తుల విభజన తప్ప తరలింపు మొత్తం పూర్తయినట్టేనన్నారు. అమరావతికి హైకోర్టు తరలడానికి తక్కువ సమయం ఇచ్చారన్నారు. హైకోర్టు విధుల నిర్వహణకు ఇబ్బందుల్లేకుండా చూస్తామని చెప్పారు. విభజన సమస్యలున్నా అన్నింటినీ అధిగమిస్తున్నామని, సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో జనవరి 1న నూతన హైకోర్టును ప్రారంభించుకోవడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా తాను, తొలి గవర్నర్‌గా నరసింహన్ బాధ్యతలు చేపట్టామని, ఇప్పుడు హైకోర్టు తొలి చీఫ్ జస్టిస్‌గా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించడం చరిత్ర అని పేర్కొన్నారు. ఇక్కడినుంచే న్యాయపరిపాలనకు శ్రీకారం చుట్టామని, మనందరం కలిసి ఉత్తమ హైకోర్టుగా తీర్చిదిద్దుదామని అన్నారు.

నేటినుంచి తాత్కాలిక హైకోర్టు కార్యకలాపాలు..

విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హైకోర్టు కార్యకలాపాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియ పూర్తయింది. అమరావతి కేంద్రంగా హైకోర్టు కార్యకలాపాలకు, జడ్జీలు, అధికారుల వసతికి అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైకోర్టు కార్యాలయం కోసం 10,000 చదరపు అడుగులు కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి: జస్టిస్ ఎన్వీ రమణ



తాత్కాలిక హైకోర్టును ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ.రమణ

హైకోర్టు ఏర్పడినంత మాత్రాన మన కర్తవ్యం తీరిపోలేదని, దీన్ని ఒక ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దాలని, అందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజలు సహకరించినప్పుడే అది సాధ్యమవుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి జస్టిస్ ఎన్వీ రమణ విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత (10 కోర్టు హాల్స్) న్యాయస్థానం భవన సముదాయాలను ప్రారంభించారు. మొత్తం పది కోర్టులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. హైకోర్టు నిర్వహించాల్సిన విధులు క్లిష్టతరంగాను, సున్నితంగాను ఉంటాయన్నారు. వ్యక్తికి–వ్యక్తికి, వ్యక్తికి–ప్రభుత్వానికి వచ్చే వ్యాజ్యాలు విచారించి న్యాయాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కర్తవ్యాన్ని నిష్కర్షగా నిర్వహించాల్సి ఉందని, ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటమే కాకుండా రాజ్యాంగంలో నిబిడీకృతమైన అంశాలకూ ప్రాధాన్యమివ్వాలన్నారు. తీర్పులు వెల్లడించే సమయంలో న్యాయమూర్తులు స్వతంత్రంగానూ, నిష్కర్షగానూ వ్యవహరించాలని ఉద్బోధించారు. అనువైన సంఘ నిర్వహణకు నిర్మించబడిన సంస్థల్లో న్యాయ సంస్థ కూడా ఒకటన్నారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవభావం ఉండేలా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. హైకోర్టు తరలిరావడంతో ఇక్కడి కక్షిదారులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ప్రస్థానమిదీ..



ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం గవర్నర్ నరసింహన్‌తో కరచాలనం చేస్తున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్

హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ 1961 ఫిబ్రవరి 26వ తేదీన హైదరాబాద్‌లో జన్మించారు. ఆయన తండ్రి సి.పద్మనాభరెడ్డి ప్రముఖ క్రిమినల్ లాయర్, గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారు. ఎంతోమంది పేదల తరపున ఉచితంగా కేసులు వాదించి న్యాయ సహాయాన్ని చేశారు. ఆయన కుమారుడైన ప్రవీణ్‌కుమార్ 10వ తరగతి వరకు హైదరాబాద్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో చదివారు. లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి నిజాం కాలేజీలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1986 ఫిబ్రవరి 28న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. తండ్రి పద్మనాభరెడ్డి వద్దే న్యాయవాద వృత్తిని ఆరంభించారు. అతి తక్కువ కాలంలోనే తండ్రి మాదిరిగా క్రిమినల్ లాపై పట్టు సాధించారు. 2012 జూన్ 29న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2013 డిసెంబర్ 4న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

తాత్కాలిక హైకోర్టును సందర్శించిన చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్

తుళ్లూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం సాయంత్రం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని నేలపాడులో నిర్మిస్తున్న తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పలువురు న్యాయవాదుల బృందం ఆయన వెంట ఉన్నారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం అక్కడ పనిచేస్తున్న పలువురు ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధుల ద్వారా నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ నూతన హైకోర్టు

- సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్‌తో రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్
- అనంతరం హైకోర్టులో ప్రమాణం చేసిన 12 మంది జడ్జీలు



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరాదిన తెలంగాణ కొత్త హైకోర్టు కొలువుదీరింది. తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్ ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో ఉదయం 8.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో జస్టిస్ రాధాకృష్ణన్‌తో గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయించారు. కార్యక్రమం అనంతరం హైకోర్టుకు చేరుకున్న జస్టిస్ రాధాకృష్ణన్ తన సహచర న్యాయమూర్తులు జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పివీ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ బి.శివశంకర్‌రావు, జస్టిస్ షమీమ్ అక్తర్, జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ టి.అమర్‌నాథ్ గౌడ్‌లతో ప్రమాణం చేయించారు. ఇప్పటివరకు ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు మొదటి కోర్టు హాలు వేదిక కాగా, ఈసారి హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద ఉన్న వేదిక నుంచి ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం సీజే, ఇతర న్యాయమూర్తులను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, పలువురు విశ్రాంత న్యాయమూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, అదనపు ఏజీ జె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ తొలి రిజిస్ట్రార్ జనరల్ వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం సాగింది.

జస్టిస్ ఎస్.వి నారాయణబట్టు



1962లో చిత్తూరు జిల్లా మదనపల్లెలో రామ కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసమంతా మదనపల్లెలో కొన సాగింది. బెంగళూరులోని జగద్గురు రేణుకాచార్య కాలేజీ నుంచి లా డిగ్రీ పొందారు. 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఈ.కళ్యాణ్‌రామ్ వద్ద వృత్తిపరమైన మెళకువలు నేర్చుకున్నారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2000–03 సంవత్సరాల మధ్య ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా సేవలు అందించారు. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి



పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో వ్యవసాయ కుటుంబంలో 1962లో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసమంతా భీమవరంలోనే సాగింది. ఏలూరు సీఆర్ రెడ్డి లా కాలేజీ నుంచి లా డిగ్రీ పొందారు. 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాదులు పి.రాజగోపాలరావు, పి.రాజారావుల వద్ద వృత్తి జీవితాన్ని ఆరంభించారు. సివిల్, క్రిమినల్, సర్వీసు చట్టాలపై పట్టు సాధించారు. అనతికాలంలోనే స్వతంత్రంగా ప్రాక్టీస్ చేపట్టారు. పలు సంస్థలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సంగీతం, కళలపై మంచి మక్కువ.

జస్టిస్ ఎం.సీతారామమూర్తి



తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో న్యాయవాద కుటుంబంలో జన్మించారు. వారి వంశంలో మూడో తరం న్యాయవాదిగా ఈయన నిలిచారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 12 సంవత్సరాలపాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఆ తరువాత జ్యుడీషియల్ సర్వీసుల్లో ప్రవేశించారు. పలు హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో పనిచేశారు. ఉత్తమ న్యాయాధికారిగా పలు పతకాలు అందుకున్నారు. యోగా, సంగీతం, ప్రయాణాలంటే ఆసక్తి. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు



విజయనగరం జిల్లాలో 1962లో న్యాయవాద కుటుంబంలో జన్మించారు. తాత ఉప్మాక నారాయణమూర్తి విజయనగరం, పార్వతీపురంలలో ప్రముఖ న్యాయవాదిగా, శతావధానిగా పేరుగాంచారు. తల్లి తరపున వారు కూడా న్యాయవాదులే. భార్య, ఆమె తండ్రి కూడా న్యాయవాదులే. 1986లో బొబ్బిలిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 1998లో అదనపు జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. వివిధ హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో పనిచేశారు. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ తాళ్లూరు సునీల్ చౌదరి



1957 ఫిబ్రవరి 4న ప్రకాశం జిల్లా కారం చేడులో వెంకటాద్రి, వీరమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా కారంచేడులోనే కొనసాగింది. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ సాధించారు. 1984లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. చీరాలలో పి.వెంకటాద్రి వద్ద జూనియర్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. తరువాత జస్టిస్ జె.చలమేశ్వర్(సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఇటీవల పదవీ విరమణ చేశారు) వద్ద పనిచేశారు. పలు ప్రభుత్వరంగ సంస్థలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 1998లో జిల్లా, సెషన్స్ జడ్జిగా ఎంపికయ్యారు. వివిధ హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో పనిచేశారు. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి



కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 1960 జూన్ 14న మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. గ్రాడ్యుయేషన్ వరకు విద్యాభ్యాసమంతా మచిలీపట్నంలోనే సాగింది. ఏలూరు సీఆర్ రెడ్డి లా కాలేజీ నుంచి లా డిగ్రీ సాధించారు. న్యాయవాదిగా ఎన్‌రోల్ అయి, మచిలీపట్నంలో ప్రాక్టీస్ ప్రారంభించారు. యక్కాల పాండురంగారావు వద్ద వృత్తి మెళకువలు నేర్చుకున్నారు. 1991లో జ్యుడీషియల్ సర్వీసుల్లోకి ప్రవేశించారు. పలు హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో పనిచేశారు. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సతీమణి రమణకుమారి ప్రస్తుతం న్యాయాధికారిగా పనిచేస్తున్నారు.

జస్టిస్ జి.శ్యాంప్రసాద్



గుంటూరులో 1958 సెప్టెంబర్ 27న మల్లికార్జునరావు, సావిత్రమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం గుంటూరులోనే సాగింది. నెల్లూరు వీఆర్ లా కాలేజీ నుంచి లా డిగ్రీ సాధించారు. న్యాయవాదిగా ఎన్‌రోల్ అయి ఎన్.చలపతిరావు వద్ద వృత్తి జీవితాన్ని ఆరంభించారు.1985లో జ్యుడీషియల్ సర్వీసుల్లోకి ప్రవేశించారు. వివిధ హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో సేవలు అందించారు. 2016లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ జె.ఉమాదేవి



1959 సెప్టెంబర్ 26న అనంతపురం జిల్లాలో జ్ఞానోబారావు, తులసీబాయి దంపతులకు జన్మించారు. శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ, అన్నామలై యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పట్టాలు పొందారు. 1986లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. వరదారావు వద్ద వృత్తి మెళకువలు నేర్చుకున్నారు. ఆ తరువాత జ్యుడీషియల్ సర్వీసుల్లోకి ప్రవేశించి ఉభయ రాష్ట్రాల్లో పలు హోదాల్లో పనిచేశారు. 2017లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ఎన్.బాలయోగి



తూర్పుగోదావరి జిల్లా పెయ్యలవారిపేట గ్రామంలో 1957 జనవరి 15న జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొందారు. 1980లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయి, సీనియర్ న్యాయవాదిగా వెంకటరామయ్య వద్ద వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తరువాత జ్యుడీషియల్ సర్వీసుల్లోకి ప్రవేశించారు. పలు హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో పనిచేశారు. 2017లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ నెల 14న పదవీ విరమణ చేయనున్నారు.

జస్టిస్ టి. రజని



ప్రకాశం జిల్లా అన్నంబొట్లవారిపాలెంలో 1958 నవంబర్ 6న వెంకటప్పయ్య, రామతులసమ్మ దంపతులకు జన్మించారు. పాఠశాల నుంచి కాలేజీ వరకు విద్యాభ్యాసం గుంటూరులో సాగింది. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొందారు. 1981లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2002 వరకు గుంటూరులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత జ్యుడీషియల్ సర్వీసుల్లోకి ప్రవేశించి పలు హోదాల్లో ఉభయ రాష్ట్రాల్లో పనిచేశారు. 2017లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు



1961 సెప్టెంబర్ 26న జన్మించారు. తండ్రి డీవీ సుబ్బారావు ప్రముఖ న్యాయకోవిదుడు. విద్యాభ్యాసమంతా విశాఖపట్నంలోనే సాగింది. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొందారు. విశాఖపట్నంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. పలు ప్రభుత్వరంగ సంస్థలకు న్యాయవాదిగా వ్యవహరించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, బీసీసీఐ లీగల్ కమిటీ సభ్యునిగా కొనసాగారు. స్వచ్ఛభారత్ అంబాసిడర్‌గా నామినేట్ అయ్యారు. 2017న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కింది కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ కొంగర విజయలక్ష్మి



గుళ్లాపల్లి వెంకటేశ్వరరావు, సీతారత్నం దంపతులకు 1960 సెప్టెంబర్ 20న జన్మించారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ నుంచి లా డిగ్రీ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. విద్యార్థి దశలో వివిధ బహుమతులు అందుకున్నారు. 1985లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. జస్టిస్ ఎస్.పర్వతరావు వద్ద జూనియర్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా, న్యాయవాదిగా పనిచేశారు. ఈమె జస్టిస్ జాస్తి చలమేశ్వర్ వద్ద కూడా పనిచేశారు. 2017లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ఎం.గంగారావు



అనంతపురం జిల్లా గుంతకల్లులో 1961 ఏప్రిల్ 8న చింతామణి, గోవిందమ్మ దంపతులకు జన్మించారు. అనంతపురంలో కామర్స్ డిగ్రీ పూర్తి చేశారు. 1987లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొందారు. 1988లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. జస్టిస్ బీఎస్ఏ స్వామి, జస్టిస్ సీవీ రాములు వద్ద జూనియర్‌గా చేరి వృత్తి మెళకువలు నేర్చుకున్నారు. హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది, ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2017లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

హైకోర్టు ఉద్యోగుల కేటాయింపులు పూర్తి

- ఏపీకి ఆప్షన్ ఇచ్చిన వారందరినీ అక్కడికే కేటాయింపు
- జనవరి 4 లోపు రిపోర్ట్ చేయాలని ఆదేశం
- తెలంగాణకు ఎక్కువ మంది ఆప్షన్ ఇవ్వడంతో పోస్టులన్నీ ఫుల్
- డిప్యూటేషన్‌పై ఏపీకి పలువురు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉద్యోగుల విభజన కూడా పూర్తయింది. ఆంధ్రప్రదేశ్‌కు ఆప్షన్ ఇచ్చిన వారందరినీ ఆ రాష్ట్రానికే కేటాయించారు. వీరంతా నాలుగో తేదీలోపు అమరావతి వెళ్లి ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ) వద్ద రిపోర్ట్ చేయాలని రిజిస్ట్రార్ (అడ్మిన్) డి.నాగార్జున సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణకు ఆప్షన్ ఇచ్చిన వారిలో చాలా మందిని వారి వారి కేడర్‌లో పోస్టులు ఖాళీ లేకపోవడంతో డిప్యూటేషన్‌పై ఏపీ హైకోర్టుకు వెళ్లాలని పేర్కొన్నారు. మరికొంత మందిని తెలంగాణలోనే కింది కోర్టుల్లో డిప్యూటేషన్‌పై చేరాలని స్పష్టం చేశారు. జాయింట్ రిజిస్ట్రార్ పి.శ్రీధర్‌రావు తెలంగాణ హైకోర్టుకు ఆప్షన్ ఇవ్వగా ఆయనను ఏపీ హైకోర్టుకు డిప్యూట్ చేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేడర్‌లో 12 మందిని, సెక్షన్ ఆఫీసర్ కేడర్‌లో 51 మందిని, డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్ కేడర్‌లో 13 మందిని, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కేడర్‌లో 36 మందిని, ఎగ్జామినర్ల కేడర్‌లో 7 మందిని ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై వెళ్లాలని ఆదేశించారు. అసిస్టెంట్ కేడర్‌లో 67 మందిని, ఆఫీస్ సబార్డినేట్ కేడర్‌లో 151 మందిని తెలంగాణలోని కింది కోర్టులో పనిచేయాలని స్పష్టం చేశారు. తెలంగాణకు ఆప్షన్ ఇచ్చి కేడర్ పోస్టులు ఖాళీగా లేనందున ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులతో ఆయా కేడర్‌లో భవిష్యత్తులో ఏర్పడే ఖాళీలను సీనియారిటీ ఆధారంగా భర్తీ చేశారు. తెలంగాణ హైకోర్టులో ఆయా కేడర్‌లో ఖాళీ అయ్యే పోస్టుల్లోకి వీరు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేడర్‌లో తెలంగాణ హైకోర్టులో ఒక పోస్టు ఖాళీ అయిందనుకుంటే, ఆ పోస్టును ఏపీ హైకోర్టు డిప్యూటేషన్‌పై పంపిన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లలో సీనియర్ అయిన అధికారి చేత భర్తీ చేస్తారు. ఇదే రీతిలో మిగిలిన కేడర్ పోస్టులను సైతం భర్తీ చేస్తారు. ఇందుకు సంబంధించి గతంలోనే మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

కొత్త బెంచీల ఏర్పాటు..

ఉమ్మడి హైకోర్టు విభజన జరిగిన జనవరి 1 నుంచి తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హైకోర్టులు వేర్వేరుగా పనిచేస్తున్న నేపథ్యంలో ఇరు హైకోర్టులకు వేర్వేరు వెబ్‌సైట్లను రూపొందించారు. హైకోర్టు విభజన జరిగిన నేపథ్యంలో కొత్త న్యాయమూర్తులతో కొంత బెంచీలు ఏర్పాటు చేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్ పాలనాపరమైన నిర్ణయం తీసుకున్నారు. కేసుల విచారణలో పాత కేసులకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. సీజే సహా మొదటి ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులతో బెంచీలు ఏర్పాటయ్యాయి. మిగిలిన న్యాయమూర్తులు సింగిల్ బెంచ్‌లుగా కేసులను విచారిస్తారు. మొదటి బెంచీలో సీజే జస్టిస్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, రెండో బెంచీలో జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్, మూడో బెంచీలో జస్టిస్ ఆర్.రామసుబ్రమణియన్, జస్టిస్ పి.కేశవరావు ఉంటారు. ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ అప్పీళ్లు, హెబియస్ కార్పస్‌లు, పర్యావరణ, వినియోగదారుల వివాదాలు తదితర కేసులను సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తుంది. క్రిమినల్ అప్పీళ్లు, ఉరిశిక్ష ఖరారు తదితర కేసులపై జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతుంది. ఇన్‌కంట్యాక్స్ ట్రిబ్యునల్ అప్పీళ్లు, వివిధ చట్టాలను, చట్ట నిబంధనలను, ఏపీ పునర్విభజన చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన కేసులను, మనీలాండరింగ్ కేసులను జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తుంది. రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలతో పాటు పలు ఇతర శాఖల కేసులను జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, సివిల్ రివిజన్ పిటిషన్లు, ఒరిజినల్ పిటిషన్లను జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, హోం (ఎఫ్‌ఐఆర్‌ల కొట్టివేత కేసులు మినహా), కేంద్ర ప్రభుత్వ శాఖలు, వైద్య, ఆరోగ్య శాఖ, బీసీ సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు పలు ఇతర శాఖల కేసులను జస్టిస్ పి.నవీన్‌రావు, పురపాలశాఖ, భూ సేకరణ, గనులు, రవాణా, దేవాదాయం, ఎక్సైజ్, అటవీ తదితర శాఖల కేసులను జస్టిస్ చల్లా కోదండరాం, క్రిమినల్ రివిజన్లు, క్రిమినల్ పిటిషన్లను జస్టిస్ బి.శివశంకర్‌రావు, బెయిళ్లు, క్రిమినల్ అప్పీళ్లను జస్టిస్ షమీమ్ అక్తర్, పరిపాలన ట్రిబ్యునల్ నుంచి వచ్చిన కేసులను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి విచారిస్తారు.

ఏ రాష్ట్రానికి ఎంతమంది..

హోదా	తెలంగాణ	ఏపీ
జాయింట్ రిజిస్ట్రార్లు	3	1
డిప్యూటీ రిజిస్ట్రార్లు	5	7
అసిస్టెంట్ రిజిస్ట్రార్లు	15	9
సెక్షన్ ఆఫీసర్లు	67	38
కోర్టు మాస్టర్లు	75	46
డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్లు	20	15
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు	43	21
అసిస్టెంట్లు	94	38
ఎగ్జామినర్స్	29	9
టైపిస్టులు	31	6
కాపీయిస్టులు	31	20
డ్రైవర్లు	58	4
రికార్డ్ అసిస్టెంట్లు	77	7
ఆఫీస్ సబార్డినేట్లు	213	50

కొండెక్కిన 'కోడి'

▶ మొదటి పేజీ తరువాయి

ముగియనున్నాయి. అలాగే అయ్యప్ప భక్తుల్లో కూడా అత్యధిక మంది (మఖరజ్యోతి దర్శనం కోసం ఆగేవారు మినహా) వారం పది రోజుల్లో మాలలు తీసేస్తారు. వీటికి తోడు సంక్రాంతి సందర్భంగా కోళ్లకు డిమాండు పెరుగుతుందని వ్యాపారవర్గాల అంచనాగా ఉంది. వీటికి తోడు గతంతో పోల్చుకుంటే మందు వినియోగం కూడా బాగా పెరగడంతో అదే స్థాయిలో చికెన్ అమ్మకాలూ పెరిగాయి. 'చెప్పడానికి బాగున్నా బాగులేకపోయినా మందుప్రియులవల్లే ఎక్కువగా చికెన్ అమ్ముడుపోతోందన్నది మాత్రం నిజం. చికెన్ విక్రయించే షాపు నిర్వాహకుడిగా ఇది నేను గ్రహించిన వాస్తవం...' అని విజయవాడకు చెందిన ఒక దుకాణం యజమాని 'సాక్షి'కి వివరించారు. ఇతర ప్రాంతాలతో పోల్చితే విజయవాడలో చికెన్ వినియోగమే కాదు ధర కూడా కొద్దిగా ఎక్కువగానే ఉంటుందని ఒక హోటల్ యజమాని అభిప్రాయపడ్డారు.

ముక్కలేనిదే ముద్ద దిగనివారెందరో: పొట్టేలి మాంసంతో పోల్చితే ధర తక్కువగా ఉండటం కూడా కోడికూరకు డిమాండు పెరగడానికి కారణం. మటన్ కొనలేని వారంతా చికెన్‌వైపే మొగ్గుచూపుతున్నారు. హోటళ్లలో సైతం మటన్ కంటే చికెన్ వినియోగమే ఎక్కువగా ఉండటం ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో ప్రతి నెలా మూడు కోట్లకు పైగా బ్రాయిలర్ కోళ్ల ఫారాల నుంచి బయటకు వస్తున్నాయి. సీజన్‌ను బట్టి కొంచెం అటు ఇటుగా అదే స్థాయిలో కోడి పిల్లలు పెంపకం కోసం పౌల్ట్రీలకు చేరుతున్నాయి. వచ్చే వేసవిలో చికెన్ ధరలు పెరగవచ్చని బ్రాయిలర్ రంగ నిపుణులు చెబుతున్నారు. 'ఈఏడాది ఖరీఫ్‌లోనూ, రబీలోనూ వర్షాభావం వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోవడం వల్ల కోళ్లకు దాణాగా వాడే మొక్కజొన్న, తౌడు, సజ్జలు తదితరాల ధర పెరుగుతుంది. కరువువల్ల నీటి సమస్య ఏర్పడుతుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. వేడి పెరిగి భూతాపంవల్ల కోళ్లు చనిపోయి మాంసం ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ కారణాలవల్ల చికెన్ ధర పెరిగితే తప్ప గిట్టుబాటు కాని పరిస్థితి వస్తుందని పౌల్ట్రీ రంగ నిపుణులు చెబుతున్నారు. ధరల్లో నాటుకోడి పొట్టేలు మాంసంతో పోటీ పడుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పొట్టేలి మాసం రూ.550 ఉంటే నాటుకోడి రూ.500 ఉంది. పెద్ద పెద్ద హోటళ్లలో సైతం నాటుకోడి పులుసు, సంగటి మెనూకు క్రేజీ ఏర్పడింది. నాటుకోళ్ల పెంపకం ఖర్చు కూడా ఎక్కువే ఉంటుందని పౌల్ట్రీల యజమానులు చెబుతున్నారు.

ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో ఐటీఐలు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లను (ఐటీఐ) ఏర్పాటు చేసేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆమోదం తెలిపింది. 2016లో తీసుకున్న నిర్ణయాన్ని తాజాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషన్ ట్రైనింగ్ సూచనల మేరకు 2019–20 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో ఐటీఐలను ప్రారంభించేందుకు యాజమాన్యాలు దరఖాస్తు చేసుకునేలా వీలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉన్న సదుపాయాలతోపాటు కొద్దిపాటి వసతులు కల్పిస్తూ ఐటీఐలను ఏర్పాటు చేసుకోవచ్చని వెల్లడించింది. ఈ మేరకు ఏఐసీటీఈ ఆమోదం పొందిన ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలకు, అన్ని రాష్ట్రాల సాంకేతిక విద్యాశాఖలకు లేఖలు రాసింది.

జెన్‌కో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్?

పోర్టు నుంచి చేరని బొగ్గు

ముత్తుకూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం, నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తికి తాత్కాలికంగా గండం ఏర్పడింది. 1.50 లక్షల టన్నుల బొగ్గు లోడుతో రెండు నౌకలు ఇటీవల కృష్ణపట్నం పోర్టుకు చేరుకోవాల్సి ఉన్నా, పెథాయ్ తుపాను కారణంగా సముద్రంలో ఏర్పడిన ఇసుకమేటలు దాటి నౌకలు బెర్తులకు చేరే పరిస్థితి లేకపోవడంతో వాటికి సముద్రంలోనే లంగరు వేసి ఉంచారు. జెన్‌కో ప్రాజెక్టు 2వ యూనిట్లో ఓవరాయిలింగ్ పనులు జరుగుతుండగా, 1వ యూనిట్లో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. బొగ్గు నిల్వలు కేవలం 15 వేల టన్నులకు మించి లేవు. నిల్వలు రెండు రోజులకు కూడా చాలవు. నౌకలు బెర్తులకు చేరి, బొగ్గు దిగుమతి చేయని పక్షంలో జెన్‌కో ప్రాజెక్టులో విద్యుత్ నిలిపివేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

3 జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు

సాక్షి, అమరావతి: వైఎస్‌ఆర్, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 3 పట్టణాభివృద్ధి అథారిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప కేంద్రంగా కడప మున్సిపల్ కార్పొరేషన్, ప్రొద్దుటూరు, రాయచోటి, మైదుకూరు, బద్వేలు, పులివెందుల మున్సిపాలిటీలు, మైదుకూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు నగర పంచాయతీలతో పాటు 39 మండలాల్లోని 339 గ్రామాలతో అన్నమయ్య పట్టణాభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేశారు. అలాగే ఒంగోలు కేంద్రంగా ఒంగోలు మున్సిపల్‌కార్పొరేషన్, చీరాల, మార్కాపురం, కందుకూరు మున్సిపాలిటీలు, అద్దంకి, చీమకుర్తి, కనిగిరి, గిద్దలూరు నగర పంచాయతీలతో పాటు 39 మండలాల్లోని 435 గ్రామాలతో ఒంగోలు పట్టణాభివృద్ధి అథారిటీ ఏర్పాటు చేశారు. అలాగే ఏలూరు కేంద్రంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, భీమవరం మున్సిపాలిటీలు జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలతో పాటు 35 మండలాల్లోని 463 గ్రామాలతో ఏలూరు పట్టణాభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేశారు.

జరిమానాకు బదులు నజరానా!

- వెలిగొండలో 60సీ కింద తొలగించిన కాంట్రాక్టర్లకు ముఖ్యనేత దన్ను
- అదనంగా రూ.195.47 కోట్లు చెల్లించాలంటూ ఒత్తిడి
- నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ల నుంచి రూ.31.39 కోట్లను జరిమానాగా రాబట్టాలన్న అధికారులు
- అభ్యంతరం చెప్పినవారిపై మండిపడ్డ ముఖ్యనేత
- తదుపరి క్యాబినెట్ భేటీలో ప్రతిపాదనలు ఆమోదించేందుకు సిద్ధం
- ఈ వ్యవహారంలో రూ.వంద కోట్లకుపైగా ముడుపులు చేతులు మారే అవకాశం



సాక్షి, అమరావతి: వెలిగొండ ప్రాజెక్టు పనులను సకాలంలో చేయలేదంటూ 60 సీ నిబంధన కింద తొలగించిన పాత కాంట్రాక్టర్ల నుంచి రూ.31.39 కోట్లను జరిమానా వసూలు చేయాల్సిన సర్కారు అది రాబట్టకపోగా వారికి అదనంగా రూ.195.47 కోట్లు చెల్లించాలని ఒత్తిడి తేవడంపై అధికారులు నివ్వెరపోతున్నారు. నిబంధనల ప్రకారం అదనంగా చెల్లించలేమని, ఇప్పటివరకూ చేసిన పనుల బకాయిల కింద రూ.8.09 కోట్లను సర్దుబాటు చేయగలమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే నిబంధనలతో ముడిపెడితే పనులు సాగవంటూ తక్షణమే కాంట్రాక్టర్లకు అదనపు నిధులు చెల్లించేందుకు వీలుగా వచ్చే కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ పెద్దలు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నట్లు జలవనరులశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

2014 నాటికే సింహభాగం పనులు పూర్తయినా

వెలిగొండ పనుల్లో మొదటి సొరంగం (0 కి.మీ నుంచి 18.8 కి.మీ) తవ్వకం పనులను రూ.624.60 కోట్లకు సాబీర్–ప్యూ–ప్రసాద్ (జేవీ), రెండో టన్నెల్ (0కి.మీ. నుంచి 18.787 కి.మీ.) తవ్వకం పనులను రూ.735.21 కోట్లకు హెచ్‌సీసీ–సీపీపీఎల్(జేవీ) దక్కించుకున్నాయి. 2014 నాటికే మొదటి సొరంగంలో 15.2 కి.మీ., రెండో సొరంగంలో 10.750 కి.మీ. వరకు తవ్వకం పనులు లైనింగ్‌తో సహా పూర్తయ్యాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసం ఓ కీలక మంత్రి సొరంగాల కాంట్రాక్టర్లతో బేరసారాలు జరిపారు. ఈ నేపథ్యంలో వెలిగొండ ప్రాజెక్టును 2016 డిసెంబర్ నాటికే పూర్తి చేయాలంటూ సొరంగాల పనులను వేగవంతం చేయడం పేరుతో టీబీఎం(టన్నెల్ బోరింగ్ మిషన్)లకు కొత్త బుష్‌లు, కన్వేయర్ బెల్ట్‌లు అమర్చేందుకు నిబంధనలను తుంగలో తొక్కుతూ కాంట్రాక్టర్లకు రూ.68.44 కోట్లను ఇస్తూ 2016 జూలై 5న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంట్రాక్టర్లతో కుదిరిన ఒప్పందం మేరకు ఇందులో సింహభాగం నిధులను కీలక మంత్రి కమీషన్ల రూపంలో దక్కించుకున్నారు.

మిగిలిన పనుల అంచనాలు పెంచేసి...

అదనపు నిధులను కీలక మంత్రి అందినకాడికి స్వాహా చేయడంతో కాంట్రాక్టర్లు టీబీఎంలకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దీంతో రోజుకు సగటున 4 మీటర్ల మేర కూడా సొరంగం తవ్వలేని దుస్థితి నెలకొంది. దీన్ని సాకుగా చూపిస్తూ గత మార్చిలో రెండు సొరంగాల కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద వేటు వేసేలా ముఖ్యనేత చక్రం తిప్పారు. మొదటి సొరంగం పనుల్లో 116.447 కోట్లు, రెండో సొరంగంలో రూ.299.48 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. ఈ మిగిలిన పనులకు జీవో 22 (ధరల సర్దుబాటు), జీవో 63 (పనుల పరిమాణం పెరిగితే అదనపు బిల్లుల చెల్లింపు)లను వర్తింపజేసినా సరే మొదటి సొరంగంలో మిగిలిన పనుల విలువ రూ.186.31 కోట్లు, రెండో సొరంగంలో మిగిలిన పనుల విలువ రూ.479.17 కోట్లకు మించదని జలవనరుల శాఖ అధికారులు నిర్ధారించారు. అయితే సొరంగాల పనులను కోటరీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకునే ఎత్తుగడలో భాగంగా అంచనా వ్యయాన్ని పెంచాలని అధికారులపై ముఖ్యనేత తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. దీంతో మొదటి సొరంగం పనుల వ్యయాన్ని రూ.292.15 కోట్లకు, రెండో సొరంగం పనుల వ్యయాన్ని రూ.720.26 కోట్లకు పెంచేశారు. వీటిని తనకు అనుకూలమైన సంస్థలకు అప్పగించి ముఖ్యనేత రూ.275 కోట్లకుపైగా కమీషన్‌లు వసూలు చేసుకున్నారు.

కమీషన్ల కోసం పాత కాంట్రాక్టర్లకు దన్ను..

సొరంగాల పనుల్లో అబ్రాసివ్ రాక్(కరకు రాళ్లు) తొలగించినందుకు రూ.20.38 కోట్లు, ఫాల్ట్ జోన్ (వదులు మట్టి) తప్పించి పనులు చేసినందుకు రూ.27.19 కోట్లు, క్వారీని మార్చినందుకు రూ.7.69 కోట్లు, ధరల సర్దుబాటు కింద రూ.21.24 కోట్లు, టీబీఎంల మరమ్మతుకు రూ.10 కోట్లు, హెడ్ రెగ్యులేటర్‌లో అదనపు పనులకు రూ.పది కోట్లు, 60 సీ నిబంధన కింద తొలగించడంతో పరిహారం కింద రూ.84 కోట్లు, మిగిలిన పరికరాల పరిహారంగా రూ.14.97 కోట్లు వెరసి రూ.195.47 కోట్లు తమకు అదనంగా ఇవ్వాలంటూ పాత కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాంట్రాక్టర్లకు న్యాయం చేయకుంటే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉందని ముఖ్యనేత పేర్కొనడంతో వీటిని పరిశీలించిన అధికారులు రూ.8.09 కోట్ల బకాయిలు మాత్రమే చెల్లిస్తామని, అదనపు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం లేదని తేల్చారు. 60 సీ కింద కాంట్రాక్టర్లను తొలగిస్తే నిబంధనల ప్రకారం మిగిలిన పనుల విలువలో ఐదు శాతాన్ని జరిమానాగా వసూలు చేయాలని, ఆ లెక్కన సొరంగాల కాంట్రాక్టర్ల నుంచి రూ.31.39 కోట్లను రాబట్టాలని అధికారులు ప్రతిపాదించడంపై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జరిమానా నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వడంతోపాటు కాంట్రాక్టర్లకు అదనపు నిధులు ఇవ్వాలంటూ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఈ ప్రతిపాదనను తోసిపుచ్చిన స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌సీ) అదనపు నిధులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అధికారులు అడ్డం తిరగడంతో అదనపు నిధులు మంజూరు చేసేందుకు వీలుగా కేబినెట్‌కు ప్రతిపాదనలు పంపాలని ముఖ్యనేత జలవనరుల శాఖను ఆదేశించారు. తదుపరి కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసి కాంట్రాక్టర్లకు రూ.19.5.47 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చేందుకు సిద్ధపడ్డారు. ఈ వ్యవహారంలో రూ.వంద కోట్లకుపైగా ముడుపులు చేతులు మారనున్నట్లు సమాచారం.

దుర్గమ్మని దర్శించుకున్న జస్టిస్ సోమయాజులు



డీజీపీ ఠాకూర్‌కు దేవస్థాన క్యాలెండర్‌ను అందజేస్తున్న దుర్గ గుడి పాలకమండలి సభ్యులు



జస్టిస్ సోమయాజులుకు క్యాలెండర్ అందజేస్తున్న ఈవో కోటేశ్వరమ్మ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్.సోమయాజులు మంగళవారం రాత్రి దుర్గమ్మని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ సోమయాజులు దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. జస్టిస్‌కు ఆలయ ఈవో వి.కోటేశ్వరమ్మ అమ్మవారి చిత్రపటం, దేవస్థాన కేలండర్‌తో పాటు ప్రసాదాలను అందజేశారు.

దుర్గమ్మ సేవలో డీజీపీ ఠాకూర్..

డీజీపీ ఠాకూర్ విజయవాడ దుర్గమ్మను మంగళవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన డీజీపీకి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం డీజీపీకి వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. డీజీపీకి ఆలయ పాలకమండలి సభ్యులు పద్మశేఖర్, ఆలయ అర్చకులు దేవస్థాన కేలండర్‌ను, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ)/సాక్షి, హైదరాబాద్: ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ–సికింద్రాబాద్ ప్రత్యేక రైలు(08501) జనవరి 8, 15, 22, 29, ఫిబ్రవరి 5, 12, 19, 26, మార్చి 5, 12, 19, 26 తేదీలలో రాత్రి 11 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. సికింద్రాబాద్–విశాఖ రైలు (08502) జనవరి 2, 9, 16, 23, ఫిబ్రవరి 6, 13, 20, 27, మార్చి 6, 13, 20, 27 తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. జబల్‌పూర్–తిరునల్వేలి రైలు (02194) జనవరి 3, 10, 17, 24, 31 తేదీల్లో ఉదయం 9.30కి జబల్‌పూర్‌లో బయలుదేరుతుంది. తిరునల్వేలి–జబల్‌పూర్ రైలు (02193) జనవరి 5, 12, 19, 26, ఫిబ్రవరి 2వ తేదీలలో సాయంత్రం 5.45 గంటలకు తిరునల్వేలిలో బయలుదేరుతుంది.

ప్రజా సంకల్ప యాత్ర

335వ రోజు

ఇప్పటి వరకు నడిచిన దూరం

3,585 కిలో మీటర్లు

335వ రోజు నడిచిన దూరం

10.9 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు డెప్పూరు కూడలి

ముగింపు: సా. 5 గంటలకు హరిపురం శివారు

ముఖ్యాంశాలు

- డెప్పూరు కూడలి, ఒంకులూరు క్రాస్, అనకాపల్లి క్రాస్, రంగోయి క్రాస్, శ్రీరాంనగర్, బాహడపల్లి, నల్లబొడ్లూరు, గుజ్జులూరు, బి.జగన్నాథపురం, నారాయణపురం, హరిపురం శివారులో ప్రజలతో మమేకం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు హరిపురం శివారు

ముఖ్యాంశాలు

- మందస మండలం హరిపురం, అంబుగాం, ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలంలోని రాణిగాం, మామిడిపల్లి, పాత్రపురం క్రాస్, తురకశాసనలలో ప్రజలతో మమేకం

నా బిడ్డకు మాటలు తెప్పించండన్నా..



అన్నా.. నా బిడ్డ గుంటి జయశ్రీకి చిన్నతనం నుంచి మాటలు రావడం లేదు. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని ప్రధాన ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఫలితం లేదు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుని ఆపరేషన్ చేయిస్తేనే మాటలు వస్తాయని చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పుడిది సాధ్యం కాదని చెబుతున్నారు. ఎలాగైనా నా బిడ్డకు మాటలు వచ్చేలా చూడండన్నా.

– గుంటి శ్రీకన్య, ఒంకులూరు, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

గంగిరెద్దుల కులస్తులను ఆదుకోవాలి



సార్.. 70 సంవత్సరాలుగా మా కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. పండుగ రోజుల్లో ఊరూరూ తిరిగి గంగిరెద్దులతో ఆటలు ఆడించి, భిక్షాటన చేసి, గుప్పెడు గింజలు సంపాదించి జీవనం సాగిస్తున్నాం. మేము సంచార జాతుల వాళ్లం. మమ్మల్ని బీసీ–ఏ కేటగిరీలో గుర్తించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందడం లేదు. ఇల్లు కట్టుకోవడానికి సెంటు భూమి కూడా లేదు. మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలి. మమ్మల్ని కళాకారులుగా గుర్తించి పింఛన్లు అందజేయాలి. అన్ని విధాలా వెనుకబడిన మమ్మల్ని మీరే ఆదుకోవాలి.

– యడ్ల విశ్వనాథం, గంగిరెడ్ల కుల సంఘ నేత, బైరిసారంగపురం, పలాస మండలం,

తిత్లీ నష్ట పరిహారం రూపాయి కూడా అందలేదు



అన్నా.. తిత్లీ తుపానుతో నా రెండు ఎకరాల కొబ్బరి తోట సర్వం తుడిచి పెట్టుకుపోయింది. అధికారులు వచ్చి నష్టపోయిన పంటను పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో పేరు ఉన్నప్పటికీ నేటికీ ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం అందలేదు. ప్రతి రెండు నెలలకు ఆదాయం వచ్చే కొబ్బరి పంటా లేదు. ఎలా జీవితం గడపాలో అర్థం కావడం లేదు. మీ ప్రభుత్వం రాగానే తిత్లీ బాధితులను ఆదుకోవాలి.

– జుత్తు మోహనరావు, బిడిమి, మందస మండలం



నూతన సంవత్సరాది సందర్భంగా అభిమానుల కేరింతల మధ్య డెప్పూరులో కేక్ కట్ చేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



నారాయణపురం జంక్షన్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్ (ఇన్‌సెట్‌లో) చిన్నారితో ఆప్యాయంగా..

అన్నదాతలపై రాజద్రోహం కేసులా?

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలోని పలు పల్లెల్లో పాదయాత్ర సాగించారు. మందస మండలం బాహడాపల్లి గ్రామం వద్ద రైతు సంఘం నేతలు మామిడి మాధవరావు, నల్లా హడ్డి, ఎం.తులసయ్య, ఎం.కృష్ణారావు, మజ్జి బాబూరావు (రిటైర్డు ఎంఈఓ)తో పాటు రైతులు దాసరి శ్రీరాములు, జె.కోదండ, నీలకంఠం, సాలిన వీరాస్వామి, పుచ్చ దుర్యోధనతో పాటు కేసులున్న మరికొందరు రైతులు జగన్‌ను కలుసుకుని తమపై కేసులు పెట్టడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు. 'అయ్యా.. మొన్నటి తిత్లీ తుపాను బీభత్సానికి ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోయింది. బాధితులైన రైతులు, ఆయా గ్రామాల ప్రజలు రోడ్డున పడి, సాయం కోసం ఆర్తనాదాలు చేశారు. ఈ సమయంలో ప్రభుత్వ సాయం ఎంతకీ అందక పోవడంతో ఉద్దాన రైతాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేతలు, స్థానికంగా కొంత మంది రైతులు కలిసి బాధితులకు బియ్యం, పప్పులు, దుప్పట్లు, కొవ్వొత్తులు (కరెంటు లేనందువల్ల) ఉచితంగా పంపిణీ చేశారు. అప్పటికే ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సాగుతూండింది. రైతులు ఎక్కడైనా ఆందోళనకు దిగి చంద్రబాబు పర్యటనకు అడ్డొస్తారేమోననే అనుమానంతో.. ఉద్దానం ప్రాంతంలో రైతు ర్యాలీలు నిర్వహించామనే నెపాన్ని చూపుతూ మాపై అణచివేతకు దిగారు. మాలో 16 మందిని అరెస్టు చేసి రాజద్రోహం కింద కేసులు పెట్టారు' అని వారు జగన్‌కు వివరించారు. వీరి కష్టంపై జగన్ స్పందిస్తూ.. 'మనందరి ప్రభుత్వం రాగానే రైతు సంఘం నేతలు, రైతులపై ప్రభుత్వం అక్రమంగా పెట్టిన అన్ని కేసులనూ బేషరతుగా ఎత్తి వేస్తాం. అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటాం. ఈ ప్రభుత్వం రైతుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తోంది' అన్నారు. జగన్ భరోసాపై పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని పలువురు రైతులు వైఎస్ జగన్‌కు విన్నవించారు. చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. జంతిబంద చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చే విషయం పరిశీలించాలని, తుపానుల సమయంలో పెనుగాలుల తీవ్రతను తగ్గించేందుకు తీరం వెంబడి తాటి, మొగిలి, సరుగుడు, ఈత చెట్లతో మడ అడవులను పెంచాలని కోరారు. వీటన్నింటిపై జగన్ సానుకూలంగా స్పందిస్తూ.. పంట వేయడానికి ముందే గిట్టుబాటు ధర ప్రకటిస్తామని, మత్స్యకారులనూ అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మిగతా సమస్యలపై నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

జీడి కార్మికులకు జగన్ భరోసా

పలాస ప్రాంతంలోని జీడి పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులను ఆదుకుంటామని జగన్ హామీ ఇచ్చారు. బాహడాపల్లి గ్రామంలో జీడి పరిశ్రమ కార్మికులంతా వైఎస్ జగన్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఎస్.నాగమ్మ అనే కార్మికురాలు జగన్‌తో మాట్లాడుతూ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కేజీ జీడి పిక్కలు కటింగ్ చేస్తే ఇచ్చే రూ.23 గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. ఎస్.పార్వతి అనే కార్మికురాలు మాట్లాడుతూ జీడి పిక్కలు కటింగ్ చేస్తున్న కార్మికులు కీళ్లు, ఎముకల నొప్పులతో బాధ పడుతున్నారని, పలువురు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్నారు. కటింగ్ మిషన్ వద్ద ఎక్కువ సమయం పని చేసినందువల్ల ఈ పరిస్థితి ఎదురవుతోందన్నారు. ఈ ప్రాంతంలో తమకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. చేతి వేళ్లకు చీడి అతుక్కుని పుండ్లు పుట్టి రేషన్ వద్ద బయోమెట్రిక్ పడడం లేదన్నారు. ఈ కారణంగా రేషన్ ఇవ్వడం లేదని వాపోయారు. జీడిపరిశ్రమలో ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న జీడిపరిశ్రమ యజమాని కొంచాడ తిరుమలరావుతో జగన్ మాట్లాడారు. మనందరి ప్రభుత్వం రాగానే కార్మికులకు వైద్య సేవలు మెరుగుపరుస్తామని భరోసా ఇచ్చారు. మహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని 45 ఏళ్లు దాటిన ప్రతి అక్కకూ నాలుగేళ్లలో రూ.75 వేలు ఇస్తామని భరోసా ఇచ్చారు.





వంకులూరు క్రాస్ - చిన్నవంకులూరు మధ్య తిత్లీ తుపాను వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలిస్తూ పాదయాత్ర సాగిస్తున్న వైఎస్ జగన్

ఈ ఏడాది మాకు ప్రత్యేకం..

'ఈ ఏడాది తొలి రోజునే జగనన్న మా ఊర్లో అడుగు పెట్టాడు. ఆయన్ను కలుసుకోవడం మాకు చాలా ఆనందంగా ఉంది' అని మంగళవారం ఉద్దానం పల్లె ప్రజలు అన్నారు. మత్స్యకారులు, ఉద్యాన పంటల రైతులు, బీసీలు ఎక్కువగా నివసించే వంకులూరు క్రాస్, చిన్న వంకులూరు, అనకాపల్లి క్రాస్, రంగోయిక్రాస్, శ్రీరాంనగర్, బహాడపల్లి, నల్ల బొడ్లూరు, గుజ్జులూరు, బి.జగన్నాథపురం, నారాయణపురం గ్రామాల్లో జగన్ పాదయాత్ర సాగిస్తున్నప్పుడు కొత్త దుస్తులు ధరించిన మహిళలు, సాధారణ జనం ఆయన వద్దకు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. 2019లో మీరు తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని వారంతా మనసారా ఆకాంక్షించారు. 2018లో భీకరమైన తిత్లీ తుపానుతో తామంతా తల్లడిల్లి పోయామని అలాంటి రోజు మళ్లీ రాకూడదని భావిస్తున్నామన్నారు. జగన్ భరోసా తమకు ఎంతో ఊరటను కలిగించిందన్నారు.



బి.జగన్నాథపురంలో జనసందోహం మధ్య పాదయాత్ర సాగిస్తున్న జగన్..



బాహడాపల్లిలో జీడిపిక్కల కార్మికుల చేతి వేళ్లను పరిశీలిస్తున్న వైఎస్ జగన్






ఓ అవ్వ, ఓ దివ్యాంగుడు కోరడంతో సెల్ఫీ..

ప్రజాసంకల్ప యాత్ర మరిన్ని చిత్రాల కోసం QR code స్కాన్ చేయండి

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

335వ రోజు

01–01–2019, మంగళవారం,
హరిపురం శివారు, శ్రీకాకుళం జిల్లా.



కొత్త సంవత్సరంలోనైనా రాష్ట్ర ప్రజలకు వంచన నుంచి విముక్తి లభించాలి

ఉదయం శిబిరం వద్ద వందలాది మంది ఆత్మీయుల నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాదయాత్రను ప్రారంభించాను. శిబిరం బయటకు వస్తూనే వంకులూరు గ్రామ అక్కచెల్లెమ్మలు సంప్రదాయ కలశాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేయించారు. ఒకప్పుడు అభివృద్ధికి నోచుకోని శివారు మత్స్యకార గ్రామమది. నేడు ఆదర్శ గ్రామంగా మారింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే అభివృద్ధికి నడుం బిగించారు. చేపల వేట భారమై, జీవనోపాధి వెతుక్కుంటూ, ఆ గ్రామం నుంచి వలస వెళ్లిపోయి బయట ప్రాంతాల్లో బాగా స్థిరపడినవారు.. తాము పుట్టిన ఊరిని దత్తత తీసుకున్నారట. ప్రతిరోజూ ఊళ్లోని ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో మమేకమవుతున్నారని తెలిసి సంతోషమేసింది. వారి స్ఫూర్తి ఆదర్శదాయకం.

తిత్లీ బాధితుల విషయంలో సర్కార్ మాయాజాలం అన్ని గ్రామాల్లో కనబడుతోంది. అనర్హులైన పచ్చచొక్కాల వారు బాధితుల పరిహారాన్ని మింగేస్తున్నారని శ్రీరామ్‌నగర్ గ్రామస్తులు చెప్పారు. మరోవైపు అసలైన బాధితుల్లో కొందరినే గుర్తించింది ప్రభుత్వం. వారికి బాబుగారి ఫొటోలున్న చెక్కులిచ్చి చేతులు దులుపుకుంది. అవి కేవలం ప్రచారం కోసమే ఇచ్చినవని గ్రామస్తులు వాపోయారు. పరిహారం మాత్రం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాహడాపల్లి.. సాయుధ విప్లవ పోరాటాలకు పేరెన్నికగన్నది. ఆ ఊరి దగ్గర రైతు సంఘాల ప్రతినిధులు కలిశారు. తిత్లీ తుపాను తర్వాత ప్రభుత్వం నుంచి సహాయ కార్యక్రమాలే లేవట. దాంతో అక్కడి ప్రజాసంఘాలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసించాయి. దాతల నుంచి సేకరించిన బియ్యాన్ని, నిత్యావసర సరుకులను బాధితులకు పంచిపెడుతూ ఉంటే 16 మంది మీద రాజద్రోహం కేసులు పెటారని వాపోయారు. బాధితులకు పరిహారం చెల్లించకుండా చెల్లని చెక్కులిచ్చి మోసం చేస్తున్న చంద్రబాబుపై ఏ కేసులు పెట్టాలంటూ రైతు సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు.

అదే గ్రామంలో జీడి పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు కలిశారు. వారి కష్టాలను కళ్లారా చూశాను. చేతులన్నీ పొక్కిపోతున్నా, రోజంతా నిలబడి పనిచేస్తున్నా కూలి రూ.200 కూడా రాకపోతే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్టం చూసి బాధనిపించింది. వారికి మంచి చేయాలన్న ఆలోచన దృఢపడింది.

ఈ రోజు పాదయాత్ర సాగిన మందస మండలం పాలకోవాకు బాగా ప్రసిద్ధి. స్వచ్ఛమైన పాలతో, సంప్రదాయ పద్ధతుల్లో తయారు చేసే కోవా మందసకే పేరు తెచ్చిపెట్టింది.

ఈ నూతన సంవత్సరంలోనైనా రాష్ట్ర ప్రజలకు వంచన నుంచి విముక్తి లభించాలి.. జీవన ప్రమాణాలు పెరగాలి.. సుఖసంతోషాలు వెల్లివిరియాలి.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. వ్యాట్‌ను 12.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గించి, హార్టికల్చర్ సబ్సిడీని 40 శాతానికి పెంచి, పావలా వడ్డీ రుణాలిచ్చి నాన్నగారు పలాస జీడి పరిశ్రమను ఆదుకున్నారు. ఆ పరిశ్రమ అభివృద్ధి కోసం మీరు తీసుకున్న ఒక్కటంటే ఒక్క చర్య అయినా ఉందా?

వై.యస్. జగన్.

వ్యవ'సాయ' వంగడాలు

▶ మొదటి పేజీ తరువాయి

పండుతుంది. అగ్గితెగులు, ఆకుమచ్చ, పొట్టకుళ్లు, కాండం తొలుచు పురుగును తట్టుకునే రకం ఇది. ఈ రెండూ కూడా పొట్టి గింజరకాలే. భోజనానికి అనువైన రకం.

జొన్న: నంద్యాల పచ్చజొన్న ఎస్–15 (ఎస్‌జే 2446) 125 రోజుల పంట. ఖరీఫ్, రబీలలో సాగు చేయవచ్చు. వర్షాభావాన్ని తట్టుకోగలదు. కాండం తొలిచే పురుగును తట్టుకోగలదు. ఇక నంద్యాల తెల్లజొన్న (ఎస్‌జే 2647) వంద రోజుల పంట. ఏ కాలంలోనైనా పండించవచ్చు. పశువులకు మంచి మేత కూడా.

రాగి: ఏయూ 3077, రత్నగిరి రకాల సంకరంతో 125 రోజుల్లో పండే ఈ తిరుమల రకాన్ని అభివృద్ధి చేశారు. ఖరీఫ్, రబీ, వేసవిలో పండించవచ్చు. పైరు ఏపుగా పెరుగుతుంది. కంకి పెద్దదిగా ఉండి అధిక దిగుబడినిస్తుంది. కాల్షియం ఎక్కువ.

మినుము: ఎల్‌బీజీ– 685, పీయూ –31 రకాల సంగమంతో ఘంటసాల మినుము రకాన్ని రూపొందించారు. 75 రోజుల్లో చేతికి వచ్చే ఈ రకాన్ని మూడు కాలాల్లోనూ సాగు చేయవచ్చు. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. మాగాణిలోనూ సాగు చేయవచ్చు. ధీరజ్ రకమైతే ఎండతో పాటు రసం పీల్చే పురుగు వంటి తెగుళ్లను తట్టుకుంటుంది. తినడానికి అనువైన రకం

చెరకు: కోయంబత్తూరు ఏ 92081, జీసీ వంగడాల కలయికతో రూపొందించిన రంగా రకం చెరకు పది నెలల్లో కొట్టుడుకు వస్తుంది. డిసెంబర్, జనవరి నెలల్లో నాటితే మంచిది. కనీస మద్దతు ధరకు నిబంధనగా పెట్టిన పంచదార దిగుబడి శాతం 13.9 – 14.9 దాకా వస్తుంది. చవుడు భూముల్లోనూ సాగు చేయవచ్చు. స్వర్ణముఖి రకమైతే 19–20 శాతం మధ్య పంచదార దిగుబడి వస్తుంది. నాణ్యమైన బెల్లం తయారీతో పాటు యంత్రాలతో కోతకు అనువైంది. పరిమిత నీటి వనరులతో కూడా పండించవచ్చు.

జాతీయ స్థాయి వంగడాలలో వరి, వేరుశనగ:
వరిలో వరం, క్షీర అనే రెండు రకాల వంగడాలను మచిలీపట్నంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎండు తెగులు సహా వివిధ రకాల చీడపీడల్ని తట్టుకునే రకాలివి. గరిష్టంగా 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. వేరుశనగలో అభివృద్ధి చేసిన నిత్య హరిత, కదిరి చిత్రావతి రకాలు గరిష్టంగా 120 రోజుల్లో దిగుబడిని ఇస్తాయి. వైరస్ తెగుళ్లను కూడా తట్టుకుంటాయి.

ఎక్కడ దొరుకుతాయి?
ఈ వంగడాలు ఆయా ప్రాంతాల్లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రాలలో లభిస్తాయి. ఉదాహరణకు ఏదైనా వంగడాన్ని తిరుపతిలోని వ్యవసాయ కేంద్రం అభివృద్ధి చేస్తే అది అక్కడ దొరుకుతుంది. బ్రీడర్ సీడ్‌గా వీటిని విక్రయిస్తారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు నిర్ణయించిన ధరకు మార్క్‌ఫెడ్ సంస్థ రైతులకు అమ్ముతుంది. అదనపు సమాచారం కోసం దగ్గర్లోని వ్యవసాయాధికారులను, కృషి విజ్ఞాన కేంద్రాలను (కేవీకే) సంప్రదించవచ్చు.

ఇవీ నూతన వంగడాలు....

పంట	రకం	పరిశోధన కేంద్రం	దిగుబడి (హెక్టార్‌కు)
రాష్ట్ర స్థాయిలో			
వరి	పాండురంగ (ఎంసీఎం 100)	మచిలీపట్నం	55 నుంచి 60 క్వింటాళ్ల మధ్య
వరి	బాపట్ల మసూరి (బీపీటీ 2295)	బాపట్ల	65 నుంచి 70 క్వింటాళ్ల మధ్య
చెరకు	స్వర్ణముఖి 2005 టీ 16 (కో.టి.0367)	పెరుమాళ్లపల్లె	100 నుంచి 110 టన్నుల మధ్య
చెరకు	రంగా 2009 వి 127 (కో.వి. 15–356)	ఉయ్యూరు	120 నుంచి 130 టన్నుల మధ్య
మినుము	ఘంటసాల మినుము–1 (జి.బి.జి. 1)	ఘంటసాల	17 నుంచి 18 క్వింటాళ్ల మధ్య
వేరుశనగ	ధీరజ్ (టీసీజీఎస్. 1073)	తిరుపతి	25 నుంచి 26 క్వింటాళ్ల మధ్య (ఖరీఫ్)
వేరుశనగ	ధీరజ్ (టీసీజీఎస్. 1073)	తిరుపతి	35 నుంచి 37 క్వింటాళ్ల మధ్య (రబీ)
రాగి	తిరుమల (పీపీఆర్ 1012)	పెరుమాళ్లపల్లె	30 నుంచి 35 క్వింటాళ్ల మధ్య
జొన్న	ఎస్‌టిజే 5 (ఎస్‌జే 2647)	నంద్యాల	37 నుంచి 62 క్వింటాళ్ల మధ్య
జొన్న	ఎస్ 15 (ఎస్‌జే 2446)	నంద్యాల	25 నుంచి 32.5 క్వింటాళ్ల మధ్య
జాతీయస్థాయిలో			
వరి	వరం (ఎంటీయూ 1190)	మచిలీపట్నం	60 నుంచి 70 క్వింటాళ్ల మధ్య
వరి	క్షీర (ఎంటీయూ 1157)	మచిలీపట్నం	75 క్వింటాళ్ల వరకు
వేరుశనగ	నిత్య హరిత (టీసీజీఎస్ 1157)	తిరుపతి	25 క్వింటాళ్ల వరకు
వేరుశనగ	కదిరి చిత్రావతి (కె 1719)	కదిరి	30 నుంచి 52 క్వింటాళ్ల వరకు

'నిన్ను నమ్మం బాబూ'

- చంద్రబాబు వైఫల్యాలు, మోసాల చిట్టా ఇక ప్రజల్లోకి..
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం
- ప్రజా సంకల్పయాత్రకు సంఘీభావ కార్యక్రమాలు
- చేపట్టాల్సిన కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు సర్క్యులర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలు, ఇన్నాళ్లూ చేసిన అన్యాయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా 'నిన్ను నమ్మం బాబూ..' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ముగింపునకు వచ్చిన నేపథ్యంలో ఈ యాత్రకు సంఘీభావంగా ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకూ చేపట్టాల్సిన ముందస్తు కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తూ అన్ని నియోజకవర్గాలకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది.

2017 నవంబరు 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో అశేష జనవాహిని మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రజా సంకల్పయాత్ర ఈ నెల 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీ బహిరంగ సభతో ముగియనుంది. ఈ యాత్ర ముగింపు సభను ఎప్పటికీ మర్చిపోలేనంత ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పార్టీ శ్రేణులకు సర్క్యులర్ జారీ చేసింది. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంట్ జిల్లా/ నగర పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులకు కూడా ఈ సర్క్యులర్ పంపించారు. ఇందులో ఏం పేర్కొన్నారంటే...

''పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఎక్కడికక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ఆపన్నులకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రత్యేక హోదాతోపాటు రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన అన్ని హక్కులను సాధించుకునేందుకు అలుపెరగని పోరాటం కొనసాగిస్తున్న జననేతకు అన్ని వర్గాలవారు నీరాజనం పలుకుతున్నారు. 2014లో చంద్రబాబు చేసిన తప్పుడు ప్రకటనలు, మోసపూరిత హామీల వల్ల నష్టపోయామని, వచ్చే ఎన్నికల్లో ఎన్ని మాయమాటలు చెప్పినా ఇక 'నిన్ను నమ్మం బాబూ..' అని ప్రజలు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ప్రజా సంకల్పయాత్ర ముగింపు నేపథ్యంలో సంఘీభావం ప్రకటిస్తూ పలు కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలి''

చేపట్టాల్సిన కార్యక్రమాలు

- **జనవరి 2:** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు పత్రికా సమావేశాలు నిర్వహించి పార్టీ కార్యక్రమాల గురించి వివరించాలి.
- **జనవరి 3 నుంచి 7:** ప్రతి నియోజకవర్గంలో రోజుకు రెండు చొప్పున పది గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలి. ఈ సందర్భంగా 'నిన్ను నమ్మం బాబూ...' అనే పెద్ద హోర్డింగ్‌ను తప్పనిసరిగా ప్రతి నియోజకవర్గంలో ఎత్తయిన ప్రాంతంలో ఏర్పాటు చేయాలి.
- సమన్వయకర్తలు గ్రామాల్లో పర్యటించే సమయంలో పార్టీ పంపిన స్టిక్కర్లను అతికించిన వాహనాలనే ఉపయోగించాలి.
- కనీసం 500 మంది గ్రామస్థులతో సమావేశాలు నిర్వహిచి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. హాజరైన వారితో 'నిన్ను నమ్మం బాబూ' కార్యక్రమానికి మద్దతుగా 9121091210 నంబరుకు మిస్డ్ కాల్స్ ఇప్పించాలి. గ్రామాల్లో సమావేశాల తర్వాత ర్యాలీలతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలి.
- జనవరి 9న ఇచ్ఛాపురంలో ప్రజా సంకల్పయాత్ర ముగింపు సభ, ర్యాలీకి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సమన్వయకర్తలు పార్టీ శ్రేణులతో కలిసి వచ్చి, సభను విజయవంతం చేయాలి.



■ ఈమె పేరు.. గోలి పద్మావతి. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చేనేత కార్మికురాలు. ఈమె రోజంతా నేత నేసినా రూ.150 కూడా కూలి రావడం లేదు. కుటుంబ సభ్యులందరూ కలిసి పనిచేస్తేనే జీవనం సాగుతోంది. ఫీజులు చెల్లించలేక పిల్లలతో చదువు మానిపించింది. చేనేత పరిశ్రమను ఆదుకుంటామని చెప్పడమే కానీ ప్రభుత్వం చేతల్లో చూపించకపోవడంతో తనలాంటి ఎంతోమంది చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతోంది. కార్మికులకు బీమా తీసేయడంతో వచ్చే కాస్త కూలి డబ్బులు ఆరోగ్యం బాగాలేకపోతే మందుబిళ్లలు కొనుక్కోవడానికే సరిపోతున్నాయని ఆవేదన చెందుతోంది.



■ ఈమె పేరు.. పామిశెట్టి రామలక్ష్మి. అనంతపురం జిల్లా ధర్మవరంలో చేనేత మగ్గం నేస్తూ జీవనం సాగిస్తోంది. రెండేళ్లుగా హృదయసంబంధ జబ్బుతో బాధపడుతోంది. క్రమం తప్పకుండా మందులు వాడితే తప్ప జబ్బు నయం కాదని వైద్యులు చెప్పారు. గోరుచుట్టుపై రోకలిపోటులా టీడీపీ సర్కార్ అధికారంలోకి రాగానే చేనేత ఆరోగ్య బీమా పథకాన్ని నిలిపివేసింది. దీంతో వైద్యం చేయించుకునేందుకు, మందులు కొనేందుకు డబ్బులేక, చేనేత మగ్గం నేయలేక అవస్థలు పడుతోంది.



■ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ముగతిపేటలో నివాసముంటున్న ఈరన్న, నరసమ్మ దంపతులు మగ్గంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈరన్న గతంలో స్పిన్నింగ్ మిల్లు కార్మికుడిగా పనిచేసేవాడు. స్పిన్నింగ్ మిల్లు మూతపడడంతో చేనేత వైపు మళ్లాడు. తర్వాత పక్షవాతం రావడంతో ఇల్లు గడవటం కష్టంగా మారింది. ప్రస్తుతం ఈరన్న భార్య నరసమ్మ మగ్గం వేస్తేనే ఇల్లు గడుస్తోంది. ఈరన్నకు పక్షవాతం వచ్చినా పింఛన్ రావడం లేదు. అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు.

రాష్ట్రంలో చేనేత కార్మికుల దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవడానికి ఈ మూడు సంఘటనలు నిదర్శనాలు.



- నేటికీ పూర్తికాని రుణమాఫీ
- రుణసాయం అంతంత మాత్రమే
- సొసైటీలకు కూడా నామమాత్రపు విదిలింపే
- పవర్‌లూమ్స్ ధాటికి మూతపడుతున్న మగ్గాలు
- ప్రత్యామ్నాయం చూపడంలో ప్రభుత్వం విఫలం

చేనేతలకు చేయూత ఎక్కడ?

సాక్షి, అమరావతి: ప్రభుత్వ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో రెండు లక్షల చేనేత కుటుంబాలు ఉంటాయని అంచనా. ఇందులో నేత నేసేవారు దాదాపు లక్ష మంది వరకు ఉన్నారు. మొత్తం 650 చేనేత సహకార సొసైటీలు ఉన్నాయి. పవర్‌లూమ్స్ ప్రవేశించాక చేనేతకు కొంత ఆదరణ తగ్గింది. అయితే ఇప్పటికీ అద్భుత నైపుణ్యంతో చీరలు నేసే నేతన్నలు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది 50 ఏళ్ల వారే ఉన్నట్లు చేనేత, జౌళి శాఖ పరిశీలనలో వెల్లడైంది. చేనేత వృత్తి పొట్ట నింపకపోవడం, ప్రభుత్వం ఆదుకోకపోవడం వంటి కారణాలతో కొత్తగా చేనేత రంగంలోకి వచ్చే కుటుంబాలు వేరే వృత్తుల వైపు మళ్లుతున్నాయి. కొందరు మట్టిపనులు, బేల్దారి పనులు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. చేనేతల కోసం పేరుకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు ఉన్నా ప్రభుత్వం నుంచి వారికి అందే సాయం అంతంతమాత్రమే. చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని 2014 ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా అమలుకాలేదు. బడ్జెట్‌లో ప్రభుత్వ కేటాయింపులకు, మంజూరుకు, ఖర్చులకు ఎంతో తేడా ఉంటోంది.

రుణమాఫీ మాటతప్పి..

ప్రభుత్వం నేతన్నలకున్న సుమారు వంద కోట్ల రుణాలను ఒక్కసారిగా మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పింది. దశలవారీగా ఇప్పటివరకు రూ.75 కోట్లు మాఫీ చేశామని, ఇంకా రూ.25 కోట్లు మాఫీ చేయాల్సి ఉందని ప్రకటించింది. వాస్తవానికి చేనేతల రుణాలు సుమారు రూ.500 కోట్ల వరకు ఉన్నాయి. అయితే తాము రద్దు చేస్తామన్నది కుటుంబానికి రూ.లక్ష మాత్రమేనని ఇప్పుడు ప్రభుత్వం అవాస్తవాలు చెబుతుండటం గమనార్హం. ఉదాహరణకు 2014–15 బడ్జెట్‌లో చేనేతల కోసం రూ.75.42 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవాలను పరిశీలిస్తే.. దారం, రంగులు, రసాయనాల కొనుగోలుకు రూ.14 కోట్లు కేటాయిస్తే 121 సొసైటీలకు కలిపి రూ.2.38 కోట్లు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. పావలా వడ్డీ కింద రూ.14.25 కోట్లు కేటాయిస్తే రూ.3.08 కోట్లు మాత్రమే విడుదల చేసింది. వ్యక్తిగత రుణాల కింద రూ.12.19 కోట్లు కేటాయించి రూ.1.46 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. ఇలా వివిధ కార్యక్రమాలకు మొత్తం కలిపి రూ.59.78 కోట్లు కేటాయించగా అందులో రూ.23.76 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఈ మొత్తాన్ని కూడా ఖర్చు చేయలేదు. గత నాలుగున్నరేళ్లలో పరిస్థితి ఇలాగే ఉంది.

అందని ఆరోగ్య బీమా

ఏడాదికి ఒక్కో కార్మికుడు రూ.80 చెల్లిస్తే వారికి ఆరోగ్య బీమా ఉండేది. చేనేత కార్మికుడు అనారోగ్యానికి గురైతే ప్రభుత్వం ఏడాదికి ఒక్కో కార్మికుడికి రూ.7,500 చెల్లించేది. చేనేత కార్మికులు అనారోగ్యానికి గురైతే ఈ కాస్త డబ్బుతోనే వైద్యం చేయించుకునేవారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులకు ఉన్న ఆరోగ్య బీమా పథకాన్ని ఎత్తేసింది. దీంతో ఆరోగ్య బీమా అందడం లేదు.

చేయూతనివ్వని ఆప్కో

చేనేత రంగాన్ని నిలబెట్టేందుకు ఏర్పాటైన ఆప్కో చేనేత కార్మికులకు చేయూతనివ్వలేకపోతోంది. కార్మికులు, సహకార సంఘాలు తయారుచేసిన వస్త్రాలను కొనుగోలు చేయటంలో ఆప్కో సంస్థ పూర్తి స్థాయిలో ముందుకు రాలేకపోతోంది. కొంత మేరకు వస్త్రాలను కొనుగోలు చేసినా తిరిగి డబ్బులు చెల్లించడంలో పూర్తి జాప్యం చేస్తుండటంతో కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

చేనేతలు మార్పులకు అనుగుణంగా మారాలి

మగ్గాలపై నేసే వస్త్రాలు బాగుంటాయి. అయితే ఖర్చు కూడా ఎక్కువవుతోంది. కుటుంబాన్ని పోషించడం నేతన్నకు కష్టమవుతోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చేనేతలు మారాలి. రుణమాఫీ 75 శాతం పూర్తి చేశాం. మరో 25 శాతం పూర్తి కావాల్సి ఉంది. ఒక్కో నేత కుటుంబానికి రూ.లక్ష రుణం రద్దు చేస్తున్నాం. అంతకంటే ఎక్కువ రుణం బ్యాంకుల నుంచి తీసుకుంటే వారే చెల్లించుకోవాలి.

– శ్రీనివాస్ శ్రీ నరేష్, కార్యదర్శి, చేనేత జౌళి శాఖ

పిల్లలను పస్తులు ఉంచలేక..

మగ్గం పనితో వచ్చే ఆదాయం చాలక, అర్ధాకలితో భార్య, పిల్లలను పస్తులుంచలేక నేతన్నలు వేరే పనులు చేసుకుంటున్నారు. చేనేతలు అధికంగా ఉన్న చీరాల (ప్రకాశం జిల్లా) ప్రాంతానికి చెందినవారు బేల్దారి పనుల కోసం ఒంగోలు, బాపట్ల, కావలి, పొన్నూరు తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. చీరాల ప్రాంతంలో ఈపూరుపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు రెండు వేల మందికి పైగా చేనేత కార్మికులు మట్టి పనుల కోసం రోజూ ఒంగోలు పోతున్నారు. ఉదయం 7 గంటలకే చీరాల రైల్వేస్టేషన్‌లో చేతిలో క్యారియర్ పట్టుకొని వందలాది మంది చేనేత కార్మికులు వివిధ ప్రాంతాలకు పనులకు వెళ్లేందుకు వేచిచూస్తుంటారు. అలాగే ఈపూరుపాలెం, జాండ్రపేట, వేటపాలెం స్టేషన్‌లలో కూడా పాసింజర్ రైళ్లు మట్టి పనికి వెళ్లే చేనేత కార్మికులతో కిక్కిరిసిపోతున్నాయి.

షెడ్డు జీవితం దుర్భరం

చేనేత షెడ్డు కార్మికుల జీవితాలు మరీ దయనీయంగా ఉంటాయి. మాస్టర్‌వీవర్ ఇచ్చే నాలుగు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు ఉండే షెడ్డులోనే చేనేత కార్మికుడి కుటుంబమంతా ఉంటుంది. రోజంతా కుటుంబమంతా కలిసి పనిచేస్తే నేటికీ రూ.100 గిట్టుబాటు కాని దుస్థితి. వచ్చే రూ.100 తిండి, అద్దెకే సరిపోతుంది. దీంతో మాస్టర్ వీవర్ వద్ద తీసుకున్న అప్పు ఎప్పటికీ తీరదు. చేనేత కార్మికుల దుస్థితి ఎలా ఉందంటే బతికినంతకాలం పెట్టుబడిదారు వద్దనే పని చేయాల్సి ఉంటుంది. అప్పు తీర్చకుండా మరొక పెట్టుబడిదారుడు పని కల్పించకూడదనే తీర్మానం కూడా ఉంది. దీంతో అక్కడే చచ్చినట్టు పనిచేయాల్సి వస్తుంది.

వీవర్స్‌కు నో క్రెడిట్



రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులు సొంతంగా మగ్గం మీద చీరలు నేసి ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో వీవర్స్ క్రెడిట్ పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద ఒక్కో చేనేత కార్మికుడికి ముడి సరుకుల కింద రూ.2 లక్షల రుణాన్ని అందించాలి. రుణం పొందిన కార్మికుడు సొంతగా చీరలు నేసి ఆప్కో ద్వారా వాటిని విక్రయించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలనేది ముఖ్య ఉద్దేశం. అయితే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో చేనేత కార్మికులకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు మాత్రమే రుణాలు ఇస్తున్నారు. అది కూడా 20 నుంచి 30 శాతం మంది కార్మికులకు మాత్రమే అందుతోంది. దీంతో చేనేత కార్మికులు సొంతగా మగ్గం మీద నేయలేక మాస్టర్ వీవర్లపైనే ఆధారపడుతున్నారు. చేనేత కార్మికులకు ప్రత్యేకంగా పరపతి బ్యాంకులను ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. ప్రత్యేక పరపతి బ్యాంకు ద్వారా చేనేతలకు రుణాలు అందిస్తారు. అయితే ఈ విషయంలో అడుగు ముందుకు పడలేదు.

చేనేత వృత్తి వదిలిపెట్టి డ్రైవర్‌గా మారా



ఒకప్పుడు నాలుగు మగ్గాలు నిర్వహిస్తూ పలువురికి ఉపాధి కల్పించాను. నేడు గిట్టుబాటు కాకపోవడంతో చిన్నపాటి టాటా ఏస్ వాహనం నడుపుకుంటూ డ్రైవర్‌గా మారాను. ప్రభుత్వం మా కోసం ఎలాంటి సంక్షేమ పథకాలను చేపట్టకపోవడం వల్లే నాలాంటివారు వృత్తిని వదిలిపెట్టి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. మరికొందరు కుటుంబాలతో సహా నగరాలకు వలస వెళ్లి కూలి పనులకు వెళ్తున్నారు.

–పూజారి హనుమంతు, రాజేంద్రనగర్, ధర్మవరం

చేనేత వృత్తి కనుమరుగవుతోంది



గత నాలుగేళ్లలో చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రోజంతా పని చేసినా రూ.200 కూడా రావడం లేదు. చేనేత మగ్గం నేసి అప్పులపాలయ్యా. చిన్నపాటి ఐస్‌క్రీమ్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నా. చేనేత రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో చేనేత కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

–శంకర్, మారుతినగర్, ధర్మవరం

కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు



చేసే పనికి కూలి గిట్టుబాటు కావడం లేదు. భార్యాభర్తలిద్దరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేసినా రూ.300 కూడా రావడం లేదు. సీఎం చంద్రబాబు చేనేత కార్మికులకు 100 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అని చీరాలలో ఆగస్టు 7న ప్రకటించారు. ఇంతవరకు అది అమలు కాలేదు. వర్షాకాలంలో నెలకు రూ.2000 భృతి కింద ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రకటించడం తప్ప ఏవీ అమలు కావడం లేదు.

–పప్పూరి రవికుమార్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, ఆరేపల్లి ముప్పాళ్ల, గుంటూరు జిల్లా

బీమా కూడా ఎత్తేశారు




టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకపోగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన జీవిత బీమా పథకాన్ని కూడా తొలగించింది. రుణమాఫీ, మగ్గం షెడ్లు, వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తామన్న హామీలు కూడా ఆచరణకు నోచుకోలేదు.

–ఆకురాతి రాజేష్, మగ్గం షెడ్ నిర్వాహకుడు, మంగళగిరి, గుంటూరు జిల్లా

ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుంది?

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నట్లు చెప్పకపోయినా వారు అందులో ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. మహాకూటమి విఫలం కాలేదని, విఫలమైంది జైట్లీ, మోదీ అని వ్యాఖ్యానించారు. దేశానికి ఏం మేలు చేశారనే అంశంపై ప్రధాని మోదీ చర్చకు సిద్ధమా? అని చంద్రబాబు సవాల్ చేశారు. ప్రధాని, బీజేపీ అధ్యక్షుడు అన్నిసార్లు తిరిగినా తెలంగాణాలో ఆ పార్టీ గెలిచింది ఒక్క సీటేనని, కేసీఆర్ గెలిచినందుకు వారు సంతోషపడుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకుండా ఏపీ మీడియాలో ప్రకటనలు ఇచ్చి తమను రెచ్చగొట్టాలని, అవమానించాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారన్నారు.



బీటీఏ డైరీ ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

వృద్ధి రేటులో దేశాన్ని మించిపోయాం..

రెవెన్యూ పెంచుకోవడానికే అప్పులు చేశామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తక్కువ వడ్డీ రేటుకే అప్పులు తీసుకున్నామన్నారు. లోటు లేని ఆర్థిక వ్యవస్థ ఎక్కడా ఉండదన్నారు. నాలుగేళ్లుగా 10.52 శాతం వృద్ధి రేటు సాధించామని, దేశ వృద్ధిరేటు 7.3 శాతం కాగా తెలంగాణ వృద్ధిరేటు 9.7 శాతం మాత్రమేనన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ వేగవంతమైన వృద్ధి రేటు సాధించామన్నారు. 2013–14లో రూ.4.64 లక్షల కోట్లుగా ఉన్న ఆదాయం 2017–18 నాటికి రూ.8.04 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. నాలుగేళ్లలో వ్యవసాయం, అనుబంధ రంగాల వల్ల పెరిగిన ఆదాయం రూ.1.25 లక్షల కోట్లని (96 శాతం) చెప్పారు. నాలుగేళ్లలో తలసరి ఆదాయం సగటున రూ.59,154 (71 శాతం) పెరిగిందని తెలిపారు. పన్నుల ద్వారా ఆదాయం 2014–15లో రూ.38,038 కోట్లు రాగా 2017–18 నాటికి రూ.53,300 కోట్లకు పెరిగిందన్నారు.

శ్వేత పత్రాలపై జన్మభూమిలో చర్చిస్తాం..

హైదరాబాద్ నుంచి అమరావతికి కార్యాలయాల తరలింపు, ఉద్యోగుల వేతన స్కేళ్ల రివిజన్, 2015–16 నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ల చెల్లింపు, సంక్షేమ పథకాలవల్ల రెవెన్యూ వ్యయం పెరిగిందని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద గరిష్ట పరిమితిని రూ.5 లక్షలకు పెంచామన్నారు. త్వరలో ప్రతి ఇంటికీ ఒక స్మార్ట్ ఫోన్ ఇస్తామని, విజ్ఞానాన్ని మొబైల్ ద్వారా అందుబాటులోకి తేవడానికి ఇది దోహదపడుతుందన్నారు. జన్మభూమి తర్వాత ప్రతి గ్రామానికి విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామని, పండుగ తర్వాత రాష్ట్ర స్థాయిలో 2019–24 విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామని తెలిపారు.

'బీటీఏ' డైరీని ఆవిష్కరించిన సీఎం

సాక్షి, అమరావతి బ్యూరో: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రూపొందించిన 2019 డైరీని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు చేబ్రోలు శరత్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పి ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి బట్టు వెంకయ్య, ఉపాధ్యాక్షుడు మీర్జా అబుతురాబ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

పార్టనర్స్ ముసుగు తొలగింది!

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ముసుగు తొలగిపోయింది. పార్టనర్స్ బంధం బట్టబయలయ్యింది. అంతా ఊహించినట్లుగానే ఎన్నికల ముంగిట్లో సీఎం చంద్రబాబు నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో తమ బంధం ఎప్పటికీ నిలిచే ఉంటుందని ఆయన మాటలు తేటతెల్లం చేస్తున్నాయి. పవన్, తాము కలిసి పోటీ చేస్తే జగన్ మోహన్‌రెడ్డికి బాధ ఎందుకని చంద్రబాబు ప్రశ్నించడాన్ని బట్టి ఇద్దరి మధ్య బంధం కొనసాగుతున్నట్లే భావించాలని విశ్లేషకులంటున్నారు. నిన్న మొన్నటి వరకు జగన్, పవన్ భాగస్వాములని, ఇద్దరూ మోడీ చెప్పినట్లల్లా ఆడుతున్నారని విమర్శించిన చంద్రబాబు మంగళవారం ఒక్కసారిగా అసలు విషయాన్ని బయటపెట్టేశారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. రాజకీయాలపైనా మాట్లాడారు. జగన్ ఎవరితో ఉన్నారో, ఎవరితో వెళుతున్నారో చెప్పాలన్నారు. జగన్–మోడీ–కేసీఆర్ మధ్య ఐక్యత ఉన్నట్లు తాజా పరిణామాలను బట్టి అర్థమవుతోందన్నారు. 'పవన్, మేము కలిసి పోటీచేస్తే తప్పేమిటి' అని ప్రశ్నించారు. 'చంద్రబాబు–పవన్ ఇద్దరూ పార్టనర్స్ కాబట్టే నాలుగున్నరేళ్లుగా ఎప్పుడు ఏ సమస్య వచ్చినా చంద్రబాబును ఆదుకోవడానికి పవన్ ముందుకు వస్తున్నారు.' అన్న విమర్శలకు ఇపుడు బాబు వ్యాఖ్యలు బలాన్ని చేకూరుస్తున్నాయి.

కొద్దిరోజులుగా మారిన సీన్..

జగన్, పవన్ బీజేపీతో కలసిపోయారని, మోదీ చెప్పినట్లల్లా ఆడుతున్నారని ఎల్లోమీడియా సహకారంతో చంద్రబాబు అండ్ కో ప్రచారం చేస్తూ వచ్చారు. జగన్, పవన్ రహస్య మిత్రులని కూడా చంద్రబాబు వ్యాఖ్యానిస్తూ వచ్చారు. నిన్న కేసీఆర్ విమర్శలను తిప్పికొడుతూ కేసీఆర్, జగన్ కలసి పోయారని, వారిద్దరూ మోదీ చెప్పినట్లల్లా ఆడుతున్నారని చంద్రబాబు విమర్శించారు. ఇందులో పవన్‌ను మినహాయించారు. గత కొద్దిరోజులుగా పవన్ కల్యాణ్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. అంతేకాదు పవన్‌ను ఏమీ అనవద్దని నాయకులకు, అధికార ప్రతినిధులకు అన్యాపదేశంగా సూచనలూ చేశారు. ఇక ఇపుడు పూర్తిగా ముసుగు తొలగించారు. పవన్, తాను కలసి పోటీచేస్తే జగన్‌కు ఇబ్బంది ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



పవన్ మనోడే అని శ్రేణులకు సూచిస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యానాల క్లిప్పింగ్

స్వార్థ రాజకీయ ప్రయోజనాలే పరమావధి..

ఇపుడు ఇక రెండే కూటములున్నాయని, బీజేపీకి వ్యతిరేకంగా అందరూ తనతో కలసి రావాలని చంద్రబాబు పిలుపునిస్తున్నారు. గతంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అందరూ కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. తల్లి కాంగ్రెస్ పిల్ల కాంగ్రెస్ ఒకటేనని వైఎస్ఆర్‌పీపై విమర్శలు చేశారు. జగన్ కాంగ్రెస్‌తో కలసిపోయినట్లు ప్రచారం చేశారు. ఇపుడు తానే కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. చంద్రబాబు తాను ఎవరితో కలవాలనుకుంటే వారితో అందరూ కలసి రావాలని కోరుతుంటారని, తనకు అనుకూలంగా ప్రచారం చేయిస్తుంటారని అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కూటమి కట్టి లాభపడి నాలుగున్నరేళ్లు కాపురం చేసిన చంద్రబాబు ఇపుడు బీజేపీకి వ్యతిరేకంగా కూటమి కట్టి లాభపడదామనుకుంటున్నారని విశ్లేషకులంటున్నారు. దానికి రాష్ట్ర ప్రయోజనాలని, దేశప్రయోజనాలనే ముసుగు వేస్తుంటారని వారు ఎద్దేవా చేస్తున్నారు. నిజానికి తన అవినీతిని కప్పిపెట్టి తనను తాను రక్షించుకోవడం కోసమే బీజేపీ లేదంటే కాంగ్రెస్ పంచన చేరుతుంటారన్న విమర్శలున్నాయి. రాష్ట్రాన్ని వంచించిందంటూ కాంగ్రెస్‌పై విమర్శలు చేసిన చంద్రబాబు నిస్సిగ్గుగా అదే పార్టీతో చేతులు కలిపారు. దానికి సమాధానం చెప్పుకోవాల్సిందిపోయి ప్రతిపక్ష పార్టీ నేతపై బురదజల్లే కార్యక్రమం చేస్తున్నాడు. ఇదంతా పొలిటికల్ డ్రామాలో భాగమేనని విశ్లేషకులంటున్నారు. పవన్, జగన్ ఒకటేనని ప్రచారం చేసిన చంద్రబాబు ఇపుడు మరోసారి పవన్‌తో కలసి పోటీచేస్తే తప్పేమిటని నిస్సిగ్గుగా అడుగుతున్నారు.



పవన్, జగన్, మోదీ ఒకతానులోని ముక్కలేనంటూ గతంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యానాల క్లిప్పింగ్

జనవరి 9.. చరిత్రాత్మకం

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి
- చంద్రబాబు మోసాలపై విస్తృత ప్రజాచైతన్య కార్యక్రమాలు
- ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలు మేనిఫెస్టోతో సమానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన దారుణమైన మోసాలపై పార్టీ నాయకులు, శ్రేణులు కలిసి పెద్దఎత్తున ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై 'నిన్ను నమ్మం బాబూ' అంటూ పార్టీ నాయకులకు సర్క్యులర్ జారీ చేశామని చెప్పారు. ఈ నెల 7వ తేదీ వరకూ అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తామని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపన, చంద్రబాబు మోసాలను వివరిస్తారని పేర్కొన్నారు. 'నిన్ను నమ్మం బాబూ' కార్యక్రమం ద్వారా బాబు మోసాలను వివరించి ప్రజలను మరింత చైతన్య పరుస్తారని తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 2019 జనవరి 9 ఒక చరిత్రాత్మక రోజుగా నిలిచిపోతుందని చెప్పారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర ముగింపు రోజును చరిత్రాత్మకమైనదిగా ప్రజలు భావిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడపడానికి జగన్ వస్తున్నారని జనం పూర్తిగా నమ్ముతున్నారని వెల్లడించారు.

పవన్‌ను బాబు జట్టులో కలుపుకున్నారేమో!

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం పదేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి దేశంలో ఏ నాయకుడూ ఎదుర్కోనన్ని సమస్యలను జగన్ ఎదుర్కొన్నారని, చివరకు హత్యాయత్నం నుంచి కూడా బయటపడ్డారని సజ్జల రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు. గత పదేళ్లలో ఇన్ని సమస్యలు, సంక్షోభాలు ఎదుర్కొన్న నాయకుడు దేశంలో ఎవరూ లేరని వివరించారు. చంద్రబాబు పాలన భరించడం ఇక తమ వల్ల కాదు, జగన్‌కు తోడూ నీడగా ఉంటామమని జనం చెబుతున్నారని తెలిపారు. ''పాదయాత్రలో జగన్ ఎన్నడూ, ఎక్కడా మొక్కుబడిగా చేతులు ఊపుకుంటూ వెళ్లలేదు. జనంతో మమేకమై వారు చెప్పింది వింటూ సమస్యలపై వినతిపత్రాలు తీసుకుంటూ, ఆపన్నులకు భరోసా ఇస్తూ సమస్యల పరిష్కారానికి ఏమిచేయాలో మథనం చేస్తూ, ప్రణాళికలు రూపొందిస్తూ మహాయజ్ఞమే సాగిస్తూ వస్తున్నారు. అందువల్లే పాదయాత్రను అనుకున్న దానికంటే ఆరు నెలలకు పైగా పొడిగించాల్సి వచ్చింది. ప్రతి వర్గమూ తమ సమస్యలను జగన్‌కు చెప్పాలని కోరుకుంది. ఆయనకు చెబితే పరిష్కరిస్తారనే భరోసా ఉండటమే ఇందుకు కారణం. అందువల్లే ప్రజాసంకల్పయాత్రను పొడిగించక తప్పలేదు. ఒక దృఢచిత్తం, నిజాయతీ, విశ్వసనీయత గల నాయకుడిపై గురి కుదిరితే ఎలా ఉంటుందో వెల్లువలా వచ్చిన ప్రజా సమూహం ద్వారా తేటతెల్లమైంది. చంద్రబాబు నిద్రలో లేచినా మోదీ, జగన్, కేసీఆర్ పేర్లే స్మరిస్తున్నారు. పవన్ పేరు గతంలో అనేవారు. పవన్‌ను జట్టులో కలుపుకుంటున్నారేమో! ఇప్పుడు ఆయన పేరును బాబు ఎత్తడం లేదు'' అని వివరించారు.



పార్టీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సజ్జల

ఇది జగన్ నామ సంవత్సరం

2019 జగన్ నామ సంవత్సరం అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మన రాష్ట్రానికి జగన్ తిరుగులేదని దశ కల్పిస్తారని విశ్వసిస్తున్నామని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలు మేనిఫెస్టోతో సమానమని స్పష్టం చేశారు. ''జగన్ ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటారు. కొన్ని నియోజకవర్గాల ప్రజలు ఇంకా తమ వద్దకు జగన్ రాలేదని, రావాలని కోరుకుంటున్నారు. సమయాభావం వల్ల వెళ్లలేకపోయారు. ఇక బస్సులో వెళతారా? వేరేగా వెళతారా అన్నది ఆలోచిస్తున్నాం'' అని సజ్జల వివరించారు. టీఆర్ఎస్ గురించి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... చంద్రబాబుతో జత కడితే మంచివారు, లేకపోతే చెడ్డవారా? అని ఎదురు ప్రశ్నించారు. చంద్రబాబు తప్పిదాలు, మోసాలు, నేరాలు ఎవరి ద్వారా బయటకు వచ్చినా తాము సంతోషిస్తామని అన్నారు.

తెలుగు ప్రజలకు సుఖసంతోషాలు చేకూరాలి

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సజ్జల రామకృష్ణారెడ్డి కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. 2019 ఏపీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే సంవత్సరంగా మిగిలిపోవాలన్నారు. ఈ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ కుటుంబ అభిమానులందరూ ఐకమత్యంతో ముందుకు సాగి ప్రజలు కోరుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీని ఏపీలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. పలువురు ప్రముఖులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కంతేటి సత్యనారాయణ రాజు, నాయకులు వాసిరెడ్డి పద్మ, చల్లా మధు, కానుమాను రాజశేఖర్, ఆవుల శ్రీనివాసరెడ్డి, పుత్తా శివశంకర్, సత్యనారాయణ మూర్తి బసిరెడ్డి సిద్ధారెడ్డి, ఇ.రాజశేఖర్, శ్రీవర్ధన్ రెడ్డి, దేవరకొండ రామభాస్కర్, బుర్రా సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలి

నూతన సంవత్సర వేడుకల్లో గవర్నర్ నరసింహన్

సాక్షి, హైదరాబాద్: ఇది మన రాష్ట్రమని తెలుగు వారందరూ ఒక్కటేనని, ప్రతీ పౌరుడు బాధ్యతతో వ్యవహరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. దర్బార్ హాల్‌లో గవర్నర్ దంపతులను సామాన్యులు, ఉద్యోగులు, వివిధ కుల సంఘాల నాయకులు, పలువురు ప్రముఖులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి
బుధవారం, జనవరి 2

హసీనా అఖండ విజయం

గత ఏడాది దక్షిణాసియాలోని మూడు దేశాల్లో–పాకిస్తాన్, మాల్దీవులు, బంగ్లాదేశ్–చట్టసభలకు ఎన్నికలు జరిగాయి. ఎవరు గెలిచి అధికారంలోకొచ్చినా సైన్యానిదే పైచేయి అయ్యే పాకిస్తాన్ సంగతలా ఉంచితే, మాల్దీవుల్లో అడుగడుగునా భారత వ్యతిరేకతను ప్రదర్శించిన అబ్దుల్లా యామీన్ ఓడిపోయి, విపక్ష కూటమి అభ్యర్థి సోలిహ్ దేశాధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. ఆదినుంచీ మనకు మిత్ర దేశంగా ఉన్న బంగ్లాదేశ్‌లో సైతం ఇప్పుడు ప్రధాని షేక్ హసీనా వాజెద్ నేతృత్వంలోని అవామీ లీగ్ కూటమి అఖండ విజయం సాధించింది. ఇప్పటికే వరసగా రెండు దఫాలనుంచి అధికారంలో కొనసాగుతున్న హసీనా మూడోసారి కూడా విజేత కావడం మనకు అనుకూల పరిణామం. బంగ్లాదేశ్‌లో మిలిటెన్సీ బలపడితే దాని ప్రభావం పశ్చిమ బెంగాల్‌పైనా, ఈశాన్య రాష్ట్రాలపైనా ఎక్కువగా ఉంటుంది. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ అందుకోసం తెగ ప్రయత్నిస్తోంది. మన దేశం బంగ్లా ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంటేపాటు ఉగ్రవాదంపై ఎప్పటికప్పుడు దాన్ని అప్రమత్తం చేస్తూ ఆ ప్రయత్నాలను వమ్ము చేస్తోంది. బంగ్లా సైతం మూడో దేశ ప్రమేయానికి తావీయకుండా మనకు చెక్కుచెదరని మిత్ర దేశంగా ఉంటున్నది.

అవామీ లీగ్ కూటమికి వచ్చిన విజయం అసాధారణమైనది. ఊహాతీతమైనది. పార్లమెంటులోని 300 స్థానాల్లో ఆ కూటమి 299 చోట్ల పోటీచేయగా ఏకంగా 96 శాతం సీట్లు...అంటే 288 స్థానాలు వచ్చాయి. ఈ సందర్భంగా హసీనా గెలుపును గురించి చెప్పుకోవాలి. ఆమెకు మొత్తం 2,29,539 ఓట్లు రాగా, ప్రత్యర్థి పక్షమైన బంగ్లా నేషనల్ పార్టీ(బీఎన్‌పీ) అభ్యర్థికి కేవలం 123 ఓట్లు లభించాయి. మరో అభ్యర్థికి 71 ఓట్లు వచ్చాయి. మొన్న డిసెంబర్ 30న పోలింగ్ పూర్తయిన వెంటనే 'నిశ్శబ్ద ప్రజా వెల్లువ' బ్యాలెట్ పెట్టెల్ని ముంచెత్తిందని అభివర్ణించిన బీఎన్‌పీ ఆధ్వర్యంలోని జాతీయ ఐక్య ఫ్రంట్ చివరకు ఏడంటే ఏడు స్థానాలకు పరిమితమై అందరినీ విస్మయపరచడంతోపాటు తానూ అయోమయంలో పడిపోయింది. అధికార అవామీ లీగ్ 'ఇది ప్రజా తీర్పు' అంటుంటే...'అంతా మోసం, దగా' అని విపక్షాలు ఆక్రోశిస్తున్నాయి. తిరిగి ఎన్నికలు జరపాలని డిమాండు చేస్తున్నాయి. ఈ ఫలితాలను న్యాయస్థానాల్లో సవాలు చేస్తామంటున్నాయి. ఈ ఎన్నికల్లో హింస విస్తృతంగా జరిగిన మాట వాస్తవం. అయితే 18మంది మృతుల్లో అవామీ పార్టీ కార్యకర్తలే అధికం. బంగ్లా ఎన్నికల్లో రివాజుగా ఉండే భారత వ్యతిరేక ప్రచారం ఈసారి లేకపోవడం గమనించదగ్గది. భారత్‌ను దూరం చేసుకోవడం మంచిది కాదని విపక్ష బీఎన్‌పీ కూడా భావించడంవల్లే ఈ మార్పు. ఈ ఎన్నికల్లో తొలిసారి ప్రయోగాత్మకంగా కొన్ని నియోజకవర్గాల్లో ఈవీఎంలు ఉపయోగించారు. మన దేశంతోసహా వేర్వేరు దేశాలకు చెందిన 175మంది నిపుణులు ఈ ఎన్నికలకు పరిశీలకులుగా వచ్చారు. వీరంతా వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్టు ఎక్కడా తమ దృష్టికి రాలేదని చెప్పారు. కానీ ఒక మీడియా ప్రతినిధికి రెండు మూడుచోట్ల పోలింగ్ కేంద్రాల్లో అసలు విపక్షాల ఏజెంట్లే కనబడలేదు. వాస్తవానికి ఈ స్థాయిలో హసీనా నేతృత్వంలోని కూటమికి అసాధారణ మెజారిటీ రావడంపై అనుమానాలున్నాయి తప్ప ఆమె నెగ్గే అవకాశమే లేదని ఎవరూ అనడం లేదు. విపక్షాలు క్రితంసారి ఎన్నికలను బహిష్కరించినప్పుడు సైతం ఆ కూటమి 234 స్థానాలు గెల్చుకుంది. ఇప్పుడు ఆ పక్షాలన్నీ రంగంలో ఉన్నాయి గనుక మెజారిటీ తగ్గొచ్చునని కొందరు అంచనాలు వేశారు. కానీ అందుకు భిన్నంగా రికార్డు స్థాయిలో సీట్లు గెలుచుకోవడమే అందరినీ అయోమయంలో పడేసింది. తమ పార్టీ గెలుపును సమర్థించడానికి హసీనా మన బీజేపీ, కాంగ్రెస్‌లను ఉదహరిస్తున్నారు. నాయకుడెవరో తెలియని పార్టీలకు ఓట్లేయరని వివరిస్తున్నారు.

ఈ పోలికల మాటెలా ఉన్నా గత పదేళ్లుగా హసీనా అవలంబించిన ఆర్థిక విధానాలు బంగ్లా ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పు తీసుకొచ్చాయన్నది వాస్తవం. పేదరికం గణనీయంగా తగ్గింది. ఆహారభద్రత ఏర్పడింది. సార్వత్రిక ప్రాథమిక విద్య వంటి అంశాల్లో దేశం ముందంజలో ఉంది. అతి తక్కువ అభివృద్ధి సాధించిన దేశాల జాబితా నుంచి బంగ్లాదేశ్ తప్పుకుని వర్ధమాన దేశాల జాబితాలో చేరింది. అవినీతి నిర్మూలనలో, ఛాందసవాద మిలిటెంట్ల ఆగడాలను అదుపు చేయడంలో కఠినంగా వ్యవహరించింది. అలాగని అంతా సవ్యంగా ఉన్నదని చెప్పడం అవాస్తవమవుతుంది. భావప్రకటనా స్వేచ్ఛకు ఆటంకాలు, విచ్చలవిడి ఎన్‌కౌంటర్లు, మనుషుల్ని అదృశ్యం చేయడం వంటివి ప్రభుత్వ తీరుతెన్నుల్ని ప్రశ్నార్థకం చేశాయి. బీఎన్‌పీ అధినేత ఖలీదాతోసహా ఎందరో నేతల్ని అవినీతి కేసుల్లో శిక్షలు పడేలా చేయగలిగామని చెబుతున్నా...స్వపక్షం అవినీతి విషయంలో హసీనా సర్కారు ఉదాసీనంగా ఉంటోంది. భూ కబ్జాలు, మెగా ప్రాజెక్టుల్లో స్వాహాలు, పబ్లిక్ రంగ సంస్థల్లో అవినీతి, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో విచ్చలవిడిగా రుణాల మంజూరు, ఎగవేతదార్లపై చర్యలు తీసుకోకపోవడం వగైరాలు ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తున్నాయి. మిలిటెన్సీని అణిచేస్తున్నామని చెబుతున్నా సెక్యులర్ విలువలున్న కవులు, కళాకారులు, రచయితలపై ఆ సంస్థల దాడులు తగ్గలేదు. ఏదో ఒక సాకుతో విపక్ష నేతల్ని, వారి మద్దతుదారుల్ని జైల్లోకి నెట్టి ఆ పార్టీలకు నాయకత్వమే లేకుండా చేసిన తీరు ఎన్నికల ప్రక్రియపైనే సందేహాలు రేకెత్తించింది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక సంయమనం పాటించాలని తమ శ్రేణులకు హసీనా పిలుపునిచ్చారు. మంచిదే. కానీ వచ్చే అయిదేళ్లలో ప్రభుత్వం సైతం అదే రీతిలో మెలగాలి. అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు జనం మనసుల్ని గెల్చుకుని ఉండొచ్చుగానీ, ప్రభుత్వం అదే పనిగా నియంతృత్వ పోకడలకు పోతున్నదన్న అభిప్రాయం కలిగిస్తే మున్ముందు అది ఆమె పార్టీపైన మాత్రమే కాదు...మొత్తంగా ప్రజాస్వామిక వ్యవస్థపైనే అవిశ్వాసాన్ని ఏర్పరుస్తుంది. అలాంటి పరిస్థితి ఏర్పడకుండా చూస్తేనే, అందరినీ కలుపుకొని వెళ్తేనే బంగ్లాదేశ్ చరిత్రలో హసీనా సమర్థ ప్రధానిగా శాశ్వతంగా నిలిచిపోతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు
మార్గశిరమాసం, తిథి బ.ద్వాదశి రా.3.38 వరకు,తదుపరి త్రయోదశి
నక్షత్రం విశాఖ ప.12.01 వరకు,తదుపరి అనూరాధ
వర్జ్యం సా.4.05 నుంచి 5.42 వరకు
దుర్ముహూర్తం ప.11.43 నుంచి 12.25 వరకు
అమృతఘడియలు...రా.1.53 నుంచి 2.45 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.33
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

అంకెల గారడీలో విద్యాప్రమాణాలు

రాష్ట్రంలో మానవవనరుల అభివద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేసిన శ్వేతపత్రం అసత్యాలు, అర్థసత్యాలు, అబద్ధాలతో నిండి ఉంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థలో ప్రమాణాలు, ఇతర అంశాలపై ప్రభుత్వం చూపుతున్న గణాంకాలు అంకెల గారడీ తప్ప మరేమీ కాదని వాస్తవిక పరిస్థితి చూస్తే స్పష్టమవుతుంది. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా ప్రభుత్వ విభాగాల ద్వారా ప్రభుత్వం గణాంకాలు రూపొందింపచేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు వాటిని శ్వేతపత్రాల ద్వారా విడుదల చేసిందని అర్థమవుతోంది. బడ్జెట్ నిధుల కేటాయింపు నుంచి విద్యా ప్రమాణాల వరకు అన్ని అంశాల్లోనూ ఇదే పరిస్థితి కళ్లకు కట్టినట్లు కనబడుతోంది.

శ్వేతపత్రం 6–II
రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిపై విశ్లేషణ



రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగున్నరేళ్ల కాలంలో హేతుబద్ధీకరణ పేరిట వేలాది పాఠశాలలను మూసివేసి గ్రామీణ ప్రాంత సామాన్య, నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్యను దూరం చేసింది. ప్రయివేటు కార్పొరేట్ విద్యాసంస్థలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ విద్యను వ్యాపారమయంగా మార్చేసింది. వేలాది రూపాయల ఫీజులు కట్టలేక, పిల్లల చదువులు ఆపలేక ఆయా కుటుంబాలు పాఠశాల విద్యనుంచే అప్పుల పాలు కావలసిన పరిస్థితులు నేడు రాష్ట్రంలో తాండవిస్తున్నాయి. టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీచేయకుండా మిగిలిపోయిన టీచర్లను వాటిలో సర్దుబాటు చేస్తూ నిరుద్యోగ యువతకూ మొండిచేయి చూపింది. రేషనలైజేషన్ పేరిట మూతపెట్టిన పాఠశాలల భవనాలు, మౌలిక సదుపాయాలను ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రభుత్వ యూనివర్సిటీలను నీరుగారుస్తూ మరోపక్క ఫీజుల పేరిట విద్యార్థులను పీల్చిపిప్పిచేసే ప్రైవేటు యూనివర్సిటీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తోంది. ప్రభుత్వ సంస్థలకు భూములు లేవంటూనే ప్రయివేటు సంస్థలకు వందలాది ఎకరాలు కట్టబెడుతోంది.

బడ్జెట్ నిధుల కేటాయింపులో గారడీ

పాఠశాల విద్యలో బడ్జెట్ కేటాయింపులు గతంలో కన్నా భారీగా పెంచినట్లు ప్రభుత్వం శ్వేతపత్రంలో పేర్కొంటోంది. కానీ పీఆర్సీ, ఇతర అంశాల వల్ల పెరిగిన భారానికి తగ్గట్టుగానే ఆ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయే కానీ కొత్తగా విద్యాభివద్ధి కోసం కేటాయింపులు లేవన్నది నిజం. పైగా బడ్జెట్ కేటాయింపు నిధుల అంకెల్లో కూడా మతలబు చేస్తోంది. ఉదాహరణకు 2018–19 సంవత్సరానికి ఉన్నత విద్యాశాఖకు రూ.3349 కోట్లు కేటాయించినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంటోంది. కానీ వాస్తవానికి ఉన్నత విద్యాశాఖ రూ.1,971 కోట్లకు ప్రతిపాదనలు పంపిస్తే రాష్ట్రప్రభుత్వం కేటాయించినది కేవలం రూ. 1,452 కోట్లు మాత్రమేనని ఆ శాఖ అంతర్గత కేటాయింపు గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రప్రభుత్వం విద్యారంగానికి యూజీసీ, రూసా, కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖల ద్వారా ఇచ్చే నిధులను కూడా తన కేటాయింపుల కింద చూపిస్తూ గారడీ చేస్తోంది.

పాఠశాలల మూసివేత

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ హేతుబద్ధీకరణ ప్రక్రియకు తెరలేపారు. పాఠశాలల్లో తగినంతమంది విద్యార్థులు లేరన్న సాకుతో 5వేలకు పైగా స్కూళ్లను మూసివేయించారు. వీటిలో ఎక్కువగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలే ఉన్నాయి. ఇక్కడి విద్యార్థులను సమీపంలోని మరో పాఠశాలలో చేరాలని చెప్పి చేతులు దులుపుకున్నారు. పాఠశాలలు లేక ఆయా గ్రామాల్లోని విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈపాఠశాలల్లోని టీచర్లను సైతం ఇతర పాఠశాలల్లో ఖాళీ పోస్టుల్లో సర్దుబాటు చేశారు. సరిపడ విద్యార్థులు లేరంటూ పాఠశాలలు మూసివేస్తున్న పాఠశాలల ప్రాంతాల్లో ప్రయివేటు పాఠశాలల ఏర్పాటు చేయిస్తోంది.

ఫీజులతో నిలువుదోపిడీ

రాష్ట్రంలో ప్రయివేటు పాఠశాలలను ప్రోత్సహించేలా ప్రభుత్వం కొత్త చట్టాలను కూడా చేస్తోంది. ఇందుకోసం 'సెల్ఫ్‌ఫైనాన్స్‌డ్ ఇండిపెండెన్స్ స్కూల్స్ యాక్ట్'ను రూపొందించింది. దీని ప్రకారం ఇకపై ప్రయివేటుస్కూళ్లను కార్పొరేట్ సంస్థల ద్వారా ఏర్పాటు అవుతాయి. వీటిపై ప్రభుత్వానికి ఎలాంటి ఆజమాయిషీ ఉండదు. పిల్లల తల్లిదండ్రులు కూడా వీటిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీలులేదు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగాలు లేక వేలాది మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి కింద ప్రయివేటులో బడ్జెటరీ స్కూళ్లను పెట్టుకొని కొనసాగుతున్నారు. అటు పేదలకు తక్కువ ఫీజులతో విద్యనందిస్తూ వీరు ఉపాధి పొందుతున్నారు. ఈ కొత్త చట్టం ద్వారా ఈ స్కూళ్లు కూడా మూతబడి వాటిస్థానంలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఏర్పాటుచేయాలన్నది ఈ చట్టం ఉద్దేశం. ఈ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు భారీగా ఉంటూ రాష్ట్రంలో ఎల్‌కేజీ విద్యనుంచే వేలు, లక్షలకు చేరుకొని పేద, సామాన్యుల నడ్డి విరుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతూ నారాయణ, చైతన్య వంటి సంస్థల స్కూళ్లు వీధికొకటిగా పుట్టగొడుగుల్లా ఏర్పాటు అవుతున్నాయి.

తప్పుడు లెక్కలపై కాగ్ అక్షింతలు

రాష్ట్రంలోని విద్యాప్రమాణాలపై ప్రభుత్వం చూపించిన గణాంకాల తీరును పలు సందర్భాల్లో కాగ్ అక్షింతలూ వేసింది. విద్యార్థుల నమోదు పెంచామని, డ్రాపవుట్లను తగ్గించామని చూపించిన గణాంకాలు పాఠశాల విద్యాశాఖ ఒకలా సర్వశిక్ష అభియాన్ మరోలా పేర్కొనడాన్ని తప్పుబట్టింది. తప్పుడు అంకెలతో ప్రమాణాలు చూపిస్తున్నారని పలుమార్లు మండిపడింది. పదో తరగతి ప్రమాణాల్లో గణితంలో ప్రథమస్థానంలో, ఇతర సబ్జెక్టులలో రెండో స్థానంలో ఉన్నామని, విద్యాభివృద్ధిలో జాతీయస్థాయిలో ముందంజలో ఉన్నామని శ్వేతపత్రంలో పేర్కొంది. అయితే ప్రభుత్వం తప్పుడు గణాంకాలు చూపిస్తోందన్న ఆరోపణలున్నాయి.

డీఎస్సీకి చెల్లుచీటీ

రాష్ట్రంలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని డీఎస్సీని భర్తీచేయకుండా నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. పాఠశాలల్లో టీచర్లు లేక విద్యాప్రమాణాలు అడుగంటుతున్నా ప్రభుత్వం పోస్టులను భర్తీచేయడం లేదు. రాష్ట్రంలో గత ఏడాదిలో 23వేల పోస్టులకుపైగా ఖాళీలున్నాయని ప్రభుత్వమే ప్రకటించింది. ఆ తరువాత రిటైరైన వారిని కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 30వేలకు పైగా చేరుతుంది. అయినా ప్రభుత్వం ఇటీవల డీఎస్సీలో కేవలం 7729 పోస్టులను మాత్రమే ప్రకటించింది. ఒకపక్క పాఠశాలల్లో చేరికలు భారీగా పెరుగుతున్నాయని శ్వేతపత్రంలో చూపుతూనే మరోపక్క టీచర్లు, విద్యార్థుల నిష్పత్తిని తక్కువగా చేసి చూపుతూ హేతుబద్ధీకరణ పేరిట పాఠశాలలను మూసివేతకు సిద్ధపడుతోంది.

ఉత్తీర్ణతలో పురోగతి.. నైపుణ్యాల్లో అధోగతి

రాష్ట్రంలో ఎస్సెస్సీలో ఉత్తీర్ణత శాతాలు ఏటేటా పెరిగిపోతూ ఇప్పటికి 96 శాతానికి చేరుకోవడం విద్యారంగ నిపుణుల్ని విస్మయానికి గురిచేస్తోంది. చంద్రబాబునాయుడు 1995లో అధికారం చేపట్టినప్పటినుంచే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. అంతకు ముందు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం పగడ్బందీగా జరిగేది. చంద్రబాబు సీఎం అయ్యాక ప్రయివేటును ప్రోత్సహిస్తూ ఆ సంస్థలను పెంచుకుంటూ పోయారు. వాటిపై విద్యాశాఖకు పెత్తనం లేకుండా పోయింది. మాస్ కాపీయింగ్‌తో పాటు మూల్యాంకణంలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. అప్పటి వరకు ఉత్తీర్ణత శాతం 50 శాతానికి మించకుండా ఉండగా ఆతరువాత నుంచి క్రమేణా పెరుగుతూ ఏకంగా 96 శాతానికి వచ్చింది. ఇంత పెరిగినా ఆమేరకు ప్రమాణాలు ఉంటున్నాయా? అంటే అదీ లేదు. అయినా ప్రభుత్వం శ్వేతపత్రంలో అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు పేర్కొంటుండడం విశేషం.

ఇంటర్మీడియట్ విద్యలో ప్రయివేటుదే పెత్తనం

రాష్ట్రంలో కీలకమైన ఇంటర్మీడియట్ విద్య పూర్తిగా ప్రయివేటు కార్పొరేట్ సంస్థల చేతుల్లో నడుస్తోంది. మొత్తం ఇంటర్మీడియట్ కాలేజీలు 3200 ఉండగా అందులో 2700 కాలేజీలు నారాయణ, శ్రీచైతన్య వంటి ప్రయివేటు కార్పొరేట్ సంస్థలవే. ప్రభుత్వం నిర్దేశిత నిబంధనలు వీటికి పట్టనేపట్టవు. ఫీజులు12500కు మించరాదని రూలు ఉన్నా ఈ కాలేజీలు రూ.లక్షల్లో వసూలు చేస్తూ విద్యార్థులను దోపిడీ చేస్తున్నాయి. పలు సంస్థలు అక్రమంగా కాలేజీలకు అనుబంధంగా హాస్టళ్లను నిర్వహిస్తూ రూ.3 లక్షలవరకు పిండుకుంటు న్నాయి. వీటికి కనీసం అనుమతులూ లేవు. విద్యార్థులను జైళ్లలో పెట్టినట్లు బంధించి చదువుల పేరిట తీవ్ర ఒత్తిళ్లు పెడుతుండటంతో గత కొన్నేళ్లలో వందల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వీటికి కారణమైన కాలేజీలపై చర్యలు తీసుకోకపోవడం అటుంచి స్వయంగా ముఖ్యమంత్రి స్థాయిలో వాటికి మరింత వెన్నుదన్నుగా చంద్రబాబు నిలిచారు. ఆత్మహత్యల నివారణకు నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికలు బుట్టదాఖలు తప్ప అమలు కావడం లేదు.

సర్కారు యూనివర్సిటీలు నిర్వీర్యం

చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీలు నిర్వీర్యమవుతున్నాయి. ప్రయివేటు యూనివర్సిటీలకు భూములు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తూ అదే సమయంలో ప్రభుత్వ వర్సిటీలకు నిధులు, ఇతర వనరులను సమకూర్చకుండా నిర్లిప్తత దాలుస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా జిల్లాకొక యూనివర్సిటీ చొప్పున దాదాపు అన్నిచోట్లా ఏర్పాట్లుచేయగా కొత్తగా ఒక్క ప్రభుత్వ వర్సిటీని కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటుచేయలేదు. ఏకంగా 11 ప్రయివేటు వర్సిటీలకు భూములను మాత్రం కట్టబెట్టారు. ప్రభుత్వ వర్సిటీల్లో బోధన, బోధనేతర పోస్టులు కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నా భర్తీచేయలేదు. 4వేల బోధనా పోస్టులు ఖాళీగా ఉన్నా రేషనలైజేషన్ పేరిట వాటిని కుదించి 1385 చేశారు. వేలాదిమంది విద్యార్థులు ఎలాంటి ప్రమాణాలు లేకుండానే పట్టాలు చేతపట్టుకొని బయటకు వస్తున్నారు. శ్వేతపత్రాల్లో చూపిస్తున్న అంశాలు ఒకటి కాగా ప్రభుత్వం నిర్దిష్ట విద్యాలక్ష్యాల మెరుగుకు ఈ నాలుగున్నరేళ్లలో చేసిన కృషి అంతంతమాత్రమేనన్నది సుస్పష్టం.

– సీహెచ్.శ్రీనివాసరావు, సాక్షి ప్రతినిధి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వాహ్..



"గ్యాస్ సిలిండర్ల ధర పెరిగినప్పుడు భారీగానూ, తగ్గినప్పుడు స్వల్పంగానూ ఉంటుంది. సబ్సిడీ లేకుండా అందించే గ్యాస్ సిలిండర్ ధరను రూ.120 తగ్గించి, సామాన్య ప్రజలకు సబ్సిడీపై అందించే గ్యాస్ సిలిండర్ ధరను రూ.5 మాత్రమే తగ్గించిన మన ప్రధాని నరేంద్ర మోదీ తెలివిని అభినందించి తీరాల్సిందే."

– కీర్తి అజాద్, ఎంపీ

లక్ష్యం



"ఈ నూతన సంవత్సరం మీరంతా ఎన్నో మంచి పనులు చేయాలని నిర్ణయాలు తీసుకుని ఉంటారు. ముందు మీరంతా అలా లక్ష్యాలను నిర్ణయించుకోవడం మానేయండి. లక్ష్యాలు అనేవి మీ సువిశాలమైన ఊహాశక్తిని పరిమితం చేస్తాయి, మీకున్న ఎన్నో ఆశలకు పరిధులు నిర్ణయిస్తాయి. జీవితాన్ని ఒక అడ్వంచర్‌లా గడపాలి. మీరేం చేస్తున్నారో దాన్ని ప్రేమించండి చాలు."

– శేఖర్ కపూర్, దర్శకుడు

స్థాయి



"అవును, మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చాలా మంది రాజకీయ నాయకుల్లాగా పైస్థాయికి చెందిన రాజకీయ నాయకుడు కాదు. అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీలతో కలిసి ఆయన చేసేది చిడతలు వాయించడమే కదా?"

– జిగ్నేష్ మేవానీ, గుజరాత్ ఎమ్మెల్యే

స్వరం



"ఈ నూతన సంవత్సరం రోజున మీ అందరికీ ఒక విషయం చెప్పాలని ఉంది. స్వరాలన్నీ సక్రమంగా సమ్మిళితం అయినప్పుడే చెవులకు ఇంపైన రాగం వెలువడుతుంది. అలాగే మనం అందరం చక్కగా కలిసి మెలిసి ఉన్నప్పుడే ఈ విశాల విశ్వం సుమధురం అవుతుంది."

– లతామంగేష్కర్, గాయని

ఫోన్ లాక్



"కొత్త సంవత్సరం ఇలా మొదలు పెట్టాం.. కుటుంబ సభ్యులందరి దగ్గర నుంచీ ఫోన్లు తీసుకుని ఒక డబ్బాలో పడేశా. ఒక రోజంతా ఆ డబ్బాకు తాళం వేసి ఉంచా. సమయాన్ని అందరూ ఒకరితో ఒకరు అనేక విషయాలను పంచుకుంటూ గడపాలి, ఫోన్లతో కాదు కదా."

–జూహీచావ్లా, సినీ నటి

చంద్రులిద్దరూ దొందూ దొందే

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల అధినేతలు చంద్రశేఖర్‌రావు , చంద్రబాబునాయుడు ఇద్దరికీ ప్రజాస్వామ్యం పట్ల ఏ మాత్రం విశ్వాసం కానీ, గౌరవం కానీ లేవు. చంద్రశేఖర్‌రావు అయినా చంద్రబాబునాయుడు అయినా వోట్లేసి గెలిపించిన ప్రజలకు తాము జవాబుదారీ కాదు అనుకుంటారు కదా. కాంగ్రెస్ వ్యతిరేక ప్రయోజనాలు కేసీఆర్‌వి అయితే, బీజేపీ వ్యతిరేక ప్రయోజనాలు చంద్రబాబువి. ఈయన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్నా,ఆయన కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిని బలోపేతం చేస్తానన్నా ఇద్దరూ ఆశిస్తున్న ఫలితం ఒక్కటే.

సందర్భం



దేవులపల్లి అమర్

డేట్‌లైన్ హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆ రాష్ట్రాల ప్రజలకు ఏ మాత్రం సంబంధంలేని ఒక రాజకీయ యుద్ధం జోరుగా సాగుతున్నది. ఇటీవలే ముగిసిన తెలంగాణ శాసన సభ ఎన్నికల ఫలితాల అనంతరం ఆ యుద్ధం మరింత తీవ్రం అయింది. ఈ రెండు రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల అధినేతల మధ్య జరుగుతున్న ఈ రాజకీయ యుద్ధాన్ని రెండు జాతీయ రాజకీయ పార్టీలు చాలా ఆసక్తిగా గమనిస్తున్నాయి. కొద్ది నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల మీద ఈ రెండు ప్రాంతీయ పార్టీల అధినేతల రాజకీయ యుద్ధం ప్రభావం ఆ రెండు జాతీయ పార్టీల జయాపజయాల మీద కొద్దో గొప్పో ఉండక పోదు కాబట్టే వాటికి ఈ ఆసక్తి.

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల అధినేతలు చంద్రశేఖర్‌రావు , చంద్రబాబు నాయుడు ఇద్దరికీ ప్రజాస్వామ్యం పట్ల ఏ మాత్రం విశ్వాసం కానీ, గౌరవం కానీ లేవు. తెలంగాణ సాధన కోసం పద్నాలుగేళ్ళు సాగిన మలి విడత ఉద్యమ కాలంలో కానీ, తత్ఫలితంగా సాకారం అయిన తెలంగాణ రాష్ట్రంలో మొదటి ముఖ్యమంత్రిగా నాలుగున్నర ఏళ్ళు పరిపాలన సాగించిన కాలంలో కానీ చంద్రశేఖర్ రావు ఆ విషయాన్ని అనేక మార్లు రుజువు చేసుకున్నారు. మళ్ళీ మంచి ఆధిక్యతతో ప్రజలు అధికారం కట్టబెట్టి రెండవసారి ముఖ్యమంత్రిని చేశాక అయినా ఆయన కొంచెం మారుతారేమో, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తారేమో అనుకున్న వారికి ఆశాభంగమే అయింది. ఈ పదవీ కాలంలో ఆయన వ్యవహార శైలి ఎట్లా ఉండబోతున్నదో ఈ మూడు వారాల కాలంలో తెలంగాణ ప్రజలకు రుచి చూపించారు.

డిసెంబర్ 11 న ఎన్నికల ఫలితాలు వెలువడితే ఇవాళ జనవరి రెండవ తేదీ వరకు అంటే 21 రోజులయినా మంత్రి వర్గాన్ని ఏర్పాటు చెయ్యలేదు. ఆయన దృష్టిలో మంత్రివర్గం ఉన్నా లేకున్నా ఒకటే. అవును మంత్రివర్గం ఉన్ననాడు కూడా నిర్ణయాలన్నీ ఆయనే చేసినప్పుడు ఇంకా మంత్రివర్గంతో పని ఏముంటుంది. తన పార్టీ తరఫున గెలిచిన 88 మంది శాసనసభ్యులతో సుస్థిర ప్రభుత్వాన్ని నడిపే అవకాశం ఉన్నా ఇద్దరు స్వతంత్ర ఎంఎల్‌ఏలను రెండో రోజే కండువా కప్పి పార్టీలో కలిపేసుకున్నారు. తన కుమారుడికి పార్టీ కార్యాధ్యక్ష పదవి కట్టబెట్టి రానున్న రోజుల్లో ఆయనే ముఖ్య మంత్రి, అన్ని అధికారాలూ ఆయనవే అన్న సంకేతాలు బలంగా పంపించారు. అధికార కేంద్రం ఇప్పుడు తెలంగాణ భవన్‌లో కేటీ రామారావు చాంబర్‌కు బదిలీ అయిపోయింది. మంత్రి పదవి ఆశిస్తున్న వాళ్ళంతా ఆయన ఆఫీస్ ముందు క్యూ కడుతున్నారు. ప్రాంతీయ పార్టీల్లో ఇటువంటివి సహజమే కాబట్టి అవి పార్టీ లో ప్రజాస్వామ్యయుతంగా అత్యధికుల ఆమోదంతో జరిగాయా లేదా అన్నది ఎవరూ పట్టించుకోరు. దేశమంతటా ప్రాంతీయ పార్టీలలో ఏక వ్యక్తి అధికారం చెలాయించిన చోటల్లా ఇదే పరిస్థితి ఉంటుంది. దాన్నే కేసీఆర్ కూడా ఆదర్శంగా తీసుకుంటారు.

స్వతంత్ర ఎంఎల్‌ఏలతోబాటు, శాసన మండలిలో కాంగ్రెస్ పక్షాన్ని నిర్వీర్యం చేస్తూ ఆ పార్టీ సభ్యులను కలుపుకుని వారికి చట్టబద్ధత కల్పిస్తారు. కానీ తమను విభేదించి బయటికివెళ్ళిన మండలి సభ్యుల మీద మాత్రం 24 గంటల్లో వేటు వేయిస్తారు. అదే శాసన మండలిలో కాంగ్రెస్ నుండి తన పార్టీలోకి కొంతకాలం క్రితం ఫిరాయించిన వారి మీద వేటు ఉండదు. ఇంకా పదిమంది దాకా కాంగ్రెస్ సభ్యులకు కండువాలు కప్పబోతున్నామని ఆయన నోటనే విన్నాం. వాళ్ళు వొస్తానంటే నేనువొద్దని ఎలా అనాలి అని ఆయనే స్వయంగా విలేకరులకు చెప్పారు. వంద స్థానాలు గెలుస్తామని ఎన్నికల ముందు చెప్పిన మాటను ఈ విధంగా నిజం చెయ్యాలన్నది తండ్రీకొడుకుల పట్టుదల అని అర్థం అవుతూనే ఉంది. ఒక పార్టీ పేరు మీద గెలిచి ఇంకో పార్టీలోకి వెళుతున్న వాళ్ళు సిగ్గుపడనప్పుడు చేర్చుకునే వాళ్ళెందుకు సిగ్గు పడాలి? అని కదా ఇవాళ దేశమంతటా రాజకీయ పార్టీలు చెపుతున్నది. అదే కేసీఆర్ కూడా పాటిస్తున్నారు. ప్రతిపక్షం నుండి 23 మంది శాసన సభ్యులను కొనుగోలు చేసి కొందరికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టిన చంద్ర బాబు మొన్నటికి మొన్న తెలంగాణా ప్రచారంలో పార్టీ ఫిరాయింపుల విషయంలో టీఆర్‌ఎస్ మీద విరుచుకుపడిన విడ్డూరంచూసాం కదా.

ముఖ్య మంత్రే చెప్పారు, తన పరిపాలనా పద్ధతికి ప్రజలు ఆమోదం తెలిపారనడానికి నిదర్శనమే మొన్నటి ఫలితాలు అని. సచివాలయానికి వెళ్ళవలసిన పని లేదని ప్రజలే అంగీకరించారు కదా అని చెప్పేశారు ఆయన. మంత్రివర్గం లేకుండా ప్రగతి భవన్ దర్బార్‌లో ఆయన నిర్వహిస్తున్న సమీక్షల తీరు చూసి అధికారులే ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులకే నోరు లేనప్పుడు అధికారులు మాత్రం ఏం మాట్లాడుతారు? ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నీటి పారుదల ప్రాజెక్ట్‌ల పురోగతి సమీక్షల్లో నాలుగున్నర సంవత్సరాలు నిద్రాహారాలు మాని ప్రాజెక్ట్ సైట్‌ల దగ్గర గడిపిన అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ఉండడు,వాటితో ఏ సంబంధం లేని ఇతర ప్రజాప్రతినిధులు ఉంటారు. ఎన్నికల ప్రచార సభల్లో ఇరిగేషన్ మంత్రిగా హరీశ్ చేసిన కృషిని ఆకాశానికి ఎత్తిన కేసీఆర్‌కు మళ్ళీ గెలిచాక సమీక్షల్లో ఆయన కూడా ఉండాలని అనిపించదు, పైగా పనిలో జాప్యం జరుగుతున్నదని అధికారులను మందలించడం దేనికి సంకేతం?హరీశ్ రావును వేనోళ్ళ పొగిడిన నోటనే ఆయన అధ్వర్యంలో పనిసరిగా జరగలేదని చెప్పడమా! ప్రాజెక్ట్‌ల సందర్శనకు కూడా బయలుదేరారు ఆయన. తన కుమారుడి ప్రాముఖ్యత పెంచే క్రమంలో హరీశ్ సమర్థతను తగ్గించి చూపే ప్రయత్నం కావొచ్చు, కానీ ఈ వ్యవహారం అంతా అప్రజాస్వామికంగా ఉంది అని చెప్పేదెవరు ఆయనకు. మాట్లాడితే మీడియా మీద విరుచుకు పడుతున్నారాయే. మొన్నటి పత్రికా గోష్ఠిలో ఆయన ఇంకోమాట కూడా చెప్పారు. దాన్ని బట్టి రేపటి నుండి పత్రికల్లో,టీవీలలో ఎటువంటి వార్తలు రాయాలో,చూపాలో కూడా ఆయనే నిర్ణయిస్తారు. కేసీఆర్ అయినా చంద్రబాబు అయినా వోట్లేసి గెలిపించిన ప్రజలకు తాము జవాబుదారీ కాదు అనుకుంటారు కదా.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి కూడా గడ్డు కాలం నడుస్తున్నది. ఆర్థిక పరిస్థితి అద్భుతంగా ఉంటే ఆరోగ్యశ్రీ బకాయిలు ఎందుకు వెయ్యి కోట్లకు పైగా పేరుకు పోయాయి. కార్పొరేట్ ఆస్పత్రులు వైద్యం ఎందుకు చెయ్యడం లేదు ఆరోగ్యశ్రీ పథకం కింద? రాష్ట్రం మీద నుండి దృష్టి మళ్ళించడానికే ఆయన ఫెడరల్ ఫ్రంట్ పర్యటనలు అని అందరికీ తెలుసు. రాష్ట్రంలో ఆయనకు ఏనాడయినా కాంగ్రెస్‌తోనే సమస్య. అందుకే ఆయన కాంగ్రెస్ ఉండే ఫ్రంట్‌ను వ్యతిరేకిస్తారు. బీజేపీని కూడా విమర్శిస్తున్నాం, ఆ పార్టీ ఉండే ఫ్రంట్‌లో కూడా చేరబోము అన్న మాటలు ఇప్పటి వరకే. లోక్‌సభ ఎన్నికల తరువాత అది బహిరంగ రహస్యమే అవుతుంది.

ఇక తెలంగాణ ఎన్నికల్లో చావు దెబ్బతిన్న తెలుగు దేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గత నాలుగున్నర సంవత్సరాల్లో ఆ రాష్ట్రాన్ని భయంకరమయిన అప్పుల్లో ముంచేసి అస్తవ్యస్తం చేసిన పరిస్థితి నుండి జనం దృష్టి మళ్ళించడానికి, రోజురోజుకూ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి,ఆ పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్ రెడ్డికి కోట్లాది మందిలో పెరిగిపోతున్న అభిమానం నుండి దృష్టి మళ్ళించడానికి మార్గం కావాలి.కేంద్రంలో బీజేపీ వ్యతిరేక కూటమిని బలోపేతం చేస్తానని బయలుదేరిన చంద్రబాబు రెండు ప్రయోజనాలు ఆశించారు. ఒకటి ముందే చెప్పుకున్నట్టు రాష్ట్ర సమస్యల నుండి, తన అస్తవ్యస్త, అవినీతిమయ పాలన నుండి ప్రజల దృష్టి మళ్ళించడం, రెండవది బీజేపీ నుండి తన మీదకు దూసుకు వొచ్చి పడుతుందని ఊహిస్తున్న ప్రమాదాల నుండి రక్షణ పొందడం. అయితే ఆ ప్రయత్నం పెద్దగా ఫలించకపోవడంతో ఇప్పుడు మోదీ, కేసీఆర్, జగన్ కలయిక అనే కొత్త ప్రయత్నం మొదలుపెట్టారు.

కాంగ్రెస్ వ్యతిరేక ప్రయోజనాలు కేసీఆర్‌వి అయితే, బీజేపీ వ్యతిరేక ప్రయోజనాలు చంద్రబాబువి. ఈయన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్నా,ఆయన కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిని బలోపేతం చేస్తానన్నా ఇద్దరూ ఆశిస్తున్న ఫలితం ఒక్కటే. కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే కేసీఆర్‌కు, బీజేపీ కూటమి అధికారంలోకి వొస్తే చంద్రబాబుకు రాజకీయంగానే కాదు. ఇతరత్రా కూడా ఇబ్బందులు తప్పవు. అదీ జాతీయ రాజకీయాలపై వారు చూపుతున్న మక్కువకు అసలు కారణం.ఆ రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ కూడా ఈ ఇద్దరు ప్రాంతీయ నాయకులను అందుకే అంత ఆసక్తిగా గమనిస్తున్నాయి. అయిదు మాసాలు ఆగితే లోక్‌సభ ఫలితాలు వెలువడిన 24గంటల్లో దూద్ కా దూద్ పానీ కా పానీ, అసలు రంగులన్నీ బయట పడతాయి.

datelinehyderabad@gmail.com

సవరణ: 01–01–2019 (మంగళవారం) నాటి సాక్షిలో 'ఇది పేదలను పట్టించుకోని ప్రజాస్వామ్యం' అనే వ్యాసంలో రాజ్‌మోహన్ గాంధీని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పేర్కొనడం జరిగింది. పొరపాటుకు చింతిస్తున్నాం.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం
2-1-2019



కాలానికి ధన్యవాదాలు
– సినిమా పేజీలో



కామెడీ కింగ్ ఖాదర్ ఖాన్ ఇక లేరు
– సినిమా పేజీలో



కంగనకర్ణిక

జనవరి 26 గణతంత్ర దినోత్సవం. ఒక రోజు ముందు కంగనతంత్ర దినోత్సవం. కంగన డైరెక్ట్ చేసిన, కంగన హీరోయిన్‌గా నటించిన బయోపిక్.. 'మణికర్ణిక : ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' జనవరి 25న రిలీజ్ అవుతోంది. మణికర్ణిక.. కంగనకర్ణిక అనుకునే స్థాయిలో ఉంటే కనుక నటిగా కన్నా, డైరెక్టర్‌గా ఇది ఆమెకు పెద్ద విజయం.

పైన బ్రిటిష్ డేగల కళ్లు.
కింద కోడిపిల్ల.. ఝాన్సీ.

ఏ క్షణమైనా తన్నుకుపోవచ్చు. తక్షణం ఝాన్సీకి వారసుడు కావాలి. ఆ వారసుడి చేతిలో పదునైన ఖడ్గం ఉండాలి. ముక్కుకు కరచుకుపోవడానికి కిందికి వాలబోతున్న డేగల కంఠాల్ని సర్రున తెగ్గొట్టేయాలి. అప్పుడే ఝాన్సీకి బతుకు. ఝాన్సీ ప్రజలకు మెతుకు.

వారసుడు లేడు. మణికర్ణిక వచ్చింది. మ..ణి..క..ర్ణి..క!

ఆమెలా ఎవరూ ఉండరు. ఆమెలా ఎవరూ నృత్యం చెయ్యలేరు. ఆమెలా ఎవరూ అశ్వాన్ని పరుగులు తీయించలేరు. ఆమెలా ఎవ్వరూ ఖడ్గాన్ని తిప్పలేరు. ఆమేనా వారసురాలు? ఝాన్సీని రక్షించేందుకు లేచి నిలబడింది కదా. లేచి నడుము బిగించింది కదా. ఒరలోకి కత్తిని దోపుకుంది కదా. జవనాశ్వాన్ని ఎక్కింది కదా. ఖడ్గాన్ని తీసి.. గగనంలో నెత్తురు కక్కుతున్న సామ్రాజ్యవాద నేత్రాలకు చూపింది కదా. అయితే వారసురాలే. మణికర్ణిక.. ఝాన్సీ పౌరురాలు కాదు. అయినా వారసురాలే.

ఝాన్సీకి ఆమె కోడలు.

ఝాన్సీ ఇక కోడి పిల్ల కాదు. కోడలు పిల్ల.

• • •

మెట్టినింటికి వచ్చాక మణికర్ణిక పేరు మారింది. లక్ష్మీబాయి. ఝాన్సీ లక్ష్మీబాయి. భర్త వీరమరణం పొందాక.. ఝాన్సీ కి రాణి.

'లక్ష్మీబాయి అనే నేను.. '

.. చివరి రక్తపు బొట్టు చిందేవరకు, ఝాన్సీకి అత్యంత విధేయురాలినై, ఝాన్సీ ప్రజల సేవకు, ఝాన్సీ సంస్థాన రక్షణకు, సంరక్షణకు.. లక్ష్మీబాయి ప్రమాణ స్వీకారం.

డేగలు క్షుద్ర చేశాయి. ఝాన్సీ నుంచి వెళ్లిపొమ్మని వర్తమానం పంపాయి. వెళ్లిపోతే దేశద్రోహం. మిన్నకుండిపోతే శత్రు శేషం. శత్రువును మిగిల్చదలచుకో లేదు లక్ష్మీబాయి. బ్రిటిష్ ఫిరంగులు ఝాన్సీలో చొరబడ్డాయి. ఝాన్సీని మరుభూమిగా మార్చివేశాయి.



లక్ష్మీ బాయి, ఆమె అశ్వం, ఆమె చేతిలోని ఖడ్గం.. పోరాటం ఆపలేదు.

''దేశంపై ప్రేమ.. ఓటమిని అంగీకరించనివ్వదు. దేశాన్ని శత్రువుకు వదిలి పారిపోనివ్వదు''

భర్త మాటలు గుర్తుకొచ్చాయి లక్ష్మీబాయికి

''నిన్ను ప్రేమించడానికన్నా ముందు నేను నా దేశాన్ని ప్రేమించాను లక్ష్మీ''.

భర్త చివరి మాటలు గుర్తుకున్నాయి లక్ష్మీబాయికి.

''నేనున్నా పోయినా, నా దేశం మిగలాలి లక్ష్మీ.. నా దేశం మిగలాలి లక్ష్మీ.. నా దేశం మిగలాలి లక్ష్మీ''.

పదిహేడవ శతాబ్దపు నాటి మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ కల కూడా అదే. స్వరాజ్యం. ఆయన కలను కూడా ఒక కత్తిలా చేతికి తీసుకుంది లక్ష్మీబాయి.

హరహర మహాదేవ్. హరహర మహాదేవ్. శత్రు మూకల శిరస్సులు తెగి, లక్ష్మీబాయి ముఖం మీద రక్తం చింది పడుతోంది. నుదుటిపై సింధూరంలా రక్తం. కంఠంపై ఆభరణంలా రక్తం. పెదవులపై విజయహాసంలా రక్తం.

లక్ష్మీబాయి గెలిచింది. కాదు.. ఝాన్సీ గెలిచింది. కాదు. ఝాన్సీ లక్ష్మీబాయి గెలిచింది. కాదు కాదు.. కంగనా రనౌత్ గెలిచింది.

''నీకు ఝాన్సీ కావాలి. నాకూ ఝాన్సీ కావాలి. ఒకటే తేడా. నీకు పాలన కావాలి. నాకు ప్రజలు కావాలి''.. శత్రువుతో లక్ష్మీబాయి.

''నీకు నా శిరస్సు కావాలి, నాకూ నీ శిరస్సు కావాలి. ఒకటే తేడా. ఝాన్సీ కోట గుమ్మం ముందు వేలాడగట్టేందుకు నీకు నా శిరస్సు కావాలి. ఎవరికీ తలొంచే పని లేదని నా ప్రజలకు నేను చెప్పేందుకు నీ శిరస్సు నాకు కావాలి''.. శత్రువుతో లక్ష్మీబాయి.

• • •

'మణికర్ణిక' జనవరి 25న వస్తోంది. 1857 నాటి తిరుగుబాటు యోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి కథ ఇది. లక్ష్మీబాయిగా కంగనా రనౌత్‌ది కీ రోల్. ఇద్దరు డైరెక్టర్లు. ఆ ఇద్దరిలో కంగన కూడా ఒకరు. రెండో వ్యక్తి రాధాకృష్ణ జాగర్ల మూడి. మన క్రిష్. 'కృష్ణం వందే జగద్గురుమ్' క్రిష్. కంగనతో పడక 'మణికర్ణిక' డైరెక్షన్‌ని మధ్యలోనే వదిలి హైదరాబాద్ వచ్చేశారు క్రిష్. కంగన ఇగోతో అతడికి ఏవో ప్రాబ్లెమ్స్. ఇగో మంచిదే. రెండు ఇగోల ఘర్షణలో క్రియేటివిటీ క్రీమీ లేయర్‌లా పైకి తేలుతుంది.


2017 మే లో షూటింగ్ ప్రారంభమైంది. కంగన 'మణికర్ణిక'గానే కాదు, డైరెక్టర్‌గా కూడా డే వన్ నుంచి టీమ్‌లో కత్తి తిప్పుతూనే ఉన్నారు. 'అది అలా వద్దు. ఇది ఉండాలి' అన్నప్పుడు సమఉజ్జీలతో, సమఉజ్జీలం అనుకునే వారితో తప్పని పోరే ఇది. ఆ పోరులో లక్ష్మీబాయిలా నిలిచి గెలిచారు కంగన. రీషూట్‌లు, మధ్యలోనే మానేసి వెళ్లిన నటులు, స్క్రిప్టులో మార్పులకు అంగీకరించని వారు, అడ్డుపుల్లలేసేవారు, కాళ్లడ్డు పెట్టేవాళ్లు, ఆరోపణలు చేసేవారు, అలిగి కూర్చునేవాళ్లు, ఇంతేనా పారితోషికం అని కంగనతో అన్నవాళ్లు, అంత పారితోషికమా అని కంగనతో అన్నవాళ్లు.. అసలు సినిమానే తీయనీయకుండా అడుగడుగున ప్లకార్డ్‌లు పట్టుకుని వచ్చినవాళ్లు.. వీళ్లందర్నీ కలుపుకుని వస్తూ, సినిమాను నిలుపుకున్నారు కంగన. టీజర్‌లు, ట్రైలర్‌లు చూస్తుంటే ఒక టనిపిస్తోంది. సినిమాతో పాటు, కంగన కూడా హిట్ అవుతారని. ఈసారి గణతంత్రానికి ముందు మన మొక కంగ న తంత్రాన్ని సెలబ్రెట్ చేసుకోబోతున్నాం.

వివాదాల రాణి

కంగనా రనౌత్ కాంట్రవర్సీల క్వీన్. బాలీవుడ్‌లో ఏకైక బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ ఉమన్. ఎవర్నీ లెక్క చెయ్యరు. అలాగని అహంకారం కాదు. ఆత్మాభిమానం. మనసులో ఉన్నదే మిటో అదే మాట్లాడేస్తారు. చాన్స్‌లు పోతాయని భయపడరు. విమర్శించిన వారిని ఊరికే వదిలిపెట్టరు. ఉరి తీసినంత పని చేస్తాను. వివాదాల రాణి అని ఆమెపై ఉన్న ముద్ర 'మణికర్ణిక' సినిమాతో మరింత బలపడింది. మొదటి చికాకు కో–యాక్టర్ సోనూ సూద్‌తో వచ్చిందామెకు. డైరెక్టర్ ఆమె. ఆమె చెప్పినట్లు చెయ్యాలి. 'చెయ్యలేను. ఆమెకు అంత సీన్ లేదు' అని తప్పుకున్నాడు. కంగన కలవరపడలేదు. ఉండమని అడగనూ లేదు. సోనూ చేసిన సీన్స్ అన్నిటినీ తక్కువ టైమ్‌లో మళ్లీ షూట్ చేశారు! బలమైన సీన్‌లు, బలమైన సినిమా. సోనూ సూదే నష్టపోయాడు. అంతకు ముందే కో–డైరెక్టర్‌తో పడింది కంగనకు. క్రియేషన్‌లో విభేదాలు. ఎందుకొచ్చిందీ అనుకున్నాడు క్రిష్. పక్కకు వచ్చేశాడు. లోపలి వాళ్లతో ఒక రకం తలనొప్పి. బయటివాళ్లతో ఒక రకం తలనొప్పి. రాజస్తాన్‌లో షూటింగ్ జరుపుతున్నప్పుడు 'సర్వ బ్రాహ్మణ మహాసభ' నాయకులు.. 'ఆపండి' అంటూ వచ్చారు. 'ఈస్ట్ ఇండియా కంపెనీ ఏజెంటుతో రాణీ లక్ష్మీబాయి ప్రేమలో పడినట్లు చూపిస్తుంటే చూస్తూ ఊరుకోం' అన్నారు. కంగన తల కొట్టుకున్నారు. 'నీచ్ బాత్' అని అందర్నీ తరిమికొట్టేశారు. యుద్ధం చేస్తున్నప్పుడు ఏ మారణాయుధం ఎటువైపు నుంచి వస్తుందో చెప్పలేం. సినిమా తియ్యడం కూడా యుద్ధమే. ఆ యుద్ధంలో కంగన గెలిచారు. ఇక మిగిలింది బాక్సాఫీస్ విజయం.

చెట్టు నీడ
మంచే జరిగింది

ఒకసారి పరీక్షిత్తు మహారాజు వేటకు వెళుతూ తాత భీమసేనుడు గతంలో జరాసంధుణ్ణి చంపి తెచ్చిన బంగారు కిరీటాన్ని ధరించాడు. మణులు పొదిగిన ఆ కిరీటం ధరించగానే, ఆయనలో రజోగుణం ప్రవేశించింది. వేటాడి వేటాడి అలిసిపోయిన పరీక్షిత్తు, దాహంతో చుట్టూ చూశాడు. నిశ్చలంగా తపస్సులో లీనమైన శమీక మహర్షి కనిపించాడు. ఎన్నిసార్లు పిలిచినా పలకలేదన్న కోపంతో ఒక చచ్చిన పాముని తెచ్చి, ఆయన మెడలో వేశాడు. శమీక మహర్షి కొడుకు శృంగి, జరిగినదాన్ని తెలుసుకుని, తపస్సు చేసుకుంటున్న తండ్రిని అవమానించాడన్న కోపంతో, ఆనాటికి ఏడవ రోజున తక్షకుడు అనే సర్పం విషంతో రాజు మరణించాలని శపించాడు. పరీక్షిత్తు మహారాజుకు జరిగినదేమీ తెలియదు. రాజమందిరానికి రాగానే కిరీటం తీసి పక్కన పెట్టాడు. అప్పుడు ఆయనలో ఉన్న రజోగుణం తగ్గి, తాను చేసిన పనిని తలచుకొని పశ్చాత్తాపపడ్డాడు అయితే, దురదృష్టవశాత్తూ అప్పటికే జరగవలసిన అనర్థం అంతా జరిగిపోయింది. శమీక మహర్షి శిష్యులు వచ్చి అసలు విషయం తెలియజేశారు. మహారాజు ఉత్తమ సంస్కారం కలవాడు కనుక, తనకు మంచే జరిగిందనుకున్నాడు. మరణం ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికీ తెలి



యదు కనుక, భగవచ్చింతనలో సమయాన్ని సద్వినియోగ పరుచుకోవాలనుకున్నాడు. చివరకు ఒక మహర్షి ద్వారా జ్ఞానం పొంది, వైకుంఠం చేరాడు. పరీక్షిత్తు అసుర గుణాలు కలిగినవారి వస్తువులను వాడటం వల్ల, వివేకాన్ని కోల్పోయాడు. అదే ఆయనకు శాపమైంది.

– డి.వి.ఆర్.

స్త్రీలోక సంచారం

☛ 'ఇప్పుడే వస్తాను బిడ్డను పట్టుకో' అని చెప్పిన వెళ్లిన తల్లి మళ్లీ తిరిగి రాలేదు. బిడ్డ ఏడుస్తోంది. బిడ్డను ఎత్తుకున్న ఆ మగ మనిషికి ఏం చేయాలో పాలుపోలేదు. ఇంటికి తీసుకెళ్లాడు. ప్యాకెట్ పాలు పట్టబోయాడు. పాప తాగలేదు. దగ్గరల్లో ఉన్న పోలీస్ స్టేషన్‌లో పాపను అప్పగించి తనూ వెళ్లిపోయాడు. పాప ఏడుపు ఆపడం లేదు. డ్యూటీలో ఉన్న



● ఆశ్రయం

కానిస్టేబుల్‌కు ఏం చేయాలో తోచలేదు. ఇంటికి ఫోన్ చేశాడు. 'పాల కోసం ఏడుస్తున్నట్లుంది. ఇంటికి తీసుకురండి' అంది ఆయన భార్య. 'ఆ పాపను మనమే మన సొంత కూతురిలా పెంచుకుందాం' అని కూడా చెప్పింది. అప్పటికే ఆ దంపతులకు ఒక మగబిడ్డ. ''అలా చేయలేం'' అని చెప్పాడు. వెంటనే ఆమె తన బిడ్డను చంకనేసుకుని భర్త పని చేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. చంకలోని బిడ్డను భర్తకు ఇచ్చి, స్టేషన్‌లో ఉన్న బిడ్డను చంకేసుకుని తన పాలు పట్టించింది. కడుపులో పాలు పడగానే పాప ఏడుపు మానింది. పాలు పట్టిన ఆ తల్లి కూడా కానిస్టేబులే! పాప తల్లి చిత్తుకాగితాలు ఏరుకునే మనిషి అని పాపను పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి వెళ్లినతను చెప్పిన దాన్ని బట్టి తెలుస్తోంది. పోషణలేక పాప బలహీనంగా ఉంది. ఆ పసికందుకు ఒక సురక్షితమైన ఆశ్రయం కల్పించే ప్రయత్నాల్లో ఉన్నారు ఇప్పుడా కానిస్టేబుల్ దంపతులు. ఈ సంఘటన ఏడాది చివరి రోజు హైదరాబాద్‌లో జరిగింది.



● మాలా పార్వతి

☛ కేరళ ప్రభుత్వం జనవరి 1 సాయంత్రం తలపెట్టిన 630 కిలోమీటర్ల పొడవైన 'మహిళాహారం' (వనితామతిల్) విజయవంతం అయింది. ఉత్తర కేరళలోని కాసర్‌గడ్ జిల్లా నుంచి దక్షిణ కేరళలోని తిరువనంతపురం వరకు జాతీయ రహదారి వెంబడి దాదాపు 20 లక్షల మంది మహిళలు చేయిచేయి కలిపి మహిళాహారాన్ని నిర్మించారు. ''లైంగిక సమానత్వ సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటి చెప్పేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేపట్టిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా సామాజిక కార్యకర్తలంతా మద్దతు ఇస్తున్నట్లు ప్రముఖ నటి, యాక్టివిస్టు మాలా పార్వతి తెలిపారు.

☛ విజయవాడ కనకదుర్గ ఆలయంలో జనవరి 1 నుంచి వస్త్రధారణ నిబంధన అమల్లోకి వచ్చింది. ప్రధానంగా మహిళా భక్తుల కోసం ఉద్దేశించిన ఈ నిబంధన ప్రకారం దర్శనానికి, ఆర్జిత సేవలకు వచ్చేవారు చీర, లెహంగా వంటి సంప్రదాయ దుస్తులను మాత్రమే ధరించవలసి ఉంటుంది. ఆలయ పవిత్రతను, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాల కార్యనిర్వాహక అధికారి కోటేశ్వరమ్మ తెలిపారు. అయితే ఈ నిబంధన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉందని 'నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్' ఏ.పి. శాఖ కార్యదర్శి పి.దుర్గాభవాని వ్యాఖ్యానించారు.



● డ్రెస్ కోడ్

నాన్నను మా అమ్మ '... మనిషి' అని కులం పేరుతో తిట్టేది!

ఓ జర్నలిస్టు ఆత్మ కథనం

అయితే ఈ కథనం.. కులాంతర వివాహాల గురించి కాదు. పరువు హత్యలు జరిగినప్పుడు కులపట్టింపులపై జర్నలిస్టులు సంధించే ప్రశ్నల గురించి! 'ఈ ధోరణి సరికాదు' అని ఒక వెబ్‌సైట్‌కు రాస్తూ, తన తల్లిదండ్రుల జీవితాల్ని సమాజం ముందు పరిచారు ఆ అజ్ఞాత మహిళా జర్నలిస్టు.



● ఇంకెన్నాళ్లీ ప్రేమ వెలి!

''మా తల్లిదండ్రులది ప్రేమ వివాహం. మా అమ్మ సంప్రదాయ నేత పనివారి కుటుంబంలో పుట్టింది. మా తాతయ్య దర్జీగా పనిచేసేవాడు. పేదరికం గురించి ఏమాత్రం ఆలోచించకుండా, మా అమ్మని 1970 ప్రాంతంలో చదువుల కోసం మద్రాసు విశ్వవిద్యాలయానికి పంపాడు. అమ్మ బాగా చదువుకుని, మంచి ఉద్యోగం సంపాదించి తన ఆరుగురు తోబుట్టువులకు అండగా ఉంటుందని భావించాడు తాతయ్య.

అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే బాగానే ఉంటుంది. అక్కడ చదువుకునే రోజుల్లోనే అమ్మకి మా నాన్నతో పరిచయం ఏర్పడింది. నాన్న దళిత కుటుంబానికి చెందినవాడు. వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు, వివాహం చేసుకుందామనుకున్నారు. అగ్ర వర్ణంలో పుట్టిన అమ్మాయి, దళిత అబ్బాయిని వివాహం చేసుకోవడమేంటని అమ్మ తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పారు. మరోవైపు నాన్న దళితుడనే కారణంగా లిటరేచర్‌లో పి.హెచ్.డి. చేసే అవకాశం రాలేదు. ఒకవేళ నాన్న భయపడి తన గ్రామానికి వెళ్లిపోతే, అక్కడ సైకిల్ రిపేర్ చేసుకుంటూ జీవనం సాగించవలసి వచ్చేది. ఇద్దరూ ధైర్యం చేశారు. బెంగళూరులో వివాహం చేసుకున్నారు. ఇద్దరూ ఒకే కాలేజీలో పార్ట్ టైమ్ జాబ్ చేయడం ప్రారంభించారు.

నాన్నపై ఒత్తిడి తెచ్చారు

వివాహం జరిగిన కొన్ని నెలల తరవాత, ఇరు కుటుంబాల వారు అమ్మనాన్నలను చూడటానికి వచ్చారు. నాన్న దళితుడు కావడంతో, తాతయ్య వాళ్లు నాన్నకి గౌరవం ఇవ్వకపోగా, అమ్మని చదివించడానికి అయిన ఖర్చు ఇవ్వమని ఒత్తిడి చేశారు. అమ్మకు ఒక బిడ్డ పుట్టి, రెండవసారి గర్భవతిగా ఉన్న సమయంలో, అమ్మ తోబుట్టువులు వచ్చి, డబ్బు కోసం ఒత్తిడి చేశారు. రెండుకుటుంబాలను పోషించడం కష్టం కావడంతో, ప్రసవించిన ఏడో రోజు నుంచి అమ్మ మమ్మల్ని ఇంట్లోనే ఉంచి ఉద్యోగానికి వెళ్లడం ప్రారంభించింది. నేను పడుకున్న మంచం మీద నల్లులు కూడా ఉన్నాయి. నా పరిస్థితి చూసి అమ్మమ్మ వాళ్లు నన్ను వాళ్లతో తీసుకువెళ్లారు. నేను పుట్టిన రెండు సంవత్సరాలకి, అమ్మనాన్నలు మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారు. దాంతో మళ్లీ అమ్మ దగ్గరకు వచ్చేశాను. మా ఆర్థిక పరిస్థితితో బాటు, అమ్మ వాళ్లకి మా బాధ్యతలు కూడా పెరిగాయి. అమ్మ వాళ్ల పుట్టింటివారిని, నాన్న వాళ్ల పుట్టింటివారినీ ఇద్దరినీ చూసుకునే బాధ్యత మరింత పెరిగింది. మా నాన్న తాను ఎందుకు డబ్బులు పంపలేకపోయాననే విషయం గురించి చెప్పబోతుంటే, 'నువ్వు దళితుడివి. నీ మాటలు వినవలసిన అవసరం మాకు లేదు' అని కఠినంగా మాట్లాడేవారు తాతయ్య. మా అమ్మ తన సోదరులకు, భర్తకు మధ్య నలిగిపోయేది. వారిని వెనకేసుకొస్తే నాన్నకి కోపం వచ్చేది. అమ్మా నాన్నకు గొడవలు ఎక్కువైపోయాయి.

అమ్మ విడిపోయింది

అమ్మ తాను విడిగా ఉండటానికి నిశ్చయించుకుంది. అప్పటికి నా వయసు పది సంవత్సరాలు. నేను, మా అన్నయ్య ఇద్దరం నాన్నతోనే కలిసి ఉన్నాం. రానురాను బంధువుల రాకపోకలు తగ్గిపోయాయి. మా సెలవులన్నీ ఇంటికే పరిమితమైపోయాయి. ఏ పండుగను బంధువులతో జరుపుకునే అవకాశం లేకపోయింది. కేవలం చావుల సమయంలో మాత్రమే బంధువులు వస్తున్నారు. ప్రపంచం చాలా ఇరుకుగా కనిపించింది. మా అమ్మ తన ఒంటరి జీవితాన్ని దుర్భరంగా గడుపుతోంది. మా నాన్న ఎక్కడికైనా వెళ్లినప్పుడు అమ్మ ఇంటికి వచ్చి మమ్మల్ని పలకరించి వెళ్లేది. కొన్ని సంవత్సరాల తరవాత అమ్మనాన్నలు విడాకులు తీసుకున్నారు. వారిద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి బంధువులు ప్రయత్నించలేదు. ఇద్దరినీ కలపడానికి ఎవరూ లేకపోవడంతో వారి బంధం కూలిపోయింది.

మా అమ్మనాన్నల మధ్యన వచ్చిన గొడవల కారణంగా, మా అమ్మ మా నాన్నను '... మనిషి' అని కులం పేరుతో తిడుతుండేది. మా నాన్న బాధతో, 'నేను బతికున్నంత కాలం ఈ మాటలు వింటూ ఉండవలసిందే' అనేవారు. తల్లిదండ్రుల గొడవలు పిల్లల మీద ప్రభావం చూపుతాయి. నా మనసులోని భావాలను ఎవరితోనూ పంచుకోలేకపోయాను. కులం నన్ను కూడా వెంటాడుతూనే ఉంది. నా కులం గురించి చెప్పగానే, అవతలి వారు విధించే నిబంధనలు వినడానికి నేను సిద్ధంగా లేను. దళితులను కులాంతర వివాహం చేసుకుంటే, బంధువుల నుంచి తెగదెంపులు ఎదుర్కోక తప్పడం లేదు. మనలో మతసహనం లోపిస్తోందనడానికి ఇటువంటి ఉదాహరణలు ఎన్నెన్నో. ఏటా జరిగే ఉత్సవాలకు కూడా దళితులను గుడి వెలుపల నుంచి మాత్రమే పూజలు చేసుకోవడానికి అనుమతిస్తున్నారు. గ్రామాలలో ఈ విషయంలో ఇంతవరకు మార్పు రాలేదు. ఇంకా ప్రమాదం ఏమిటంటే.. హింస జరిగినప్పుడు మాత్రమే మతసహనం గురించి ప్రస్తావిస్తున్నారు. మిగతా సమయాల్లో కులరహిత సమాజం వైపుగా చైతన్యం తెచ్చే ప్రయత్నాలను మనమెందుకు చెయ్యం? అనిపిస్తుంది'' అని ఆ జర్నలిస్టు ఆలోచన రేపారు.

– జయంతి ('స్క్రాల్.ఇన్' ఆధారంగా)

'పరువు కోసం' అని రాయకండి

గతేడాది నవంబర్ పదహారు తమిళనాడు ప్రజలకి కాళరాత్రిని మిగిల్చింది. 'గజ' తుపాను బీభత్సం సృష్టించింది. ఆ తుపానులో కొట్టుకొచ్చిన రెండు మానవ దేహాల ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. ఒక యువ జంటను చంపేసి, కావేరీ నదిలోకి విసిరేశారు. వారివే ఆ మృతదేహాలు. ఆ అమ్మాయి వెనుకబడిన కుటుంబంలో పుట్టింది. అబ్బాయి దళితకులానికి చెందినవాడు. వారిలో ఈ దళితుడు అణగారిన వర్గానికి చెందినవాడి కింద లెక్క. సంప్రదాయాన్ని మైలపరచినందుకు గాను అమ్మాయి కుటుంబీకులు ఆ జంటను దారుణంగా హత్య చేశారు. దక్షిణ భారతదేశంలో ఇటీవల పరువు కోసం జరిగిన వరుస హత్యలలో ఇది మూడో హత్య. ఇటువంటి హత్యలు జరిగినప్పుడు, జర్నలిస్టులు ఆ ప్రాంతానికి చేరుకుని, ఆయా కుటుంబాల వారిని ప్రశ్నించి, కేసు పూర్వాపరాలు తెలుసుకుంటారు. ప్రతి కేసులోనూ 'పరువు కోసం యువజంట దారుణ హత్య' అనే రాస్తారు. నిత్యజీవితంలో కులం గురించి మరచిపోలేమా అనేది పక్కన పెడితే, వీటిపై ప్రత్యేక వార్తా కథనాలు ఇచ్చేటప్పుడు జర్నలిస్టులు 'పరువు కోసం' అంటూ తీర్పులు ఇచ్చేయకుండా.. సామాజిక ధోరణులను మలిచేలా సమస్య మూలాల్ని విశ్లేషించాలని 'స్క్రాల్.ఇన్'లో వ్యాసం రాసిన ఆ పాత్రికేయురాలు కోరుతున్నారు.



● ప్రతీకాత్మక చిత్రం

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
విజయవాడ ॥ బుధవారం
2-1-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హలో అన్నా. నేనొక అమ్మాయిని త్రీ ఇయర్స్‌గా లవ్ చేస్తున్నాను. తను కూడా నన్ను ట్రూగా లవ్ చేసింది. మా నేపథ్యాలు వేరు కావడంతో తనకి వేరే సంబంధం చూశారు. పెళ్లికి ముందు రోజు కాల్ చేసి 'నాకు నువ్వు కావాలి' అంది. అప్పుడు నేనేం చెయ్యలేకపోయాను. తనకి పెళ్లైపోయింది. ప్రాణం పోయేంతగా ఏడ్చాను. నా ప్రాబ్లమ్ ఏంటంటే... ఇప్పుడు తను రోజూ కాల్ చేస్తోంది. ఎన్నిసార్లు పట్టించుకోలేనట్లున్నా కాల్ చేస్తూనే ఉంటోంది. పైగా 'నువ్వే కావాలి' అంటోంది. నాకు ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. ఒక పెళ్లి అయిన అమ్మాయితో ఎలా మాట్లాడాలి. పైగా ప్రతిసారీ 'ఐ లవ్ యూ' అంటోంది. పెళ్లి అయ్యాక కూడా ఎందుకిలా మాట్లాడుతున్నావని అడిగితే.. 'పెళ్లి అయితే లవ్ చెయ్యొద్దా?' అంటోంది. నా ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ చెప్పండి బ్రో. నాకు ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు.

– లక్కీ

మంచివాడివి...!
అంతగా అమ్మాయి అడుగుతున్నా...
అదుపు తప్పకుండా గౌరవంగా బిహేవ్ చేస్తున్నావ్...!!
నిజంగా అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు అన్నా....!!
నీలాంటి వాళ్లు కొందరున్నారు కాబట్టే...
ఇంకా సమాజంలో ఒక నియమం, నిబద్ధత ఉన్నాయి...!!
'సార్...! ఇంత బటర్ పూస్తున్నారెందుకు సార్??
జారి కింద పడతాడేమో సార్?!!'
అమ్మాయి రాస్తున్న బటర్‌కే పడలేదు..!
అయినా ఈ పిలగాడు
పడేరకం కాదు...!
పడిపోయే నీచ గుణం లేదు...!!
తనను తాను తగ్గి....
'మంచిని లేపే గుణం ఉన్నవాడు కదా సార్? నిజమే... నాకు కూడా నచ్చాడు సార్...! అమ్మాయిని రాంగ్ రూట్‌లో పడకుండా ఉంచాడు.. శభాష్!!'

lovedoctorram@sakshi.com

సుడోకు

4		2	5	8			6	
			3	7	6	4	2	
	7					5		3
		3	7				9	8
		6				2		
7	8				1	6		
3		4					1	
	6	8	1	9	7			
	1			3	2	8		6

నిన్నటి జవాబు

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]



అఖిల్

లవర్‌బాయ్ ఆఫ్ ది ఇయర్!

ప్రేమలో పీహెచ్‌డీ చేయాలనుకునే కొందరు లవర్ బాయ్స్ కూడా ఓ మంచి అందమైన అమ్మాయికి ఫిదా అయిపోవాల్సిందే. అలాంటి అమ్మాయితో ప్రేమలో పడ్డ ఓ లవర్‌బాయ్ కథతో రూపొందుతున్న సినిమా 'మిస్టర్ మజ్ను'. తొలిప్రేమ ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ''ఆల్రెడీ రిలీజ్ చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్, 'ఏమైనదో.. ఏమైనదో', 'మిస్టర్. మజ్ను' సాంగ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను బుధవారం సాయంత్రం ఆరు గంటలకు విడుదల చేయనున్నాం. లవర్ బాయ్ ఆఫ్ ది ఇయర్ 'మిస్టర్ మజ్నుని' కలుసుకోండి. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాను జనవరి 25న విడుదల చేయబోతున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, 'హైపర్' ఆది ముఖ్య పాత్రలు చేసిన ఈ సినిమాకు తమన్ స్వరకర్త.



● 'వినయ విధేయ రామ' చిత్రంలో కియారా అద్వానీ, రామ్‌చరణ్



● ప్రకాశ్‌రాజ్

స్వతంత్ర అభ్యర్థిగా!

'జస్ట్ ఆస్కింగ్' అనే యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియాలో సామాజిక అంశాలపై తన అభిప్రాయలను షేర్ చేసుకుంటుంటారు నటుడు ప్రకాశ్‌రాజ్. ఇప్పుడు ఆయన ప్రజల తరఫున రాజకీయాల్లోకి వెళ్లనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ''ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీ (ప్రజలు) సపోర్ట్‌తో రాబోయే పార్లమెంట్ ఎలక్షన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నాను. ఎక్కడి నుంచి అనే వివరాలు త్వరలో వెల్లడిస్తాను. కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టబోతున్నాను. ఇప్పుడు నా బాధ్యత మరింత పెరిగింది'' అని ట్వీట్ చేశారు ప్రకాశ్‌రాజ్. ప్రస్తుతం ఆయన సౌత్ మూవీస్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే.

కాలానికి ధన్యవాదాలు

న్యూ ఇయర్ వచ్చేసింది. గడచిన సంవత్సరం ఎలా గడిచింది? అని విశ్లేషించుకుంటూ ఈ ఏడాది ఎలా ఉండాలో కోరుకుంటూ బిజీగా ఉన్నారు చాలా మంది. శ్రుతీహాసన్ ఏమంటున్నారంటే.. ''ఎలా జీవించాలో నాకు నేర్పుతున్న ప్రతి ఏడాదికి థ్యాంక్స్. కాలం నాలో తెచ్చిన మార్పులకు థ్యాంక్స్. నాలో నన్ను వెతుక్కునే అవకాశం కల్పించి, నన్ను నేను ప్రేమించుకునేలా చేసిన టైమ్‌కి థ్యాంక్స్. అలాగే 2019 కూడా నన్ను ఎగ్జైట్ చేసే ఎన్నో అంశాలను నా ముందుకు తీసుకురావాలి. నాకు నచ్చిన విషయాలను ఎంపిక చేసుకునే అవకాశాలను ఇవ్వాలి. నా సంతోషంలో గతేడాది భాగమైన నా బంధుమిత్రులకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు. అలాగే న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను ఆమె తన బాయ్‌ఫ్రెండ్ మైఖేల్ కోర్సలేతో కలిసి లండన్‌లో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ ఫొటోలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇక శ్రుతి సినిమాల విషయానికి వస్తే.. హిందీలో విద్యుత్ జమాల్ సరసన ఆమె ఓ సినిమా చేస్తున్నారు. మహేశ్ మంజ్రేకర్ ఈ సినిమాకు దర్శకుడు.



● శ్రుతీహాసన్, మైఖేల్



● శ్రుతీహాసన్

కాపాడతాడు!

కంటికి రెప్పలా కాపల కాస్తున్నారు సూర్య. విలన్స్ ఎవరైనా ఎటాక్ చేయాలని ట్రై చేస్తే తూటాతోనే సమాధానం చెబుతున్నాడు. మరి.. సూర్య మిషన్ ఏంటి? అనే విషయం ప్రస్తుతానికి సస్పెన్స్. కేవీ ఆనంద్ దర్శకత్వంలో సూర్య హీరోగా రూపొందుతున్న సినిమాకు 'కాప్పాన్' అనే టైటిల్‌ను ఖరారు చేసి, న్యూ ఇయర్ సందర్భంగా ఈ చిత్రంలోని సూర్య లుక్‌ని కూడా రిలీజ్ చేశారు చిత్ర బృందం. కాప్పాన్ అంటే కాపాడతాడు అని అర్థం. ''మీట్‌పాన్, కాప్పాన్, ఉయిర్కా' ఈ మూడు టైటిల్స్‌లో ఏదో ఒక టైటిల్‌ని ఎంపిక చేయవలసిందిగా ఆడియన్స్ కోరి పోల్ పెట్టాం. 'ఉయిర్కా' టైటిల్‌కు మంచి స్పందన వచ్చింది. కానీ నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, టీమ్ మెంబర్స్, ఇండస్ట్రీ సన్నిహితులు 'కాప్పాన్' టైటిల్ సౌండింగ్ బాగుందని, ఆడియన్స్‌కి బాగా రీచ్ అవుతుందని అభిప్రాయపడ్డారు. దీంతో ఆ టైటిల్‌నే ఫిక్స్ చేశాం. ఇందులో సూర్య ఎన్‌జీఏ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్) పాత్రలో కనిపిస్తారు. 70 శాతం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం సూర్య 'ఎన్‌జీకే' (నంద గోపాలన్ కుమారన్) సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ నెల 17 నుంచి 'కాప్పాన్' షూటింగ్ తిరిగి ప్రారంభం అవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో సాయేషా కథానాయికగా నటిస్తున్నారు.



● సూర్య


కామెడీ కింగ్ ఖాదర్ ఖాన్ ఇక లేరు

నూతన సంవత్సరం వేళ బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, రచయిత ఖాదర్ ఖాన్ (81) ఇక లేరు. చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కెనడాలోని తన కుమారుడు సర్ఫరాజ్ ఖాన్ గృహంలో డిసెంబరు 31న సాయంత్రం 6 గంటలకు కన్నుమూశారు. ఈ విషయాన్ని సర్ఫరాజ్ ఖాన్ తెలిపారు. ''చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాన్నగారు గత 16–17 వారాలుగా ఆస్పత్రిలో ఉన్నారు. పరిస్థితి విషమించి సోమవారం తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులందరూ కెనడాలోనే ఉన్నందున ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తాం'' అని పేర్కొన్నారు సర్ఫరాజ్.



● ఖాదర్ ఖాన్

ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబూల్‌లో 1937 డిసెంబరు 11న జన్మించిన ఖాదర్ ఖాన్ 1973లో వచ్చిన 'దాగ్' సినిమాతో బాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు. దాదాపు 300లకు పైగా సినిమాల్లో విభిన్నమైన పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అంతే కాదు.. 250 సినిమాలకు రచయితగా వ్యవహరించిన ఘనత ఖాదర్ ఖాన్‌ది. మాటల రచయితగా ఆయన మొదటి సినిమా 'జవానీ దివానీ'. హాస్య పాత్రలకు పేరుగాంచిన ఖాన్ సినీ రంగంలో తనదైన ముద్ర వేసుకొని, అన్నివర్గాల ప్రేక్షకులతో 'కామెడీ కింగ్' అనిపించుకున్నారు. ఆయన ఎక్కువగా దర్శకుడు డేవిడ్ ధావన్ సినిమాల్లో నటించారు. అమితాబ్ బచ్చన్‌తో పాటు రాజేశ్ ఖన్నా, జితేంద్ర, ఫిరోజ్ ఖాన్, అనిల్ కపూర్, గోవిందా వంటి నటులతో కలిసి ఆయన నటించారు. ఖాదర్ లేరనే విషయాన్ని ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఖాదర్ ఖాన్ మరణం పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. 'తన అద్భుత నటనతో ఆయన వెండి తెరకు మరింత మెరుగులు దిద్దారు.. రచయితగా కూడా గొప్ప సినిమాలు అందించారు' అన్నారు. అమితాబ్ బచ్చన్ స్పందిస్తూ 'ఖాదర్ ఖాన్ మరణ వార్త కలచివేసింది. గొప్ప ప్రతిభావంతుడైన ఆయన్ని కోల్పోవడం బాధాకరం'' అన్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఖాదర్ మృతికి సంతాపం తెలిపారు.



● రాజశేఖర్

35ఏళ్లు వెనక్కి!

'పి.ఎస్.వి. గరుడవేగ' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ హిట్ అందుకున్నారు రాజశేఖర్. ఆ సినిమా తర్వాత ఆయన నటిస్తున్న చిత్రం 'కల్కి'. 'అ!' వంటి విలక్షణమైన చిత్రాన్ని తెరకెక్కించిన ప్రశాంత్ వర్మ 'కల్కి' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శివానీ శివాత్మిక మూవీస్ బ్యానర్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మిస్తున్నారు. అదా శర్మ, నందితా శ్వేత, స్కార్లెట్ విల్సన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. నూతన సంవత్సరం సందర్భంగా 'కల్కి' చిత్రం ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఓపెన్ టాప్ జీప్‌లో స్టైల్‌గా కూర్చుని ఉన్న రాజశేఖర్ లుక్ ఆకట్టుకుంటోంది. 1983 నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగుతుందట. మరి.. 35 ఏళ్ల క్రితం ఏం జరిగింది? అన్నది తెలియాలంటే సినిమా విడుదల వరకూ ఆగాల్సిందే. అశుతోష్ రాణా, నాజర్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.



సీసాలో ఆవిరి

విభిన్న చిత్రాల దర్శకుడు, నటుడు రవిబాబు నూతన సంవత్సర కానుకగా తన కొత్త సినిమాని ప్రకటించారు. ఈ చిత్రానికి 'ఆవిరి' అనే టైటిల్‌ని ప్రకటించారాయన. అంతేకాదు.. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేశారు. గాజు సీసా లోపల అమ్మాయి ఉండటం.. ఆ సీసా మూతని ఎవరో ఓపెన్ చేస్తుంటే ఆవిర్లు బయటికి వస్తుండటం.. వంటి వాటితో విభిన్నంగా ఉన్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ''ఇది ఒక ఆఫ్ బీట్ చిత్రం. త్వరలోనే సినిమా పూర్తి వివరాలను, నటీనటులను ప్రకటిస్తాం'' అని రవిబాబు తెలిపారు. ఫ్లయింగ్ ఫ్రాగ్స్ పతాకంపై రవిబాబు స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించనున్నారు.



చీకటి నిద్ర

నిద్రలో మరణం సహజమే కావచ్చు.
కాని సహజంగా కనిపించే ప్రతి మరణం సహజం కాకపోవచ్చు.
చీకటిలో కోరికలు ఉంటాయి.
అవి తీరే ఏకాంతం దొరకడం మనుషులకు ప్రమాదకరం.
బుద్ధి చీకటి దారి తప్పితే జీవితం అంధకారంలో పడుతుంది.
నేరం జరిగిన తర్వాత వగచే కన్నా
నేరం జరిగే పరిస్థితులను ముందే నివారించడం తెలివైన పని.

క్లూ తప్పించుకోలేరు

2012– అక్టోబర్ 13.

కాజీపేట ప్రశాంత్ నగర్.

ఉదయం 6 గంటల 3 నిమిషాలు.

వేంకటేశ్వర గుడిలో నుంచి మైకులో వస్తున్న సుప్రభాతం వింటూ రెండు కప్పుల కాఫీ తయారు చేసింది సుజాత. తను ముందుగా కాఫీ తాగుతూ టీవీ ఆన్ చేసింది. అరగంట టీవీ చూసి తర్వాత గిన్నెలో ఉన్న కాఫీని మళ్ళీ వేడి చేసి కప్పులో పోసి, అత్త సువర్ణమ్మ రూమ్‌వైపుగా వెళ్లింది. బయట నుంచే డోర్ మీద తడుతూ 'అత్తయ్యా.. అత్తయ్యా..' అని పిలిచింది.

ఎలాంటి అలికిడి వినిపించలేదు.

'అదేంటీ.. రోజూ ఈ టైమ్‌కి లేస్తారు. ఈ రోజు ఇంకా లేవలేదా?' అనుకుంటూ డోర్ తీసుకొని లోపలికి వెళ్లి మళ్లీ పిలిచింది. పడుకున్న మనిషి పడుకున్నట్టే ఉంది. దగ్గరగా వెళ్లి తట్టింది. చెయ్యి చల్లగా తగిలింది. ఆందోళనగా టీపాయి మీద కాఫీ కప్పు పెట్టి, మరోసారి అత్తను లేపే ప్రయత్నం చేసింది. కానీ, సువర్ణమ్మ లేవలేదు.

సుజాతకు మాటరాలేదు.

'ఇప్పుడేం చేయాలి...' కంగారుగా కాలనీలోనే ఉంటున్న తల్లిగారింటికి ఫోన్ చేసింది.

అప్పటికి సమయం 7.15.

సుజాత తల్లీదండ్రితో పాటు ఇరుగు పొరుగూ సువర్ణమ్మ మంచం చుట్టూ చేరారు.

'అకస్మాత్తుగా ఇలా జరిగిందంటే నిద్రలోనే గుండెపోటు వచ్చి ఉండవచ్చు' అన్నారంతా!

సుజాత ఏడుస్తూ ఉంటే.. 'కోడలివైనా ఇన్నాళ్లూ కూతురులా చూసుకున్నావు. ఆమె అదృష్టవంతురాలు. నిద్రలోనే పోయింది.' అంటూ సముదాయిస్తున్నారు సుజాతని..

* * *

సువర్ణమ్మ (పేరుమార్చాం) అటవీశాఖ కార్యాలయంలో ఉద్యోగినిగా పని చేసేది. వయసు 55 పైనే. ఇద్దరు కొడుకులు. ఇద్దరూ ఉద్యోగరీత్యా విదేశాలలో ఉంటున్నారు. మూడేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కొడుకులు కోడళ్లతో కలిసి పండగలకు వచ్చిపోతుండేవారు. సంవత్సరం క్రితం పెద్ద కొడుకు వచ్చినప్పుడు తల్లికి ఆరోగ్యం బాగుండడం లేదని భార్య సుజాతను ఇక్కడే వదిలి వెళ్లాడు. అందువల్ల సుజాత అత్తతోనే ఉంటోంది.

* * *

విషయం తెలిసిన వెంటనే కొడుకులు ఇద్దరు బయల్దేరారు.

అక్టోబర్ 17న ఇంటికి చేరుకున్నారు.

అదే రోజున తల్లి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

నెలమాసికం తర్వాత తిరుగు ప్రయాణం పెట్టుకుందామనుకున్నారు.

కానీ, కుదరక మరో నెల రోజులకు ప్రయాణం వాయిదా వేసుకున్నారు.

నవంబర్ 19.

'వదినా... అమ్మ సెల్‌ఫోన్ కనిపించడం లేదేంటీ..' అన్నాడు సువర్ణమ్మ రెండో కొడుకు సతీష్ ఏదో గుర్తుచ్చినట్టు.

'ఏమో సతీష్. ఫోన్ రిపేర్‌కు ఇచ్చిందనుకుంట. ఎక్కడ ఇచ్చిందో నాకూ దాని గురించి తెలియదు' అంది సుజాత.

'అలాగా. సరే వదినా. నేను బయటకెళ్లొస్తా. అన్నయ్య వస్తే చెప్పు' అంటూ వెళ్లిపోయాడు సతీష్.

షోరూమ్‌కెళ్లి తల్లి మొబైల్ నెంబర్ పై కొత్త సిమ్ తీసుకుని తన దగ్గర ఉన్న మరో ఫోన్‌లో వేశాడు.

సిమ్ యాక్టివేట్ అయిన కొద్దిసేపట్లోనే ఆంధ్రా బ్యాంక్ నుంచి మూడు మెసేజ్‌లు ఆ నంబర్‌కు వచ్చాయి. అక్టోబర్ 15న, నవంబర్ 2న మొత్తం 75 వేల రూపాయలు బ్యాంక్ అకౌంట్ నుంచి డ్రా అయినట్టు ఉందా సమాచారం.

ఆంధ్రాబ్యాంక్ అకౌంట్‌ను తన ఫోన్ నెంబర్‌కు జత చేసుకుంది సువర్ణమ్మ. డబ్బు డ్రా చేస్తే మెసేజ్ వస్తుంది. అలాంటి మెసేజులే అవి.

వాటిని చూడగానే సతీష్ ఆశ్చర్యపోయాడు.

'అక్టోబర్ 13న అమ్మ చనిపోయింది. మేమెవరమూ డబ్బు డ్రా చేయలేదు. అక్టోబర్ 15న నవంబర్ 2న డబ్బులు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చిందేంటి?' అనుమానంతో వెంటనే బ్యాంక్‌కు వెళ్లి అధికారులను అడిగితే వాళ్లు స్టేట్‌మెంట్ తీసిచ్చారు.

ఏయే ఏటీఎమ్‌ల నుంచి డబ్బులు డ్రా అయ్యాయో బ్యాంక్‌వాళ్లు చెప్పారు.

'ఏటీఎం కార్డులు ఎవరు తీసుకెళ్ళి డ్రా చేశారు? ఇంట్లో ఏదైనా దొంగతనం జరిగిందా? అసలు ఇన్ని రోజులు తాత్సారం చేయడం తనదే తప్పు' అనుకుంటూ పోలీస్ కంప్లైంట్ ఇచ్చాడు సతీష్.

సువర్ణమ్మ బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు ఏయే బ్యాంక్ ఏటీఎంల నుంచి డ్రా అయ్యాయో పూర్తి వివరాలు తీసుకున్నారు పోలీసులు. కాజీపేటలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం నుంచి డబ్బులు డ్రా అయినట్లు తెల్సింది. దీంతో యాక్సిస్ బ్యాంక్ అధికారులను కలిశారు.

* * *

సువర్ణమ్మ బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు ఏయే బ్యాంక్ ఏటీఎంల నుంచి డ్రా అయ్యాయో పూర్తి వివరాలు తీసుకున్నారు పోలీసులు. కాజీపేటలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం నుంచి డబ్బులు డ్రా అయినట్లు తెల్సింది. దీంతో యాక్సిస్ బ్యాంక్ అధికారులను కలిశారు.

'అక్టోబర్ 15న, నవంబర్ 2న సాయంత్రం సమయంలో ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేస్తున్న సీసీ ఫుటేజీ కావాలి' అని సీఐ కోరాడు.

బ్యాంక్ అధికారులు ఆ ఫుటేజీని పోలీసులకు అప్పగించారు.

ఫుటేజ్ పరిశీలిస్తే ఒక మనిషి కనిపించాడు. పురుషుడు. 35 ఏళ్లు ఉండొచ్చు. అతనే డబ్బులు డ్రా చేసినట్టు తెలుసుకున్నారు.

'ఆ వ్యక్తికి సువర్ణమ్మ ఏటీఎమ్ కార్డులు ఎలా దొరికాయి? వన్నాట్ టూ... ఈ కేసులో క్లూ దొరికిందయ్యా. పద' అంటూ బయటకు దారి తీశాడు. అతన్ని అనుసరించారు మిగతా సిబ్బంది.

* * *

డిసెంబర్ 3 సాయంత్రం పోలీసులు సువర్ణమ్మ ఇంటికి వచ్చారు.

ముగ్గురు అన్నదమ్ములతో మాట్లాడారు.

పెద్దకోడలు సుజాతను పిలిచాడు సీఐ.

'సువర్ణమ్మతో పాటు మీరొక్కరే ఈ ఇంట్లో ఉంటున్నారు కదా. అందరికంటే మీకే బాగా తెలియాలి. ఆ రోజు ఏం జరిగింది?' అన్నాడు.

'రోజులాగే అత్తయ్యకు భోజనం పెట్టి, నేను తిని పడుకోవడానికి నా రూమ్‌కి వెళ్లిపోయాను. ఉదయం 6 గంటలకే ఆవిడ నిద్రలేస్తారు. ఆ రోజు ఏడు అయినా లేవలేదు. నేనే కాఫీ తీసుకెళ్లి లేపాను. కానీ అప్పటికే ఆవిడ చనిపోయింది. నాకేం చేయాలో అర్థం కాలేదు. మా నాన్నకు ఫోన్ చేసి విషయం చెప్పాను. గతంలో ఆమెకు ఓసారి గుండెపోటు వచ్చింది. ఆ రోజు నిద్రలోనే గుండెపోటు వచ్చి ఉంటుంది' అంది సుజాత.

మరిన్ని వివరాలు అడిగి వెళ్లిపోయారు పోలీసులు.

* * *

సుజాత ఫోన్ నెంబర్ తెలుసుకొని ఆమె కాల్ డేటాను తీయించారు పోలీసులు.

ఒక ఫోన్ నెంబర్‌తో ఏడాది నుంచి తరచూ మాట్లాడినట్టు రికార్డ్ అయి ఉంది. సువర్ణమ్మ చనిపోవడానికి కొన్ని రోజుల ముందు గంటల తరబడి మాట్లాడినట్టు రికార్డ్‌లో ఉంది. ఆ నెంబర్ ఎవరిదో వెరిఫై చేయిస్తే నరేష్ అనే వ్యక్తిదని తెలిసింది.

2012అక్టోబర్ 12న అర్ధరాత్రి నరేష్, సుజాత సెల్‌లు ఒకే సెల్ టవర్ పరిధిలో ఉండటంతో పోలీసులకు మరింత అనుమానం కలిగింది. సువర్ణమ్మ చనిపోయిన రోజున ఇద్దరి కాల్ లిస్టులను పరిశీలించగా ఆ సమయంలో ఇద్దరూ ఒకే ఇంట్లో ఉన్నట్లుగా వెల్లడయ్యింది.

* * *

సుజాతను ఎన్నిసార్లు అడిగినా తన సమాధానం ఒక్కటే .. 'నాకేం తెలియదు' అని.

కానీ పోలీసుల నిఘా మాత్రం సుజాతను నీడలా వెంటాడింది.

డిసెంబర్ 4న ఉదయం సుజాత, నరేష్ ఇద్దరూ వరంగల్ రైల్వే స్టేషన్ చేరుకున్నారు ముందే అనుకున్న ప్లాన్ ప్రకారం.

ఇది గమనించిన పోలీసులు రైల్వేస్టేషన్‌లోనే ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

ఇద్దరినీ విచారించడం మొదలుపెట్టడంతోనే తామే సువర్ణమ్మను హత్య చేశామని ఒప్పుకున్నారు.

నిజాలను బైట పెట్టారు. కుటుంబసభ్యులంతా మౌనంగా తలదించుకున్నారు.

* * *

సుజాత భర్త నాలుగేళ్ల క్రితం తమ్ముడితో కలిసి విదేశాలకు వెళ్లాడు. అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు.

సుజాత కూడ కొన్నాళ్లు అక్కడే ఉంది. ఏడాది క్రితం పండక్కి అందరూ వచ్చారు. ఆ సమయంలో సువర్ణమ్మకు ఆరోగ్యం బాగుండకపోవడంతో సుజాతను అమ్మకు తోడుగా ఉండమన్నాడు భర్త.

దీంతో సుజాత ఏడాదిగా ఇక్కడే ఉంటోంది.

ఈ సమయంలోనే సుజాతకు నరేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది.

సువర్ణమ్మ ఉద్యోగానికి వెళ్లిపోవడంతో సుజాత ఒక్కర్తే ఇంట్లో ఉండేది.

ఓసారి ఇంట్లో సుజాతతో నరేష్ ఉండటం చూసి సువర్ణమ్మ కోడలిని హెచ్చరించింది. కొడుకుతో చెబుతానని తల్లిదండ్రిని పిలిపించి నిలదీస్తానని మందలించింది.

అత్త అడ్డుతొలగిపోతే తమ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుందనుకుంది సుజాత.

ఇద్దరూ సువర్ణమ్మను ఎవరికీ అనుమానం కలగకుండా హత్య చేయాలని ప్లాన్ చేశారు.

దీనికి నరేష్ ఫ్రెండ్స్ కిరణ్, క్రాంతిలు కూడా తోడయ్యారు.

అక్టోబర్ 12 అర్ధరాత్రి.

సువర్ణమ్మ గాఢ నిద్రలో ఉంది. ఆమె ముఖంపై దిండు పెట్టి, నలుగురూ ఊపిరి ఆడకుండా చేసి చంపివేశారు. ఏటీఎమ్ కార్డులను పిన్‌నెంబర్‌తో సహా నరేష్‌కి ఇచ్చింది సుజాత.

ఏటీఎంలలో డబ్బులను డ్రా చేసిన నరేష్ ఆ డబ్బుతో ఫ్రెండ్స్‌తో కలిసి జల్సాలు చేశాడు.

* * *

డిసెంబర్ 5న ఈ నలుగురిని రిమాండ్‌కు తరలించారు పోలీసులు.

– గజవెల్లి షణ్ముఖరాజు,
వరంగల్ రూరల్ స్టాఫ్ రిపోర్టర్

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం
2-1-2019





■ చిత్తూరు జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం తుమ్మరకుంట పంచాయతీ నావాబ్ కోట గ్రామానికి చెందిన గంగులప్పకు మూడెకరాల పొలం ఉంది. టమాటా సాగు చేశాడు. దిగుబడి ఉన్నా ధర లేదు. దీంతో చేసిన అప్పు తీరలేదు. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. పెట్టుబడుల కోసం చేసిన అప్పు రూ.1.10 లక్షలయింది. అప్పు ఇచ్చిన ప్రైవేటు వ్యక్తులు ఒత్తిడి చేయడంతో 2017 ఆగస్టు 5న పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



■ విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన లోవరాజు వరి పండిస్తాడు. గత ఖరీఫ్‌లో పండిన పంటను అమ్ముకోవడానికి పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. పంట చేతికి వచ్చేంత వరకు రూ.1300 పలికిన వడ్ల బస్తా పంట చేతికి వచ్చాక రూ.1100కు పడిపోయింది. దళారుల మాయాజాలంలో చిక్కిన రైతులు చేసేది లేక అయిన కాడికి అమ్ముకుని వడ్డీకి తెచ్చిన అప్పులు తీర్చుకోవాల్సివచ్చింది. ఫలితంగా బస్తాకు సగటున రూ.200 నష్టపోవాల్సి వచ్చింది. క్వింటాల్ వరికి ప్రకటించిన మద్దతు ధర రూ.1580 అయితే రైతుకు దక్కింది మాత్రం రూ.1100 కావడం గమనార్హం. రాష్ట్రంలోని రైతులందరిదీ ఇదే దుస్థితి. ఒక్కో రైతుది ఒక్కో దీనగాథ. పంట అమ్ముకోలేక కొందరు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినా పరిహారం రాక మరికొందరు.. పాలకుల మాయ మాటలు నమ్మి ఇంకొందరు అప్పులపాలయ్యారు. ఆ అప్పులు ఎలా తీర్చాలో తెలియక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

రైతుల కష్టాలన్నింటినీ కళ్లారా చూశారు ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. తిరిగి వైఎస్సార్ స్వర్ణ యుగాన్ని తెచ్చేందుకు కంకణం కట్టుకున్నారు. 'రైతు కంట కన్నీరు పెడితే దేశానికే అరిష్టం' అని వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో.. ఆయన కంటే ఒకడుగు ముందుకేసి 'వైఎస్సార్ రైతు భరోసా' అనే రత్నాన్ని (పథకాన్ని) ప్రకటించారు.

మోడుబారిన బతుకుల్లో చిగురించిన ఆశలు

ఎటుచూసినా నెర్రెలిచ్చిన నేలలు.. వరస కరవులు.. రాష్ట్రంలో సగానికి పైగా మండలాలు నిరంతరం కరవులోనే.. పసిబిడ్డలు తల్లిపాల కోసం ఏడుస్తున్న తీరుగా నీళ్ల కోసం రైతుల ఎదురు చూపులు.. పశువులు కబేళాలకు.. కడుపు నింపుకోవడానికి పొలాలను తెగనమ్ముకుని కూలీల అవతారమెత్తుతున్న రైతులు.. వ్యవసాయ కూలీలు పొట్ట చేత పట్టుకుని పని కోసం రాష్ట్రేతర ప్రాంతాలకు వలసలు.. ప్రతికూల పరిస్థితుల్లో ఏటికి ఎదురీది పంట పండించినా, కనీస మద్దతు ధరా దక్కని దౌర్భాగ్యపు పరిస్థితి. దళారులు ఆడింది ఆట.. పాడింది పాట.. పాలకులే దళారుల అవతారం ఎత్తిన వేళ ధరల స్థిరీకరణ కలగా మారిన దుస్థితి. రుణ మాఫీ సొమ్ము వడ్డీలకు కూడా సరిపోక, కొత్త అప్పు పుట్టక.. బ్యాంకర్ల దృష్టిలో దొంగలన్న అపవాదే మిగిలింది. సున్నా, పావలా వడ్డీ జాడ లేక.. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులే దిక్కయిన వేళ అప్పుల కుప్పలే మిగిలిన దయ నీయ పరిస్థితి.. పర్యవసానం.. పూటకో రైతు బలవన్మరణం.. నేలను గుంజుకుంటున్నోడు ఆకాశానికి ఎగబాకుతుంటే, నమ్ముకున్నోడు అదే నేలలో కలిసిపోతున్నాడు. ఈ పరిస్థితి మార్చడానికి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రకటించారు. ఎప్పటికప్పుడు అందరి సూచనలు, సలహాలతో ప్రజా రంజకముగా వాటికి మెరుగులు దిద్దారు. ఈ నవరత్నాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడటం ఖాయం అని వివిధ రంగాల నిపుణులు స్పష్టీకరిస్తున్న తరుణంలో నేటి నుంచి 'సాక్షి' వాటిని ప్రజల ముంగిటకు తీసుకువస్తోంది. ఈ ప్రయత్నంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం వివరాలు.. ఆవిర్భావానికి దారి తీసిన పరిస్థితులు..

-సాక్షి, అమరావతి

రుణాలు మాఫీ కాక రైతులు కుదేలు

అధికారంలోకి రావడానికి అడ్డమైన, అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచింది చంద్రబాబు ప్రభుత్వం. రైతుల రూ.87,612 కోట్ల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పి, తుదకు ఆ పథకం కింద ఇచ్చిన సొమ్ము వడ్డీలకు కూడా సరిపోక రైతులు డిఫాల్టర్లుగా మిగిలారు. అపరాధ వడ్డీలు కట్టాల్సిన దుస్థితిలోకి వచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వక పోవడం, పంటల బీమా సొమ్మును ఇతర పనులకు మళ్లించడం, గిట్టుబాటు ధర కల్పించక పోవడం ప్రధానంగా రైతాంగాన్ని కుంగదీసింది. మామిడి, మిర్చి, టమాటా, ఉల్లి, వరి.. పంట ఏదైనా కష్టం రైతుదైతే, లాభం మాత్రం దళారికే.

భరోసా కరువై.. బతుకు బరువై..

వాస్తవానికి రైతులు లక్ష రూపాయల లోపు పంట రుణాన్ని సకాలంలో చెల్లించగలిగితే ఎటువంటి వడ్డీ ఉండదు. ప్రభుత్వం రూ.లక్ష నుంచి రూ.3 లక్షల లోపు పంట రుణాలను పావలా వడ్డీకి ఇప్పించాలి. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆ మేరకు వడ్డీ రాయితీని బ్యాంకులకు చెల్లించక పోవడంతో సున్నా వడ్డీ, పావలా వడ్డీ పథకాలు అమలు కావడం లేదు. చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి రైతులు ధర లేక తమ పంటను రోడ్లపై పోసి నిరసన తెలపడం.. మిర్చి, కంది రైతులు రోడ్డెక్కడం చూశాం. కూలి కూడా గిట్టుబాటు కాక టమాటా రైతులు పంటను రోడ్డుపై పారబోసిపోవడమూ చూశాం. తుపాన్లప్పుడు పంట తుడిచి పెట్టుకుపోవడం కూడా చూశాం. ఈ బాధలు పడలేక రైతు ఆత్మహత్య చేసుకోని రోజంటూ లేదు.

పెట్టుబడి సొమ్ముతో రైతుకు మేలు



జగన్ తీసుకున్న నిర్ణయాలు సమర్థనీయం. పెట్టుబడి మొత్తం బాగా ఉపయోగపడుతుంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 35 లక్షల మంది (అధికారిక లెక్కల ప్రకారం 17 లక్షలు) కౌలు రైతులు ఉన్నారు. వాళ్లకూ మేలు చేకూరే ఆలోచన చేయాలి.


– రావుల వెంకయ్య, పి.జమలయ్య, ఏపీ రైతు సంఘం నేతలు

ధరల స్థిరీకరణ నిధి ఉంటేనే అండ



ఇంతవరకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు కాలేదు. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్ రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని ప్రకటించడం హర్షణీయం. ప్రతి ఏటా దీన్ని పెంచుకుంటూ పోవాలి.

– డాక్టర్ డి.నరసింహారెడ్డి, వ్యవసాయ రంగ నిపుణులు



చంద్రబాబు చెప్పిందిదీ..	చంద్రబాబు చేసిందిదీ..
■ అధికారంలోకి రాగానే వ్యవసాయ రుణాల మాఫీ చేస్తాం. (2014 టీడీపీ ఎన్నికల ప్రణాళికలో, బహిరంగ సభల్లో)	■ పదవీ కాలం ముగుస్తున్నా రుణ మాఫీ కాదు కదా.. ఈ పథకం కింద ఇచ్చిన మొత్తం రైతులు తీసుకున్న అప్పులకు సంబంధించి వడ్డీలకు కూడా సరిపోకపోగా, వారిని డిఫాల్టర్లుగా మార్చింది.
■ 9 గంటల పాటు ఉచిత విద్యుత్	■ 7 గంటలకు కోత వేసి రెండు షిఫ్టులుగా సరఫరా.. అది ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో చంద్రబాబుకే ఎరుక.
■ రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి	■ అసలు ఈ విషయాన్నే మరచిపోయారు.
■ రైతు వారీగా ఇన్సూరెన్స్	■ పంటల బీమాకే దిక్కులేదు.. ఇక రైత్వారీ ఎక్కడో?
■ చౌకధరలకు మేలు రకం విత్తనాలు	■ ప్రభుత్వం ఇచ్చే విత్తనాల కన్నా బహిరంగ మార్కెట్‌లోనే చౌక
■ ప్రతి జిల్లాలో ఒక మెగా ఫుడ్ పార్క్, ప్రతి మండలంలో ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్	■ దివిటీ పట్టుకుని వెతికినా కనిపించవు
■ రైతులకు మేలు చేసేలా పంటల బీమా	■ ప్రస్తుతం అమల్లో ఉన్నది ప్రధాన మంత్రి పంటల బీమానే.. బాబు చేసిందేమీ లేదు
■ పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు 24 గంటల్లో మరమ్మతులు	■ 24 గంటలు కాదు.. 48 గంటలైనా దిక్కులేదు)
■ స్వామినాథన్ నివేదిక ఆధారంగా కనీస మద్దతు ధరను ప్రకటిస్తాం. (ఎన్నికల ప్రణాళిక పేజీ 13)	■ గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు రోడ్డెక్కుతుంటే పోలీసులను పురమాయించి లాఠీలతో కొట్టించారు
■ ప్రత్యేక విత్తన చట్టం తెస్తాం. బీటీ పత్తి విత్తనాలను సబ్సిడీపై అందజేస్తాం.	■ ఆ చట్టం టీడీపీ చుట్టమైంది. ఇంత వరకు బయటకు రాలేదు.
■ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి రుణ సౌకర్యం కల్పిస్తాం	■ 16.5 లక్షల మందికి ఇస్తామని చెప్పారు. నాలుగున్నరేళ్లలో ఇచ్చింది 6 లక్షల మందికే. ఇందులో సగానికిపైగా గత ప్రభుత్వం ఇచ్చినవే.
■ రైతులకు కాంప్లెక్స్ ఫెర్టిలైజర్స్ సరఫరా నిమిత్తం రూ.500 కోట్లతో ప్రత్యేక నిధి	■ కనీసం ఇలాంటి ఆలోచనే చేయలేదు



ఇదీ నా భరోసా

- ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేలు సాయం. రెండవ ఏడాది నుంచి మే నెలలోనే రూ.12,500 చొప్పన నాలుగేళ్ల పాటు అందిస్తారు.
- వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల పాటు ఉచిత విద్యుత్
- ప్రతి రైతుకు వడ్డీ లేకుండా, సున్నా వడ్డీ రుణాలు
- రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తారు.
- పంట వేయడానికి ముందే గిట్టుబాటు ధర ప్రకటన. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి.
- రూ.4 వేల కోట్ల (కేంద్ర, రాష్ట్రాలు చెరిసగం భరిస్తాయి)తో ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి.
- పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి.
- తొలి ఏడాది మూతపడ్డ సహకార డెయిరీల పునరుద్ధరణ. ఆ తర్వాత వీటికి పాలు పోసిన రైతులకు లీటరుకు రూ.4 సబ్సిడీ
- అనుకోకుండా ఏ రైతు అయినా ఈ లోకాన్ని వీడిపోతే అప్పుల వాళ్లు అతని కుటుంబంపై పడి పీడించకుండా ప్రత్యేక చట్టం. రూ.5 లక్షలు ఆ కుటుంబానికి వారంలోగా అందజేసి తోడుగా ఉంటారు. ఈ రూ.5 లక్షలు ఆ కుటుంబ ఆస్తిగా పరిగణిస్తారు.
- రైతుల వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ నుంచి మినహాయింపు
- ఆక్వా రైతులకు కరెంటు చార్జీ యూనిట్ రూ.1.50కి తగ్గింపు
- ప్రతి నియోజకవర్గంలో శీతలీకరణ గిడ్డంగులు, అవసరమైన మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

(వీటన్నింటి ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.12,500 నుంచి రూ.లక్ష వరకు లబ్ధి కలిగేలా ప్రణాళిక)

“పంట నష్టపోయినా దిగులుండదు

నాపేరు గుర్రం శ్రీనివాసులు. నాకు 10 ఎకరాల భూమి ఉంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఏటా వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు. దీంతో పంట కోసం ఏటా అప్పులు చేయాల్సి వస్తోంది. మా కష్టాలు పాలకులకు పట్టలేదు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్రతో రైతుల కష్టాలు తెలుసుకుంటున్నారు. మా కష్టాలను కళ్లారా చూసి రైతు భరోసా పథకం తీసుకొస్తామని చెప్పారు. నిజంగా ఈ పథకం అద్భుతం. ప్రతి రైతుకు ఉచితంగా బోర్లు, పంట పెట్టుబడుల కోసం ఏటా రూ.12,500 మే నెలలోనే రైతు చేతికి ఇవ్వనుండటం, తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్.. ఇలా అన్ని అంశాలు ఆభినందించదగ్గవే. పంట నష్టపోయినా భయం ఉండదు. ఇంతగా రైతుల శ్రేయస్సు కోరే నాయకుడు జగనే ముఖ్యమంత్రి కావాలని మా రైతులందరం కోరుకుంటున్నాము.

-శ్రీనివాసులు, రైతు, షేక్షానిపల్లి, ఉరవకొండ నియోజకవర్గం, అనంతపురం జిల్లా.



దళారి వ్యవస్థ తగ్గుతుంది”

రైతు భరోసా పథకం చాలా బాగుంది. ఈ పథకం అమలైతే అన్నదాతలకు చాలా వరకు ఉపశమనం కలుగుతుంది. ముఖ్యంగా దళారి వ్యవస్థ తగ్గుతుంది. రైతుల వద్ద నుంచి అధికారులు గుంజే లంచాలు తగ్గుతాయి. రైతులు స్థిమితంగా ఉంటూ తమకు ఇష్టమైనప్పుడు పంటను అమ్ముకునే అవకాశం ఉంది.

-వి. వెంకటేశ్వర్లు, రైతు, మాచవరం, నర్సరావుపేట నియోజకవర్గం, గుంటూరు జిల్లా



సినిమా

ఈ ఏడాది నీకంతా సంతోషమే

క్యాన్సర్ వ్యాధి చికిత్సలో భాగంగా కీమోథెరపీ కోసం న్యూ యార్క్ వెళ్లిన సోనాలి బింద్రే ఇటీవల ముంబై చేరుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం న్యూ ఇయర్ మాత్రమే కాదు సోనాలి పుట్టినరోజు కూడా. ఆమె బర్త్‌డే వేడుకలు బంధుమిత్రుల మధ్య జరిగాయి. సునైనా ఖాన్, మలైకా అరోరాఖాన్, అర్జున్ కపూర్, సంజయ్ కపూర్, కునాల్ కపూర్, గాయత్రి ఒబెరాయ్ తదితర సినీ ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనాలి భర్త గోల్డీ బెహల్ ఓ ఎమోషనల్ పోస్ట్‌ను షేర్ చేశారు. ''జీవితంలో మీ జీవిత భాగస్వామి మీకు మంచి ఫ్రెండ్‌గా, ప్రతిబింబంగా, సపోర్ట్‌గా, స్ఫూర్తిగా ఉండాలంటారు. వాటన్నింటికంటే ఎక్కువే నువ్వు నాకు ఇచ్చావ్. 2018కి నీకు చాలా కష్టంగా గడిచిన ఏడాది. కానీ కష్టాన్ని నువ్వు ఎదుర్కొన్న తీరు నన్ను గర్వపడేలా చేస్తోంది. నన్ను నాకు మరింత పరిచయం చేశావ్. నీ సానుకూల దృక్పథమైన ఆలోచన ధోరణి ఇంకా పెరగాలి. నువ్వు నీలా ఉన్నందుకు థ్యాంక్స్. ఈ ఏడాది నీ జీవితంలో అద్భుతమైన సంతోషాలను తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. హ్యాపీ బర్త్‌డే సోనాలి'' అని పేర్కొన్నారు గోల్డీ.



● భర్త గోల్డీతో సోనాలి



● పుట్టినరోజు వేడుకలో సోనాలి బింద్రే

పాశుర ప్రభాతం 18వ రోజు

తొలి మంచు కరిగిన వేళ సుప్రభాత రాగాల నడుమ భగవంతునికి చేసే కైంకర్యం మేల్కొలుపు. భగవంతుని ఆశీస్సులే అనంత కోటి కిరణాలై లోకాన్ని జాగృతపరుస్తాయి.

“ఉన్దు మదకళిత్తనొడాదతోళ్ వలియన్
నన్దగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిరవాయ్,
వన్దెజ్గుమ్ కోళియళైత్తనగాణ్; మాదవి
ప్పన్దల్ మేల్ పలకాల్ కుయిలినజ్గల్ కూలినగాణ్;
శెన్దామరైక్కైయాల్ శీరార్‌వళైయొలిప్ప
వన్దుతిరవాయ్ మణిళన్దు ఏలో రెమ్బావాయ్”

భావం: శ్రీకృష్ణ భగవానుడు వేయి ఏనుగుల బలం కలవాడై, యుద్ధ భూమిలో శత్రువులను చూసి జంకని భుజబలం కలవాడై శోభిల్లిన మహావీరుడు. కానీ భక్తి అనే సాధనకు సర్వదా కట్టుబడి వుండే భక్తజన సముద్ధరుడు. శ్రీకృష్ణుని పతిగా పొందిన అదృష్టవంతురాలా! నీలాదేవి! తలుపులు తెరువుము. అనేక గుణాలతో అలరారే శ్రీకృష్ణుని కీర్తించడానికై విచ్చేశాము. నీవైనా నీ కంకణ ధ్వనులతో ఆ పరంధాముని మేల్కొలుపు తల్లీ! అంటూ గోపికలు విన్నవిస్తున్నారు.




ముగ్గు-ముచ్చట




జి.మాధవి
చొదిమెళ్ల
ప.గో.జిల్లా

22 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు



డి.శివకుమారి
పెద్దాపురం
తూ.గో.జిల్లా

21 చుక్కలు
1 వచ్చే వరకు
సరి చుక్క



ఇమ్మడి కాశమ్మ
మార్కాపురం
ప్రకాశం జిల్లా

21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చే వరకు

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జి జీఎంగా కుల్‌శ్రేష్ట



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జి జనరల్ మేనేజర్‌గా ఆర్.కె.కుల్‌శ్రేష్ట మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 1979లో ఐఐటీ పూర్తిచేసిన ఆయన, 1980లో ఇండియన్ రైల్వే సర్వీస్‌కు ఎంపికై వివిధ విభాగాల్లో పనిచేశారు.

జన్మభూమిలో అధికారులను నిలదీయండి!

రైతులకు ఏపీరైతు సంఘం పిలుపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో రైతులు తమ సమస్యలపై అధికారులను నిలదీయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపిచ్చింది. ఈనెల 5వ తేదీన ప్రత్యేకంగా వ్యవసాయ రంగంపై గ్రామసభ జరుగనుందని సంఘం అధ్యక్షుడు వై.కేశవరావు, కార్యదర్శి పి.పెద్దిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామసభలో కరవు, రుణమాఫీ, మార్కెట్ సమస్యలు, కరవు తుపాన్లు వంటి సమస్యల పరిష్కారానికి రైతాంగం పోరాడాలని పిలుపునిచ్చారు.

'ఎన్నికల ప్రచారం నేటి నుంచే మొదలు'

నూతన సంవత్సర వేడుకల సభలో జనసేన పార్టీ అధినేత పవన్

సాక్షి, అమరావతి: మూడు, నాలుగు నెలల్లో జరగబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు మంగళవారం నుంచే విజయవాడ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించినట్టు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అభిమానులు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన కొద్దిసేపు ప్రసంగించారు. '2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఇవాళ్టి నుంచే శ్రీకారం చుడుతున్నాం. అందరం కష్టపడి జనసేన పార్టీని గెలిపించుకుందాం.' అని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగా పార్టీ నాయకులను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు పవన్ బుధవారం నుంచి జిల్లాల వారీగా భేటీ కానున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిధుల విడుదలపై సంతకం

సాక్షి, అమరావతి: నూతన సంవత్సరం తొలి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఫైలుపై సంతకం చేసినట్లు ఆయన కార్యాలయ మీడియా విభాగం తెలిపింది. సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదల కావాల్సిన రూ.34,50,59,383 రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన ఫైలుపై చంద్రబాబు సంతకం చేసినట్లు పేర్కొంది. 2014 నుంచి ఇప్పటివరకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదల చేసిన సొమ్ము మొత్తం రూ.1,249.56 కోట్లని వివరించింది. కాగా గత సంవత్సరం నవంబర్ 29న గుజరాత్ దగ్గర సముద్రంలో వేటకు వెళ్లి పాకిస్తాన్ చెరలో బందీగా మారిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన మత్స్యకారుల విడుదల కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు.

విదేశీ జంటకు సున్నిపెంటలో వివాహం



శ్రీశైలం ప్రాజెక్ట్: నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం దక్షిణాఫ్రికాకు చెందిన జంట కర్నూలు జిల్లా సున్నిపెంటలోని న్యూ యెరుషలేము చర్చిలో వివాహం చేసుకున్నారు. ఆలీవెర్ ఆంధ్రీ పి స్టీఫెన్స్, వెయిస్ జీ జోహన్న ఉంగరాలు మార్చుకుని ఒక్కటయ్యారు. వీరు ఆంధ్రా సరిహద్దు ప్రాంతం తెలంగాణ రాష్ట్రం దోమలపెంటలో ఓ నిర్మాణ సంస్థలో ఇంజినీరింగ్ విధులు నిర్వర్తిస్తున్నారు.

డయాబెటిక్ విద్యార్థులు పండ్లు తెచ్చుకోవచ్చు

- ఈ నెల 8 నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు
- నిబంధనలను విడుదల చేసిన ఎన్‌టీఏ

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఐఐటీ, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాల కోసం ఈ నెల 8 నుంచి 12 వరకు నిర్వహించనున్న జేఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పాటించాల్సిన నిబంధనలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. పరీక్ష హాల్లోకి విద్యార్థులు నిర్ణీత సమయంలో చేరుకోవాలని సూచించింది. హాల్‌టికెట్‌లో పేర్కొన్న నిబంధనలన్నింటినీ విద్యార్థులు పాటించాలని పేర్కొంది. ఆన్‌లైన్ పరీక్షలు ఉన్న తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మొదటి షిఫ్ట్ పరీక్ష, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు రెండో షిఫ్ట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొంది. విద్యార్థులను రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. ఉదయం పరీక్షకు 8:45 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 1:45 నుంచి 2 గంటల వరకు మాత్రమే విద్యార్థులను పరీక్ష హాలు లోకి అనుమతిస్తారని తెలిపింది.

హాల్‌టికెట్, ఫొటో, ఐడీ ప్రూఫ్.. విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఐడీ ప్రూఫ్ వెంట తెచ్చుకోవాలని ఎన్‌టీఏ పేర్కొంది. పరీక్ష హాల్లోనే విద్యార్థులకు పెన్సిల్, పెన్ను, రఫ్ వర్క్ పేపరు అందిస్తారని వాటిని తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడించింది. ముఖ్యంగా డయాబెటిక్ విద్యార్థులు షుగర్ టాబ్లెట్లు, పండ్లు, ట్రాన్స్‌ఫరెంట్ వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవచ్చని వివరించింది.

పల్నాడు ప్రాంతంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు / మేత, నీరు లేక భారంగా మారిన పశుపోషణ / డొక్కలు ఎండుతున్న ఆవులు, ఎద్దులు / పోషించలేక కబేళాలకు అమ్ముకుంటున్న రైతులు / పశుగ్రాసం సరఫరా చేయడంలో సర్కారు విఫలం



పశు సంపదపై కరువు కాటు



గుంటూరు జిల్లా గురజాల పశువుల సంతలోని దృశ్యం



మేత లేక డొక్కలు ఎండిన కాడెద్దులు

సాక్షి, గుంటూరు: నాగార్జున సాగర్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పల్లెలు కరువు ధాటికి ఎడారులను తలపిస్తున్నాయి. గడ్డి పోచ కరువై గ్రామాల్లోని పశు సంపద కబేళాలకు తరలిపోతోంది. ప్రకృతి ప్రకోపం, ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రజలకు వ్యవసాయం తర్వాత కాస్తోకూస్తో ఆదాయాన్ని సమకూర్చే పాడి పశువులకు మేత, నీరు దొరకడం లేదు. వాటిని పోషించలేక కబేళాలకు తెగనమ్ముకుంటున్నారు. పల్నాడులోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, వినుకొండ, బొల్లాపల్లి, శావల్యాపురం, నూజెండ్ల తదితర ప్రాంతాల్లో వర్షాల జాడ లేక పశుగ్రాసం దొరకడం లేదు. పల్నాడు ప్రాంతంలో ఎక్కడ చూసినా డొక్కలు ఎండిన పశువులే కనిపిస్తున్నాయి.

ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.20,000

ఖరీఫ్, రబీ సీజన్లలో వరుణుడు ముఖం చాటేశాడు. నాగార్జున సాగర్ నిండా నీళ్లున్నా ప్రభుత్వం సాగుకు నీరందించడం లేదు. ఈ నేపథ్యంలో పల్నాడులో పశుగ్రాసానికి డిమాండ్ భారీగా పెరిగింది. మాచర్ల, గురజాల, వినుకొండ నియోజకవర్గాల రైతులు తెలంగాణ నుంచి ఎండు గడ్డి కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి ధర రూ.20,000కు పైగా పలుకుతోంది. పశువులను పోషించడం భారంగా మారిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్నాడులో వర్షాలు లేకపోవడంతో పచ్చగడ్డి ఉత్పత్తి తగ్గింది.


కబేళాలకు తరలుతున్న పాడి పశువులు

దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో పశువులకు పిడికెడు మేత కూడా పెట్టలేక వాటిని కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులోని కబేళాలకు తరలిస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలోనే పల్నాడు నుంచి లక్షకు పైగా మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు, ఎద్దులను కబేళాలకు తరలినట్లు తెలుస్తోంది. రూ.40 వేల నుంచి 60 వేలు ఖరీదు చేసే గేదె ధర ప్రస్తుతం రూ.25 వేల నుంచి రూ.30 వేలు కూడా పలకడం లేదని రైతులు బోరుమంటున్నారు. ఎద్దుల ధరలు కూడా అమాంతం పడిపోయాయని చెబుతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

కరువు కాలంలో పశుగ్రాసం కొరత తీర్చడంతోపాటు నాణ్యమైన మేతను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చగడ్డిని కిలో రూ.2కే సరఫరా చేసే పథకానికి గతేడాది ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టింది. సైలేజీ గడ్డి పేరుతో పచ్చిమేతను బేళ్లలో మగ్గబెట్టి రైతులకు కావాల్సిన సమయంలో అందిస్తామని ప్రభుత్వం అప్పట్లో గొప్పలు చెప్పింది. అయితే, పల్నాడులో ఒక్కరికై నా ఈ గడ్డిని సరఫరా చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

పశుపోషణ భారంగా మారింది



''గత ఏడాది రూ.88 వేలతో కాడెద్దులు కొనుగోలు చేశా. వర్షాలు పడకపోవడంతో చేతికొచ్చిన పంట నాశనమైపోయింది. పశుగ్రాసం కూడా దక్కలేదు. దీంతో ఎద్దుల పోషణ భారంగా మారింది. ఎండు గడ్డి కొనాలంటే తెలంగాణాకు వెళ్లాలి. ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.20 వేలు పలుకుతోంది. ఇక చేసేది లేక ఎద్దులను రూ.60 వేలకు అమ్మేశా. పశువులను తక్కువ ధరకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోయా''

– లక్ష్మానాయక్, రెంటాల, రెంటచింతల మండలం, గుంటూరు జిల్లా

పశుగ్రాసం కొనలేకే..



''గత ఏడాది రూ.70 వేలు పెట్టి గేదెను కొనుగోలు చేశా. కరువు పరిస్థితుల నేపథ్యంలో పచ్చగడ్డి ఎక్కడా లభించడం లేదు. ఎండు గడ్డి ధరలు మండిపోతున్నాయి. గేదెను పోషించుకోలేక నష్టానికే విక్రయించాల్సి వచ్చింది. పశుగ్రాసం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జీవనాధారమైన గేదెను అమ్ముకున్నాను. కూలీ పనుల కోసం ఊరు వదలాల్సిన పరిస్థితి నెలకొంది''

– ఎం.సుబ్బారావు, దాచేపల్లి, గుంటూరు జిల్లా

ప్రజల భరోసా యాత్రగా సాగుతోంది

- వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర రాజకీయ మార్పులను తెచ్చింది
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ



సాక్షి, హైదరాబాద్: ప్రజల కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదలు పెట్టిన ప్రజా సంకల్పయాత్ర భరోసా యాత్రగా సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ చేపట్టిన యాత్ర రాష్ట్రంలో అనేక రాజకీయ మార్పులను తీసుకొచ్చిందన్నారు. యాత్ర ప్రారంభించిన నాటికి రాష్ట్రంలో నరేంద్రమోదీ, పవన్, చంద్రబాబు కూటమిగా ఉన్నారన్నారు. ప్రజలు చంద్రబాబు, నరేంద్రమోదీ, పవనకల్యాణ్‌లను విడగొట్టారని తెలిపారు. ఇదంతా ప్రజా సంకల్పయాత్ర వల్లనే జరిగిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొచ్చే వరకు జగన్ విశ్రమించడని ప్రజలు తెలుసుకున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, వారిలో కొందర్ని మంత్రులుగా చేయడం అన్నింటినీ ప్రజలు గమనించారన్నారు. చంద్రబాబును ప్రజలు పూర్తిగా తిరస్కరించారనే విషయాన్ని తెలంగాణలో నిరూపించారని చెప్పారు. వైఎస్ జగన్‌పై పన్నిన కుట్రలను పటాపంచలు చేస్తూ ప్రజాసంకల్ప యాత్ర సాగుతోందన్నారు. ప్రజల మనసులను గెలిచిన నేతగా ఆయన నిలిచిపోయారన్నారు. చంద్రబాబు చరిత్ర హీనుడుగా మిగిలిపోయారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని మాట్లాడనీయని పరిస్థితుల్లో ప్రతిపక్ష నేత ప్రజాక్షేత్రంలోకి వెళ్లారని గుర్తు చేశారు. బీజేపీతో అంటకాగి నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు దెబ్బతీశారని, ఇక ఆయన్ను నమ్మడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఇవన్నీ తెలిసి చేసేది లేక శ్వేతపత్రాలు, శిలాఫలకాలంటూ చంద్రబాబు బయల్దేరారని ఆరోపించారు. జగన్ యాత్ర వల్ల ప్రత్యేక హోదా నినాదం చంద్రబాబు కూడా చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి నెలకొందన్నారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు చేతకాక భౌతికంగా లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. నా జోలికి సీబీఐ, ఈడీ రావడానికి వీల్లేదంటూ జీవోలు తీసుకువచ్చారంటే చంద్రబాబుకు ఎంతలా భయం పుట్టిందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఇక చంద్రబాబును నమ్మలేం.. జగన్‌ను సీఎంగా చేసుకుంటామని ప్రజలు ఆయన చేతిలో చేయి వేసి చెబుతున్నారని వాసిరెడ్డి పద్మ తెలిపారు.

ఒక్కరోజే రూ.120 కోట్ల మద్యం తాగేశారు

సాక్షి, అమరావతి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 31వ తేదీ ఒక్క రోజే రాష్ట్రంలో రూ.120 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సాధారణంగా మద్యం షాపుల్లో రాత్రి పది గంటల వరకు, బార్లలో రాత్రి 11 గంటల వరకు అమ్మకాలకు అనుమతి ఉంటుంది. అయితే డిసెంబరు 31వ తేదీన మద్యం షాపులు, బార్లలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మద్యం ప్రియుల డిమాండ్ మేరకు మద్యం షాపుల యజమానులు జనవరి 1వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటల వరకు అమ్మకాలు జరిపారు. మద్యం అమ్మకాలు అంచనాలకు మించి సాగుతుండడంతో జనవరి 1వ తేదీన కూడా అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చింది.

బాధ్యతలు స్వీకరించిన వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర రైల్వే బోర్డు చైర్మన్‌గా పదోన్నతి పొందిన దక్షిణ మధ్య రైల్వే మాజీ జీఎం వినోద్‌కుమార్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం ఢిల్లీలోని కార్యాలయానికి చేరుకుని వినోద్‌కుమార్ విధులు నిర్వర్తించారు.

గాండ్రిస్తున్న చలి పులి

- మరింత క్షీణించిన ఉష్ణోగ్రతలు
- నేడూ కొనసాగనున్న అతిశీతల గాలులు
- లంబసింగిలో 0.5.. రెంటచింతలలో 10 డిగ్రీలు
- రాయలసీమకూ పాకిన చలి

ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీలు)
జంగమహేశ్వరపురం	10
విశాఖపట్నం	12
అమరావతి	12
ఆరోగ్యవరం	12
కళింగపట్నం	12
బాపట్ల	12
నందిగామ	13
విజయవాడ	14
నంద్యాల	14
కర్నూలు	14
అనంతపురం	14
తిరుపతి	15
కడప	15
తుని	15
నర్సాపూర్	16
కావలి	16
కాకినాడ	16
మచిలీపట్నం	17
అగళి (అనంతపురం)	7.9 డిగ్రీలు
తెలంగాణ	
ఆదిలాబాద్	5
హైదరాబాద్	9

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రాన్ని చలి గజగజ వణికిస్తోంది. రోజురోజుకు తగ్గకపోగా మరింత తీవ్రతరమవుతోంది. ఇప్పటికే మూడు రోజుల నుంచి సాధారణం కంటే 3–5 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. మంగళవారం పరిస్థితి మరింత క్షీణించింది. సోమవారంతో పోల్చుకుంటే రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 7 డిగ్రీలు పడిపోయాయి. విశాఖ జిల్లాలో చలి తీవ్రత మరింతగా కనిపిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం విశాఖ నగరంలో 12.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డు కాగా మంగళవారం ఉదయానికి మరో .2 డిగ్రీలు తగ్గి 12 డిగ్రీలకు పడిపోయింది. ఇది సాధారణంకంటే 6 డిగ్రీలు తక్కువ. ఇక విశాఖ ఏజెన్సీలోనూ అతిశీతల ప్రభావం కొనసాగుతోంది. ప్రముఖ పర్యాటక ప్రదేశం లంబసింగిలో .5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. చింతపల్లిలో 2.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మైదాన ప్రాంతాల్లోకెల్లా అత్యల్పంగా గుంటూరు జిల్లా జంగమహేశ్వరపురం (రెంటచింతల)లో 10 (–7), అమరావతి, బాపట్ల, కళింగపట్నం (–5) ఆరోగ్యవరం (–3)లో 12, నందిగామ 13(–3), విజయవాడ 14 (–4), అనంతపురం, కర్నూలు, నంద్యాల 14 (–3), తుని, తిరుపతిల్లో 15 (–4) చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోపక్క పగటి ఉష్ణోగ్రతలు కూడా ప్రస్తుతం సాధారణంకన్నా రెండు మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి.

సీమలోనూ..

ఇన్నాళ్లూ కోస్తాంధ్రపైనే చలి తీవ్రత ఎక్కువగా ఉంటుండగా ఇప్పుడు రాయలసీమలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండడంతో అక్కడ కూడా చలి ప్రభావం అధికమవుతోంది. ఇదే పరిస్థితి బుధవారం కూడా కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. గురువారం నుంచి రాత్రి ఉష్ణోగ్రతల్లో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తుందని, విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు మంగళవారం రాత్రి 'సాక్షి'కి చెప్పారు. గురువారం తర్వాత నుంచి అతిశీతల గాలుల ప్రభావం ఒకింత తగ్గినా చలి కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణలో..

సాక్షి, హైదరాబాద్/ కోహీర్ (జహీరాబాద్): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల వరకు చలి తీవ్రత తగ్గకపోవడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు.

చలి పంజాకు ముగ్గురి మృతి

కోటవురట్ల (పాయకరావుపేట): విశాఖ జిల్లా కోటవురట్ల మండలంలో సోమవారం రాత్రి వీచిన చలి గాలులకు తాళలేక ముగ్గురు వృద్ధులు మృతి చెందారు. కోటవురట్ల రజకవీధికి చెందిన టేకు అచ్చన్న (65), లింగాపురం జంక్షన్‌లో కన్నూరి రామయ్యమ్మ (70), రాట్నాలపాలేనికి చెందిన వి.రాములమ్మ (68) సోమవారం అర్ధరాత్రి తీవ్ర చలిగాలికి అస్వస్థకు గురై తెల్లవారుజాము ప్రాంతంలో మృతి చెందారు.

సర్కార్‌కు 'బోద'పడని బాధ!

- రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 29,016 మంది బాధితులు
- ఒక్క తూర్పుగోదావరిలోనే 15,541 మంది
- రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి పైగా ఉంటారని అంచనా
- బాధితుల్లో 60 శాతం మంది మహిళలు
- చేనేత కార్మికులే ఎక్కువ బాధితులు
- చేనేత గుంతల్లో నీరు నిల్వలతోనే వీరికి దోమకాటు
- రాష్ట్రంలో ప్రభుత్వపరంగా నియంత్రణ చర్యలు శూన్యం



బోదకు గురైన కాలుని శుభ్రపరిచే విధానంపై అవగాహన



గుంటూరు జిల్లా రేపల్లె నేతాజీనగర్ పాఠశాలలో మూతపడ్డ ఫైలేరియా కేంద్రం



దాచేపల్లి మండలం తంగెడలో వ్యాధి గ్రస్తుడు

'బోద వ్యాధి బారినపడి మంచానికే పరిమితమయ్యా. పూటగడవడమే కష్టంగా ఉంది. రెండేళ్ల క్రితం వరకు ప్రభుత్వమిచ్చే ఉచిత మందులు వాడుతూ వ్యాధి పెరగకుండా చూసుకున్నా. అయితే, రెండేళ్లుగా రేపల్లె ఫైలేరియా కేంద్రంలో మందులను నిలిపివేశారు. బయట కొందామంటే నెలకు రూ. 2వేలకు పైగా ఖర్చు. ఆర్థిక స్థోమతలేక మందులు ఆపేశా. దీంతో పది రోజులకోసారి జ్వరం వస్తోంది. కాలు విపరీతంగా నొప్పి పుడుతోంది. వికలాంగులకు ఇచ్చే విధంగా మాకూ పింఛను ఇస్తానని మాట ఇచ్చిన ప్రభుత్వం మాట తప్పింది'.. గుంటూరు జిల్లా రేపల్లె నేతాజీనగర్‌కు చెందిన దాసరి రామారావు వేదన ఇది.

.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా బోద వ్యాధి బారినపడి మంచాల్లోనే కదల్లేని స్థితిలో అవస్థపడుతున్న అభాగ్యులు వేలల్లో ఉన్నారు.

సాక్షి, అమరావతి బ్యూరో/గుంటూరు/లబ్బీపేట (విజయవాడ తూర్పు) : రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో బోద వ్యాధి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇటీవల ఎనిమిది జిల్లాల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న మండలాలను ఎంపికచేసి ప్రభుత్వం సర్వే చేయగా 29,016 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించింది. వారిలో ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 15,541 మంది రోగులు ఉండటం గమనార్హం. అలాగే, రాష్ట్రం మొత్తంమీద 50వేలకు పైగా బోద వ్యాధిగ్రస్తులు ఉన్నారని అంచనా. ఒకప్పుడు మున్సిపాలిటీలు, నగరాల్లోనే ఈ కేసులు ఎక్కువగా నమోదయ్యేవి. కానీ, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి. మరోవైపు.. రాష్ట్రంలో ఈ వ్యాధిగ్రస్తులు ఏటా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరు జిల్లా తెనాలి, దాచేపల్లి, రేపల్లె, నరసరావుపేట, గుంటూరులతో పాటు కృష్ణాజిల్లాలోని పెడన, నూజివీడు, జగ్గయ్యపేట, అవనిగడ్డ, వత్సవాయి, విజయవాడ, తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో బాధితులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

వ్యాధి నియంత్రణకు చర్యలు శూన్యం

బాధితులకు చికిత్సతోపాటు, ముందుగా వ్యాధిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇది ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉన్నా అవేమీ చేయడం లేదు. ఫైలేరియా.. నియంత్రణే తప్ప, నివారణలేని వ్యాధి కావడంతో 30 ఏళ్ల క్రితం వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం ఫైలేరియా కేంద్రాలను ఏర్పాటుచేసింది. ప్రతి కేంద్రంలో సీనియర్ ఎంటమాలజిస్ట్, ఇన్ స్పెక్ట్ కలెక్టర్, నలుగురు సీనియర్ ఫీల్డ్ వర్కర్లు, పది మంది ఫీల్డ్ వర్కర్లను ఏర్పాటుచేసింది. నిత్యం యాంటీలార్వా పిచికారితోపాటు, వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఈ కేంద్రాల బాధ్యత. ప్రస్తుతం ఈ కేంద్రాలన్నీ నామమాత్రంగా పనిచేస్తున్నాయి. మందుల పంపిణీ, పారిశుధ్య పనులు చేయడంలేదు. దీంతో వ్యాధి ఎక్కడ సోకుతుందోనని గ్రామాల్లోని ప్రజలు భయాందోళనల్లో ఉన్నారు. కాగా, రాష్ట్రంలో ఒక్క విజయనగరం మినహా ఇతర జిల్లాల్లో మైక్రో ఫైలేరియా కేసులు 0.2 శాతం కంటే తక్కువగా ఉండడంతో ఏటా నవంబరు 11న నిర్వహించే జాతీయ ఫైలేరియా దినోత్సవాన్ని రద్దు చేశారు.

పింఛన్లు ఇచ్చి ఆదుకోని ప్రభుత్వం

ఫైలేరియా వ్యాధిగ్రస్తులు వికలాంగుల మాదిరిగా మంచాలకే పరిమితం అవుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారికి వికలాంగుల సర్టిఫికెట్లు ఇచ్చి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పింఛన్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటికీ అది సాకారం కాలేదు.

పెళ్లిళ్లకూ ఇబ్బందికరమే

ఫైలేరియా ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, గ్రామాల్లోని వారిని పెళ్లిళ్లు చేసుకోవడానికి ఇతర ప్రాంతాల వారు ఆసక్తి చూపించడంలేదు. పిల్లలను ఇవ్వడానికి, తెచ్చుకోవడానికి ఇష్టపడటంలేదు. దీంతో వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడానికి చర్యలు చేపట్టాలని స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

బాధితుల్లో 60 శాతం మంది మహిళలు

ఇదిలా ఉంటే.. వ్యాధి బాధితుల్లో 60 శాతం మంది మహిళలుంటున్నారు. ఇరుకైన ఇళ్లల్లో, దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉండే వారికి ఈ వ్యాధి ఎక్కువగా సోకుతున్నట్లు అధ్యయనాల్లో తేలింది. మహిళలు ఎక్కువగా ఇంటి వద్దే ఉంటారని, దీంతో వీరు దోమకాటుకు గురై బాధితులుగా మారుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. చేనేత మగ్గం గుంతల్లో నీటి నిల్వలవల్ల చేనేత కార్మికులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

క్యూలెక్స్ దోమల ద్వారా వ్యాప్తి

ఉకరేరియా బాంక్రాఫ్టి అనే మైక్రో ఫైలేరియా పరాన్నజీవి కారణంగా ఈ బోద వ్యాధి సోకుతుంది. ఈ జీవులు క్యూలెక్స్ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతాయి. ఈ జీవుల క్రిములు నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. దీనివల్ల ప్రధానంగా కాళ్లు, చేతులు, మర్మావయవాల వాపు చెందడం ప్రారంభమవుతుంది. క్రిములు శరీరంలోకి ప్రవేశించిన ఏడాది వరకు లక్షణాలు బహిర్గతం కావు. దీంతో ప్రాథమిక దశలో ఈ వ్యాధి వెలుగుచూడకపోవడంతో బాధితులకు ఒక్కసారిగా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



జిల్లా పేరు	సర్వే చేసిన మండలాలు	నమోదైన కేసులు
నెల్లూరు	24	2,676
ప్రకాశం	7	609
గుంటూరు	10	2,393
కృష్ణా	11	1,844
విశాఖపట్నం	13	2,017
విజయనగరం	12	2,633
శ్రీకాకుళం	8	1,303
తూర్పుగోదావరి	...	15,541
మొత్తం కేసులు		29,016

అప్రమత్తతతోనే నియంత్రణ



బోద వ్యాధిని అప్రమత్తతతోనే నియంత్రించడం సాధ్యపడుతుంది. ప్రధానంగా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలి, జ్వరం, వాంతులు, మర్మావయవాల వద్ద వాపు, దురద ప్రాథమిక లక్షణాలుగా గుర్తించాలి. వెంటనే మందులు వాడితే నియంత్రించొచ్చు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో రక్తనమూనాలను సేకరించడం ద్వారా ఈ వ్యాధి నిర్ధారణ అవుతుంది. వ్యాధికారక దోమలు గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉంటాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎక్కువగా ఫైలేరియా, హైడ్రోసిల్‌కు గురవుతుంటారు.

– డాక్టర్ పి నాంచారయ్య, జనరల్ సర్జరీ ప్రొఫెసర్, సిద్దార్థ వైద్య కళాశాల, విజయవాడ

బాధితులకు పింఛన్ ఇవ్వాలి



బోద వ్యాధి బాధితులను వికలాంగులుగా గుర్తించి ఫించన్లు మంజూరు చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం జీవో ఇచ్చినా, అమలుకావడం లేదు. దీంతో బాధితులు పనులు చేసుకోలేక, ఆసరా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– మామిడి రాధిక, లెప్రా సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్

సాక్షి
స్పోర్ట్స్
బుధవారం
2-1-2019



సానియా ‘తల్లి లాలన’...

ఏస్‌లు, సర్వీస్‌లే కాదు తనకు ‘శిశు’లాలనా తెలుసంటోంది హైదరాబాదీ టెన్నిస్‌ స్టార్‌ సానియా మీర్జా. తన ముద్దుగారే కుమారుడు ఇజ్‌హాన్‌ను మురిపెంగా చూసుకుంటున్న ఈ ఫొటోను కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం ట్విట్టర్‌లో షేర్‌ చేసింది. పక్కనే ఎంచక్కా కునుకు తీస్తున్న భర్త షోయబ్‌ మాలిక్‌లాగే తనకూ నిద్రపోవాలని ఉన్నా... మాతృత్వపు మధురిమల్లో మునిగితేలుతున్నానని చెప్పింది.

ఈసారి వదలొద్దు...



70 ఏళ్ల ప్రయాణంలో 12 పర్యటనల్లో 47 టెస్టుల పరంపరలో ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారిగా 2-1 ఆధిక్యంలో నిలిచింది. మరొక్క విజయం సాధించినా... కనీసం ‘డ్రా’ చేసుకున్నా ... సిరీస్‌ను కైవసం చేసుకుని రికార్డుల్లోకెక్కుతుంది. ఏ తీరుగా చూసినా మళ్లీ ఎప్పటికి వస్తుందో చెప్పలేనంతటి గొప్ప అవకాశం ఇది. ఏమాత్రం పొరపాటు జరుగకుండా చూసుకోవాల్సిన అరుదైన సందర్భం ఇది. ఈ చారిత్రక మలుపును కోహ్లి సేన గెలుపు పిలుపుతో మురిపిస్తుందని ఆశిద్దాం...!

సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో టీమిండియా
- గెలిస్తే నయా చరిత్ర
- ‘డ్రా’ చేసుకున్నా తొలిసారి సిరీస్‌ విజయం
- సిడ్నీలో రేపటి నుంచి నాలుగో టెస్టు

సాక్షి క్రీడా విభాగం

2003–04 ఆసీస్‌ పర్యటనలో నాలుగు టెస్టుల సిరీస్‌లో రెండో టెస్టును గెలిచిన టీమిండియా 1–0తో పైచేయి సాధించింది. అయితే, తర్వాతి దాంట్లో ఓడిపోవడంతో ఆధిక్యం చేజారింది. ఈ సిరీస్‌లో మొదటి, నాలుగో టెస్టులు ‘డ్రా’గా ముగియడంతో తుది ఫలితం 1–1గా మారింది. అంతకుముందు 1977–78లో 2–2తో సమంగా ఉన్న స్థితిలో ఐదో మ్యాచ్‌లో ఓడి సిరీస్‌ను కోల్పోయింది. కంగారూ గడ్డపై ఇప్పటి వరకు ఈ రెండు మాత్రమే భారత్‌ సిరీస్‌ విజయానికి చేరువగా వచ్చిన సందర్భాలు. కానీ, ఇప్పుడు స్పష్టమైన ఆధిక్యంతో సిడ్నీలో అడబోతోంది. ఈ మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకున్నా కోహ్లి సేన చరిత్ర తిరగరాసినట్లవుతుంది.

పట్టిన పట్టు విడవొద్దు...

పైన చెప్పుకొన్న ఉదాహరణల్లో మొదటి దాంట్లో భారత్‌ చేజేతులా పట్టు జారవిడిచింది. స్థిరమైన బ్యాటింగ్‌ ప్రదర్శన చేయలేక మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో ఓడింది. 1977–78 సిరీస్‌లో మాత్రం ఐదో టెస్టులో అతి భారీ లక్ష్యాన్ని (492) ఛేదిస్తూ 445 పరుగుల వద్ద ఆగిపోయింది. పోరాటం ఎలా ఉన్నా... ఈ రెండు సార్లూ ‘బ్యాటింగ్‌’దే ప్రధాన పాత్ర కావడం గమనార్హం. ప్రస్తుతం కూడా బ్యాటింగే జట్టును కొంత కలవరపెడుతోంది. మెల్‌బోర్న్‌ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో టాపార్డర్‌ కుప్పకూలిన వైనమే దీనికి నిదర్శనం. తొలి ఇన్నింగ్స్‌లో దక్కిన భారీ ఆధిక్యానికి రెండో ఇన్నింగ్స్‌లో కుర్రాళ్లు మయాంక్‌ అగర్వాల్, రిషభ్‌ పంత్‌ విలువైన పరుగులు జోడించడంతో ఇబ్బంది లేకపోయింది. ఆసీస్‌ ఓడిన తేడా (137 పరుగులు)ను పరిగణనలోకి తీసుకుంటే వీరిద్దరి ఇన్నింగ్స్‌ విలువ తెలుస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ‘ఓడినా పోయేదేమీ లేదుగా’ అనే భావనను వీడి ఏమాత్రం అలసత్వం వహించకుండా పకడ్బందీగా ఆడాల్సి ఉంటుంది.

ఆ పొరపాట్లు చేయొద్దు...

పిచ్‌ గురించి అంచనా వేయలేక, అతి విశ్వాసంతో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, తాజాగా ఆస్ట్రేలియాలోనూ ఎదురుదెబ్బలు తగిలాయి. కనీసం ముందస్తు ఊహాగానాలనూ పట్టించుకోకుండా బరిలో దిగి ఫలితం అనుభవించారు. సిడ్నీ టెస్టుకు మాత్రం వాతావరణం సహా అన్ని విషయాలనూ లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. సీనియర్‌ ఆఫ్‌ స్పిన్నర్‌ అశ్విన్‌ ఫిట్‌నెస్‌ సంతరించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సిడ్నీలో వాతావరణం వేడిగా ఉంది. పిచ్‌ పొడిగా కనిపిస్తోంది. దీంతో ఆస్ట్రేలియా లయన్‌కు తోడుగా స్పిన్నర్‌ లబుషేన్‌ను ఆడిస్తుందనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు స్పిన్నర్లను ఆడించాలా? లేదా బ్యాట్స్‌మన్‌ రోహిత్‌ శర్మ స్థానాన్ని ఆల్‌రౌండర్‌ హార్దిక్‌ పాండ్యాతో భర్తీ చేయాలా? అనేదానిపై టీమిండియా కచ్చితంగా ముందే ఓ అభిప్రాయానికి రావాలి. అద్భుత ఫామ్‌తో పాటు పోటాపోటీగా వికెట్లు పడగొడుతున్నందున ముగ్గురు పేసర్లతో సరిపెట్టుకుని, హార్దిక్‌ బదులు పూర్తి ఫిట్‌గా ఉంటే అశ్విన్‌నే ఆడించడం ఉత్తమం. బ్యాటింగ్‌లోనూ అశ్విన్‌ సామర్థ్యాన్ని తక్కువగా చూడలేం. మెల్‌బోర్న్‌లో ప్రత్యర్థి ఆఫ్‌ స్పిన్నర్‌ నాథన్‌ లయన్‌ కంటే జడేజా మెరుగ్గా రాణించాడు. ఆసీస్‌ బ్యాట్స్‌మెన్‌... పేసర్‌ బుమ్రా తర్వాత జడేజా బౌలింగ్‌లోనే ఎక్కువగా ఇబ్బంది పడ్డారు. మరోవైపు పక్కటెముకల గాయంతో దీర్ఘకాలంగా ఇబ్బంది పడుతున్న దృష్ట్యా అశ్విన్‌ ఫిట్‌నెస్‌పై ఏమాత్రం అనుమానం ఉన్నా, అతడిని తుది జట్టులో చేర్చకపోవడమే మేలు. రెండో స్పిన్నర్‌గా హనుమ విహారిని ఉపయోగించుకోవచ్చు.

బ్యాట్స్‌మెన్‌ మరింత బాధ్యతగా...

పుజారా, కోహ్లి... ఈ సిరీస్‌లో భారత్‌ బ్యాటింగ్‌ భారాన్ని పూర్తిగా మోస్తున్నారు. అయితే, నిర్ణయాత్మకమైన స్థితిలో వీరిద్దరికి మిగతా వారూ సహకరించాల్సిన అవసరం ఉంది. అరుదైనదే అయినా మెల్‌బోర్న్‌ రెండో ఇన్నింగ్స్‌లోలా పుజారా, కోహ్లి పరుగులు సాధించలేకపోతే.. రహానే పూర్తి బాధ్యత తీసుకోవాలి. మూడో టెస్టులో తమ పాత్ర సమర్థంగా పోషించిన ఓపెనర్లు మయాంక్‌ అగర్వాల్, హనుమ విహారి సిడ్నీలోనూ దానిని కొనసాగించాలి. రోహిత్‌ లేనందున లోయరార్డర్‌లో వికెట్‌ కీపర్‌ రిషభ్‌ పంత్‌ మరింత కీలకం కానున్నాడు. పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ అతడు మరిన్ని పరుగులు జోడిస్తే అవే కీలకం అవుతాయి. ఏదేమైనా, కోహ్లి సేన జోరును కొనసాగిస్తూ, గెలుపు ఊపును నిలబెట్టుకుంటూ కొత్త సంవత్సరం తొలినాళ్లలోనే దేశానికి అద్భుతమైన కానుక ఇస్తుందని బలంగా ఆశిద్దాం... విజయోస్తు టీమిండియా!

గావస్కర్‌కు అందని సీఏ ఆహ్వానం

ట్రోఫీ ప్రదానానికి గైర్హాజరు కానున్న దిగ్గజం



2015లో ఆసీస్‌ కెప్టెన్‌ స్మిత్‌కు ట్రోఫీ అందజేస్తున్న బోర్డర్, గావస్కర్‌ (ఫైల్‌)

ముంబై: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌ పేరేమో ‘బోర్డర్‌–గావస్కర్‌’ ట్రోఫీ. చిత్రంగా ట్రోఫీ ప్రదానోత్సవానికి మాత్రం భారత దిగ్గజం సునీల్‌ గావస్కర్‌కు క్రికెట్‌ ఆస్ట్రేలియా (సీఏ) అధికారిక ఆహ్వానం పంపలేదు. దీంతో సన్నీ అక్కడికి వెళ్లడం లేదు. బోర్డర్‌తో కలిసి ట్రోఫీని అందించడం లేదు. 1996 నుంచి జరుగుతున్న ఈ సిరీస్‌ విజేతకు ఈసారి మాత్రం అలెన్‌ బోర్డర్‌ ఒక్కడే ట్రోఫీని ప్రదానం చేయనున్నారు. సీఏ సీఈఓ జేమ్స్‌ సదర్లాండ్‌ గత మే నెలలో గావస్కర్‌కు ముందస్తు సమాచారం ఇచ్చారు. ఆ మరుసటి నెలలోనే సదర్లాండ్‌ తన 17 ఏళ్ల సుదీర్ఘ పదవీ కాలానికి బైబై చెప్పారు. ముందస్తు సమాచారమైతే ఉంది కానీ అనంతరం సీఏ నుంచి అధికారిక ఆహ్వానమేదీ సన్నీకి అందలేదు. ఒకవేళ సీఏ హడావుడిగా ఇప్పుడు ఆహ్వానం పంపినా గావస్కర్‌ వెళ్లే అవకాశం లేదు. ఎందుకంటే సన్నీ ‘సోనీ నెట్‌వర్క్‌’తో ఒప్పందం చేసుకున్నారు. ముంబై నుంచి వ్యాఖ్యానం చేస్తున్నారు. కనీసం సిరీస్‌కు ముందైనా చెబితే సోనీ సంస్థ ఏదైనా ప్రత్యామ్నాయం చేసుకునేదని ఇప్పుడు మాత్రం ఏ అవకాశం లేదని సన్నీ చెప్పారు. దీంతో భారత దిగ్గజం గైర్హాజరు కానున్నారు. మరోవైపు సీఏ కమ్యూనికేషన్స్‌ హెడ్‌ టిమ్‌ విటకెర్‌ మాట్లాడుతూ... జూన్‌లో ఒకసారి, ఆగస్టులో మరోసారి గావస్కర్‌కు ఆహ్వానాలు పంపామని చెప్పారు. అయితే ఈ ఆహ్వానాల స్క్రీన్‌షాట్స్‌ చూపగలరా అంటే మాత్రం ‘మీడియాకు మా అధికారిక ఆహ్వానాలు వెల్లడించం’ అని బదులిచ్చారు. సీఏ ఇలా చేయడం ఇదేం మొదటిసారి కాదు. 2015లో చివరి నిమిషంలో ఆహ్వానించింది. అక్కడే ఉండటంతో సన్నీ సరేనన్నారు. 2007–08లోనూ ఇలాగే చేసింది. 2000లో ఆస్ట్రేలియా శతాబ్ది జట్టును ఎంపిక చేసేందుకు సీఏ గావస్కర్‌ను ఆ ప్యానెల్‌లో సెలెక్టర్‌గా నియమించింది. వేడుకకి మాత్రం పిలవలేదు.

ఆంధ్ర భారీ స్కోరు

సాక్షి, విజయనగరం: మిడిలార్డర్‌ బ్యాట్స్‌మెన్‌ రికీ భుయ్‌ (248 బంతుల్లో 129; 14 ఫోర్లు, 2 సిక్సలు), కోన శ్రీకర్‌ భరత్‌ (277 బంతుల్లో 178 నాటౌట్‌; 22 ఫోర్లు, 2 సిక్సలు) సెంచరీలతో కదంతొక్కడంతో...



భరత్‌

హైదరాబాద్‌తో జరుగుతున్న గ్రూప్‌ ‘బి’ రంజీ ట్రోఫీ లీగ్‌ మ్యాచ్‌లో ఆంధ్ర 231 పరుగుల తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యాన్ని సంపాదించింది. ఓవర్‌నైట్‌ స్కోరు 207/3తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ కొనసాగించిన ఆంధ్ర ఏడు వికెట్లకు 502 పరుగుల వద్ద డిక్లేర్‌ చేసింది. ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్‌ 10 ఓవర్లలో వికెట్‌ నష్టపోకుండా 33 పరుగులు చేసింది. ఆ జట్టు 198 పరుగులు వెనుకబడి ఉంది. ప్రస్తుతం తన్మయ్‌ (13 బ్యాటింగ్‌), తిలక్‌ వర్మ (20 బ్యాటింగ్‌) క్రీజులో ఉన్నారు. నేడు ఆటకు చివరి రోజు.

సైనాపై సింధు విజయం

హైదరాబాద్‌ హంటర్స్‌ చేతిలో నార్త్‌ ఈస్టర్న్‌ వారియర్స్‌ చిత్తు



సింధు

సైనా

పుణే: భారత బ్యాడ్మింటన్‌ స్టార్‌ పీవీ సింధు కొత్త ఏడాదిని గొప్ప విజయంతో ప్రారంభించింది. ప్రీమియర్‌ బ్యాడ్మింటన్‌ లీగ్‌ (పీబీఎల్‌)లో భాగంగా సైనా నెహ్వాల్‌ ప్రాతినిధ్యం వహించిన నార్త్‌ ఈస్టర్న్‌ వారియర్స్‌పై సింధు నేతృత్వంలోని హైదరాబాద్‌ హంటర్స్‌ 5–0తో ఘనవిజయం సాధించింది. నార్త్‌ ఈస్టర్న్‌ వారియర్స్‌ ఆడిన గత మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమైన సైనా ఈసారి బరిలోకి దిగింది. మూడో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో సింధు 11–15, 15–9, 15–5తో సైనాను ఓడించింది. అంతకుముందు తొలి మ్యాచ్‌ మిక్స్‌డ్‌ డబుల్స్‌లో కిమ్‌ హా నా–లియావో మిన్‌ చున్‌ (వారియర్స్‌) ద్వయం 15–8, 15–14తో కిమ్‌ సా రంగ్‌–హై వన్‌ జోడీపై నెగ్గి 1–0తో ముందంజ వేసింది. వారియర్స్‌ ‘ట్రంప్‌’ మ్యాచ్‌లో లీ హున్‌ 10–15, 15–13, 15–9తో సెన్‌సోమ్‌ బున్‌సుక్‌ను ఓడించడంతో హైదరాబాద్‌ 1–0తో ఆధిక్యంలోకి వచ్చింది. మూడో మ్యాచ్‌లో సైనాపై సింధు నెగ్గడంతో హైదరాబాద్‌ ఆధిక్యం 2–0కు పెరిగింది. తర్వాత తమ ‘ట్రంప్‌’ మ్యాచ్‌లో మార్క్‌ కల్జౌ 15–11, 15–14తో తియన్‌ హువె (వారియర్స్‌)పై గెలవడంతో హైదరాబాద్‌ ఆధిక్యం 4–0కు చేరింది. ఐదో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో ఇసారా–కిమ్‌ సా రంగ్‌ ద్వయం 15–10, 12–15, 15–14తో లియావో మిన్‌ చున్‌–యోన్‌ సెంగ్‌ యూ (వారియర్స్‌) జోడీని ఓడించడంతో హైదరాబాద్‌ 5–0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. బుధవారం జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ డాషర్స్‌తో బెంగళూరు రాప్టర్స్‌ ఆడుతుంది.



క్వార్టర్స్‌లో దివిజ్‌-బోపన్న జంట

పుణే: టాటా ఓపెన్‌ ఏటీపీ–250 టెన్నిస్‌ టోర్నమెంట్‌లో టాప్‌ సీడ్‌ దివిజ్‌ శరణ్‌–రోహన్‌ బోపన్న (భారత్‌) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్‌ తొలి రౌండ్‌లో దివిజ్‌–బోపన్న ద్వయం 6–1, 6–2తో రాడూ అల్బోట్‌ (మాల్డోవా)–మాలిక్‌ జజిరీ (ట్యూనిషియా) జోడీపై విజయం సాధించింది. 50 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జంట నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి జంట సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్‌ చేసింది. మరో మ్యాచ్‌లో లియాండర్‌ పేస్‌ (భారత్‌)–మిగుయెల్‌ వరేలా (మెక్సికో) ద్వయం 6–3, 6–4తో మరేరో (స్పెయిన్‌)–కాస్టిలో (చిలీ) జంటను ఓడించి క్వార్టర్‌ ఫైనల్లో దివిజ్‌–బోపన్న జోడీతో పోరుకు సిద్ధమైంది. సింగిల్స్‌ విభాగంలో భారత ఆటగాళ్లు రామ్‌కుమార్‌ రామనాథన్‌ ముందంజ వేయగా... అర్జున్‌ ఖడే నిష్క్రమించాడు. తొలి రౌండ్‌లో రామ్‌కుమార్‌ 4–6, 6–4, 6–3తో మార్సెల్‌ గ్రానోలెర్స్‌ (స్పెయిన్‌)పై నెగ్గగా... అర్జున్‌ ఖడే 5–7, 6–7 (6/8)తో లాస్లో జెరీ (సెర్బియా) చేతిలో ఓడిపోయాడు. క్వాలిఫయింగ్‌ నుంచి మెయిన్‌ ‘డ్రా’కు అర్హత సాధించిన ఆంధ్రప్రదేశ్‌ ప్లేయర్‌ సాకేత్‌ మైనేని కాలి గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగాడు.



సిడ్నీలో నాలుగో టెస్టు ఆడేందుకు వచ్చిన ఆస్ట్రేలియా, భారత జట్లకు మంగళవారం ఆ దేశ ప్రధానమంత్రి తన అధికారిక నివాసంలో విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్‌ మారిసన్‌తో కోహ్లి బృందం

సూపర్‌-12కు అర్హత పొందని లంక

దుబాయ్‌: మాజీ చాంపియన్‌ శ్రీలంక టి20 ప్రపంచకప్‌ సూపర్‌–12కు నేరుగా అర్హత సాధించడంలో విఫలమైంది. తక్కువ ర్యాంకు కారణంగా లంకతో పాటు బంగ్లాదేశ్‌ కూడా వచ్చే ఏడాది జరిగే మెగా ఈవెంట్‌కు నేరుగా అర్హత పొందలేదు. దీంతో ఈ రెండు జట్లు గ్రూప్‌ దశలో మిగతా ఆరు జట్లతో పోటీపడాల్సి ఉంటుందని అంతర్జాతీయ క్రికెట్‌ మండలి (ఐసీసీ) మంగళవారం వెల్లడించింది. టాప్‌ ర్యాంకులో ఉన్న పాకిస్తాన్‌తో పాటు భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్గానిస్తాన్‌ ఈ ఎనిమిది జట్లు సూపర్‌–12కు నేరుగా అర్హతపొందాయి. మరో నాలుగు జట్లు గ్రూప్‌ దశ ద్వారా అర్హత సాధిస్తాయి. వచ్చే ఏడాది అక్టోబర్‌ 18 నుంచి నవంబర్‌ 15 వరకు గ్రూప్, ప్రధాన టోర్నీ జరుగుతుంది. అంతకంటే ముందు ఈ ఏడాది టి20 ప్రపంచకప్‌ క్వాలిఫయర్స్‌ నిర్వహిస్తారు. ఇందులో రాణించిన ఆరు జట్లు గ్రూప్‌ దశకు అర్హత పొందుతాయి. ఒకసారి టైటిల్‌ నెగ్గి... మూడు సార్లు ఫైనలిస్టుగా నిలిచిన లంక నేరుగా అర్హత పొందలేకపోవడం పట్ల కెప్టెన్‌ మలింగ విచారం వ్యక్తం చేశాడు. అయితే గ్రూప్‌ దశలో సత్తాచాటడం ద్వారా సూపర్‌–12 బెర్త్‌ సాధిస్తామన్నాడు.

పంత్‌... బెస్ట్‌ బేబీసిట్టర్‌!

ఆసీస్‌ కెప్టెన్‌ టిమ్‌ పైన్‌ భార్య బోని కితాబు




సిడ్నీ: మెల్‌బోర్న్‌ టెస్టులో ఆస్ట్రేలియా కెప్టెన్‌ టిమ్‌ పైన్, భారత వికెట్‌ కీపర్‌ రిషభ్‌ పంత్‌ క్రీజ్‌లో నోటికి పని చెప్పారు. ఒకరు బ్యాటింగ్‌ చేస్తుంటే మరొకరు స్లెడ్జింగ్‌కు దిగారు. హద్దులు దాటని ఈ కామెంట్లు ఆ టెస్టులో ఓ భాగమయ్యాయి. అలాగే ఇద్దరి మాటల తూటాలు మీడియాలో బాగానే పేలాయి. అప్పుడు పైన్‌ చేసిన కామెంట్‌ను పంత్‌ తాజాగా నిజం చేశాడు. ‘బెస్ట్‌ బేబీ సిట్టర్‌’గా అతని భార్య నుంచే కితాబు అందుకున్నాడు. బేబీ సిట్టర్‌ అంటే తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో లేనపుడు పసిపిల్లల ఆలనాపాలన చూసే సంరక్షకుడని అర్థం. ఆసీస్‌ ప్రధాని స్కాట్‌ మారిసన్‌ తన నివాసంలో కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం ఇరు జట్లకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఇందుకు పైన్‌ భార్య బోని తన ఇద్దరి పిల్లల్ని తీసుకొచ్చింది. వారిలో ఒకరిని పంత్‌ ఎత్తుకున్నాడు. పక్కనే బోని మరో చిన్నారిని ఎత్తుకుంది. ఈ ఇద్దరిపై కెమెరాలు క్లిక్‌మన్నాయి. అంతే ఆ ఫొటోను పైన్‌ భార్య బోని తన ఇన్‌స్ట్రాగామ్‌లో సరదాగా ‘పంత్‌ బెస్ట్‌ బేబీ సిట్టర్‌’ అనే క్యాప్షన్‌తో పోస్ట్‌ చేసింది. మొత్తానికి ‘బాక్సింగ్‌ డే’ టెస్టులోని స్లెడ్జింగ్‌ వేడి ‘న్యూ ఇయర్‌’లో ఇలా చల్లబడింది. మూడో టెస్టులో రిషభ్‌ బ్యాటింగ్‌ చేస్తుంటే పైన్‌ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. ‘జట్టులోకి ధోని వచ్చాడు. ఇక నువ్వు ఇక్కడే మా బిగ్‌బాష్‌ లీగ్‌ ఆడుకో. హోబర్ట్‌ హరికేన్స్‌ తరపున బ్యాటింగ్‌ చెయ్‌. అలా ఆసీస్‌లో సెలవుల్ని ఆస్వాదించు. అన్నట్లు నేను నా భార్య సినిమాకెళ్లి చాలా రోజులైంది. నువ్వు మా ఇంట్లో బేబీ సిట్టర్‌గా ఉంటే మేమిద్దరం సినిమాని ఎంజాయ్‌ చేస్తాం’ అంటూ స్లెడ్జింగ్‌ చేశాడు. దీనికి రిషభ్‌ కూడా దీటుగానే బదులిచ్చాడు. మయాంక్‌తో ‘ఈ రోజు మనం ఓ ప్రత్యేక అతిథిని చూస్తున్నాం. పెద్దగా బాధ్యతలేని పని. అదే తాత్కాలిక కెప్టెన్‌. ఎపుడైనా ఇలాంటి తాత్కాలిక కెప్టెన్‌ను చూశామా? దాని గురించి విన్నామా? అతన్ని ఔట్‌ చేసేందుకు శ్రమించాల్సిన పనిలేదు బాయ్స్‌ (బౌలర్లనుద్దేశించి). మాట్లాడితే చాలు. అతిగా మాట్లాడటమే ఇష్టం. అంతే’ అని రిటర్న్‌ గిఫ్ట్‌ ఇచ్చేశాడు. ఇదంతా వివాదం కాకపోవడంతో ఆరోగ్యకరంగానే ముగిసింది.



సెరెనా జంటపై ఫెడరర్‌ జోడీ గెలిచింది

పెర్త్‌: హాప్‌మన్‌ కప్‌లో అరుదైన సమరం ఆవిష్కృతమైంది. ‘ఆల్‌టైమ్‌ గ్రేట్‌ స్టార్స్‌’ ఫెడరర్‌ (స్విట్జర్లాండ్‌), సెరెనా విలియమ్స్‌ (అమెరికా) తొలిసారి కోర్టులో ‘ఢీ’కొన్నారు. మిక్స్‌డ్‌ డబుల్స్‌ విభాగంలో జరిగిన ఈ పోరు హాప్‌మన్‌ కప్‌కే హైలైట్‌గా నిలిచింది. దేశాల మధ్య జరిగే ఈ టీమ్‌ ఈవెంట్లో తొలి సింగిల్స్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ స్విట్జర్లాండ్‌ తరపున ఫెడరర్‌ 6–4, 6–1తో టియాఫో (అమెరికా)పై నెగ్గాడు. తర్వాత మహిళల సింగిల్స్‌లో సెరెనా 4–6, 6–4, 6–3తో బెన్సిచ్‌ (స్విట్జర్లాండ్‌)ను ఓడించడంతో స్కోరు 1–1తో సమమైంది. ఇక నిర్ణాయక మిక్స్‌డ్‌ డబుల్స్‌లో ఫెడరర్‌–బెన్సిచ్‌ జంట 4–2, 4–3 (5/3) సెరెనా–టియాఫో జోడీపై గెలిచింది. కోర్టులో రాకెట్లు దూసిన దిగ్గజాలు మ్యాచ్‌ ముగిశాక తమ స్మార్ట్‌ఫోన్లతో సెల్ఫీ ముచ్చట తీర్చుకున్నారు. ఆటతో పాటు ఈ హేమాహేమీల ‘స్వీయచిత్రం’ అందర్నీ ఆకట్టి పడేసింది. అన్నట్లు వెంటనే ఇద్దరు ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో తమదైన శైలి క్యాప్షన్‌లతో పోస్ట్‌ చేయడంతో లెక్కలేనన్ని లైక్‌లు వస్తున్నాయి.

ధనలక్ష్మిగా పైడిమాంబ


ధనలక్ష్మీ అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు దాతల సహకారంతో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ.10, రూ.20, రూ.50 నోట్లతో ఆలయ గర్భగుడి ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అర్చకులు దూసి కృష్ణమూర్తి, మూలా పాపారావు, తదితరులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీఏవీఎస్ భానురాజా, సూపర్‌వైజర్ రామారావు పర్యవేక్షించారు.

నాసిరకంగా దుర్గమ్మ లడ్డు

- ఇంటికి చేరకుండానే బూందీగా మారుతున్న లడ్డు
- బరువు తక్కువగా వస్తుందంటున్న భవానీలు


బూందీగా మారిన లడ్డు ప్రసాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ) : దీక్షల విరమణకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భవానీలకు అమ్మవారి దర్శనం తర్వాత ఇస్తున్న లడ్డు ప్రసాదం నాసిరకంగా ఉంటుందనే ఆరోపణలొస్తున్నాయి. లడ్డు ప్యాకింగ్‌లో సిబ్బంది అలసత్వం కారణంగా ఇళ్లకు తీసుకెళ్లకముందే బూందీగా మారిపోతుంది. మరో వైపు 80 గ్రాములు ఉండాల్సిన అమ్మవారి లడ్డు ప్రసాదం..అంత మేరకు ఉండటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దుర్గగుడి ఈవో వీ కోటేశ్వరమ్మ లడ్డు ప్రసాదాన్ని భవానీలకు సక్రమంగా అందేలా చూడటంతో పాటు తూకం సక్రమంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

నిబంధనలకు నిప్పు!



అక్రమ నిర్మాణాల సక్రమానికి గ్రీన్ సిగ్నల్

- ఫైర్ సర్వీసెస్ నిబంధనలకు విరుద్ధంగా కట్టిన మల్టీప్లెక్స్‌లు, సినిమాహాళ్ల క్రమబద్ధీకరణకు సిద్ధం
- 2006 చట్టానికి తూట్లు పొడుస్తూ పలు మినహాయింపులు
- సర్కారు చర్యలపై అగ్నిమాపక శాఖలో ఆందోళన

సాక్షి, అమరావతి: ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అక్రమంగా నిర్మించిన భవనాలు అగ్నికి ఆహుతైనా ఫరవాలేదనే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. 2006 నాటి చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణను ఆమోదిస్తూ పలు మినహాయింపులను కల్పించడం గమనార్హం. త్వరలో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ కానున్నాయి. దీనికి సంబంధించి ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర వేస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు.

అదనపు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించినా..

ప్రమాదాలను నివారించేందుకు అగ్నిమాపక శాఖ సూచనల మేరకు భవన నిర్మాణాలను చేపడితేనే నిరభ్యంతర సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. ఈమేరకు అగ్నిమాపకశాఖ 2006 డిసెంబర్ 12న ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ నిబంధనలను జారీ చేసింది. దీని ప్రకారం 2007 నుంచి అక్రమ నిర్మాణాలకు నిరభ్యంతర సర్టిఫికెట్ జారీ చేసేందుకు వీలు లేదని హోంశాఖ స్పష్టం చేసింది. ఎక్కువ అంతస్తులు కలిగిన భవనాల్లో అదనపు భద్రతా చర్యలు, సెట్ బ్యాక్ లోపాలను సవరించాలని కూడా 2008లో మెమో జారీ చేసినట్లు పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా నిరభ్యంతర సర్టిఫికెట్ జారీ చేస్తే దారుణమైన పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అయితే దీన్ని పట్టించుకోకుండా నిరభ్యంతర సర్టిఫికెట్ల మంజూరు నుంచి పలు మినహాయింపులు ఇస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. దీని ద్వారా అక్రమ నిర్మాణాలన్నింటినీ క్రమబద్ధీకరించేందుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టైంది. ప్రధానంగా సీఆర్‌డీఏ పరిధిలో కేపిటల్ సిటీని మినహాయించి మిగతా చోట్ల అక్రమ నిర్మాణాలన్నింటినీ సక్రమం చేయడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన మల్టీప్లెక్స్‌లు, సినిమా హాల్స్, ఫంక్షన్ హాల్స్, స్కూళ్లను సక్రమ నిర్మాణాలుగా మార్చేలా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. భారీగా ముడుపులు అందనుండటంతోనే అగ్నిమాపక చట్టం నిబంధనల నుంచి మినహాయింపు కల్పించి అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అగ్నిమాపక, ఆర్థిక శాఖలు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

మరో మార్గం లేదంటున్న పురపాలకశాఖ...

సీఆర్‌డీఏ పరిధిలో కేపిటల్ సిటీని మినహాయించి మిగతా చోట్ల అక్రమ నిర్మాణాలన్నింటినీ సక్రమం చేయనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, పంచాయతీలు, మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అధారిటీల్లో అనధికారిక నిర్మాణాలతోపాటు నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను సక్రమం చేయనున్నారు. భవనాల యజమానులు నోటిఫికేషన్ జారీ చేసిన 90 రోజుల్లోగా రూ.10 వేల రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును తిరస్కరిస్తే రుసుములో పది శాతం తిరిగి చెల్లిస్తారు. 1985 జనవరి 1వ తేదీ నుంచి 2018 ఆగస్టు 31వ తేదీ వరకు చేపట్టిన అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1997 డిసెంబర్ 31వ తేదీకి ముందు నాటి అక్రమ, అనధికారిక నిర్మాణాల క్రమబద్ధీకరణకు ఫీజులో 25 శాతం మేర రాయితీ కల్పించనున్నారు. మురికివాడల్లో రెసిడెన్షియల్ భవనాల క్రమబద్ధీకరణకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెద్ద ఎత్తున ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం సాధ్యం కాదని, ఈ నేపథ్యంలో క్రమబద్ధీకరణ మినహా మరో మార్గం లేదని పురపాలకశాఖ తన చర్యలను సమర్థించుకోవడం గమనార్హం.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు వర్తించదు..

18 మీటర్ల ఎత్తు వరకు నివాస భవనాలు, 15 మీటర్ల ఎత్తు వరకు వాణిజ్య సముదాయాలు, స్కూళ్లు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, 500 చదరపు మీటర్లకు పైబడిన మల్టీప్లెక్స్‌లను క్రమబద్ధీకరించడం ద్వారా అక్రమ నిర్మాణాలను సక్రమం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ భూముల ఆక్రమణ, గృహ నిర్మాణ మండలి, ఏపీఐఐసీ, సీఆర్‌డీఏ, స్థానిక సంస్థలు, దేవదాయ, వక్ఫ్ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు క్రమబద్ధీకరణ వర్తించదని పేర్కొంది. భవిష్యత్‌లో రహదారులు, బీఆర్‌టీఎస్, ఎంఆర్‌టీఎస్‌ల పరిధిలోకి వచ్చే నిర్మాణాలకు క్రమబద్ధీకరణ వర్తింపచేయకూడదని ప్రభుత్వం నిర్ణయించింది.

ఏడు నెలల గర్భిణిపై భర్త, అత్త దాష్టీకం

- విచక్షణారహితంగా దాడి చేయడంతో గర్భస్రావం
- గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తెనాలి రూరల్: ఏడో నెల గర్భిణి అని చూడకుండా భర్త, అత్త విచక్షణారహితంగా దాడి చేయడంతో బాధితురాలికి గర్భస్రావమైంది. ఆమె ప్రస్తుతం గుంటూరు సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెనాలి మండలం బుర్రిపాలెంకు చెందిన ఒగ్గోలు నాగ పద్మావతి (20)కి 2015లో వీరాస్వామితో వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచే ప్రతి చిన్న విషయానికీ భర్త, అత్త వేధిస్తుండేవారు. అయినా సహిస్తూ వచ్చింది. ఇటీవలి కాలంలో అదనపు కట్నం కోసం వేధింపులు పెరిగాయి. డిసెంబర్ 26వ తేదీ రాత్రి నాగ పద్మావతిపై భర్త దాడి చేశాడు. అప్పటికే ఆమె ఏడు నెలల గర్భిణి. బయటకు కనబడని గాయాలు కావడంతో తల్లికి చెప్పుకుని, మరుసటి రోజు 27న తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు చికిత్స కోసం వెళ్లింది. వైద్యులు ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. ఆరోజు రాత్రి ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు ఉదయం వైద్యశాలకు వెళ్లిన వీరాస్వామి, అతని తల్లి కలసి నాగపద్మావతిపై ఆస్పత్రిలోనే అందరిముందే విచక్షణారహితంగా దాడి చేశారు. స్పృహ తప్పి పడిపోయిన ఆమెను వైద్యులు గుంటూరుకు పంపారు. అక్కడ గర్భస్రావం అయింది. బాధితురాలు గుంటూరులో ఇచ్చిన స్టేట్‌మెంట్ సోమవారం రాత్రి తెనాలి తాలూకా పోలీసులకు అందింది. ఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 4, 5 తేదీల్లో ఏఎన్‌యూలో అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను మంగళవారం ఏఎన్‌యూ వీసీ ఎ.రాజేంద్రప్రసాద్, మిజోరాం సెంట్రల్ వర్సిటీ వీసీ కేఆర్ఎస్ సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్, ఏఎన్‌యూ ఇంజనీరింగ్ డీన్ ఈ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కృత్రిమ మేథస్సు, మెషీన్ లెర్నింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్, డేటా సైన్స్, సోషల్ నెట్‌వర్క్, సైబర్ సెక్యూరిటీ వంటి నూతన అంశాలకు చెందిన పరిశోధకులు పరిశోధనా పత్రాలు సమర్పించవచ్చన్నారు. పరిశోధనా పత్రాలను జనవరి 30వ తేదీలోగా పంపాలని సూచించారు. సదస్సుకు ఎంపికైన పరిశోధనా పత్రాలను స్ప్రింగర్ జర్నల్, ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలలో ప్రచురిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ రెక్టార్ కె.జాన్‌పాల్, రిజిస్ట్రార్ జి. రోశయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్దయ్య, ఏఎన్‌యూ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఆచార్య గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్నా అహోబిలంకు నీటిని విడుదల చేయించండి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లాలో తీవ్ర కరవు పరిస్థితుల నేపథ్యంలో పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడికాలువ కింది చెరువులకు నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. గత ఏడాది కూడా 2.5 టీఎంసీల నీరు విడుదల చేసి పీఏబీఆర్ కుడి కాలువ కింద ఉన్న చెరువుల్ని నింపినట్టు గుర్తు చేశారు. నీటి కోసం రైతులు ఆందోళన చేస్తున్నా.. స్థానిక అధికారులు తాత్సారం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.

అయోధ్యపై ఆర్డినెన్స్ ఉండదు

న్యాయ ప్రక్రియ ముగిశాకే నిర్ణయం

- రుణమాఫీ రైతులందరికీ ప్రయోజనకరం కాదు
- ఉర్జిత్ పటేల్ ఏడు నెలల క్రితమే రాజీనామా చేస్తానన్నారు
- ప్రజలకు, మహా కూటమికి మధ్యనే రానున్న ఎన్నికలు
- నూతన సంవత్సరం ప్రధాని మోదీ తొలి ఇంటర్వ్యూ



అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ఆర్డినెన్స్ తీసుకు వచ్చే ఆలోచన ప్రస్తుతానికి లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కోర్టు కేసు తేలేవరకు, న్యాయప్రక్రియ ముగిసేవరకు ఆర్డినెన్స్ గురించి ఆలోచించబోమన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రజలకు, విపక్ష మహాకూటమికి మధ్యనే జరగనున్నాయన్నారు. నోట్ల రద్దు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని, దాన్ని ఒక షాక్ గా చూడకూడదని, నల్లధనం నిర్మూలనే లక్ష్యంగా ఆ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. నూతన సంవత్సర తొలి ఇంటర్వ్యూను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చారు. ప్రతిపక్షాలు, మీడియా గత కొన్నాళ్లుగా లేవనెత్తుతున్న అనేక అంశాలపై వివరణ ఇచ్చారు. మీడియా ముందుకు రావడం లేదన్న విమర్శలకు జవాబు అన్నట్లుగా దాదాపు 90 నిమిషాల పాటు ముఖాముఖిలో పాల్గొని పలు ప్రశ్నలకు సదీర్ఘ సమాధానాలిచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. - న్యూఢిల్లీ

అయోధ్యలో రామ మందిరం



న్యాయ ప్రక్రియ ముగిసే వరకు రామ మందిర నిర్మాణం కోసం ఆర్డినెన్స్ తీసుకు రావాలనుకోవడం లేదు. ఈ సమస్యకు రాజ్యాంగ పరిధిలో పరిష్కారం చూస్తామని మా మేనిఫెస్టోలో చెప్పాం. న్యాయ ప్రక్రియ పూర్తి కానివ్వండి. ఒక ప్రభుత్వంగా మా బాధ్యత ఏమిటో అది నిర్వర్తించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ట్రిపుల్ తలాక్ పై ఆర్డినెన్స్‌ను కూడా సుప్రీంకోర్టు తీర్పు తరువాతే తెచ్చాం. సుప్రీంకోర్టులో కాంగ్రెస్ న్యాయవాదులు అడ్డంకులు సృష్టిస్తుండటం వల్లనే తీర్పు ఆలస్యమవుతోంది. 70 ఏళ్లుగా అధికారంలో ఉన్నవాళ్లు ఈ సమస్యను అపరిష్కృతంగా ఉంచేందుకే కృషి చేశారు.

సర్జికల్ స్ట్రైక్స్



అది ఒక క్లిష్టమైన నిర్ణయం. అప్పుడు రాజకీయాల కన్నా జవాన్ల భద్రత గురించి ఎక్కువగా ఆలోచించాం. ఆపరేషన్ విజయవంతం కావడం కన్నా ఆ ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్ల ప్రాణాలు ముఖ్యమనుకున్నా. అందుకే మెరుపుదాడుల తేదీలను రెండు సార్లు మార్చాం. ఆపరేషన్‌లో పాల్గొనే వారికి కఠోర శిక్షణ ఇచ్చాం. సర్జికల్ స్ట్రైక్స్ కోసం నియంత్రణ రేఖ దాటి వెళ్లిన ప్రతీ జవాను తిరిగొచ్చే వరకు ఉత్కంఠ, ఆందోళనతో ఎదురు చూశా. మెరుపుదాడుల్లో విజయం సాధించినా, పరాజయం పాలైనా.. అందరినీ సూర్యోదయం లోపే తిరిగిరావాలని ఆదేశించాం. ఉడీ ఉగ్రదాడి మన ఆర్మీ జవాన్లలో కసిని పెంచింది.

పాకిస్తాన్

పాకిస్తాన్ అంత తొందరగా మారదు. ఒక్క యుద్ధం వల్ల పాక్ వైఖరిలో మార్పు వస్తుందని నేను భావించడం లేదు. అలా ఎవరు అనుకున్నా పొరపాటే.

ఉర్జిత్ పటేల్

ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ రాజీనామా హఠాత్తుగా జరిగినదేమీ కాదు. ఏడు, ఎనిమిది నెలల క్రితమే ఆయన రాజీనామా చేస్తానన్నారు. అందుకు వ్యక్తిగత కారణాలున్నాయన్నారు. ఈ విషయం నేను ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. ఈ విషయంలో రాజకీయ ఒత్తిడులు లేనే లేవు. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన అద్భుతంగా పనిచేశారు.

నోట్లరద్దు

నల్లధనం కారణంగా దేశంలో సమాంతర ఆర్థిక వ్యవస్థ నడుస్తోందనే విషయంలో సందేహం లేదు. అందుకే పెద్ద నోట్లు రద్దు చేశాం. ఇది హఠాత్తు నిర్ణయం కాదు. ఏడాది క్రితమే హెచ్చరించాం. మీ దగ్గర నల్లధనం ఉంటే బ్యాంకుల్లో దానిని డిపాజిట్ చేయండి. జరిమానాలు చెల్లించండి, అందుకు ప్రభుత్వం మీకు సాయం చేస్తుందని ఏడాది ముందుగానే ప్రజలను హెచ్చరించాం. నోట్ల రద్దు ఫలితంగా మంచాల కింద, అరల్లో దాచిన కట్టల కొద్దీ నగదు బయటపడింది. అదంతా ఇప్పుడు బ్యాంకుల్లోకి వచ్చి చేరింది. పన్నుల వసూళ్లు పెరిగాయి. ఇది గెలుపు కాదంటారా? జీడీపీతో పోలిస్తే కరెన్సీ చెలామణీ తగ్గింది. వచ్చే రోజుల్లో ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతుంది. ఈ నిర్ణయాన్ని షాక్‌గానో, ప్రజలపై భారంగానో భావించకూడదు.

మాల్యా, చోక్సీ

ప్రభుత్వం తీసుకున్న నోట్లరద్దు చర్యకు భయపడే వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా విదేశాలకు పారిపోయారు. మా ప్రభుత్వ హయాంలో పారిపోయిన ఆ ఇద్దరినీ నేడో రేపో తిరిగి తీసుకువస్తాం. దేశ ప్రజల సొమ్ము దొంగిలించిన వారి నుంచి ప్రతిపైసా తిరిగి రాబడతాం.

2019 ఎన్నికలు

రానున్న లోక్‌సభ ఎన్నికలు దేశ ప్రజలకు, విపక్ష మహా కూటమికి మధ్య జరగనున్నాయి. ఈ సారి బీజేపీకి 180 స్థానాల కన్నా ఎక్కువ రావని కొందరు చెబుతున్నారు. అలాంటి అంచనాలే 2014లోనూ వచ్చాయి. ప్రజలు నావైపే ఉన్నారనుకుంటున్నాను. ప్రజల ఆకాంక్షలు, ఆశలు నెరవేర్చేవారు.. ఆ ఆకాంక్షలు నెరవేరకుండా అడ్డుకునే వారు.. ఈ ఇద్దరి మధ్యనే రానున్న ఎన్నికలు జరుగుతాయి. వారి 70 ఏళ్ల పాలన ప్రజలకు గుర్తుంది.

తాజా ఎన్నికల్లో ఓటమి..

తెలంగాణ, మిజోరంలలో బీజేపీ గెలుస్తుందని ఎవరూ భావించలేదు. ఆ ఆలోచన మాకూ లేదు. మిగతా మూడు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఓడిపోయింది. కానీ మధ్యప్రదేశ్, రాజస్తాన్‌ల్లో హంగ్ అసెంబ్లీ వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ రాష్ట్రాల్లో 15 ఏళ్లు బీజేపీ అధికారంలో ఉంది. ప్రభుత్వ వ్యతిరేకత అనేది సహజంగానే ఉంటుంది.

ఫెడరల్ ఫ్రంట్

తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ప్రతిపాదిస్తున్న కూటమి గురించి నేను వినలేదు. నాకు తెలియదు.

మోదీ మ్యాజిక్

అలా అనే వారందరికీ కృతజ్ఞతలు. 2014లోనూ కొందరు మోదీ హవా ప్రభావమేం లేదన్నారు. వాళ్లే ఇప్పుడూ అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. మోదీ హవా అనేది ఒకటుందని వారు నమ్ముతున్నందుకు నేను హ్యాపీ. దాని గురించి వారికి తెలిసినందుకు సంతోషం. నా దృష్టిలో హవా అంటే ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేవారిని విశ్వసించడమే.

ప్రజలదే నిర్ణయం

నా ప్రతి పనిలో నిజం ఉంది, నిజాయతీ ఉంది. నేను ఏం చేశానో, ఎలా చేశానో నిర్ణయించే బాధ్యత ప్రజలకే వదిలిపెట్టా. ప్రతిపక్షాలు మాపై దుష్ప్రచారం తప్ప మరేం చేస్తాయి? అలా చేయకుంటే వారి కూటమి ఎలా నిలుస్తుంది? మాకు హాని చేసేందుకే అవి చెడు ప్రచారం చేస్తున్నాయి. కానీ, ప్రజా తీర్పుపైనే నా విశ్వాసం.

రఫేల్ ఒప్పందం



రఫేల్ ఒప్పందానికి సంబంధించి చేస్తున్న ఆరోపణలు నాపై వ్యక్తిగతంగా చేస్తున్నవి కాదు. నా ప్రభుత్వంపై చేస్తున్నవి. నాపై వ్యక్తిగత ఆరోపణలైతే.. ఎవరు, ఎప్పుడు, ఎలా ఇచ్చారు? లాంటి ఆధారాలుంటే బయటపెట్టాలంటున్నా. ఊరికే బురద చల్లి పారిపోవడం కాదు. వాళ్లకు పదేపదే ఒకే విషయాన్ని అరచి చెప్పే జబ్బు ఉంది. ఈ విషయంపై పార్లమెంటులోనూ, బయట చాలాసార్లు వివరణ ఇచ్చాను. సుప్రీంకోర్టు మాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అసలు రక్షణ రంగ ఒప్పందాల్లో మధ్యవర్తులు ఎందుకు ఉంటారు? 'మేక్ ఇన్ ఇండియా'ను 70 ఏళ్ల క్రితమే ప్రారంభించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా. నేనా పని ఇప్పుడు చేస్తుండటమే నా నేరం. మన సాయుధ దళాలకు రక్షణ రంగ ఉత్పత్తులను సమకూర్చడానికి ప్రయత్నించడమే నేను చేస్తున్న నేరంలా ఉంది.

మోదీ-అమిత్ షా ద్వయం

మోదీ, అమిత్‌షాల కారణంగానే బీజేపీ ముందుకు సాగుతోందని అనుకునే వారికి బీజేపీ గురించి తెలియదు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ. 'హర్ పోలింగ్ బూత్, సబ్‌సే మజ్బూత్' అనే నినాదంతో పోలింగ్ బూత్ నుంచే బీజేపీ పని మొదలవుతుంది. మా కార్యకర్తలు 365 రోజులూ ఇదే లక్ష్యంగా పనిచేస్తుంటారు. బీజేపీని ఒకరిద్దరు నడుపుతున్నారని భావించే వారు బీజేపీ సంస్థలను అర్థం చేసుకోలేదు. పార్టీలోని ప్రతి స్థాయి లోనూ కార్యకర్తల నాయకత్వం ఉంటుంది. అది పైకి చేరేకొద్దీ అంచెలంచెలుగా వృద్ధి చెందుతుంది. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ అన్న సిద్ధాంతంతో ప్రజల మెప్పును పొందుతూ బీజేపీ ముందుకు సాగుతుంది. బీజేపీ పట్టు తగ్గుతుందంటే దానర్థం మేం నష్టపోతున్నామని కాదు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం అసోం, హరియాణా, త్రిపురల్లో జరిగిన స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలిచింది.

రైతు రుణ మాఫీ

రుణమాఫీతో అత్యధిక శాతం రైతులకు ప్రయోజనం కలగదు. రుణమాఫీ రాజకీయ స్టంట్. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలవి. రైతులకు సాధికారత కల్పించడమే వారి సమస్యలకు పరిష్కారం. ఆ దిశగానే మేం ఆలోచిస్తున్నాం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే రైతుల సంఖ్య చాలా తక్కువ. ఎక్కువగా ప్రైవేటు రుణాలే తీసుకుంటారు. వారికి రుణ మాఫీతో ఎలాంటి ప్రయోజనం ఉండదు. రుణాలు తీసుకోవాల్సి రాకుండా ఉండాల్సిన పరిస్థితి రైతులకు రావాలి. వాళ్లు పూర్తిగా రుణమాఫీ చేశామంటున్నారు. కానీ అది నిజం కాదు. అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఉద్దేశంతోనే 'లాలీపాప్' కామెంట్ చేశాను. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీ ఏదైనా రుణమాఫీ పేరుతో ప్రజలను మభ్యపెట్టదు. రుణమాఫీతో నిజంగా ప్రయోజనం ఉంటే.. మే మూ చేసేవాళ్లం. గతంలో దేవీలాల్(ఉప ప్రధాని) సమయం నుంచి రుణమాఫీలు చేస్తూ వస్తున్నారు. 2009లో ఎన్నికల్లో గెలవడం కోసం యూపీఏ రుణమాఫీ ప్రకటించింది.

డోక్లాం వివాదం

డోక్లాం సంక్షోభ సమయంలో వ్యవహరించిన తీరును బట్టే భారత్ సామర్థ్యాన్ని నిర్ణయించాలి. చైనా చేతిలో నెహ్రూ హయాంలో మాదిరిగా భారత్ మోస పోయిందని చెప్పేంత స్థాయిలో ఏదీ జరగలేదు. అయితే, పొరుగు వారితో స్నేహాన్ని కోరుకోవాలన్నదే మన సిద్ధాంతం. మన ప్రభుత్వాలన్నీ అదే విధానాన్ని కొనసాగిస్తూ వస్తున్నాయి.

మహాకూటమి

తెలంగాణలో వీళ్లు చెబుతున్న మహా కూటమి ఏమైంది? అట్టర్ ఫ్లాప్ అయింది. ఐదేళ్లుగా మనం చూస్తే, కచ్చితమైన మహాకూటమి ఏర్పాటుపై ఎవరైనా మాట్లాడారా? వాళ్లు ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారు. ఎవరు వీరు? తమను తాము రక్షించుకునేందుకు, మద్దతు కోరుకుంటూ 'ఒకరి చేతులు మరొకరు పట్టుకుంటే అందరం సురక్షితంగా ఉంటాం' అని అనుకునేవారు. వీరందరి ఎజెండా ఒక్కటే.. మోదీ. ఏ వార్తా పత్రికలో పది పేజీలు తిరగేసినా మోదీ ఇది చేయలేదు, మోదీ అలా మోదీ ఇలా అని విమర్శించే పది మంది కూటమి నేతల మాటలే కనిపిస్తాయి. దేశం కోసం వారేం చేయబోతున్నారు, ఎందుకు చేయాలనుకుంటున్నారనే దానిపై ఏకాభిప్రాయం లేదు.

రాహుల్.. గబ్బర్ సింగ్ ట్యాక్స్



ఒక వ్యక్తి ఎలా ఆలోచిస్తాడో, అతని మాటలూ అలాగే ఉంటాయి. ప్రణబ్ ఆర్థిక మంత్రిగా పనిచేసినప్పటి నుంచే జీఎస్టీ ప్రక్రియ కొనసాగుతోంది. పార్లమెంట్‌లో జీఎస్టీ బిల్లును అందరూ ఆమోదించారు. జీఎస్టీకి ముందు రోజుల్లో దేశంలో పన్ను రేటు 30 నుంచి 40 శాతం వరకు ఉండేది. దీంతోపాటు కనిపించని పన్నులు, మళ్లీమళ్లీ పన్నులు అదనంగా ఉండేవి. జీఎస్టీతో పన్ను విధానం సరళమైంది. అత్యధిక పన్ను రేటు ఉండే దాదాపు 500 వస్తువులపై జీఎస్టీ వల్ల పన్ను రద్దయింది. రోజువారీ వాడే దాదాపు 1200 వస్తువులపై పన్ను 18శాతం నుంచి దాదాపుగా 5 శాతానికి తగ్గింది. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తున్నాం. జీఎస్టీ కౌన్సిల్‌లో అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం ఉంది. ఈ విషయంలో కాంగ్రెస్ నేతలు తమను తామే విమర్శించుకుంటున్నారా లేదా తమ పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వాలను విమర్శిస్తున్నారా? జీఎస్టీ కొత్త విధానం. సాంకేతిక అంశాల ఆధారంగా పెను మార్పు తీసుకువచ్చిన విధానం. దీనిపై రాజకీయ దురుద్దేశాలతో విమర్శలు చేయడం సరికాదు. కొందరు చిన్న వ్యాపారుల అసౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకున్నాం. మా దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్‌కు పంపుతున్నాం. అందరం కలిసి పరిష్కరిస్తున్నాం.

మూక దాడులు

సభ్య సమాజంలో ఇలాంటి వాటిని ఎవరూ సమర్థించరు. అయితే, ఇవి 2014లోనే ప్రారంభమయ్యాయా? మన సమాజంలోని చెడు అలా బహిర్గతమవుతోంది. ఇలాంటి ఘటనలను అంతా కలసికట్టుగా ఖండించాల్సిందే. భారత దేశంలో అహింసే సంప్రదాయం. ఇది అలాగే కొనసాగుతుంది. చర్చలు, సంప్రదింపుల పైనే మనకు విశ్వాసం ఉంది. సబ్ కాసాథ్.. సబ్ కా వికాస్.. మా నినాదం. 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాం. వర్గాల ప్రాతిపదికన ఆ గ్రామాలను ఎంపిక చేయలేదు.

'గాంధీ' కుటుంబం

ఆ కుటుంబంలోని నాలుగు తరాల నేతలు దేశాన్ని పాలించారు. అందుకే ఆ కుటుంబాన్ని ఒకప్పుడు 'ప్రథమ కుటుంబం' అనేవాళ్లు. ఆ 'ప్రథమ కుటుంబం'లోని వ్యక్తులు ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసుల్లో ఇప్పుడు బెయిల్‌పై ఉన్నారు. ఇది ముఖ్యంగా గమనించాల్సిన విషయం. అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మాజీ ఆర్థిక మంత్రి(చిదంబరం) పలు ఆర్థిక అక్రమాల కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

వ్యవస్థల విధ్వంసం



ఈ విషయంపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు. పీఎంకు, పీఎంఒకు వ్యతిరేకంగా ఎన్ఏసీ(జాతీయ సలహా మండలి)ని ఏర్పాటు చేసిందెవరు? కేబినెట్ ఓ నిర్ణయం తీసుకుంటే.. ఓ పెద్ద నేత ఆ పేపర్లను ప్రెస్‌మీట్లోనే చింపేస్తారు. ఇదేనా వ్యవస్థను గౌరవించడం. న్యాయవ్యవస్థలోనూ తమకు అనుకూలురైన జూనియర్లను జడ్జీలుగా నియమించలేదా? ఎంతమంది ఆర్బీఐ గవర్నర్లను బలవంతంగా పంపించలేదు? వీళ్లు వ్యవస్థల విధ్వంసం గురించి మాట్లాడుతారా? ప్రణాళిక సంఘాన్ని జోకర్ల బృందంగా అభివర్ణించింది వీరు కాదా?

ట్రిపుల్ తలాక్.. శబరిమల

ట్రిపుల్ తలాక్, శబరిమల రెండు వేర్వేరు అంశాలు. ప్రపంచంలోని చాలా ముస్లిం దేశాలు ట్రిపుల్‌తలాక్‌ను నిషేధించాయి. కాబట్టి, ఇది మతపరమైన అంశం కాదు. పొరుగునే ఉన్న పాకిస్తాన్ కూడా ట్రిపుల్‌తలాక్‌ను నిషేధించింది. కాబట్టి, దీనిని లింగ సమానత్వానికి, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయంగా గుర్తెరగాలి. ఇది మత విశ్వాసంలో భాగం కాదు. అందుకే, శబరిమల అంశంతో దీనిని పోల్చడం సరికాదు.

స్వోత్కర్ష.. వాగాడంబరమే!

- ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్, బీజేపీల వాగ్యుద్ధం

న్యూఢిల్లీ: మోదీ ఇంటర్వ్యూపై కాంగ్రెస్ స్పందించింది. ఇంటర్వ్యూలో దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలను ప్రస్తావించలేదని, కేవలం వాగాడంబరం అందులో ఉందని ఆరోపించింది. నోట్ల రద్దు, జీఎస్టీ, బ్యాంకు స్కామ్‌లు, రైతాంగ సంక్షోభం.. తదితరాల వల్ల దేశ పౌరులు ఎదుర్కొన్న కష్టనష్టాలపై ప్రధాని మాట్లాడితే బావుండేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సూర్జేవాలా విమర్శించారు. 'నేను, నా'లకే ప్రధాని ఇంటర్వ్యూ పరిమితమయిందన్నారు. ఇది 'ఫిక్స్‌డ్ ఇంటర్వ్యూ' అని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రెస్ కాన్ఫరెన్స్‌ను ఎదుర్కోవాలని సవాలు చేశారు.

కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు: బీజేపీ

కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలను ప్రధాని మోదీ చీల్చి చెండాడారని బీజేపీ ప్రశంసించింది. 'ఇది సమగ్రమైన, అద్భుతమైన ఇంటర్వ్యూ. చాన్నాళ్లుగా వార్తల్లో ఉన్న అనేక అంశాలపై ప్రధాని విస్పష్ట సమాధానం, వివరణ ఇచ్చారు. విపక్ష పార్టీల స్వార్థ ప్రచారాన్ని ప్రధాని సమర్థంగా తిప్పికొట్టారు' అని బీజేపీ అధికార ప్రతినిధి నళిన్ పేర్కొన్నారు. 'గత కొన్ని నెలలుగా విపక్ష పార్టీలు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని, అబద్ధాలను ఒకే ఒక ఇంటర్వ్యూలో ప్రధాని ప్రజలకు తేటతెల్లం చేశారు. నిజం, నిజాయితీకున్న శక్తి ఇదే' అని మరో నేత షానవాజ్ హుస్సేన్ తెలిపారు. కోర్టు కేసు తేలేవరకు అయోధ్యలో రామమందిర నిర్మాణానికి సంబంధించి ఆర్డినెన్స్ తీసుకురాబోమని ప్రధాని స్పష్టం చేయడాన్ని జనతాదళ్(యూ) స్వాగతించింది. మోదీ హయాంలోనే రామమందిర నిర్మాణం జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారని ఆర్ఎస్ఎస్ పేర్కొంది.

'ఎస్ సర్' వద్దు.. 'జైహింద్' ముద్దు!

అహ్మదాబాద్: జనవరి 1 నుంచి గుజరాత్‌లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు హాజరు తీసుకునే సమయంలో విద్యార్థులు 'ఎస్ సర్' అని కాకుండా 'జైహింద్' అని కానీ 'జై భారత్' అని కానీ హాజరు పలకాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రాథమిక, ఉన్నత విద్య డైరెక్టరేట్ అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు ఆదేశాలను జారీ చేసింది. జైహింద్, జై భారత్‌లను పలకడం ద్వారా విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తి భావనలు పెరుగుతాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి భూపేంద్ర సింగ్ పేర్కొన్నారు. సీబీఎస్ఈ అఫిలియేటెడ్ పాఠశాలలు కూడా ఈ ఆదేశాలను పాటించాలన్నారు. ఈ ఆదేశాలపై రాష్ట్రంలోని విపక్ష కాంగ్రెస్, పటీదార్ ఆందోళన సమితి విమర్శలు గుప్పించాయి. ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం కాకుండా.. రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్య నాణ్యతను, వసతులను, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకుంటే బావుంటుందని వ్యాఖ్యానించాయి.

21వ సంవత్సరంలోకి టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్‌కాంగ్రెస్ జనవరి 1న 21వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమత బెనర్జీ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 'జనవరి 1, 1998న ఈ ప్రయాణం ప్రారంభమైంది. ఈ ప్రస్థానంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ప్రజా ఉద్యమాలు నిర్వహించాం.. ప్రజల కోసం నిలుచున్నాం. ఇన్నాళ్లూ మద్దతిచ్చిన 'మా, మాటి, మానుష్'కు, 365 రోజులు పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు కృతజ్ఞతలు.. మీకు నా సెల్యూట్' అని మమత పేర్కొన్నారు. 26 ఏళ్ల పాటు కొనసాగిన కాంగ్రెస్ పార్టీని వీడి మమత బెనర్జీ 1998, జనవరి 1న తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు.

అఫ్గాన్‌లో 'ఐఎస్'కు ఎదురుదెబ్బ

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాదులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తూర్పు నంగరార్‌లో 27 మంది ఉగ్రవాదులను అఫ్గాన్ ప్రత్యేక భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. దీనికి ప్రతిగా తాలిబన్లు ఉత్తర అఫ్గాన్‌లో భద్రత బలగాలపై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో 15 మంది పోలీసులు మృతిచెందారు. ఐఎస్ ఉగ్రవాదులకు కంచుకోటగా ఉన్న అఫ్గాన్‌లోని అచిన్ జిల్లా నంగరార్‌లోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని సోమవారం ప్రత్యేక బలగాలు హెలికాప్టర్ల ద్వారా దాడులు చేశాయి. ఈ దాడుల్లో 27 మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు నంగరార్ ప్రాంతీయ కౌన్సిల్ సభ్యుడు అజ్మల్ ఒమర్ మీడియాకు తెలిపారు. అయితే ఈఘటనను ఉగ్రవాద సంస్థకు చెందిన మీడియా అమఖ్ వార్తా సంస్థ మాత్రం అఫ్గాన్-అమెరికా సంయుక్త దళాల చర్యను సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు పేర్కొంది. అయితే అజ్మల్ ఒమర్ మాత్రం ఈ ఆపరేషన్‌లో అమెరికా దళాలు పాల్గొన్నాయా లేదా అన్నది తెలియదని స్పష్టం చేశారు.

చరిత్ర సృష్టించిన న్యూ హారిజాన్!



వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ అంతరిక్షంలోకి పంపిన న్యూ హారిజాన్ అంతరిక్ష నౌక నూతన సంవత్సరం ప్రారంభంలో కొత్త చరిత్ర సృష్టించింది. మన సౌర కుటుంబంలో దాదాపు చివరన ఉన్న 'అల్టిమా టూలే'అనే చాలా చిన్న గ్రహానికి చాలా దగ్గరి నుంచి వెళ్లింది. ఇప్పటివరకు ఏ అంతరిక్ష నౌక చేరని, దూరాన్ని ఈ న్యూహారిజాన్ ఛేదించింది. అంతేకాదు దాదాపు చాలా పురాతనమైన ఖగోళ వస్తువును ఈ హారిజాన్ తొలిసారిగా సందర్శించి, దాని ఫొటోలు తీసిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మన సూర్యుడి చుట్టూ తిరుగుతున్న అల్టిమా ద్వారా మన సౌర వ్యవస్థ రహస్యాలను ఛేదించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సూర్యుడికి దాదాపు 400 కోట్ల మైళ్ల దూరంలో ఉన్న ఈ అల్టిమా.. నెప్ట్యూన్‌కు ఆవల మన సౌర వ్యవస్థలోని క్యూపర్ బెల్టులో ఉంది. దీని అసలు పేరు 2014 ఎంయూ69 కాగా, ముద్దుగా అల్టిమా టూలే అని పిలుచుకుంటున్నారు. లాటిన్ పదమైన దీనర్థం 'మన ప్రపంచానికి చాలా దూరం'. అన్ని గ్రహాల మాదిరిగా కాకుండా సూర్యుడి చుట్టూ అల్టిమా దాదాపు వృత్తాకార కక్ష్యలో తిరుగుతోందని నాసా పేర్కొంది. దీన్నిబట్టి చూస్తే ఇప్పుడున్న దూరంలోనే ఇది ఆవిర్భవించి ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

సమానత్వం కోసం మానవహారం

కేరళలో 620 కి.మీ. పొడవున చేపట్టిన మహిళలు



కొచ్చిలో మానవహారంలో మహిళలు

తిరువనంతపురం: స్త్రీ-పురుష సమానత్వం కోసం కేరళలో మహిళలు కదంతొక్కారు. మంగళవారం 65వ జాతీయ రహదారిపై కాసర్‌గఢ్ నుంచి దక్షిణ కొన వరకు 620 కిలోమీటర్ల పొడవున మహిళలు మానవహారం చేపట్టారు. మంగళవారం సాయంత్రం ప్రారంభమైన ఈ మానవహారంలో వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. వారికి సంఘీభావంగా పురుషులు మానవహారం చేపట్టారు. మానవహారం ద్వారా కులం, మతం అనే అడ్డుగోడలను మహిళలు కూలదోస్తారని కేరళ ముఖ్యమంత్రి విజయన్ విశ్వాసం వ్యక్తంచేశారు. కాసరగఢ్ వద్ద ఆరోగ్య మంత్రి శిలాజా, వెలయంబలమంలో సీపీఐ జాతీయ నేత బృందాకారత్ మానవహారంలో పాల్గొన్నారు. శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఈ మానవహారానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి ముందు సీఎం విజయన్ సామాజిక సంస్కర్త 'అయ్యంకాలి' విగ్రహాన్ని ఆవిష్కరించారు.

మానవహారంపై బీజేపీ కార్యకర్తల దాడి

కాసరగఢ్ జిల్లాలోని చెట్టుకుండ్‌లో బీజేపీ-ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మానవహారంపై దాడికి తెగబడ్డారు. మహిళలు, పోలీసులపై రాళ్లు రువ్వడంతో ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. రెండు మీడియా చానల్స్ సిబ్బందిపై దాడి చేసి ఘటనకు సంబంధించిన వీడియోలను తొలగించాల్సిందిగా బెదిరించారు. జాతీయ రహదారిపై నిలబడి ఉన్న మహిళలకు దగ్గరలోని పొదలకు కొంతమంది నిప్పు పెట్టారని, వారిని పట్టుకోవడానికి ప్రయత్నించడంతో పోలీసులపై రాళ్ళ దాడి చేశారని జిల్లా పోలీసు అధికారి అబ్దుల్ కరీం చెప్పారు.





నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బాణసంచా వెలుగుల్లో ధగధగలాడుతున్న దుబాయ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫా ఆకాశ హర్మ్యం(ఎడమ), లండన్‌లోని పార్లమెంటు ప్రాంతాలు

నోమోఫోబియా, మిస్‌ఇన్ఫర్మేషన్..

2018లో ఎక్కువగా వెతికిన పదాలివే

న్యూఢిల్లీ: టాక్సిక్, నోమోఫోబియా, మిస్ ఇన్ఫర్మేషన్, సింగిల్-యూజ్, జస్టిస్ తదితర పదాలను 2018వ సంవత్సరంలో ఎక్కువ మంది వెతికారని పలు సంస్థలు పేర్కొన్నాయి. 'టాక్సిక్'అనే పదాన్ని ఎక్కువ మంది తమ డిక్షనరీలో వెతికినట్లు ఆక్స్‌ఫోర్డ్ సంస్థ వెల్లడించింది. విషపూరితమైన అనే అర్థం వచ్చేలా టాక్సిక్ పదాన్ని వాడతారని పేర్కొంది. ఈ ఏడాదికి గానూ టాక్సిక్ వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిందని పేర్కొంది. ఇక 'జస్టిస్'పదం అర్థం కోసం ఎక్కువ మంది తమ వెబ్‌సైట్‌లో వెతికారని 'మరియమ్ వెబ్‌స్టర్'అనే సంస్థ వెల్లడించింది. 'సింగిల్ యూజ్'అనే పదాన్ని తమ డిక్షనరీలో ఎక్కువ మంది వెతికినట్లు కొలీన్స్ సంస్థ ప్రకటించింది. 2013వ సంవత్సరం నుంచి ఈ పదం అర్థం కోసం వెతికిన వారి సంఖ్య దాదాపు నాలుగింతలు పెరిగినట్లు పేర్కొంది. 'మిస్‌ఇన్ఫర్మేషన్'అనే పదం అర్థం కోసం ఎక్కువ మంది తమ వెబ్‌సైట్‌ను సంప్రదించారని 'డిక్షనరీస్.కామ్'అనే సంస్థ ప్రకటించింది. సమాచారం సరైనదా? కాదా? అని సరిచూసుకోకుండా వేగంగా వ్యాప్తి చెంది, తప్పు దోవ పట్టించే విషయాన్ని మిస్ ఇన్ఫర్మేషన్ అనే పదానికి అర్థంగా వివరించింది. 'నోమోఫోబియా'అనే పదం వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచినట్లు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రకటించింది. మొబైల్ లేకుండా ఉండలేకపోవడం, భయపడటం వంటివి నోమోఫోబియా కిందకి వస్తాయని వెల్లడించింది. ఎక్కువ మంది వాడే పదాలను ట్రాక్ చేసే 'గ్లోబల్ లాంగ్వేజ్ మానిటర్ (జీఎల్ఎమ్)' ఈ ఏడాది రెండు పదాలను టాప్ వర్డ్స్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించింది.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌	నిఫ్టీ
186 ▲	48 ▲
36,255	10,910

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

సూచీ			
నాస్‌డాక్‌	6,635	▲	50
డోజోన్స్‌	23,327	▼	265
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (సోమవారం ముగింపు)	6,728	▼	6
డాక్స్‌ (శుక్రవారం ముగింపు)	10,558	▲	177
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,493	▲	11
నికాయ్‌ (శుక్రవారం ముగింపు)	20,014	▼	63

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	68.9	70.54
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	87.33	90.64
€	యూరో	ఎస్‌బీఐ	78.55	81.47
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	62.4	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	48.23	50.44
SS	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	50.29	52.06
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	17.25	20.25
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	--	--
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	9.1	10.75



ప్రజా రవాణాకు జీపీఎస్‌ తప్పనిసరి!

- కొత్త వాహన నిబంధనలు అమల్లోకి
- పానిక్‌ బటన్‌ సైతం ఉండాల్సిందే
- ట్రాకింగ్, ప్రయాణికుల భద్రత కోసమే!

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో

పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వాహనాల్లో గ్లోబల్‌ పొజిషనింగ్‌ సిస్టమ్‌ (జీపీఎస్‌), పానిక్‌ బటన్‌ ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు దేశవ్యాప్తంగా పలు నిబంధనలను మంగళవారం నుంచి అమల్లోకి తెచ్చింది. జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిబంధనల ప్రకారం... ఆటో రిక్షాలు, ఈ– రిక్షాలు మినహా సెంట్రల్‌ మోటార్‌ వెహికిల్స్‌ రూల్స్‌– 1989 కిందకు వచ్చే అన్ని బస్సులు, స్కూల్‌ బస్సులు, ట్యాక్సీ వంటి పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వాహనాలకు వెహికిల్‌ లొకేషన్‌ ట్రాకింగ్‌ (వీఎల్‌టీ) పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. నేషనల్‌ పర్మిట్‌ ఉన్న కమర్షియల్‌ వాహనాలను సైతం ఈ నిబంధన కిందకు చేర్చారు. జీపీఎస్‌ ట్రాకింగ్‌ సిస్టమ్, పానిక్‌ బటన్‌ ఉంటేనే కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్‌ చేస్తారు. ఇవి ఉంటేనే పాత వాహనాలకు ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ జారీ చేస్తారు.

దేశవ్యాప్తంగా 2.5 కోట్ల వాహనాలు..

భారత్‌లో ప్రస్తుతం 1.8 కోట్ల పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వాహనాలు ఉన్నట్టు సమాచారం. అలాగే నేషనల్‌ పర్మిట్‌ ఉన్న ట్రక్స్‌ 75 లక్షలు ఉన్నాయని జీపీఎస్‌ ట్రాకింగ్‌ పరికరాలు తయారు చేసే వోల్టీ ఐవోటీ సొల్యూషన్స్‌ వ్యవస్థాపకుడు కోణార్క్‌ ‘సాక్షి’ బిజినెస్‌ బ్యూరో ప్రతినిధికి చెప్పారు. ఇప్పటి వరకు ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్‌ కంపెనీలు తమ వాహనాల్లో జీపీఎస్‌ ట్రాకింగ్‌ పరికరాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ సంస్థలే వాహన రాకపోకలను ట్రాక్‌ చేస్తున్నాయి. తాజా విధానంలో ప్రభుత్వమే రంగంలోకి దిగుతుంది. పన్ను ఎగ్గొట్టే వాహనాలను గుర్తించవచ్చు కూడా. మహిళలు, విద్యార్థులు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని కొత్త నిబంధనను తెచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. వాహనం ప్రమాదానికి గురైతే ఎక్కడ జరిగిందో సులువుగా గుర్తించవచ్చు కూడా.

ఏఐఎస్‌ ధ్రువీకరణ ఉంటేనే..

టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌ ఏఐఎస్‌– 140 నేషనల్‌ వెహికిల్‌ ట్రాకింగ్‌ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. ట్రాకింగ్‌ డివైస్‌ వివరాలు, చాసిస్‌ నంబరును వాహన పోర్టల్‌కు అనుసంధానిస్తారు. దీంతో వాహనాల కదలికలన్నీ డేటా సెంటర్లో నిక్షిప్తం అవుతాయి. అవసరమైతే ట్రాన్స్‌పోర్ట్, పోలీసు శాఖలకు మాత్రమే ఈ సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. వీటి పర్యవేక్షణకు ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్‌ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇక నూతన నిబంధనల ప్రకారం ఏఐఎస్‌– 140 ధ్రువీకరణ ఉన్న జీపీఎస్‌ ట్రాకింగ్‌ పరికరాలను మాత్రమే ఇందుకు వినియోగించాలి. తెలుగు రాష్ట్రాల నుంచి వోల్టీ ఐవోటీ సొల్యూషన్స్‌ పరికరాలు ఈ సర్టిఫికేషన్‌ పొందినట్లు కోణార్క్‌ చెప్పారు.

ఎల్‌ఐసీ చైర్మన్‌గా భార్గవకు అదనపు బాధ్యతలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీకి చైర్మన్‌గా ప్రస్తుత ఎండీ హేమంత్‌ భార్గవ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎల్‌ఐసీ చైర్మన్‌గా వీకే శర్మ డిసెంబర్‌ 31న పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా భార్గవకు ఈ బాధ్యతలు అప్పగించారు. హేమంత్‌ భార్గవ 2017 ఫిబ్రవరి నుంచి ఎల్‌ఐసీ ఎండీ బాధ్యతల్లో ఉన్నారు.

చైర్మన్‌ పదవికి ఇంటర్వ్యూలు

ఎల్‌ఐసీ చైర్మన్, ఎండీ పోస్టులకు అభ్యర్థుల ఎంపికలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ శాఖ సెక్రటరీ బీపీ శర్మ ఆధ్వర్యంలోని బ్యాంకు బోర్డ్‌ బ్యూరో (బీబీబీ) ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎండీగా ఉషా సంగ్వాన్‌ పదవీకాలం గతేడాది సెప్టెంబర్‌తో ముగిసిపోవడంతో ఈ పోస్ట్‌ ఖాళీగా ఉంది. ఎల్‌ఐసీ ఎగ్జిక్యూటివ్‌ బోర్డులో ఒక చైర్మన్, నలుగురు ఎండీలుంటారు. చైర్మన్, ఎండీ పదవుల కోసం ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు సంబంధిత వర్గాల కథనం. ఎల్‌ఐసీలోనే అధికారుల స్థాయిలో ఉన్న ఎంఆర్‌ కుమార్, హెచ్‌ఎస్‌ శశికుమార్, టీసీ సుశీల్‌ కుమార్‌ (హైదరాబాద్‌ జోనల్‌ మేనేజర్), ఎల్‌ఐసీ మ్యూచువల్‌ ఫండ్‌ సీఈవో రాజ్‌కుమార్‌ తదితరులు రేసులో ఉన్నారు. ఇక ప్రస్తుతం ఎండీ పదవుల్లో ఉన్న సునీతా శర్మ ఈ ఏడాది మార్చిలో రిటైర్‌ కానున్నారు. అలాగే బి. వేణుగోపాల్‌ మే నెలలో, హేమంత్‌ భార్గవ జూలైలో పదవీ విరమణ చేయాల్సి ఉంది.

తొలి రోజు రూపాయికి బలం

- డాలర్‌తో 34 పైసలు లాభం
- 69.43 వద్ద ముగింపు



ముంబై: కొత్త సంవత్సరం తొలి రోజున రూపాయి తన బలాన్ని చూపించింది. ఫారెక్స్‌ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే 34 పైసలు లాభపడి 69.43 వద్ద క్లోజయింది. అంతకుముందు రెండు రోజుల్లో రూపాయి లాభపడిన విషయం తెలిసిందే. మొత్తంమీద మూడు రోజుల్లో రూపాయి 92 పైసలు రికవరీ అయింది. ఎగుమతిదారులు డాలర్లను విక్రయించడం, స్టాక్‌ మార్కెట్ల ర్యాలీ కలిసొచ్చాయి. ఎగుమతిదారులు, బ్యాంకులు డాలర్లను విక్రయించడం రూపాయి బలపడటానికి కారణమని ట్రేడర్లు తెలిపారు. ఫారెక్స్‌ మార్కెట్లో మంగళవారం తొలుత 69.63 వద్ద ప్రారంభమైన రూపాయి ఆ తర్వాత మరింత బలపడింది. గత సంవత్సరం చివరి రోజు రూపాయి 18 పైసల లాభంతో ముగింపు పలికిన విషయం గమనార్హం. గత సంవత్సరంలో మొత్తం మీద రూపాయి 9.23 శాతం విలువను కోల్పోయింది. 2017 చివరికి రూపాయి డాలర్‌తో 63.87వద్ద ఉండటం గమనార్హం. అక్టోబర్‌ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్‌ ధరలు అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో... క్రమంగా కోలుకుంటూ వస్తోంది.

ఈ సారి బడ్జెట్లో పన్ను రాయితీ?

- ఎన్నికల నేపథ్యంలో మినహాయింపులుంటాయని అంచనా
- ఎన్నికల హామీల్లో సార్వత్రిక కనీస ఆదాయం కూడా..!
- త్వరలో చిరు వ్యాపారులకు ప్యాకేజీ ప్రకటించే అవకాశం
- ఆర్థిక శాఖ వర్గాలు, విశ్లేషకుల అంచనా



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోసారి ఆదాయపు పన్ను రాయితీల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఎంత తగ్గిస్తారు? ఏ మేరకు ఉపశమనం కలిగిస్తారు? అనే విషయాలపై ఇంకా స్పష్టత లేకపోయినా... ఈ సారి ఓటాన్‌ అకౌంట్‌లో ఆదాయపు పన్ను రాయితీల ప్రస్తావన కచ్చితంగా ఉంటుందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ‘‘ఓటాన్‌ అకౌంట్‌ ద్వారా మూడు నుంచి నాలుగు నెలల కాలానికి వ్యయాల కోసం పార్లమెంటు అనుమతి కోరే అవకాశం ఉంది. కాకపోతే, ఈ ఓటాన్‌ అకౌంట్‌లో తదుపరి ఆర్థిక సంవత్సరం కోసం పథకాలను ప్రకటిస్తే దానిపై ఓటింగ్‌ జరగదు. ఈ నేపథ్యంలో ఆదాయపన్ను రాయితీలను జైట్లీ ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి’’ అని ఆర్థిక శాఖ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అలాగే, మ్యూచువల్‌ ఫండ్స్‌ నుంచి ఉపసంహరించుకునే మొత్తాలపై పన్నును సమీక్షించే అవకాశం ఉందని, దీనివల్ల మధ్యతరగతి ప్రజలకు ఖర్చు చేసేందుకు మరింత అదనపు ఆదాయం చేతిలో మిగులుతుందని, అది వినియోగాన్ని పెంచి, ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని ఆయా వర్గాలు విశ్లేషించాయి.

సార్వత్రిక కనీస ఆదాయం (యూబీఐ)

ఈ సారి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా యూనివర్సల్‌ బేసిక్‌ ఇన్‌కమ్‌ (సార్వత్రిక కనీస ఆదాయం) హామీ కూడా తెరపైకి రావచ్చని వినవస్తోంది. నిజానికిదేమీ కొత్త ప్రతిపాదన కాదు. 2016–17 నాటి ఆర్థిక సర్వేలో పేర్కొన్నదే. పేద ప్రజలకు నేరుగా నగదు ప్రయోజనాన్ని అందించాలంటూ... ప్రజలకు ఎక్కువ చేయూత అవసరమైన చోట సరైన స్థాయిలో సహకారం అందడం లేదని, ఈ నేపథ్యంలో పేద ప్రజలకు మరింత మెరుగైన రీతిలో సాయం అందించేందుకు యూబీఐని పరిష్కారంగా చేసుకోవాలని ఆర్థిక సర్వే పేర్కొంది. నాడు ఆర్థిక సర్వేను రూపొందించిన కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్‌ సుబ్రమణియన్, ఓ కుటుంబానికి కనీస సార్వత్రిక ఆదాయం కింద రూ.7,620ను ప్రతిపాదించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్‌) అయితే, 2011–12 నాటి నివేదికలో యూబీఐని రూ.2,600గా పేర్కొంది. యూబీఐ హామీతో మోదీ సర్కారు ఎన్నికలకు వెళ్లవచ్చనే అంచనాలున్నాయి. దేశవ్యాప్తంగా రైతుల రుణ మాఫీతో పోలిస్తే యూబీఐ అన్నది ఎక్కువ మంది ప్రజలకు మేలు చేసే పథకం అవుతుంది. అందులో రైతులు కూడా ఉంటారు. ఒక్కసారి ఇచ్చే రుణ మాఫీతో పోలిస్తే, యూబీఐ మరింత ప్రభావవంతమైనదనే విశ్లేషణలున్నాయి.

రిటైల్‌ వ్యాపారులకు చేయూత

రిటైల్, చిన్న వ్యాపారుల సంఖ్య భారీగానే ఉంటుంది. డీమోనిటైజేషన్, ఆ తర్వాత జీఎస్టీతో ఈ వర్గాలు ఎక్కువగా సమస్యలు ఎదుర్కొన్నాయి. వాటి నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు కూడా. రిటైల్‌ చెయిన్లు, భారీ డిస్కౌంట్లతో ఆకర్షిస్తున్న బడా ఈ కామర్స్‌ సంస్థల నుంచి వీరంతా తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల ముందే ఈ వర్గాల కోసం ప్రత్యేక ప్యాకేజీని మోదీ సర్కారు ప్రకటించొచ్చన్న అంచనాలున్నాయి. చిన్న రిటైలర్లు, వ్యాపారుల కోసం వడ్డీ రాయితీతో కూడిన చౌక రుణాలను ఈ పథకం ద్వారా అందించే అవకాశం ఉంది.

చిన్న సంస్థల రుణాలపై ఆర్‌బీఐ మార్గదర్శకాలు



న్యూఢిల్లీ: డిఫాల్ట్‌ అయిన చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ) రుణాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రిజర్వ్‌ బ్యాంక్‌ మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ప్రకారం డిఫాల్ట్‌ అయినప్పటికీ జనవరి 1 నాటికి ’స్టాండర్డ్‌’ స్థాయిలోనే ఉన్న రుణాలను వన్‌ టైమ్‌ పునర్వ్యవస్థీకరణకు అనుమతించింది. వివిధ రూపాల్లో తీసుకున్న రుణపరిమాణం రూ. 25 కోట్లు దాటని సంస్థలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. 2020 మార్చి 31 నాటికి పునర్వ్యవస్థీకరణ అమలు చేయాల్సి ఉంటుంది.

పెట్రోల్, డీజిల్‌ కంటే విమాన ఇంధనమే చౌక!

భారీగా తగ్గిన రేట్లు



న్యూఢిల్లీ: విమాన ఇంధనం (ఏటీఎఫ్‌) ధరను కిలో లీటర్‌కు రూ.9,990 (14.7 శాతం) తగ్గిస్తూ ప్రభుత్వరంగ చమురు సంస్థలు నిర్ణయాన్ని ప్రకటించాయి. దీంతో ఢిల్లీలో కిలోలీటర్‌ ఏటీఎఫ్‌ ధర రూ.58,060కు దిగొచ్చింది. అంటే లీటర్‌ ధర రూ.58.06. ఢిల్లీ మార్కెట్లో లీటర్‌ పెట్రోల్‌ ధర రూ.68.65తో పోలిస్తే తక్కువకు అందుబాటులోకి వచ్చింది. లీటర్‌ డీజిల్‌ ధర రూ.62.66 కంటే కూడా చౌకగా మారింది. ఎయిర్‌లైన్స్‌ సంస్థలకు ఇది పెద్ద ఎత్తున ఊరటనిచ్చే నిర్ణయం. డిసెంబర్‌లోనూ ఓ సారి పెద్ద మొత్తంలో రేట్లకు కోత విధించిన విషయం తెలిసిందే. దీంతో ఏటీఎఫ్‌ ధరలు ఏడాది కాలంలోనే కనిష్ట స్థాయికి చేరాయి.

2019లోనూ కేంద్రానికి భారీగా నిధులు!

- ఎయిర్‌ ఇండియా వాటాల అమ్మకమే తరువాయి
- 2018లో ప్రభుత్వ కంపెనీల్లో వాటాల అమ్మకంతో రూ.77,417 కోట్లు



కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, వాటాల విక్రయం ద్వారా రూ.77,417 కోట్లను సమీకరించింది. ఇక 2019లోనూ ఎయిర్‌ ఇండియాలో వాటాలను ఎలాగైనా విక్రయించాలన్న లక్ష్యంతో ఉంది. దీంతో ఈ ఏడాది కూడా కేంద్రానికి గణనీయంగానే నిధులు సమకూరనున్నాయి. గతానికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ కంపెనీల మధ్య విలీనాల ద్వారా తన నిధుల అవసరాలను తీర్చుకునే ప్రణాళికలను అమలు చేస్తున్న తీరు చూస్తూనే ఉన్నాం. ఓఎన్‌జీసీ ఇదే విధంగా హెచ్‌పీసీఎల్‌ను కొనుగోలు చేసింది. దీంతో హెచ్‌పీసీఎల్‌లో కేంద్రం తనకున్న వాటాను ఓఎన్‌జీసీకి విక్రయించడం ద్వారా గణనీయంగానే నిధులు సమకూరాయి. సీపీఎస్‌ఈ ఈటీఎఫ్, భారత్‌ 22ఈటీఎఫ్, కోల్‌ ఇండియాలో వాటాల అమ్మకం, ఆరు ప్రభుత్వరంగ సంస్థల ఐపీవోల ద్వారా కేంద్రానికి గత సంవత్సరంలో 77,417 కోట్ల నిధులు అందుబాటులోకి వచ్చాయి.

2019 అమ్మకాలు: ఎయిర్‌ ఇండియాలో వాటాలను కేంద్రం గతేడాది అమ్మకానికి పెట్టినప్పటికీ... ఏ ప్రైవేటు సంస్థ కూడా ముందుకు రాలేదు. ఎయిర్‌ఇండియాకు రూ.55వేల కోట్ల వరకూ రుణాలు ఉండటంతోపాటు కార్యకలాపాలపై పెద్ద ఎత్తున నష్టాలు వస్తున్న విషయం గమనార్హం. దీంతో ఎయిర్‌ ఇండియా అమ్మకానికి ముందు ఆ సంస్థను గాడిలో పెట్టే చర్యలను కేంద్రం అమల్లో పెట్టింది. తన ప్రణాళికలో భాగంగా ఎయిర్‌ ఇండియా సబ్సిడరీలు ఎయిర్‌ ఇండియా ట్రాన్స్‌పోర్ట్‌ సర్వీసెస్, ఎయిర్‌ ఇండియా ఇంజనీరింగ్‌ సర్వీసెస్, భవనాలు, ఖాళీ స్థలాలను విక్రయించనుంది. దీని ద్వారా రూ.29,000 కోట్ల వరకు రుణ భారం తగ్గించనుంది. ఎయిర్‌ ఇండియా లాభాల్లోకి వచ్చేందుకు గాను నిధుల సాయం కూడా చేయనుంది. ఇక 2019లో పవన్‌ హన్స్‌లో తనకున్న 51 శాతం వాటాను కేంద్రం విక్రయించనుంది. మిగిలిన 49 శాతం వాటా ఓఎన్‌జీసీకి ఉంది. ఇక ఓఎన్‌జీసీ, ఐవోసీఎల్, ఆయిల్‌ ఇండియా, ఎన్‌ఎల్‌సీ, బీహెచ్‌ఈఎల్‌ తదితర కంపెనీల షేర్ల బైబ్యాక్‌ల ద్వారా కేంద్రానికి రూ.12,000 కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఆర్‌ఈసీలో కేంద్రం వాటాలను పీఎఫ్‌సీ కొనుగోలు చేయడం ద్వారా మరో రూ.15,000 కోట్లు సమకూరతాయి. ఎస్‌జేవీఎన్‌లో కేంద్రం వాటాను ఎన్‌టీపీసీ కొనడం ద్వారా రూ.6,000 కోట్లు రానున్నాయి.

ప్రారంభమైన ఏపీ ఆర్‌వోసీ

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌ రిజిస్ట్రార్‌ ఆఫ్‌ కంపెనీస్‌ (ఆర్‌వోసీ) కార్యాలయం ప్రారంభమైంది. మినిస్ట్రీ ఆఫ్‌ కార్పొరేట్‌ అఫైర్స్‌ (ఎంసీఏ) రీజినల్‌ డైరెక్టర్‌ ఎం.పి.షా ముఖ్య అతిథిగా హాజరై దీన్ని ప్రారంభించారు. ప్రస్తుతానికి విజయవాడలోని సూర్యారావుపేటలో ఏపీ ఆర్‌వోసీ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏపీ ఆర్‌వోసీగా డెన్నింగ్‌ కె బాబు, అసిస్టెంట్‌ ఆర్‌వోసీ (ఏఆర్‌వోసీ)గా ఎల్‌.సాయి శంకర్‌ నియమితులైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌వోసీ ఆర్‌సీ మిశ్రా, ఇండియన్‌ కార్పొరేట్‌ లా సర్వీసెస్‌ (ఐసీఎల్‌ఎస్‌) అధికారులు, ఇండియన్‌ కంపెనీ సెక్రటరీస్‌ ఇనిస్టిట్యూట్‌ (ఐసీఎస్‌ఐ) అమరావతి, విశాఖపట్నం చాప్టర్ల ప్రతినిధులు, ఇండియన్‌ చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ ఇనిస్టిట్యూట్‌ (ఐసీఏఐ) విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం చాప్టర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక బ్యాంక్‌ ఎంసీఎల్‌ఆర్‌ పెంపు



న్యూఢిల్లీ: ప్రైవేట్‌ రంగ కర్ణాటక బ్యాంక్‌ తాజాగా మార్జినల్‌ కాస్ట్‌ ఆఫ్‌ ఫండ్‌ ఆధారిత రుణాలపై వడ్డీ రేటును (ఎంసీఎల్‌ఆర్‌) 0.15 శాతం పెంచింది. దీంతో ఏడాది వ్యవధి ఎంసీఎల్‌ఆర్‌ 9.10 శాతానికి చేరినట్లవుతుందని, జనవరి 1 నుంచి ఇది అమల్లోకి వచ్చిందని బ్యాంక్‌ తెలిపింది. ఇక ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్‌ 0.10 శాతం పెరిగి 8.75 శాతానికి, మూడు నెలలది 0.10 శాతం మేర పెరిగి 8.70 శాతానికి చేరాయి. ఒక నెల రోజులు, ఒక్క రోజు వ్యవధి ఎంసీఎల్‌ఆర్‌ను కూడా 0.10 శాతం మేర పెంచినట్లు కర్ణాటక బ్యాంక్‌ తెలిపింది. ఇకపై 6 నెలల ఎంసీఎల్‌ఆర్‌తో అనుసంధానమైన రూ. 75 లక్షల దాకా రుణాలపై 8.80 శాతం వడ్డీ రేటు ఉంటుందని వివరించింది. అటు మరో ప్రైవేట్‌ రంగ ధన్‌లక్ష్మి బ్యాంక్‌ కూడా జనవరి 1 నుంచి 1 ఏడాది వ్యవధి ఎంసీఎల్‌ఆర్‌ను పెంచడంతో ఇది 9.90 శాతానికి చేరింది.

బ్యాంకింగ్‌ యాప్‌ ఆవిష్కరణ

కాగా కర్ణాటక బ్యాంక్‌ గురువారం బ్యాంకింగ్‌ యాప్‌ను ఆవిష్కరించింది. తన వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఈ యాప్‌ను ఆవిష్కరించినట్లు బ్యాంక్‌ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం బ్యాంక్‌ సేవలకు సంబంధించి ఉన్న పలు యాప్‌ల (బీహెచ్‌ఐఎం కేబీఎల్‌ యూపీఐ, కేబీఎల్‌ ఎంపాస్‌బుక్, కేబీఎల్‌ లొకేటర్, ఎంకామర్స్‌ ఆన్‌లైన్‌) సేవలు సహా పలు బ్యాంక్‌ సేవలు సమగ్రంగా తాజా యాప్‌ ద్వారా అందుబాటులోకి వస్తాయని బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ అండ్‌ సీఈఓ మహాబలేశ్వర్‌ ఎంఎస్‌ పేర్కొన్నారు.

సీసీఐ కార్యదర్శిగా పి.కె. సింగ్‌



న్యూఢిల్లీ: కాంపిటీషన్‌ కమిషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ) కొత్త కార్యదర్శిగా పి.కె.సింగ్‌ నియమితులయ్యారు. ఇప్పటిదాకా సీసీఐకి ఆయన న్యాయపరమైన అంశాలపై సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. కార్యదర్శి పోస్టులో నియామకం కోసం సీసీఐ సెప్టెంబర్‌లో దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే, సీసీఐకి అయిదేళ్ల పాటు సలహాదారుగా అనుభవమున్న వారిని కూడా ఎంపిక చేయొచ్చన్న నిబంధన మేరకు సింగ్‌ను నియమించినట్లు సంస్థ తెలిపింది. గుత్తాధిపత్య ధోరణులు, నిర్బంధ వాణిజ్య విధానాల నివారణ కమిషన్‌ స్థానంలో 2003లో సీసీఐ ఏర్పాటైంది. వ్యాపార రంగంలో పోటీ సంస్థలను దెబ్బతీసే ధోరణులకు చెక్‌ చెప్పేందుకు, విలీనాలు.. కొనుగోళ్ల డీల్స్‌ను నియంత్రించేందుకు సీసీఐ ఏర్పాటైంది.

దోమ కుట్టకుండా.. రూ.6 వేల కోట్లు!!

- మార్కెట్లోకి కొత్త నివారణ ఉత్పత్తులు
- ఐదు కంపెనీల పోటాపోటీ
- 80 శాతం వాటా ఈ సంస్థలదే



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఇళ్లలో దోమల నివారణకు ఏటా దేశవ్యాప్తంగా జనం పెడుతున్న ఖర్చెంతో తెలుసా? అక్షరాలా ఆరువేల కోట్ల రూపాయలు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. జనాన్ని దోమలు ఎంతలా భయపెడుతున్నాయో చెప్పటానికి ఈ అంకెలు చూస్తే చాలు. అయితే ఇదంతా ఇళ్లలో దోమల నివారణ ఉత్పత్తుల కోసం జనం చేస్తున్న ఖర్చు మాత్రమేనండోయ్‌!!. ఇక కార్యాలయాలు, షాపులు, వాణిజ్య సముదాయాలు, వీధుల్లో ప్రభుత్వ సంస్థలు చేస్తున్న వ్యయం దీనికి అదనం. దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణకయ్యే ఆసుపత్రి ఖర్చులు, వాటి కోసం వాడే మందులు ఈ లెక్కలోకి రావటం లేదు. ఎందుకంటే మలేరియా, డెంగ్యూ, చికున్‌ గున్యాతో పాటు కొత్తగా జికా, వెస్ట్‌ నైల్‌ వంటి వైరస్‌ల వ్యాప్తికి దోమలు కారణమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వీటి బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారు ఎందరో!!. అందుకే దోమల నివారణకు ఇళ్లలో లిక్విడ్‌ వేపరైజర్స్, ఏరోసోల్స్, ఇన్సెన్స్‌ స్టిక్స్, క్రీములు, మ్యాట్స్, ఆయిల్స్‌ వంటి ఉత్పత్తులు వినియోగిస్తున్నారు.

సగం కుటుంబాల్లో..

దోమల నివారణ ఉత్పత్తులు ఇప్పుడు పల్లెలకూ పాకాయి. కిరాణా దుకాణాలు, జనరల్‌ స్టోర్స్, మందుల షాపుల్లో విరివిగా లభిస్తున్నాయి. అటు కంపెనీలు సైతం విభిన్న రకాల్లో వీటిని తయారు చేస్తూ కస్టమర్లకు చేరువ అవుతున్నాయి. బ్రాండెడ్‌ కంపెనీలు ఈ ఉత్పత్తుల తయారీకి ఏళ్ల తరబడి శ్రమిస్తున్నాయి. పరిశోధన, పరీక్షల అనంతరం వీటిని విడుదల చేస్తున్నాయి. భారత్‌లో 28 కోట్ల కుటుంబాల్లో.. 13.4 కోట్ల కుటుంబాలు అన్‌బ్రాండెడ్‌ ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు గోద్రెజ్‌ కన్స్యూమర్‌ ప్రొడక్ట్స్‌ ఇండియా, సార్క్‌ సీఈవో సునీల్‌ కటారియా చెప్పారు. దేశంలో చిన్నాచితకా యూనిట్లు తయారు చేసిన నకిలీ ఇన్సెన్స్‌ (అగర్‌బత్తీలు) వ్యాపారం ఏటా రూ.500 కోట్లు ఉంటోందని ‘సాక్షి’ బిజినెస్‌ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ఇక కాయిల్స్‌ చవకగా దొరుకుతాయి కాబట్టి వీటికి ఎక్కువ గిరాకీ ఉంటోందని వెల్లడించారు. బ్రాండెడ్‌ కంపెనీల కాయిల్స్‌ వ్యాపారం రూ.2,220 కోట్లుగా ఉంది.

ఇదీ భారత మార్కెట్‌..

దేశవ్యాప్తంగా ఇళ్లలో వాడుతున్న దోమల నివారణ ఉత్పత్తుల మార్కెట్‌ రూ.6,000 కోట్లు. ఏటా ఈ మార్కెట్‌ 10 శాతం వృద్ధి చెందుతోంది. వీటిలో కాయిల్స్‌ వాటా అత్యధికంగా 37 శాతం ఉంది. లిక్విడ్‌ వేపరైజర్స్‌ 34 శాతం, ఏరోసోల్స్‌ 14, ఇన్సెన్స్‌ స్టిక్స్‌ 11 శాతం వాటా కైవసం చేసుకున్నాయి. మిగిలిన వాటాను క్రీములు, మ్యాట్స్, ఆయిల్స్‌ వంటి ఉత్పత్తులు దక్కించుకున్నాయి. చిత్రమేంటంటే వీటన్నిటిలో టాప్‌–5 బ్రాండ్స్‌ ఏకంగా 80 శాతం మార్కెట్‌ను చేజిక్కించుకున్నాయి. దోమల నివారణ ఉత్పత్తుల రంగంలో గోద్రెజ్‌ కన్స్యూమర్‌ ప్రొడక్ట్స్, ఎస్‌సీ జాన్సన్, రెక్కిట్‌ బెన్‌కిసర్, జ్యోతి ల్యాబొరేటరీస్, డాబర్‌లు అగ్రశ్రేణి కంపెనీలుగా కొనసాగుతున్నాయి. గోద్రెజ్‌కు చెందిన గుడ్‌నైట్‌ బ్రాండ్‌ ఏటా రూ.2,500 కోట్ల వ్యాపారాన్ని చేస్తూ టాప్‌ వన్‌ స్థానంలో ఉంది.

2019.. బోణీ బాగుంది!

- మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు
- బ్యాంకింగ్ షేర్ల ముందంజ
- సెన్సెక్స్‌కు 186 పాయింట్ల లాభం
- నిఫ్టీ 47 పాయింట్ల పెరుగుదల
- 10900పైన ముగింపు



దేశీ స్టాక్ మార్కెట్లు 2019వ సంవత్సరాన్ని లాభాలతో ఆరంభించాయి. ఉదయం స్వల్ప లాభాలతోనే ప్రారంభమైన ప్రధాన సూచీలు ఆ తర్వాత నష్టాల్లోకి వెళ్లాయి. కానీ, మధ్యాహ్నం తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, పలు ఇతర రంగాల స్టాక్స్‌లో కొనుగోళ్లతో సూచీలు లాభాల బాట పట్టాయి. నిఫ్టీ 47 పాయింట్లకు పైగా లాభంతో 10,910 వద్ద ముగిసింది. అటు బీఎస్‌ఈ సెన్సెక్స్ సైతం 186 పాయింట్లతో 36,254 వద్ద క్లోజయింది. బ్యాంకింగ్ రంగం కోలుకునే దశలో ఉందని, ఎన్‌పీఏలు తగ్గుముఖం పడుతున్నాయంటూ ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ చేసిన వ్యాఖ్యలు సానుకూల ప్రభావాన్ని చూపించాయి. అంతర్జాతీయ మార్కెట్లకు సెలవు కావటంతో అక్కడి నుంచి ప్రతికూల సంకేతాలు లేకపోవడం, రూపాయి బలపడడం అనుకూలించాయి. బ్యాంకింగ్ రంగం స్థూల ఎన్‌పీఏల రేషియో మార్చి త్రైమాసికానికి 11.5 శాతంగా ఉంటే, సెప్టెంబర్ త్రైమాసికానికి 10.8 శాతానికి తగ్గినట్టు ఆర్‌బీఐ తన ఆర్థిక స్థిరత్వ నివేదికలో పేర్కొనటం తెలిసిందే. ''సెషన్ ఆరంభంలో నష్టాలతో బుల్స్ మరోసారి తమ బలాన్ని చూపించారు. ఫైనాన్షియల్ స్టాక్స్ అండతో నిఫ్టీ కీలకమైన 10,900 పాయింట్ల పైన క్లోజయింది. డిసెంబర్ నెలకు సంబంధించి ఇప్పటి వరకు వెలువడిన ఆటోమొబైల్ కంపెనీల విక్రయ గణాంకాలు మిశ్రమంగా ఉన్నాయి. కార్పొరేట్ కంపెనీల ఫలితాలు వచ్చే వారం ఆరంభమవుతాయి. లిక్విడిటీ (నిధుల ప్రవాహం), సెంటిమెంట్ మార్కెట్‌ను స్వల్ప కాలంలో నడిపిస్తాయి'' అని షేర్‌ఖాన్ అడ్వైజరీ హెడ్ హేమంగ్‌జాని తెలిపారు. వాణిజ్య యుద్ధ ఆందోళనలు, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి మందగమనం, చమురు ధరలపై అనిశ్చితితో 2019లోనూ అస్థిరతలు కొనసాగుతాయని అంచనా వేశారు. ''కొత్త కేలండర్ సంవత్సరంలో ఆరంభం గట్టిగానే ఉంది. నిఫ్టీ బుధవారం ఉదయం అప్‌సైడ్ గ్యాప్ అప్‌తో నిరోధక స్థాయి 10,924కు పైన ఆరంభమైనా ఆశ్చర్యపోనవసరం లేదు. గత కొన్ని రోజులుగా చెబుతున్నట్టే ర్యాలీ 11050–11200 స్థాయిల వరకు కొనసాగుతుంది. దిగువ వైపున 10,840–10800 బలమైన మద్దతు స్థాయిలు'' అని ఏంజెల్ బ్రోకింగ్ చీఫ్ అనలిస్ట్ సమీత్ చావన్ తెలిపారు.

వీటికి లాభాలు

సెన్సెక్స్‌లో భారతీ ఎయిర్‌టెల్ షేరు అత్యధికంగా 2.76 శాతం పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ 2 శాతం, యస్ బ్యాంకు ఒకటిన్నర శాతం మేర లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, హీరో మోటోకార్ప్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, మారుతి, కోల్ ఇండియా లాభాల్లో ముగిశాయి.

పీఎస్‌యూ బ్యాంకు స్టాక్స్ ర్యాలీ

ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు కొన్ని మంగళవారం భారీ లాభాలను ఆర్జించాయి. ప్రభుత్వరంగ బ్యాంకులకు నిధుల సాయానికి కేంద్రం నిర్ణయం తీసుకోవడం, ఆర్‌బీఐ గవర్నర్ చేసిన వ్యాఖ్యలే లాభాలకు కారణమని విశ్లేషకులు తెలిపారు.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్‌ఈ	2,295
ఎన్‌ఎస్‌ఈ	18,054
ఎన్‌ఎస్‌ఈ (డెరివే.)	5,67,489
ఎఫ్ఐఐ	- 48
డీఐఐ	142

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	321.85	2.99
HDFC	2,010.00	2.12
SBIN	300.7	1.62
BPCL	368.5	1.59
INFRATEL	263	1.54
HINDPETRO	257.05	1.5
YESBANK	184.4	1.43
AXISBANK	628	1.31
HDFCBANK	2,149.00	1.29
ICICIBANK	364.2	1.12

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
M&M	773	-3.84
HINDALCO	222.9	-1.46
IBULHSGFIN	842.05	-1.38
HINDUNILVR	1,799.00	-1.13
JSWSTEEL	303.35	-1.11
ONGC	148.25	-1.1
TATASTEEL	515.6	-1.05
UPL	752	-0.82
WIPRO	328.7	-0.65
KOTAKBANK	1,249.00	-0.6

అత్యుతి టెక్నాలజీస్‌తో సిండికేట్ బ్యాంకు ఒప్పందం

హైదరాబాద్: సిండికేట్ బ్యాంకు సూక్ష్మ, చిన్న స్థాయి (ఎంఎస్‌ఈ) సంస్థలకు రుణాలిచ్చే విభాగంలో ఫిన్‌టెక్ కంపెనీ అత్యుతి టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకుంది. బ్యాంకు సేవలు అంతగా అందుబాటులో లేని చోట, ఎంఎస్‌ఈ లబ్ధిదారులను చేరుకోవడం, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.10 లక్షల వరకు రుణాలిచ్చే విషయంలో అత్యుతి టెక్నాలజీస్ సేవలను వినియోగించుకోనుంది. ఎంఎస్‌ఈ లబ్ధిదారులను గుర్తించి, వారికి బ్యాంకు నుంచి రుణాలందేలా చూడడంలో అత్యుతి తోడ్పాటు అందించనుంది. అలాగే, నిర్మాణ, మైనింగ్ రంగాలకు రుణాలిచ్చే శ్రేయి ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థతోనూ సిండికేట్ బ్యాంకు ఒప్పందానికి ప్రతిపాదించింది. ప్రాధాన్య రంగానికి రుణాలిచ్చే విషయంలో ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని భావిస్తోంది.

పామాయిల్ దిగుమతి సుంకాల తగ్గింపు

న్యూఢిల్లీ: ఆగ్నేయాసియా దేశాల కూటమి ఆసియాన్ నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాలను కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. క్రూడ్ పామాయిల్‌పై సుంకాలను 44 శాతం నుంచి 40 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొంది. అలాగే, రిఫైన్డ్ పామాయిల్ సుంకాలను మలేషియా నుంచి దిగుమతి చేసుకుంటే 54 శాతం నుంచి 45 శాతానికి, ఇతర ఆసియాన్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే 50 శాతానికి తగ్గించినట్లు వివరించింది. తాజా మార్పులు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు సీబీఐసీ తెలిపింది. ఆసియాన్ దేశాలతో ప్రాధాన్య వాణిజ్య ఒప్పందాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది.

కార్యకలాపాల విస్తరణలో ఎయిరిండియా

సంస్థ చీఫ్ ప్రదీప్ సింగ్ ఖరోలా వెల్లడి

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియా.. తాజాగా సేవలను మెరుగుపర్చుకోవడం, దేశ, విదేశీ రూట్లలో కార్యకలాపాలు మరింతగా విస్తరించడంపై దృష్టి పెట్టింది. ఉద్యోగులకు నూతన సంవత్సర సందేశమిస్తూ సంస్థ సీఎండీ ప్రదీప్ సింగ్ ఖరోలా ఈ విషయం తెలిపారు. కంపెనీ ప్రస్తుతం అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితులు, తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోందని, కష్టాలను అధిగమించి ఎయిరిండియాను మళ్లీ గాడిలో పెట్టేందుకు, కొత్త శిఖరాలకు చేర్చేందుకు సిబ్బంది కలిసికట్టుగా, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. దీనివల్ల సంస్థ సవాళ్లను అధిగమించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దాదాపు రూ. 55,000 కోట్ల రుణభారం ఉన్న ఎయిరిండియాను పునరుద్ధరించేందుకు కేంద్రం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన సంగతి తెలిసిందే.

డిసెంబర్‌లో తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు

- రూ. 94,726 కోట్లకు పరిమితం
- నవంబర్‌లో రూ. 97,637 కోట్లు...



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) వసూళ్లు 2018 డిసెంబర్‌లో రూ.94,726 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం నెల నవంబర్‌లో నమోదైన రూ. 97,637 కోట్లతో పోలిస్తే వసూళ్లు కొంత తగ్గాయి. డిసెంబర్‌లో వసూలైన రూ.94,726 కోట్లలో సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) పరిమాణం రూ.16,442 కోట్లు కాగా, స్టేట్ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) రూ.22,459 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) రూ.47,936 కోట్లు, సెస్సు రూ. 7,888 కోట్లుగా ఉన్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది.

9 నెలల్లో రూ.8.71 లక్షల కోట్లు..

2018–19 బడ్జెట్లో కేంద్రం వార్షికంగా జీఎస్‌టీ వసూళ్లు రూ.13.48 లక్షల కోట్లు ఉండవచ్చని అంచనా వేసింది. అంటే.. నెలకు సుమారు రూ. 1.12 లక్షల కోట్లు నిర్దేశించుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలంలో (ఏప్రిల్–డిసెంబర్) పరిశీలిస్తే.. జీఎస్‌టీ వసూళ్లు రూ.8.71 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్, అక్టోబర్‌లో మాత్రమే ఇవి రూ.1 లక్ష కోట్లు దాటాయి.

కొత్త రిటర్న్ ఫారంల నోటిఫికేషన్: కాగా జీఎస్‌టీ విధానం కింద జూన్ 30 నాటికి వ్యాపార సంస్థలు దాఖలు చేయాల్సిన వార్షిక జీఎస్‌టీ రిటర్న్ కొత్త ఫారంలను కేంద్రం నోటిఫై చేసింది. మరోవైపు, 2017 జులై–2018 సెప్టెంబర్ మధ్య కాలానికి సంబంధించి జీఎస్‌టీ రిటర్నులు దాఖలు చేయని వారిపై లేట్ ఫీజు నుంచి మినహాయింపునివ్వాలని సీబీఐసీ నిర్ణయించింది. అయితే, ఆయా సంస్థలు 2019 మార్చి 31 నాటికి మొత్తం 15 నెలల వ్యవధి రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఇరాన్ చమురు చెల్లింపులపై పన్ను మినహాయింపు

న్యూఢిల్లీ: ముడిచమురు కొనుగోలుకు గాను నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీకి (ఇరాన్ ప్రభుత్వం కంపెనీ) రూపాయిల్లో చేసే చెల్లింపులపై పన్ను మినహాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇరాన్ నుంచి చేసుకునే చమురు దిగుమతులకు రూపాయిల్లో చెల్లింపులు చేసేందుకు ఆ దేశంతో భారత్ గత నవంబర్ 2న ఒప్పందం చేసుకుంది. ఓ విదేశీ కంపెనీ భారత బ్యాంకు ఖాతా ద్వారా ఏ రూపంలో ఆదాయం పొందినా దానిపై విత్‌హోల్డింగ్ పన్ను 40 శాతం, ఇతర పన్నులతో కలిపి 42.5 శాతం వసూలు చేస్తుంటారు. కేంద్రం తాజా ఆదేశాలతో భారత రిఫైనరీ కంపెనీలకు ముడిచమురును ఎగుమతి చేయడం ద్వారా నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ పొందే మొత్తంపై పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు.

మియాపూర్‌లో సంగీత 566వ స్టోర్

ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ సంగీత... మియాపూర్‌లో 566వ స్టోర్‌ను మంగళవారం ప్రారంభించింది. ప్రముఖ కార్టూనిస్ట్ మృత్యుం జయ్ ఈ స్టోర్‌ను ప్రారంభించారు. పలు ఆఫర్ల నేపథ్యంలో స్టోర్ ముందు పెద్ద సంఖ్యలో కస్టమర్లు బారులు తీరారు. స్మార్ట్‌ఫోన్స్‌పై 50 శాతం డిస్కౌంట్, అలాగే ధర తగ్గినా, మొబైల్ పాడయినా వినియోగదారు నష్టపోకుండా చర్యలు, రూ.399కే ఫోన్లు వంటి పలు ఆఫర్లు ఇందులో ఉన్నాయి.





మీడియా సమావేశంలో శివప్రసాద్, నమశ్శివాయ, మూర్తి, అరుణ్ (ఎడమ నుంచి)

హైదరాబాద్‌లో మాంగళ్య షాపింగ్ మాల్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వస్త్రాలు, రెడీమేడ్స్ రంగంలో వరంగల్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మాంగళ్య బ్రాండ్ హైదరాబాద్‌కు విస్తరిస్తోంది. మదీనగూడలో 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాల్‌ను ఏర్పాటు చేసింది. జనవరి 3న ఈ ఔట్‌లెట్‌ను టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ప్రారంభిస్తారని మాంగళ్య చైర్మన్ కాసం నమశ్శివాయ తెలిపారు. సంస్థ ఫౌండర్ పి.ఎన్.మూర్తి, డైరెక్టర్లు కాసం శివప్రసాద్, పి.అరుణ్‌తో కలిసి మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 'హన్మకొండ, కరీంనగర్, సిద్దిపేటలో మాంగళ్య మాల్స్ విజయవంతంగా నడుస్తున్నాయి. మార్చి తొలివారంలో బోడుప్పల్ కేంద్రాన్ని ప్రారంభిస్తాం. ఈ ఏడాదే సూర్యాపేటలో ఇటువంటి సెంటర్ రానుంది. స్వయంవరం, కాసం తదితర బ్రాండ్లలో ఔట్‌లెట్లను నిర్వహిస్తున్నాం. మొత్తం 35 స్టోర్లున్నాయి. 1,500 మంది పనిచేస్తున్నారు. టర్నోవరు రూ.350 కోట్లుంది' అని వివరించారు.

వాహన విక్రయాలు తగ్గాయి!

- డిసెంబరు అమ్మకాల్లో నెమ్మదించిన వృద్ధి
- ఆకట్టుకోలేకపోయిన భారీ డిస్కౌంట్లు, ఆఫర్లు
- లిక్విడిటీ కొరత వంటి అంశాలే ప్రధాన కారణం!



న్యూఢిల్లీ: ప్యాసింజర్ వాహన విక్రయాలు 2018 డిసెంబర్లో నెమ్మదించాయి. సంవత్సరాంతపు ఆఫర్లు, భారీ డిస్కౌంట్లు ఎన్ని ప్రకటించినా... వాహనాల విక్రయాలు మాత్రం అనుకున్న స్థాయిలో వృద్ధి చెందలేదు. జనవరిలో ధరలు కూడా పెరుగుతుండటం ఇక్కడ గమనార్హం. కాగా లిక్విడిటీ (నగదు లభ్యత) కొరత వంటి ప్రతికూల స్థూల ఆర్థిక పరిస్థితుల వల్ల సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చిందని హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ మార్కెటింగ్ డైరెక్టర్, ఎస్‌వీపీ రాజేష్ గోయల్ చెప్పారు. డిసెంబర్లో హ్యుందాయ్ మోటార్స్, టాటా మోటార్స్ అమ్మకాలు కేవలం ఒక శాతం వృద్ధి రేటుకే పరిమితం కాగా.. మహీంద్రా అండ్ మహీంద్ర, మారుతీ సుజుకీ ఇండియా అమ్మకాలు ఏకంగా తగ్గుదలను నమోదుచేశాయి.

ఎం అండ్ ఎం: పీవీ సేల్స్ 4% డౌన్

డిసెంబర్‌లో ప్యాసింజర్ వాహన అమ్మకాలు 15,091 యూనిట్లుగా నమోదైనట్లు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) ప్రకటించింది. 2017లో ఇదే కాలానికి విక్రయించిన 15,543 యూనిట్లతో పోలిస్తే 4 శాతం తగ్గుదల నమోదైంది. వాణిజ్య వాహన అమ్మకాల్లో సైతం 4 శాతం తగ్గుదల చోటుచేసుకుంది.

టాటా మోటార్స్: పీవీ విక్రయాలు 1 శాతం అప్

దేశీ విక్రయాల్లో 8%క్షీణత చోటుచేసుకుంది. 2018 డిసెంబర్లో 50,440 యూనిట్లు విక్రయించగా.. 2017 డిసెంబర్లో 54,627 యూనిట్లు అమ్ముడైనట్లు తెలిపింది. ప్యాసింజర్ వాహన విక్రయాలు డిసెంబర్లో 14,260 యూనిట్లు కాగా, 2017 డిసెంబర్‌లో ఈ సంఖ్య 14,180.

హ్యుందాయ్: 4.6 శాతం వృద్ధి

2018 డిసెంబర్‌లో 42,093 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. అంతకుముందు ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 40,158 యూనిట్లతో పోలిస్తే 4.6 శాతం పెరుగుదల నమోదైనట్లు ప్రకటించింది.

మారుతీ సుజుకీ: 1.3 శాతం తగ్గిన పీవీ సేల్స్

గతనెల ప్యాసింజర్ వాహన అమ్మకాలు 1,28,338 యూనిట్లుగా నమోదయ్యాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే 1.3 శాతం తగ్గుదల నమోదయింది. దేశీ అమ్మకాలు మాత్రం 1,21,479 యూనిట్లకు చేరుకుని 1.8 శాతం వృద్ధి చెందినట్లు సంస్థ తెలిపింది. మిని కార్ విభాగంలో ఆల్టో 27,661 యూనిట్లు, వ్యాగన్‌ఆర్ 27,661 యూనిట్లు అమ్ముడవగా.. కాంపాక్ట్ విభాగంలో స్విఫ్ట్, డిజైర్ అమ్మకాలు 3.8 శాతం తగ్గినట్లు తెలిపింది.

వీఈ వాణిజ్య వాహన అమ్మకాలు 2.4% వృద్ధి

వోల్వో గ్రూప్, ఐషర్ మోటార్స్ జాయింట్ వెంచర్ అయిన వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికల్స్ (వీఈసీవీ) అమ్మకాలు గతేడాది డిసెంబర్‌లో 6,236 యూనిట్లకు చేరుకుని 2.4 శాతం వృద్ధి చెందాయి. ఏడాది ప్రాతిపదికన ఐషర్ బ్రాండ్ ట్రక్కులు, బస్‌ల విక్రయాలు 6,113 యూనిట్లుగా నమోదయ్యాయి.

వచ్చే 6 నెలల్లో 6 అవాన్ ఉత్పత్తులు

స్టార్ట్ అప్ ఎలక్ట్రానిక్ స్కూటర్ తయారీ సంస్థ అవాన్ మోటార్స్ నెలకి ఒక నూతన ఉత్పత్తి చొప్పున వచ్చే ఆరు నెలల్లో మరో ఆరు ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. వీటి ధరల శ్రేణి రూ.45,000 నుంచి రూ.80,000 వరకు ఉంటుందని సంస్థ సీఓఓ హరీద్ ఠాకూర్ వెల్లడించారు. ఈ ఏడాదిలో అమ్మకాల లక్ష్యం 25,000 యూనిట్లు కాగా, వచ్చే 2–3 ఏళ్లలో లక్ష మార్కును చేరుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఇటీవలే లిథియం అయాన్ బ్యాటరీలతో పనిచేసే ఆరు ఎలక్ట్రానిక్ స్కూటర్లను కంపెనీ విడుదలచేసిన సంగతి తెలిసిందే.

'ఆధార్' ఉల్లంఘిస్తే రూ.కోటి దాకా జరిమానా



న్యూఢిల్లీ: ఆధార్ చట్ట నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోనుంది. ఏకంగా రూ.కోటి దాకా పెనాల్టీ విధించడంతో పాటు నిబంధనలు పాటించే దాకా ప్రతి రోజు రూ.10 లక్షల దాకా అదనంగా జరిమానా విధించే ప్రతిపాదనలు రూపొందించింది. విశిష్ట గుర్తింపు సంఖ్యల ప్రాధికార సంస్థకు (యూఐడీఏఐ) మరిన్ని అధికారాలు కల్పించే దిశగా ఆధార్ చట్టానికి కేంద్రం ఈ మేరకు సవరణలు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆధార్ చట్టం ప్రకారం.. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చర్యలు తీసుకునేందుకు యూఐడీఏఐకి అధికారాలు లేవు. ఇక ప్రతిపాదిత సవరణల ప్రకారం.. పిల్లలకు ఆధార్ నంబరు జారీ చేసేందుకు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అలాగే, ఆధార్ లేనంత మాత్రాన బాలలకు లభించాల్సిన సబ్సిడీ, ఇతరత్రా ప్రయోజనాలను నిలిపివేయరాదు. ఆధార్‌కి సంబంధించి వర్చువల్ ఐడీ విధానాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదన కూడా ఉంది. ఆధార్ చట్టం కింద యూఐడీఏఐ ఫండ్ ఏర్పాటు చేయాలని, దీని ఆదాయాలపై పన్ను మినహాయింపులు ఇవ్వాలని కేంద్రం యోచిస్తోంది. ఆధార్ చట్ట సవరణల బిల్లు బుధవారం లోక్‌సభ ముందుకు రానుంది.

అరబిందో రక్తపోటు మందు వెనక్కి

న్యూఢిల్లీ: రక్తపోటు, గుండె వైఫల్యం చికిత్సల్లో వినియోగించే అమ్లోడిపిన్ వాల్‌సార్టన్ ట్యాబ్లెట్లు 80 లాట్లను అరబిందో ఫార్మా అమెరికా మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. ఇందులో మలినాలు ఉండడమే కారణం. ఈ మలినాలు కేన్సర్‌కు దారితీసేవి కావడంతో స్వచ్ఛందంగా ఆ మే రకు మందులను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ లాట్లతో కూడిన ట్యాబ్లెట్లను వినియోగిస్తున్న కస్టమర్లు, డిస్ట్రిబ్యూటర్లను గుర్తించే పనిలో ఉంది.

బ్రీఫ్స్

• సీఎంఐకి ఇండియన్ రైల్వేస్ భారీ కాంట్రాక్ట్


కేబుల్ తయారీ సంస్థ సీఎంఐ లిమిటెడ్ ఇండియన్ రైల్వేస్ నుంచి రూ.107 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. కాడ్మియం క్యాటనరీ వైర్ సరఫరాకు సంబంధించిన ఈ కాంట్రాక్ట్‌ను అత్యంత తక్కువ బిడ్డింగ్ ద్వారా దక్కించుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రివర్స్ ఆక్షన్ విధానంలో ఈ టెండర్ నిర్ణయమైనట్లు బీఎస్‌ఈకి తెలియజేసింది. కంపెనీ షేర్ మంగళవారం నిఫ్టీలో 1.75 శాతం (రూ.3.10) పెరిగి 180.35 వద్ద ముగిసింది.

• రాఘవ్ కమోడిటీస్‌పై రూ.25 లక్షల జరిమానా

రాఘవ్ కమోడిటీస్‌పై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ రూ.25 లక్షల జరిమానా విధించింది. మోసపూరిత ట్రేడ్‌కు సంబంధించి ఆరోపణలపై ఈ జరిమానా విధించినట్లు ఒక నోట్‌లో పేర్కొంది. బీఎస్‌ఈలో ఇల్లిక్విడ్ స్టాక్ ఆప్షన్స్ సెగ్మెంట్‌లో కృత్రిమ వ్యాల్యూమ్స్ సృష్టించినందుకు ఈ జరిమానా విధించినట్లు తెలిపింది.

• శిల్పా మెడికేర్ క్యాన్సర్ చికిత్స ఇన్‌జెక్షన్‌కు ఎఫ్‌డీఏ ఆమోదం

కొన్ని రకాల క్యాన్సర్ చికిత్సలకు వినియోగించే ఐరినోటికాన్ హెచ్‌సీఎల్ ఇంజెక్షన్‌కు అమెరికా హెల్త్ రెగ్యులేటర్– అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్‌ఎఫ్‌డీఏ) నుంచి ఆమోదం లభించింది. 40 ఎంజీ (2ఎంఎల్), 100 ఎంజీ (5 ఎంఎల్), 20ఎంజీ (ఎంల్) సింగిల్ డోస్ ఇన్‌జెక్షన్‌కు యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి లభించినట్లు శిల్పా మెడికేర్ సంస్థ బీఎస్‌ఈకి తెలియజేసింది. ఈ వార్తల నేపథ్యంలో ఈ కంపెనీ షేర్ నిఫ్టీలో 2 శాతం పెరిగి రూ.392.60 వద్ద ముగిసింది.



• సెంట్రల్ కోల్ ఫీల్డ్ చరిత్రాత్మక ఉత్పత్తి

ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం– కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ సెంట్రల్ కోల్ ఫీల్డ్స్... డిసెంబర్‌లో రికార్డు స్థాయి ఉత్పత్తిని సాధించింది. ఈ నెల్లో ఉత్పత్తిలో 17.7 శాతం వృద్ధి నమోదయ్యింది. 5.7 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సంస్థ నమోదుచేసినట్లు సీఎండీ గోపాల్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018–19 మూడు త్రైమాసికాల్లో సంస్థ 41.65 మిలియన్ టన్నుల ఉత్పత్తిని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే, ఇది 12 శాతం (37.2 శాతం) అధికం. కాగా కోల్ ఇండియా ఉత్పత్తి ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో 7.4 శాతం వృద్ధితో 412.45 మిలియన్ టన్నులకు చేరింది.

• షావోమీ టీవీ మోడళ్లపై తగ్గిన ధరలు

చైనా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం– షావోమీకి చెందిన కొన్ని టీవీ మోడళ్లపై ధరలు రూ.2,000 వరకు తగ్గాయి. ఇది ఇటీవలి జీఎస్‌టీ రేటు తగ్గింపు ప్రభావమని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 32 అంగుళాల ఎంఐ ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ 4ఏపై ధర రూ.1,500 తగ్గింది. ఇక 32 అంగుళాల ఎంఐ ఎల్‌ఈడీ టీవీ 4సీప్రోపై ధర రూ.2,000 వరకూ తగ్గింది. తక్షణం తగ్గిన చార్జీలు అమల్లోకి వస్తాయి. టీవీలపై జీఎస్‌టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిన సంగతి తెలిసిందే.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	32,190	0
బంగారం (99.5, 10గ్రా)	30,660	0
వెండి (కిలో)	41,500	0
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	31,720	▲ 40
బంగారం (22 క్యారెట్లు)	30,210	▲ 40
వెండి (కిలో)	41,500	0
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	31,720	▲ 40
బంగారం (22 క్యారెట్లు)	30,210	▲ 40
వెండి (కిలో)	41,500	0
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	32,500	0
బంగారం (22 క్యారెట్లు)	30,110	0
వెండి (కిలో)	39,400	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	32,480	▲ 70
బంగారం (22 క్యారెట్లు)	30,210	▲ 70
వెండి (కిలో)	39,500	0
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	31,650	
బంగారం (22 క్యారెట్లు)	30,170	
వెండి (కిలో)	41,300	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	32,660	▲ 40
బంగారం (22 క్యారెట్లు)	30,210	▲ 40
వెండి (కిలో)	39,300	▼ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	45.84 (రాత్రి 11.30కు)	$45.33 (సోమవారం ముగింపు)
బ్రెంట్	54.16 (రాత్రి 11.30కు)	$53.21 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 02-01-2019

విశాఖ	458–00
చిత్తూరు	438–00
వరంగల్	441–00
చెన్నై	445–00
ముంబై	494–00
విజయవాడ	453–00
నమక్కల్	430–00
గోదావరి	453–00
1-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	439–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.00
బెంగళూరు	445–00
కోల్‌కత్త	492–00
ఢిల్లీ	460–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	389	387.7
ASIAN PAINT	1371.55	1373.05
AXIS BANK L	627.3	619.9
BAJAJ AUTO	2726.65	2720.15
BAJAJ FINSE	6521.95	6476.95
BAJAJ FINAN	2656.85	2645.15
BHARTI AIRT	319.5	312.5
BPCL	367.2	362.75
CIPLA LTD	523.05	519.5
COAL INDIA	241.5	240.75
EICHER MOTO	23195.1	23158.35
GAIL (INDIA	362.15	360.3
GRASIM INDU	833.5	825.6
HCL TECHNOL	959.85	964.35
HDFC LTD	2009	1968.35
HDFC BANK L	2148.1	2121.7
HERO MOTOCO	3127.6	3104.25
HINDALCO I	222.75	226.2
HPCL	256.7	253.25
HUL	1801.1	1819.65
INDIABULLS	844.75	853.85
ICICI BANK	363.75	360.15
INDUSIND BA	1595.6	1599.3
BHARTI INFR	262.25	259
INFOSYS LIM	665.05	658.95
INDIAN OIL	137.7	137.05
ITC LTD	282.7	281.65
JSW STEEL L	303.95	306.75
KOTAK MAHIN	1250.45	1256.5
LARSEN & TO	1441.9	1437.55
MAHINDRA &M	773.35	803.85
MARUTI SUZU	7476.8	7465.5
NTPC LTD	148.7	149.05
OIL AND NAT	148.5	149.9
POWER GRID	200	198.65
RIL	1121	1121.25
SBI	299.6	295.9
SUN PHARMAC	433.55	430.5
TATA MOTORS	173.45	172.7
TATA STEEL	515.75	521.05
TATA CONSUL	1902.8	1893.05
TECH MAHIND	719.1	723.15
TITAN COMPA	928	931
ULTRATECH C	4009.2	3990.95
UPL LIMITED	753.5	758.25
VEDANTA LIM	202.1	202.2
WIPRO LTD	326.65	330.85
YES BANK LI	184.25	181.8
ZEE ENTERTA	480.25	476.45

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1319.2	1336.75
ADITYA BIRL	100.1	100
ACC LIMITED	1488.8	1508.1
AMBUJA CEME	222.9	225.1
ASHOK LEYLA	102.5	102.5
BANDHAN BAN	556.7	550.15
BANK OF BAR	123.3	118.8
BHARAT ELEC	87.45	87.95
BHEL	73.8	73.1
BIOCON LIMI	625.8	629.05
BOSCH LIMIT	19576.5	19611.2
BRITANNIA I	3103.05	3115.4
CADILA HEAL	350.05	348.45
COLGATE PAL	1323.9	1343.55
CONTAINER C	685.3	687.7
DABUR INDIA	421.85	430.65
DLF LIMITED	180.3	177.55
AVENUE SUPE	1590.75	1606.65
GENERAL INS	259.4	259
GODREJ CONS	807.35	810.65
HAVELLS IND	694.8	691.5
HDFC STAND	386.4	387.15
HINDUSTAN Z	277.85	278.65
ICICI LOMBA	873.25	864.45
ICICI PRU L	325.9	324.5
VODAFONE ID	37.75	37.75
INTERGLOBE	1165.6	1165.05
L&T FINANCE	153.15	152.6
LIC HOUSING	486.55	488.7
LUPIN LIMIT	841.45	844.3
MARICO LIMI	372.3	373.4
UNITED SPIR	621	635.8
MOTHERSON S	165.45	166.85
MRF LTD	66801.2	66984.7
NHPC LTD	25.95	26
THE NEW IND	179.75	179.75
NMDC LTD.	95.75	96.85
ORACLE FIN	3729.45	3707.75
OIL INDIA L	175.75	174.8
PIRAMAL ENT	2395.3	2381.75
PETRONET LN	229	224.15
P&G HYGIENE	9903.75	9884.1
PIDILITE IN	1101.95	1107.85
STEEL AUTHO	55.75	56.35
SBI LIFE IN	598.85	597.85
SHREE CEMEN	16973.25	17236.1
SIEMENS LTD	1062.65	1046.9
SHRIRAM TRA	1229.75	1239.95
SUN TV NETW	607.85	607.75

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	7.84	7.89
Alphageo	483.45	474.8
Alu Flouride	123.9	123.1
Amar Raja Bat	739.65	742.75
And Bank	29.9	29.3
And Cemen	5.87	5.95
And Paper	447.4	444.15
And Petro	58.9	57.4
Anjani Portl	130	130
Aries Agro Ltd	101.7	101.1
Aurobindo Ph	731.7	730.95
Avantel Soft	226.55	230.25
Avanti Feeds	389	385.55
AvonOrg	6.7	6.99
BN Rathi Sec	27	27.35
Bakelite	20.45	19.5
Balaji Amin	456	459.35
Bambino Agro	191.4	191.35
Bartronics	7.22	7.39
Bhagira Chem	443.7	449.45
Bhagya Nag	31.2	32.3
Bhagya Wood	18.45	17.6
Bhaskar Agro	19.4	18.5
Brilliant Sec	1.16	1.11
CIL Securi	17.8	16.5
Color Chip	18.95	19.1
Cont Coffee	271.9	270.25
CoroFert	450.05	450.05
Cosboard Ind	13.6	12.96
Country Club	7.45	7.43
Cubex Tub	14.6	14.5
Cybermate	2.44	2.33
DR Reddy	2610	2617
Danlaw Tec	105.7	106.15
DecCement	400	419.5
Divi's Lab	1478.55	1482.2
Divya Granit	93.8	90.4
Dolphin Medi	0.8	0.82
Dredgin Corp	470.45	441.15
Empee Sugars	1.27	1.33
Everest Org	103.85	103.5
Fortune Info	39.8	39.9
Four Soft	48.35	40.3
GMR Ferro	1.4	1.34
GMR Infra	16.45	16.4
GVK Power	8.15	7.75
Gati Corpn	86.65	86.9
Gayatri Bio	3.38	3.22
Gayatri Proj	179.9	175.85
Gayatri Sugrs	2.95	2.81
Gennex Lab	3.69	3.81
GodavDru	23.2	23.5
Goldstn Tele	231	233.45
Goldstone Tech	16.8	16.7
Granules (I)	90.8	89.65
HBL Nife Pow	28.85	28.8
HYDIndus	2055.3	2063.7
Heritage Food	530	527.6
Hifco Marwel	74.2	72.75
HindFlurocarb	17.25	17.3
IDL Industrs	295.5	293.65
IKF Soft	0.31	0.31
IVRCL Infras	1.04	1
Incap	41	42.4
IndoNationl	730	715.65
Infotech En	615.05	619.05
Invinex Lab	41.1	41.2
JSTL	38.25	38
KCP LTD	92.35	92.35
KNR Constructio	209.1	213.5
KakatiCem	201.5	202.9
Kallam Spg	18.4	18.2
Kernex Micro	23	23.9
Krebs Bio	109.1	108.25
LGS Global	2.7	2.68
LancoIndus	188	188.55
Lokesh Mach	47.45	48.05
Lotus Choc	24.95	24.45
MIC Elec	1.4	1.47
Madhucon Proje	6.81	6.66
Maytas Infra	16.25	17.07
Medinova Dia	16.15	17
Moldtek Plastic	271.5	267
Moschip Semi	25.1	25.8
NCLInd	139.05	135.75
NETTLINX	49.1	50
NMDC Ltd	95.3	97
NagarAgrich	27.5	27.7
NagarConst	88.85	88.1
Natco Pharma	700	680.8
Nava Bh Ventur	120	120.5
Neha Inter	4.68	4.89
Neocure Ther	2.53	2.38
Neuland Lab	484.9	459
Nihar Info Glo	14.33	13.65
Nile	385	385.65
Northgate Tech	0.94	0.9
Oil Country	17.55	16.58
Ortin Lab	15.45	15.85
Padmalaya Tele	2.33	2.44
Panyam Cemen	13.51	13.4
Peeti Securt	4.88	5.11
PennInd	36.9	36.4
PennProf	3.6	3.6
Phytochem I	48.5	49
Pitti Lamin	72.5	72.85
Pokarna	161.5	166.45
Prajay Engs	8.95	8.88
PremiExpl	240.15	240.25
Prism Cement	90.3	88.9
Rain Industries	135.95	134.25
Raj Packagin	30	28.05
Ram Informat	41	41.55
RavilGr	14.55	15.3
Reg.Ceramic	3.21	3.06
Restile Cer	4	4.19
Roopa Indus	11.97	12.6
Sagar Cem	706	683.25
Samkrg Pist	191.1	192.5
Sampre Nutri	40.5	39
SangInd	60.6	60.65
Satvah. Ispat	10	9.98
Saven Techno	23.4	22.3
Sibar Auto	39	38
South Bio Tech	1.91	1.9
SrRayAlk	34.4	33.9
Srinivasa Ship	45	44.9
Sujana Metal	0.37	0.37
Sujana Towers	1	1
Sujana Univers	0.34	0.33
Surana Tele	4.51	4.6
Suryachakra Pow	0.37	0.36
Suryava Spin	4.53	4.53
SuvarCem	69.8	66.75
Suven Pharma	232.35	227.35
TCI Finance	15.5	15.35
Taj Gvk Hotel	178.5	175.4
Tanla Solutions	30.7	30.55
Trans Biotek	3.19	3.32
Transport Co	281.45	286.35
Trendy Knit	0.19	0.19
Usher Agro	2.5	2.55
V&K Soft	4	4.05
VBC Ferro	45.9	45.35
VST Indus	3280	3279.2
Vamshi Rubb	33.9	31.1
Viceroy Hotels	5.3	5.15
VijayTextil	42.9	43.9
Vimta Labs	320.45	314.25
Virat Crane	33.1	33
Virinchi Con	83.05	82.8
VisakaInd	436.5	430.2
Vista Pharma	29.45	29
Vivimed Labs	37	36.85
Vjil Consult	41	39.3
ZenoTech Lab	37.3	37.85

ఇన్‌డెప్త్

అక్రమాల రూటు
వదలని ప్రైవేట్ ట్రావెల్స్



■ తిరుపతికి చెందిన ఎస్.లక్ష్మీపవన్ సంక్రాంతి పండుగకు హైదరాబాద్‌లో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లడానికి నిశ్చయించుకున్నాడు. బస్సు టికెట్ బుక్ చేసుకోవడం కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు వెళ్లగా సెమీ స్లీపర్ ఏసీ బస్సుకు రూ.1900 చెల్లించాలని చెప్పడంతో బిత్తరపోయాడు. అంతకుముందు పలుమార్లు రూ.1000తోనే హైదరాబాద్‌కు వెళ్లొచ్చిన ఆయనకు ఈసారి ట్రావెల్స్ నిర్వాహకులు రూ.900 ఎక్కువ చెప్పడంతో చేసేదేమీ లేక వారు అడిగినంతా చెల్లించి టికెట్ బుక్ చేసుకున్నాడు.




■ గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బి.ప్రమోద్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి పండుగకు ఊరికి రావడానికి టికెట్ కోసం ప్రయత్నించగా ఆర్టీసీ, రైల్వే టికెట్లు అప్పటికే అయిపోయాయి. దీంతో ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు వెళ్లగా వారు సాధారణ సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1000 ఇమ్మనడంతో కంగుతిన్నాడు. విడిరోజుల్లో హైదరాబాద్ నుంచి తెనాలికి రూ.450 తీసుకునేవారని, ఇప్పుడు రెట్టింపు వసూలు చేస్తున్నారని ప్రమోద్ వాపోతున్నాడు.



■ విశాఖపట్నం జిల్లా అనకాపల్లికి చెందిన బి.సురేశ్ హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్నాడు. సంక్రాంతి పండుగకు తన ఊరికి రావడం కోసం ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు వెళ్లగా వారు సాధారణ లగ్జరీ బస్సుకు రూ.1700 చెల్లించాలని చెప్పడంతో విస్తుపోయాడు. హైదరాబాద్ నుంచి అనకాపల్లికి రూ.700 నుంచి రూ.800 మాత్రమే ఛార్జీ అని చెప్పగా 'ఇష్టముంటే ఎక్కు.. లేదంటే మానుకో' అని ట్రావెల్స్ నిర్వాహకులు దురుసుగా సమాధానం చెప్పారు.

ఇవి ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల ఆగడాలకు అద్దంపట్టే కొన్ని సంఘటనలు.



ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల తీరు మారడం లేదు. ప్రమాదాలు ఎన్ని జరుగుతున్నా పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘిస్తూ ముందుకు దూసుకెళుతున్నాయి. అడ్డుకోండి.. చూద్దాం అనే రీతిలో ట్రావెల్స్ నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. వారాంతాల్లోనూ, పండుగల సీజన్‌లలో టిక్కెట్ల ధరలు అమాంతం పెంచేసి ప్రయాణికుల నుంచి భారీగా దోచుకుంటున్నారు. పండుగలప్పుడు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. అదనపు బెర్తులు, సీట్లు ఏర్పాటు చేసి మరీ పండుగ సీజన్‌ను క్యాష్ చేసుకుంటున్నారు. ఒకే పర్మిట్‌తో రెండు బస్సుల్ని తిప్పుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. కాంట్రాక్టు క్యారియర్లుగా అనుమతులు పొంది స్టేజి క్యారియర్లుగా తిప్పుతూ ఆర్టీసీకి ఏటా రూ.2400 కోట్లు నష్టం చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన రవాణా అధికారులు షరా'మామూలు'గానే మిన్నకుండిపోతున్నారు.

- ఒకే పర్మిట్‌తో రెండు బస్సులు
- పండుగలు, రద్దీ సమయాల్లో భారీగా దోపిడీ
- స్టేజి క్యారియర్లుగా తిప్పడంతో ఆర్టీసీకి ఏటా రూ.2,400 కోట్ల నష్టం
- నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా
- ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారుల హడావుడి
- ఆ తర్వాత అంతా 'మామూలే'

సాక్షి, అమరావతి: ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు అదనపు సీట్లు/బెర్తుల ఏర్పాటుతో బస్సుల పొడవు పెంచి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మోటారు వాహనాల చట్టంలో రూల్ 351ఎ ప్రకారం.. స్లీపర్ బస్సుకు కొన్ని నిబంధనలు ఉన్నాయి. దీని ప్రకారం.. బస్సులో 36 సీట్లు, 32 బెర్తులు ఉండాలి. కానీ అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, కర్ణాటక, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న బస్సులు నిబంధనలకు విరుద్ధంగా అదనపు సీట్లు, బెర్తులతో తెలుగు రాష్ట్రాల్లో తిరిగాయి. దీంతో ఆ రాష్ట్రాలు 2017 జూన్‌లో రిజిస్ట్రేషన్లు నిలిపివేశాయి. ఆ తర్వాత ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూడా ఆ బస్సుల్ని సీజ్ చేసిన సంగతి తెలిసిందే. కొన్నాళ్ల తర్వాత ఏపీలో మళ్లీ బస్సుల్ని రవాణా శాఖ అనుమతించింది. సీట్లు, బెర్తులు తగ్గించి మోటారు వాహనాల చట్టంలో ఏఐఎస్–119 నిబంధనను అనుసరించి తిప్పాలని ట్రావెల్స్ నిర్వాహకులకు అధికారులు సూచించారు. అప్పట్లో అధికారుల ఆదేశాల మేరకు సీట్లు, బెర్తులు తగ్గించిన ట్రావెల్స్ నిర్వాహకులు ఇప్పుడు సంక్రాంతి సీజన్ డిమాండ్ దృష్ట్యా అదనపు బెర్తులు ఏర్పాటు చేస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన రవాణా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప తర్వాత షరా'మామూలు'గానే వదిలేస్తున్నారు.

అదనపు బెర్తులతో దందా..

గతేడాది రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలతో ఇతర రాష్ట్రాల బస్సులను తిరగనిచ్చేందుకు అనుమతిచ్చింది. అయితే రవాణా శాఖ ఎన్‌వోసీ (నిరభ్యంతర ధ్రువపత్రం) కలిగి ఉండటంతో పాటు ఏఐఎస్ –119 ప్రకారం.. బెర్తుల సంఖ్య తగ్గించాలని స్పష్టం చేసింది. ఆలిండియా పర్మిట్లు పొంది ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న బస్సుల్లో స్లీపర్ బెర్తులు 36 వరకు ఉన్నాయి. ఇలా ఉండటం మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధం. ఈ బస్సులు ఏపీలో తిరగాలంటే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ స్పెసిఫికేషన్స్ ప్రకారం.. బెర్తులను 30కి తగ్గించి తిప్పాల్సిందే.

తనిఖీలకు మంగళం!

కేంద్ర మోటారు వాహనాల చట్టం 125 సి (4) ప్రకారం.. ప్రభుత్వ రవాణా సంస్థలు, రాష్ట్ర, జిల్లా స్థాయి పర్మిట్లు పొందిన ప్రైవేటు ట్రావెల్స్ మాత్రమే బెర్తులు ఏర్పాటు చేసుకోవచ్చు. ఏపీఎస్‌ఆర్టీసీలో ఏఐఎస్–119 నిబంధనలున్న బెర్తుల బస్సులు కేవలం రెండు మాత్రమే ఉండటం గమనార్హం. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న బస్సులు బెర్తులను 36 నుంచి 30కి తగ్గిస్తేనే వాటి నుంచి త్రైమాసిక పన్ను వసూలు చేయాలి. కానీ రాష్ట్రంలో రాజకీయ ఒత్తిళ్లతో రవాణా శాఖ తనిఖీలకు మంగళం పాడింది. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ యథేచ్ఛగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్లు చేస్తూ ఆక్యుపెన్సీ పెంచుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న బెర్తుల బస్సులు రాష్ట్రంలో 655 ఉన్నాయి. రవాణా అధికారులకు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ బస్సులు నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నాయా అనే అంశంలో లేకపోవడం గమనార్హం.

హైదరాబాద్ రూటే టార్గెట్

ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు ప్రధానంగా హైదరాబాద్ రూట్‌ను టార్గెట్ చేసుకున్నారు. ఈ రూట్లోనే అధికంగా బస్సులు నడిపి.. కాంట్రాక్టు క్యారియర్లుగా అనుమతులు పొంది.. స్టేజి క్యారియర్లుగా తిప్పుతూ రోజూ 70 వేల మంది ప్రయాణికుల్ని చేరవేస్తున్నారు. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఏసీ సర్వీసుకు రూ.550గా ఉన్న టిక్కెట్టు ధరను పండుగలు, రద్దీ సమయాల్లో రూ.990కు పెంచి వసూలు చేస్తున్నారు. స్లీపర్ సర్వీసుల్లో సాధారణ రోజుల్లో రూ.850–రూ.1000గా ఉన్న టిక్కెట్టు ధరను ఈ సీజన్‌లో రూ.1,200 – రూ.1,850కు పెంచి వసూలు చేయడం గమనార్హం. హైదరాబాద్ – విశాఖపట్నం రూట్‌లోనూ సాధారణ రోజుల్లో స్లీపర్ సర్వీసుల్లో రూ.1,500– రూ.1,700 ఉండే టిక్కెట్ ధరను పండుగల సీజన్‌లో ఏకంగా రూ.2,500 – రూ.2,700కు వరకు పెంచి వసూలు చేస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలతో..

ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్ల గుర్తింపునకు, వారి సంక్షేమానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఖచ్చితంగా చేపట్టాల్సిందేనని హైకోర్టు గతంలోనే స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే డ్రైవర్ల రిజిస్ట్రేషన్ విషయంలో కార్మిక శాఖ, రవాణా శాఖలు తమ బాధ్యత కాదంటే తమది కాదని కొన్నాళ్లపాటు పట్టించుకోలేదు. ఆ తర్వాత ఈ విషయం మీద హైకోర్టు సీరియస్‌గా స్పందించడంతో రవాణా శాఖ డ్రైవర్ల సంక్షేమ చట్టం అమలు బాధ్యత తీసుకుంది.

సరుకులు తరలించకూడదనే నిబంధన ఉన్నా..

ప్రైవేటు ట్రావెల్స్ ప్రయాణికుల మాటున యథేచ్ఛగా సరుకు తరలిస్తున్నాయి. చెన్నై, బెంగళూరుల నుంచి జోరుగా జీరో వ్యాపారం నిర్వహించేవారికి ఊతమిస్తున్నాయి. కాంట్రాక్టు క్యారేజీ అనుమతులు పొంది స్టేజి క్యారియర్లుగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ వల్ల ఆర్టీసీకి ఏటా రూ.2,400 కోట్లు నష్టాలు వస్తున్నట్లు అంచనా. ఆర్టీసీ ఆక్యుపెన్సీని దెబ్బకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ కార్గో వ్యాపారంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రైవేటు బస్సుల్లో వెండి, ఫర్నీచర్ సామగ్రి పెద్ద ఎత్తున మళ్లిపోతోంది. బిల్లులు లేకుండా సామగ్రిని తరలిస్తున్నా రవాణా అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలోనూ ప్రైవేటు బస్సుల్లో బాణాసంచా తరలించడంతో అగ్నిప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రైవేటు బస్సుల్లో సరుకులు తరలించకూడదనే నిబంధన ఉన్నా.. ప్రైవేటు ట్రావెల్స్ మాఫియా పెడచెవిన పెట్టి ఆయా నగరాల్లో సరుకులను తరలించేందుకు ఏకంగా బుకింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

ఇష్టారాజ్యంగా టిక్కెట్ ధరలు పెంపు

ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు ఇష్టారాజ్యంగా టిక్కెట్ ధరలను పెంచి ప్రయాణికుల అవసరాలను భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగ సీజన్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్ని తనిఖీ చేస్తే అంతిమంగా ప్రయాణికులే ఇబ్బందులు పడతారని రవాణా అధికారులు చెబుతున్నారంటే.. వీరి దోపిడీకి ఏ విధంగా సహకరిస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. టిక్కెట్ల ధరల నియంత్రణ తమ చేతుల్లో లేదని రవాణా అధికారులు చేతులెత్తేయడంతో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు తమకు అడ్డే లేదన్న రీతిలో ప్రయాణికుల్ని దోచుకుంటున్నారు. ఏటా ఈ దందా సాగుతూనే ఉందే తప్ప ట్రావెల్స్ కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సాధారణంగా పండుగ సీజన్‌ల ముందు ఆయా జిల్లాల్లో రవాణా శాఖ అధికారులు ముందుగా ట్రావెల్స్ నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల్ని వారి వారి ప్రాంతాలకు చేరవేయడంలో సహకరించాలని, టిక్కెట్ల ధరలు పెంచి ప్రయాణికుల్ని దోచుకోవద్దని హెచ్చరికలు చేయాలి. అంతేకాకుండా టిక్కెట్ల ధరల నియంత్రణపై ట్రావెల్స్ నిర్వాహకుల నుంచి అంగీకార పత్రాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ సంక్రాంతికి ఏ జిల్లాలోనూ ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు.

సాగర్‌ను సందర్శించిన వంశధార ట్రిబ్యునల్ చైర్మన్



లాంచీ స్టేషన్ నుంచి కొండకు వెళుతున్న జస్టిస్ ముకుంద శర్మ

విజయపురిసౌత్: సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, వంశధార నది జలవివాదాల పరిష్కార ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ ముకుంద శర్మ, ఆయన సతీమణి భారతి శర్మ మంగళవారం నాగార్జున సాగర్‌ను సందర్శించారు. ఆయనకు విజయవిహార్ అతిథి గృహంలో అధికారులు స్వాగతం పలికారు. విజయపురిసౌత్ చేరుకొని లాంచీస్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాంచీలో జస్టిస్ దంపతులు నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలో బుద్ధుని జీవిత చరిత్ర, శిల్పాలు, మాన్యుమెంట్స్‌లోని సింహళ విహార్, అశ్వమేథ యాగశాల, మహాస్థూపం, స్నానఘట్టాలను తిలకించారు. అనంతరం సాగర్ చేరుకుని సాగర్ డ్యాం, విద్యుదుత్పాదక కేంద్రాలను సందర్శించారు.

గృహ నిర్మాణంలో అవినీతిపై విచారణకు ఆదేశం

సాక్షి, అమరావతి: గృహ నిర్మాణంలో అవినీతి జరిగిందనే ఆరోపణలు రావడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు విచారణ చేసేందుకు దర్యాప్తు సంస్థ ఏర్పాటుకు అనుమతిస్తూ గృహ నిర్మాణ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి కాంతిలాల్ దండే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ పథకం ఇళ్ల నిర్మాణాల్లో 10 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం వీరు పదోన్నతులపై వివిధ జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో భాగంగానే అసిస్టెంట్ ఇంజనీర్లు జి.అప్పలనాయుడు (శ్రీకాకుళం జిల్లా బుర్జా మండలం) ఎస్.కె.అలీ (చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి), ఎస్.సూర్య భగవాన్ (ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం), డి.శ్రీనివాసులు (ప్రకాశం జిల్లా కొండెపి మండలం), కె.ఆనంద సాగర్ (పశ్చిమగోదావరి జిల్లాలో రిటైర్ అయ్యారు), ఎం.మధుసూదనరావు (నెల్లూరు), బి.భాస్కరరావు (నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం), జి.వి.సుబ్బారావు (ప్రకాశం జిల్లా ఎన్.ఎన్.పాడు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), ఎస్.కె.జిలానీబాషా (ప్రకాశం జిల్లా పర్చూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), ఎన్.శ్యాంరాజ్ (టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్, నెల్లూరు జిల్లా)లపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. విచారణ అధికారిగా రాష్ట్ర గృహ నిర్మాణశాఖలో ఎస్‌ఈగా పనిచేస్తున్న సి.హెచ్.మల్లిఖార్జునరావు, సహాయ విచారణ అధికారిగా ప్రకాశం జిల్లా కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.వేణుగోపాల్‌రావును నియమించారు.

కాంగ్రెస్, టీడీపీ పొత్తుపై రేపు ఢిల్లీలో నిర్ణయం: రఘువీరా

మడకశిర: రాష్ట్రంలో వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ పొత్తుపై ఢిల్లీలో గురువారం కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకోనుందని ఏపీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అనంతపురం జిల్లా మడకశిరలో మీడియాతో మాట్లాడుతూ.. పొత్తు అంశంపై చర్చించడానికి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయనున్నారని, అందులో తాను, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఊమెన్‌చాందీ పాల్గొంటారన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యూహం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ పొత్తుపై హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు.

హంద్రీనీవా కాలువకు గండికొట్టిన రైతులు



హిందూపురం అర్బన్: పాలకుల నీటి రాజకీయాలతో విసుగు చెందిన అనంతపురం జిల్లా కొటిపి గ్రామ రైతులు మంగళవారం హంద్రీనీవా కాలువకు గండికొట్టారు. కాలువ గట్టుపై బైఠాయించి నిరసన తెలిపారు. హంద్రీనీవా కాలువ ద్వారా ట్రయల్‌రన్ అంటూ.. సీఎం చేతుల మీదుగా జలహారతి చేయించి తమ పాలనలో మడకశిర వరకు నీటిని అందించామనే ప్రచారం చేసుకునేందుకు అధికార పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత నవంబర్ నెలలో గొల్లపల్లి రిజర్వాయర్‌కు ఒక టీఎంసీ నీటిని అందించారు. ఆ నీటిని సోమందేపల్లి, లేపాక్షి మండలం చలివెందల, కొండూరు, లేపాక్షి, చిలమత్తూరు గాద్రార్లపల్లి, శిరివరం, మానేపల్లి, కొటిపి చెరువుల ద్వారా కిరికెర, చౌళూరు గ్రామాల మీదుగా మడకశిర నియోజకవర్గంలోకి తరలించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే హిందూపురం నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా నీళ్లు తెప్పిస్తానని ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ ఇచ్చారు. ప్రస్తుతం చెరువులు నింపినట్లే నింపి పైనుంచి దిగువకు తీసుకెళ్లిపోతుండటంతో చెరువు ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మలుగురు, రాచేపల్లి, కొండూరు తదితర గ్రామాల్లో చెరువులు నిండే వరకు నీటిని తీసుకెళ్లడానికి వీలు లేదని రైతులు అడ్డుచెబుతూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొటిపి గ్రామ చెరువు పక్కనే హంద్రీనీవా కాలువలో నీరు పారుతున్నా చుక్క నీరు వదలకపోవడంతో రైతులు కాలువకు గండి కొట్టి చెరువులోకి నీటిని మళ్లించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు రైతులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త అబ్దుల్‌ఘనీ నాయకులతో కలిసి రూరల్ పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. చివరకు పోలీసులు అరెస్టు చేసిన రైతులను వదిలేశారు.

జన్మభూమి-మా ఊరుకు రూ.22.75 కోట్లు

- విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాల్గొనాల్సిందే
- డీఈఓ, సీఈఓ, ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ
- సర్కారు తీరును తప్పుబడుతున్న అధికారులు
- నేటి నుంచి జన్మభూమి–మా ఊరు కార్యక్రమం

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ఆరో విడత జన్మభూమి–మా ఊరు కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తోంది. ఇందుకోసం ఇప్పటివరకు 22.75 కోట్ల రూపాయలను ప్రణాళికా శాఖ విడుదల చేసింది. తొలుత జిల్లాకు కోటి రూపాయల చొప్పున 13 జిల్లాలకు రూ.13 కోట్లు విడుదల చేసిన ప్రణాళికా శాఖ.. మంగళవారం ప్రతీ జిల్లాకు మరో రూ.75 లక్షల చొప్పున 13 జిల్లాలకు రూ.9.75 కోట్లను అధనంగా విడుదల చేసింది. మరోపక్క.. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులను, కళాకారులను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం యువజన సర్వీసుల శాఖ మంగళవారం జీవో జారీ చేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసేందుకు డీఈవోలు, సీఈవోలు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని జీవోలో స్పష్టంచేశారు. అలాగే, జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేయనున్నారు. వీణ, హార్మోనియం, తబల, మృదంగం, ఫ్లూట్, గిటార్, వయొలిన్ వాయిద్యాలను పది నిమిషాలసేపు ప్రదర్శించాలని జీవోలో పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులతో కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్ర నాట్యం, కథక్, జానపద నృత్యాలు ప్రదర్శింపజేయనున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులతో డ్రామాలను, రూపకాలను ప్రదర్శించనున్నారు. డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు జన్మభూమి కార్యక్రమం చివరి రోజైన 11న బహుమతులు అందజేస్తారు.

పరీక్షల వేళ విద్యార్థులతో ప్రచారం

జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో విద్యార్థులతో ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రాల సారాంశాన్ని ప్రచారం చేయించాలని నిర్ణయించారు. వార్షిక పరీక్షల ముందు విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రభుత్వం ప్రచారానికి వినియోగించుకోవడాన్ని అధికారులు తప్పుబడుతున్నారు. ఉపాధ్యాయులను ఇతర పనులకు వినియోగించరాదని గతంలో సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ ఉపాధ్యాయులను వినియోగించాలని ఆదేశాలు జారీచేయడంపై అధికారులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లోనూ నాన్ లోకల్

- రెంటికీ చెడ్డ రేవడిలా మారిన పీజీ వైద్య అభ్యర్థులు
- మీరు మా రాష్ట్రం వాళ్లు కాదంటూ తిరస్కరించిన ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓవైపు వైద్యుల కొరత వేధిస్తుండగా, మరోవైపు స్పెషలిస్టు వైద్యులు 'స్థానికత' కారణంగా ఉద్యోగాలు పొందలేక తీవ్రంగా నష్టపోయారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చాక దరఖాస్తు చేసుకుంటే మీరు స్థానికులు కాదంటూ ఏపీ ప్రభుత్వం తిరస్కరించడంతో వైద్యులు కంగుతిన్నారు. రాష్ట్రం విడిపోయాక రెండేళ్లలోపు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన వారందరినీ స్థానికులుగానే గుర్తిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఇప్పుడేమో పదేళ్ల నుంచి ఏపీలో ఉంటూ ఇక్కడే చదువుకున్నా.. ప్రాథమిక విద్య తెలంగాణలో చదివారనే సాకుతో ఉద్యోగాలు ఇవ్వకుండా తిరస్కరించారు. 'స్థానికత'పై ప్రభుత్వ ఉన్నతాధికారులెవరూ సమాధానం చెప్పడానికి ఇష్టపడటం లేదని నష్టపోయిన వైద్య అభ్యర్థులు వాపోతున్నారు.

8 వరకూ తెలంగాణలో.. ఆ తర్వాత ఏపీలో

రాష్ట్రం విడిపోకముందు చాలామంది అభ్యర్థులు 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ హైదరాబాద్‌లో, 9వ తరగతి నుంచి పీజీ వైద్య విద్య వరకూ ఏపీలో చదువుకున్నారు. తెలంగాణలో అక్కడి ప్రభుత్వం డాక్టరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు చేసుకుంటే ఇలాంటి వారు స్థానికేతరులు(నాన్‌లోకల్) అవుతారని తేల్చిచెప్పింది. ఏపీలో కూడా నాన్‌లోకలే అంటున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఎక్కడ ఎక్కువ రోజులు చదివితే అక్కడే స్థానికులవుతారు. కానీ, తెలంగాణలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను రెసిడెన్సీ సర్టిఫికెట్, మైగ్రేషన్ సర్టిఫికెట్, స్థానిక చిరునామాతో ఆధార్‌కార్డు అడుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే మీరు 8వ తరగతి వరకూ తెలంగాణలో చదివారు కాబట్టి ఈ రాష్ట్రంలో మీరు స్థానికేతరులే అంటున్నారు. వాస్తవానికి వీళ్లు ఏపీలో పుట్టిపెరిగిన వారే. కాకపోతే తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడం వల్ల అక్కడ ప్రాథమిక విద్య అభ్యసించారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం తెలంగాణలో 1,200కు పైగా పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌లో 1,471 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండు రాష్ట్రాల్లో చదువుకున్న వైద్య అభ్యర్థుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిగా మారింది.

రెండేళ్లలోపు వస్తే స్థానికులు

2014 జూన్ 2న రాష్ట్ర విభజన జరిగింది. విభజన అనంతరం మూడేళ్లలోపు ఏపీకి వచ్చిన వారిని స్థానికులుగా పరిగణిస్తారని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ తర్వాత మళ్లీ రెండేళ్లు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో 2019 జూన్ 1వ తేదీలోగా లోకల్ స్టేటస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో చదువుతున్న లేదా ఉద్యోగాలు చేస్తున్న వారు ఏపీకి వచ్చి స్థానికతకు దరఖాస్తు చేసుకోవచ్చని మాత్రమే పేర్కొంది. తెలంగాణలో కొన్నాళ్లు చదువుకుని, విభజనకు ముందే వచ్చి ఏపీలో స్థిరపడిన వారి విషయంలో కేంద్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అందుకే విభజనకు ముందు ఉన్న ఉత్తర్వుల ప్రకారం వీళ్ల విషయంలో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఎక్కడ ఎక్కువ కాలం చదివి ఉంటే అక్కడే వారిని స్థానికులుగా పరిగణిస్తున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

నాకన్నా వెనకున్న వారికి ఉద్యోగం వచ్చింది

''నేను 8వ తరగతి వరకూ హైదరాబాద్‌లో చదువుకున్నా. 9వ తరగతి నుంచి పీజీ వైద్యం వరకూ ఏపీలో చదివా. బీసీ–డి వర్గానికి చెందిన నేను ఏపీలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేస్తే నన్ను నాన్‌లోకల్ అంటున్నారు. హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆధార్, రెసిడెన్స్, మైగ్రేషన్ సర్టిఫికెట్లు తెలంగాణలో ఉన్నట్టు తీసుకురమ్మంటున్నారు. ఏపీలో దరఖాస్తు చేసుకుంటే నాకంటే తక్కువ మార్కులు వచ్చిన ముగ్గురు అభ్యర్థులకు ఉద్యోగం వచ్చింది. నన్ను నాన్‌లోకల్ అని చెప్పడంతో ఉద్యోగం కోల్పోయా.

– డా.మంజూ యాదవ్, వైఎస్సార్ జిల్లా

వివిధ రాష్ట్రాల్లో డాక్టర్లు, జనాభా నిష్పత్తి

రాష్ట్రం	ఎంతమందికి ఒక డాక్టరు
తమిళనాడు	253
ఢిల్లీ	334
కర్ణాటక	507
కేరళ	535
గోవా	713
పంజాబ్	789
ఆంధ్రప్రదేశ్	1,700

1,700 మందికి ఒక డాక్టరే

ఆంధ్రప్రదేశ్‌లో జనాభాకు సరిపడా సంఖ్యలో వైద్యులు లేరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక డాక్టరు ఉండాలి. కానీ, ఏపీలో 1,700 మందికి ఒక డాక్టరు మాత్రమే ఉన్నారు. పొరుగు రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగ్గానే ఉంది.

నేను ఏ రాష్ట్రానికి చెందుతానో..

''నేను 7వ తరగతి వరకూ హైదరాబాద్‌లో చదువుకున్నా. ఆ తర్వాత కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో చదివా. పీజీ వైద్యం (జనరల్ సర్జరీ) తిరుపతిలో చేశాను. ఏపీలో దరఖాస్తు చేసుకుంటే నన్ను నాన్‌లోకల్ అన్నారు. దీనిపై అధికారులను కలిస్తే తామేమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. హైదరాబాద్‌లోనూ ఇదే పరిస్థితి. అసలు నేను ఏ రాష్ట్రానికి చెందిన వాడినో గుర్తించకపోవడం దారుణం. ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

– డా.కె.సుబ్రహ్మణ్యం, నెల్లూరు

ప్రభుత్వమే పరిష్కరించాలి

''ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు ప్రభుత్వమే చొరవ తీసుకుని పరిష్కరించాలి. ఎంతో కష్టపడితే గానీ పీజీ వైద్యులు కాలేరు. వారు ప్రభుత్వ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే మీరు మా రాష్ట్రం కాదంటే ఎక్కడికి వెళతారు? వీరంతా ఈ రాష్ట్రంలో పుట్టిపెరిగిన వాళ్లే. తల్లిదండ్రుల వృత్తి, ఉద్యోగం రీత్యా తెలంగాణకు వెళ్లారు. వారిని ఇక్కడే స్థానికులుగా గుర్తించాలి''

– డా.జయధీర్, కన్వీనర్, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం

ప్రెసిడెంట్ ఆర్డర్ ప్రకారమే చేశాం

''రాష్ట్రపతి ఉత్తర్వులనే అమలు చేశాం. ఏ రాష్ట్రంలో చదివినా సరే 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఎక్కడ ఎక్కువ కాలం చదువుకుని ఉంటే ఆ రాష్ట్రంలోనే స్థానికులవుతారు. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియలోనూ ఇదే నిబంధనను అమలు చేశాం''

– అరుణాదేవి, జాయింట్ డైరెక్టర్, వైద్యవిద్యా శాఖ

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.